ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 11-6-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 302

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

యువీడ్యోలు

యువరాజ్‌సింగ్.. ఇది పేరు కాదు ఓ ఉద్వేగం.. అతనాడితే అభిమానులకు ఏదో తెలియని ఆనందం. . సిక్సర్లతో బౌలర్లపై విరుచుకుపడినా.. విల్లులా వంగుతూ ఫీల్డింగ్ చేసినా.. బంతితో మాయ చేసినా.. అరుదైన రికార్డులు నెలకొల్పినా అది యువీకే చెల్లింది. 2000 ఏడాదిలో ముక్కోణపు సిరీస్‌లో కెన్యాతో మ్యాచ్‌తో అరంగేట్రమైన అతని ప్రస్థానం.. 2011 వరకు అప్రతిహతంగా సాగింది. క్యాన్సర్‌తో కొన్ని రోజులు ఆగినా పునరాగమనం చేసి స్ఫూర్తి చాటాడతను. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ గెల వడంలో యువీ పాత్ర ఎంతో ఉంది. భారత క్రికెట్‌పై బలమైన ముద్ర వేసిన ఈ స్టార్ ఆల్‌రౌండర్ సోమవారం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాడు.

...వివరాలు స్పోర్ట్స్‌లో

నగదు తీస్తే వాతే!

బ్యాంకుల నుంచి డబ్బుల ఉపసంహరణ ఏడాదికి రూ.10 లక్షలు మించితే 5% పన్ను

- యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: ప్రజల్ని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ దిశగా మరింతగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అధిక విలువుండే నగదు లావాదేవీలను నియంత్రించడం, డిజిటల్ చెల్లింపులను తప్పనిసరి చేయడం వంటి చర్యల దిశగా యత్నాల్ని ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఏడాది వ్యవధిలో మొత్తంగా రూ.10 లక్షలు మించి బ్యాంకుల నుంచి డబ్బులు ఉపసంహరిస్తే, 3 నుంచి 5 శాతందాకా పన్ను విధించాలని యోచిస్తోంది. దీనివల్ల నగదు వినియోగాన్ని తగ్గించడం, నల్లధనాన్ని అరికట్టవచ్చని భావిస్తున్నారు. ఏడాదికి రూ. 10 లక్షలకు పైగా ఉపసంహరించడం వల్ల రూ.30 వేల నుంచి రూ.50 వేల దాకా చెల్లించాల్సి రావడం నష్టమేనని, దీనివల్ల బారీస్థాయి నగదు లావాదేవీలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రూ.10 లక్షలకుపైగా నగదు ఉపసంహరణ చాలా మంది వ్యక్తులకు, వ్యాపార సంస్థలకు అవసరం ఉండదని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ...మిగతా 2లో

ఒరిగిన జ్ఞానశిఖరం

గిరీశ్ కర్నాడ్ ఇక లేరు

ఈనాడు డిజిటల్, బెంగళూరు: సాహిత్య రంగంలో నాటకాలు మాత్రమే రచించి జ్ఞానపీఠ్ పురస్కారం దక్కించుకున్న వైవిధ్య సాహితీవేత్త, తాను రచించిన నాటకంలోని పాత్రను వేరెవరైనా చేస్తే ఆత్మ లోపిస్తుం దన్న భయంతో నటనకు సిద్ధమైన ప్రతిభావంతుడు, నేనొక అర్జున్ నళ్లిలైటునంటూ మెడలో ప్లకార్డు వేసు కుని ఆందోళన చేసిన సామాజికవేత్త, పద్మభూషణ్ పుర స్కార గ్రహీత గిరీశ్ కర్నాడ్ (81) జక లేరు. సోమ వారం ఉదయం 8 గంటలకు బెంగళూరులోని తన నివా సంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సరస్వతి గణపతి, కుమారుడు రఘు కర్నాడ్, కుమార్తె శాల్మాలి రాధ ఉన్నారు. ...మిగతా 2లో

ఏమైపోతున్నారు?

తొమ్మిది రోజుల్లో 545 మంది అదృశ్యం

సగటున రోజుకు 60 మంది మాయం

సగం మంది రాజధాని పరిసరాల్లోనివారే

నానాటికీ పెరిగిపోతున్న అదృశ్యం కేసులు

పిల్లలే కాదు, మధ్యవయస్కులు, వృద్ధులూ కనిపించకుండా పోతున్నారు

పోలీసుల స్పందన అంతంతమాత్రమే

కశ్మీర్‌లోని కథువా నుంచి రాష్ట్రంలోని హాజీపూర్ వరకు ఒకటే విషాదం.. ఆడపిల్లల అదృశ్యం.. పోలీసుల నిర్లక్ష్యం.. ఆపై వెలుగులోకి వచ్చిన అత్యాచారం.. హత్యలు.. ఒకటి దేశాన్ని కుదిపే సిన ఉదంతమైతే.. రెండోది మన రాష్ట్రాన్ని కలవరపరచిన దుర్ఘటన. ఈ రెండు కేసుల్లోనూ పోలీసుల తీరు ఒక్కలాగే ఉండడం గమనార్హం. పిల్లల అదృశ్యంపై తల్లిదండ్రులు ఫిర్యాదుచేసినా సరైన రీతిలో స్పందించకపోవడం. ఫలితంగా పసిమొగ్గలు హృదయవిదారక పరిస్థితుల్లో నేల రాలిపోయారు.. అంతేకాదు ప్రస్తుతం రాష్ట్రంలో సగటున రోజుకు 60 మంది వరకు అదృశ్యమైపోతున్నారు. వీటన్నింటి విషయంలోనూ పోలీసు స్పందన అంతంతమాత్రమే. హాజీపూర్ ఉదంతం బయటపడిన తర్వాత మూలన పడేసిన అదృశ్యం కేసులను దుమ్ముదులిపి వెలికి తీసిన పోలీసులు పరిస్థితి సద్దుమణగగానే మళ్లీ పక్కనపెట్టేశారు. దీంతో రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న అదృశ్యం కేసులు హడలెత్తిస్తు న్నాయి. ఈనెలలో 9వ తేదీ వరకూ 545 మంది కనిపించకుండాపోయారు. ఇవి పోలీసు స్టేషన్లలో నమో దైన కేసులు మాత్రమే. వీరిలో సగంమందికిపైగా రాజధాని పరిసరాలకు చెందిన వారే కావడం గమ నార్హం. ఇంతమంది ఎందుకు అదృశ్యమవుతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇది బాధితుల కుటుంబ సభ్యులనే కాదు పోలీసులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది.

ఈ పరిస్థితిపై ప్రత్యేక కథనం 2లో

అవినీతి రహితం ప్రజా శ్రేయస్కరం

నూతన పురపాలక చట్టానికి ఇవే ప్రధాన లక్ష్యాలు

- అధికారులు, ప్రజాప్రతినిధులే బాధ్యులు
- గుణాత్మక అభివృద్ధిలో చట్టాల అమలు కీలకం
- పంచాయతీరాజ్, పురపాలక శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

అవినీతి రహిత పాలన అందించేలా, ప్రజలకు మేలు జరిగేలా పటిష్ఠమైన పురపాలక చట్టాన్ని రూపొందిం చాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. పురపాలక సంఘాలు దినదినాభివృద్ధి చెందుతున్న నేప థ్యంలో అవినీతిరహిత పాలన, ప్రజా శ్రేయస్సు ప్రధాన లక్ష్యాలని అధికారులు గుర్తించాలన్నారు. ప్రభుత్వ అధి కారులతోపాటు ప్రజాప్రతినిధులను బాధ్యులను చేస్తూ పకడ్బందీగా పురపాలక చట్టాన్ని రూపొందించాలని సీఎం సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌లో నూతన పంచాయతీరాజ్ చట్టం అమలు, కార్యాచరణ.. కొత్త పురపాలకచట్టం రూపకల్పనలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. గ్రామాలు, పట్ట ణాల గుణాత్మక అభివృద్ధిలో పంచాయతీరాజ్, మున్సి పల్ చట్టాల అమలు కీలకమన్నారు. సుపరిపాలన అందించడం కోసం ఉన్న చట్టాలను సవరించు కుంటూ, మరింత పటిష్ఠంగా రూపొందించుకోవాలని సూచించారు. మనసుపెట్టి పనిచేస్తే గ్రామాలు, మున్సిపాలిటీ స్థాయిల్లో చేయాల్సినవి ఎన్నో ఉన్నా యని ప్రజాప్రతినిధులు, అధికారులు గుర్తించాల న్నారు. నేలవిడిచి సాము చేయవద్దని చెప్పారు. విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పననుంచి గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఇతర మౌలిక రంగాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పటిష్ఠ విధానాలతో గ్రామాల్లో కూడా మున్సిపాలిటీ స్థాయిలో సుపరిపాలన అందిం చగలుగుతామన్నారు. సమీక్షలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కథువా అత్యాచార కేసులో ఆరుగురు దోషులు

ముగ్గురికి జీవిత ఖైదు

మిగతావారికి ఐదేళ్ల చొప్పున కారాగార శిక్షలు 16లో

నేరారోపణ నుంచి ఒకరికి విముక్తి

తీర్పు వెలువరించిన స్థానిక కోర్టు

అనధికార సిబ్బందిపై వేటు

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన 3లో

యంత్రం కదిలేదెన్నడు?

ఖరారు కాని వ్యవసాయ యంత్రాల పంపిణీ విధానం

- నేరుగా రైతు ఖాతాలో రాయితీ వేయాలంటున్న కేంద్ర వ్యవసాయ శాఖ
- కంపెనీతో రైతే మాట్లాడుకోవాలని సూచన
- ఈ విధానంలో వెళ్లాలా... పాత పద్ధతిలో ఇవ్వాలా
- ఇంకా తేల్చుకోని రాష్ట్ర ప్రభుత్వం

రూ. 18 లక్షల విలువైన వరి కోత యంత్రం

ఈనాడు, హైదరాబాద్: వానాకాలం(ఖరీఫ్) పంటల సాగు పనులు ప్రారంభమైనా వ్యవసాయ యంత్రాల రాయితీ విధానం ఇంకా ఖరారు కాలేదు. మరోవైపు ఈ సీజన్ నుంచి దేశవ్యాప్తంగా రాయితీలను రైతుల బ్యాంకు ఖాతాలో వేసే విధానాన్ని అమలు చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ అన్నీ రాష్ట్రాలకు తాజాగా సూచించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఇలా ఇస్తున్నందున సత్ఫలితాలు వచ్చినట్లు తెలిపింది. రైతు లకు ఇచ్చే రాయితీని యంత్రాల తయారీ కంపెనీలకు ఇంత కాలం రాష్ట్ర వ్యవసాయశాఖ ఇస్తోంది. యంత్రాల ధరలను నిర్ణయించేందుకు సీజన్ ఆరంభానికి 2, 3 నెలల ముందే టెండర్లు పిలవడం ఆనవాయితీ. తక్కువ ధరలను కోట్ చేసిన కంపెనీలు, యంత్రాల జాబితాను రూపొందించి జిల్లా లకు పంపేవి. ఆ జాబితాల్లో రైతు కోరుకున్న వాటిని కంపె నీలు విక్రయించేవి. ఆ యంత్రంపై ప్రభుత్వం అన్నదాతకు ఇచ్చే రాయితీ సొమ్మును సదరు కంపెనీకి వ్యవ సాయశాఖ విడుదల చేసేది. గతేడాది వరకూ అమల్లో ఉన్న దీన్ని కొనసాగించాలా లేక కేంద్రం సూచనల ప్రకారం కొత్త విధానాన్ని అమలు చేయాలా చెప్పాల్సిందిగా వ్యవసాయశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపింది.

కొత్త విధానం ప్రకారం.. కంపెనీల నుంచి ఎంత ధరకు యంత్రాలు అమ్ముతారనే వివరా లను ఒక్కో యంత్రం ...మిగతా 2లో

సప్త గోపురాలు సంపూర్ణం

- యాదాద్రిలో 32 నెలల్లో నిర్మాణం పూర్తి
- పూర్తిగా కృష్ణశిలల వినియోగం

2లో

తూర్పు నుంచి పడమటి దిశ వరకు కొలువైన గోపురాలు

ఇదీ సంగతి!

ఇలాంటివేవో తెస్తారని నాకు ముందే తెలుసు అందుకే బ్యాంకులో డబ్బు దాచేయను, తీయను.

ఐదు నక్షత్రాల నిర్బంధకేంద్రం!



చక్కటి టీపాయ్, పరుపులు, దినపత్రికలు, అడుగేస్తే మరక పడుతుందా అన్నంత పరిశుభ్రంగా ఉన్న ఈ ప్రాంతం ఏ కార్పొరేట్ ఆసుపత్రో లేక ఐదు నక్షత్రాల హోటల్‌లోనిదో కాదు. జపాన్‌లోని టోక్యోలో నిర్మించిన నిర్బంధకేంద్రం. ఈ కేంద్రంలోకి సోమవారం విదేశీ మీడియాను అనుమతించారు. ప్రస్తుతానికి ఆ కేంద్రంలో ఖైదీలు మాత్రం లేరు

భట్టి దీక్ష విరమణ

- నిమ్మరసం ఇచ్చి విరమింపజేయించిన కాంగ్రెస్ నేతలు
- సీఎల్పీ విలీనంపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం: ఉత్తమ్
- నేడు కలెక్టరేట్ల ఎదుట కాంగ్రెస్ ధర్నా 5లో

నిమ్స్‌లో భట్టికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, చిత్రంలో ఎంపీ కోమటిరెడ్డి, పార్టీ నేతలు పొన్నాల, మల్లు రవి, సలీం అహ్మద్

నోటీసు ఇవ్వకుండానే స్పీకర్ విలీన నిర్ణయం

- ఆ అధికారం ఎన్నికల సంఘానిది
- బులెటిన్‌ను రద్దు చేయండి 5లో
- హైకోర్టును ఆశ్రయించిన భట్టి, ఉత్తమ్

ఏపీలో వరాల తొలకరి

- రైతన్నకు నిండు భరోసా!
- ఉద్యోగులకు మధ్యంతర భృతి
- తెల్లకార్డు ఉంటే అమ్మఒడికి అర్హులే
- అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట
- నాలుగేళ్లలో 25 లక్షల ఇళ్ల నిర్మాణం
- జగన్ మంత్రివర్గ తొలి సమావేశంలో కీలక నిర్ణయాలు

15లో

యాదాద్రిలో సప్తగోపురాలు సంపూర్ణం

యాదగిరిగుట్ట - న్యూస్‌టుడే

ఆధార శిల నుంచి మహానాసి వరకు కృష్ణ శిలతోనే యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాజగోపురాలు నిర్మించాలన్న లక్ష్యం సంపూర్ణమైంది. అనుకున్న విధంగా అన్ని దిక్కుల్లో ఆరు రాజగోపురాలు, గర్భగుడిపై దివ్య విమానం ఆవిష్కృతమయ్యాయని 'యాడా' నిర్వాహకులు పేర్కొన్నారు. "మొదటి ప్రాకారంలో తూర్పువైపున త్రితల రాజగోపురం(ప్రవేశం మార్గం), పడమర దిశలో ఐదంతస్తుల గోపురం(బయటకు వెళ్లేందుకు) రూపుదిద్దుకున్నాయి. రెండో ప్రాకారానికి పశ్చిమాన ఏడంతస్తుల మహా రాజగోపురం, తూర్పు, ఉత్తర, దక్షిణ దిశల్లో ఐదంతస్తుల రాజగోపురాలు తీర్చిదిద్దారు. వీటితోపాటు స్వయంభువులు కొలువై ఉన్న గర్భగుడిపై 42 అడుగుల ఎత్తున దివ్య విమానం(విమాన గోపురం) నిర్మాణం పూర్తవడంతో గోపురాల నిర్మాణ క్రతువు పరిపూర్ణమైంది" అని ప్రధాన స్థపతులు సుందరరాజన్, ఆనందచారి వేలు తెలిపారు.

గోపురాలను శిల్పకారులు 32 నెలల్లో పూర్తి చేయగలిగారని వివరించారు. దక్షిణాదిలో ఎక్కడా లేని విధంగా గోపురాలన్నీ సంపూర్ణంగా కృష్ణశిలతో తీర్చిదిద్దామని, శిల్ప సంప్రదాయం, కళల గూర్చి భవిష్యత్తు తరాలకు తెలియజెప్పేలా నాగర, ద్రవిడ, పల్లవ, చోళ, విజయనగర, కాకతీయుల కాలం నాటి కళారూపాలతో ఆలయ విస్తరణ పనులు చేపట్టామని స్థపతులు అన్నారు.

సిద్ధమైన దివ్య విమానం (విమాన గోపురం)

ఏమైపోతున్నారు?

ఈనాడు - హైదరాబాద్

కుటుంబంలో ఎవరైనా ఒక సభ్యుడు కనిపించకుండా పోతే ఆ కుటుంబం పడే బాధ వర్ణనాతీతం. అలా తప్పిపోయింది చిన్నపిల్లలయితే పరిస్థితి మరింత దయనీయం. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో రోజుకు సగటున 60 కుటుంబాలు ఇంట్లో ఎవరోకరి అదృశ్యంతో తల్లడిల్లుతున్నాయి. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతూ తమ వారిని వెతికి పెట్టమని ప్రాధేయపడుతున్నాయి. అదృశ్యమవుతున్నవారిలో రెండేళ్ల పసిపిల్లల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకూ ఉంటున్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయసువారి సంఖ్యే ఎక్కువగా ఉంది. ముగ్గురు బాలికలపై అత్యాచారం చేసి హతమార్చిన హాజీపూర్ ఉదంతం ఇంకా మరుగునపడకముందే పెరిగిపోతున్న అదృశ్యం కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.

- జూన్ నెల మొదటి తొమ్మిది రోజుల్లో రాష్ట్రంలో 545 మంది అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయి. నమోదు కాని కేసులు మరి కొన్నయినా ఉంటాయని అంచనా.
- ఇందులో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు అంటే రాజధాని పరిధిలోనే 296 మంది కనిపించకుండా పోయారు.
- ఈ సంవత్సరం మొదటి మూడు నెలల్లో సగటున అదృశ్యమతున్న వారి సంఖ్య రోజుకు 45కి మించలేదు. కాని మే నెల నుంచి ఇది పెరుగుతూ వస్తూ ఇప్పుడు రోజుకు 60కి చేరింది.

పోలీసుల అరకొర స్పందన

అదృశ్యం కేసులలో పోలీసుల స్పందన అరకొరగానే ఉంటోంది. ఏవో కొన్ని కేసులలో తప్ప చాలావరకూ ఒకటి రెండురోజులు దర్యాప్తు చేసి ఆ తర్వాత పక్కన పెట్టేస్తున్నారు. దాంతో ఒక్కోసారి బాధితుల తల్లిదండ్రులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇందుకు భువనగిరి జిల్లా హాజీపూర్ ఉదంతమే నిదర్శనం. శ్రీనివాసరెడ్డి అనే హంతకుడు ముగ్గురు బాలికలపై అత్యాచారం చేసి హతమార్చి బావిలో పూడ్చిపెట్టిన ఉదంతం ఇటీవల సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తమ కుమార్తె కల్పన కనిపించడంలేదని 2015 ఏప్రిల్ 23న తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడే పోలీసులు సరిగా స్పందించి ఉంటే హంతకుడు శ్రీనివాసరెడ్డి దొరికేవాడు, ఆ తర్వాత జరిగిన మనీషా, శ్రావణిల హత్యలకు ఆస్కారమే ఉండేది కాదు. కానీ పోలీసులు అన్ని అదృశ్యం కేసులనూ ఒకేగాటన కడుతుండటం తల్లిదండ్రులకు శాపంలా మారుతోంది. గత ఏప్రిల్‌లో హాజీపూర్‌లో అదృశ్యమైన శ్రావణి కేసులో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. చివరకు గ్రామస్థులే బాలిక మృతదేహాన్ని కనుగొన్నారు. ఇక తప్పిపోయిన వారు యుక్తవయసు వారయితే ప్రేమవ్యవహారాల కారణంగానే వెళ్లిపోయినట్లు భావిస్తూ అసలు పట్టించుకోవడంలేదు.

వేదన... అరణ్యరోదన...

అదృశ్యమవుతున్న వారి కుటుంబ సభ్యులు పడుతున్న బాధ వర్ణనాతీతం. తప్పిపోయిన వారు చిన్నపిల్లలయితే పరిస్థితి మరింత దయనీయం. ఎక్కడున్నారో తెలియదు. ఎవ్వరు తిరిగి వస్తారో తెలియదు, అసలు తిరిగి వస్తారో, రారో కూడా తెలియదు. అలికిడైతే చాలు వాకిట్లోకి తొంగిచూస్తూ.. పట్టించుకోకపోయినా క్రమం తప్పకుండా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతూ నిత్యం నరకం అనుభవిస్తుంటారు. వీరికి ఉపశమనం కలగాలంటే పోలీసులు అదృశ్యం కేసులపై మరింత శ్రద్ధ కనబరచాలి. ఒకవేళ కనిపించకుండా పోవడానికి ప్రేమ వ్యవహారాలే కారణమైనప్పటికీ కనీసం వారి ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలి. తద్వారా తమ వారు ఎక్కడో ఒకచోట క్షేమంగా ఉన్నారనే భరోసా అయినా ఉంటుంది. కాని పోలీసులు వీటిని పెద్దగా పట్టించుకోవడంలేదు.

ఎందుకు అదృశ్యమవుతున్నారు?

- పరీక్ష ఫలితాల వెల్లడి సమయంలో ఎక్కువగా మిస్సింగ్ కేసులు నమోదవుతుంటాయి. ఇలా వెళ్లిన పిల్లల్లో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా తిరిగి వచ్చేస్తుంటారు.
- ప్రేమ వ్యవహారాలు మరో కారణం. మిస్సింగ్ కేసులలో ఎక్కువశాతం ఇలాంటివే ఉంటున్నాయి.
- కొందరు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులమీద అలిగి వెళ్లిపోతుంటారు.
- మధ్యవయసు వారయితే అప్పులు, ఇతర ఆర్థిక కారణాల వల్ల ఎవరికి చెప్పకుండా వెళ్లిపోతున్నారు.
- పిల్లలు తమను సరిగా చూడటంలేదని వెళ్లిపోతున్న వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోంది.
- ఐవన్నీ ఒక ఎత్తయితే అపహరణ ముఠాలు మరో ఎత్తు. అదృశ్యమైన తర్వాత తిరిగి రాని పిల్లలు, యుక్తవయసు బాలికలు వీరి బారిన పడి ఉండటానికి అవకాశం ఉంది. వీరు ప్రధానంగా బాలికలను అపహరిస్తుంటారు.

నగదు తీసుకుంటే రుసుముల వాత!

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా పేద, మధ్య తరగతి ప్రజలపై భారం వేయకూడదనేది ప్రభుత్వం ఉద్దేశంగా ఉన్నట్లు సమాచారం.

ఈ తరహా నిర్ణయంపై అంతర్గతంగా చర్చ జరుగుతోందని, పన్ను 3 నుంచి 5 శాతం మధ్య ఉండొచ్చని అధికార వర్గాల సమాచారం. ఇందులో భాగంగానే ప్రస్తుతం బ్యాంకులు ఆన్‌లైన్ నగదు బదిలీలపై విధించే ఎన్‌ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్ చెల్లింపు సేవలపై రుసుములు రిజర్వు బ్యాంకు ఎత్తివేసిందని చెబుతున్నారు. ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణపై బ్యాంకులు విధిస్తున్న రుసుములపై సమీక్ష నిర్వహించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఈ ప్రతిపాదన ప్రస్తుతం చర్చల స్థాయిలోనే ఉందని, దీనికి సానుకూలత వ్యక్తమవుతున్నట్లు అధికార వర్గాల సమాచారం. బడ్జెట్ నాటికి ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనతోపాటు అధిక విలువైన నగదు ఉపసంహరణలు అన్నింటికీ ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను సైతం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల వ్యక్తిగత స్థాయిలో పరిశీలన ఉండటంతోపాటు, పన్ను చెల్లింపులపైనా నిఘా ఉంటుందని భావిస్తున్నారు. పెట్టుబడి తదితర వ్యయాలపైనా పరిమితులు విధించే దిశగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

నేపథ్యం..

- 2005-08 మధ్య కరెంటు ఖాతాల నుంచి రూ.50 వేలకు మించి చేసే ఉపసంహరణలపై యూపీఏ ప్రభుత్వం పన్ను విధించింది. లెక్కలోకి రాని ధనాన్ని గుర్తించేందుకు ఈ చర్యకు దిగింది. చెక్కుల ద్వారా కాకుండా నగదు చెల్లింపులపైనే పన్ను విధించింది.
- 2015లో గ్రీకు ఆర్థిక వ్యవస్థ దివాలా తీసినప్పుడు లక్షలమంది ప్రజలు భయభ్రాంతులకు గురై 28 బిలియన్ల యూరోలకుపైగా బ్యాంకుల నుంచి తీసేసుకున్నారు. దీనితో బ్యాంకుల్లో నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. దీనిని అరికట్టేందుకు గ్రీకు బ్యాంకులు నగదు ఉపసంహరణలపై పన్నుల్ని ప్రతిపాదించాయి. పన్ను ఎగవేతను అరికట్టేందుకు అన్ని లావాదేవీలకు డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగం చేయాలని పేర్కొన్నాయి. నగదు ఉపసంహరణలపై సర్చార్జిని విధించాయి.
- ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2017లో డిజిటల్ చెల్లింపులపై ఏర్పాటైన అత్యున్నతస్థాయి కమిటీ నగదు లావాదేవీలపై పన్ను ఉండాలని, భారీ స్థాయి నగదు లావాదేవీలపై పరిమితి ఉండాలని, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకంగా కార్డు చెల్లింపులపై రుసుముల్ని పూర్తిగా ఎత్తివేయాలని సూచించింది. రూ.50 వేలు, అంతకు మించి ఉపసంహరణలపై బ్యాంకింగ్ నగదు లావాదేవీల పన్ను(బీసీటీటీ) విధించాలని పేర్కొంది.
- నగదు లావాదేవీల్ని నియంత్రించే నిబంధనను ఉల్లంఘించే వారిపై సదరు మొత్తానికి సమానంగా జరిమానా విధించాలని 'ఆర్థిక చట్టం-2017' స్పష్టం చేస్తోంది. దీనిప్రకారం ఒకరోజు వ్యవధిలో రూ.2 లక్షలకు మించి నగదు లావాదేవీ జరపకూడదు.
- భారీస్థాయి నగదు లావాదేవీలను అరికట్టేందుకు, నల్లధన ఆర్థిక వ్యవస్థను నిలువరించేందుకు రూ.3 లక్షలకు మించే లావాదేవీలపై నిషేధం విధింపును 2017-18 బడ్జెట్‌లో నాటి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రతిపాదించారు. అయితే, ఆర్థికబిల్లు2017 ద్వారా సవరణ తీసుకొచ్చి సదరు పరిమితిని రూ.2 లక్షలకు తగ్గించారు.

కొత్త చట్టమే దిక్సూచి

- జడ్పీ చైర్‌పర్సన్లతో కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: జిల్లా పరిషత్‌ల నూతన చైర్‌పర్సన్లు, ఉపాధ్యక్షులు కోఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని అధ్యయనం చేయాలని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. జిల్లాల పరిపాలనకు ఈ చట్టమే దిక్సూచి అని, దానిలోని విధి విధానాలను నూటికి నూరుశాతం అమలు చేయాలని చెప్పారు. సోమవారం మంత్రుల అధ్వర్యంలో 15 జిల్లా పరిషత్‌ల కొత్త చైర్‌పర్సన్లు, ఇతర నేతలు కేటీఆర్‌తో హైదరాబాద్‌లో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. కేసీఆర్‌ను కలిసిన చైర్‌పర్సన్లలో పి.పద్మావతి (నాగర్‌కర్నూల్), లోకనాథ్‌రెడ్డి (వనపర్తి), కోవ లక్ష్మి(కుమురంభీమ్ ఆసిఫాబాద్), హేమలతా శేఖర్‌గౌడ్ (మెదక్), బండ నరేందర్ రెడ్డి (నల్గొండ), ఎలిమినేటి సందీప్‌రెడ్డి (యాదాద్రి భువనగిరి), మంజుశ్రీ (సంగారెడ్డి), సుధీర్‌కుమార్ (వరంగల్ నగరం), గంధ్ర జ్యోతి (వరంగల్ గ్రామీణం), పాగాల సంపత్‌రెడ్డి (జనగామ), కుసుమ జగదీశ్వర్ (ములుగు), అంగోతు బిందు (మహబూబాబాద్), జక్కు శ్రీహర్షిణి (జయశంకర్ భూపాలపల్లి), పుట్ట మధు (పెద్దపల్లి), లింగాల కమల్‌రాజ్ (ఖమ్మం)లు ఉన్నారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జడ్పీ ఉపాధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు వీరితో ఉన్నారు. వారందరినీ కేటీఆర్ పేరుపేరునా అభినందించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. 'ప్రధాన ఎన్నికలు పూర్తయ్యాయి. అమలు బాధ్యతలను అంతా స్వీకరించాలి. సీఎం దానిపై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారు. అంతా పదవుల్లో రాణించి, జిల్లాలకు, రాష్ట్రానికి పేరు తేవాలి' అని కేటీఆర్ అన్నారు. కొత్త జిల్లాల చైర్‌పర్సన్లతో మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమవుతారని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. జిల్లా పరిషత్‌ల పాలన ఇతర అంశాలపై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాగర్‌కర్నూల్ జడ్పీ చైర్‌పర్సన్ పద్మావతి, వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, పక్కన మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు తదితరులు

ఒకట్రెండు రోజుల్లో మంత్రిమండలి భేటీ

- ప్రతిపాదనలతో సిద్ధంకావాలని అన్ని శాఖలకు ప్రభుత్వ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ మంత్రిమండలి సమావేశం ఒకట్రెండు రోజుల్లో జరగనుంది. సన్నద్ధంగా ఉండాలని, ఇప్పటికే సిద్ధం చేసిన అంశాలతోపాటు కొత్త ప్రతిపాదనలనూ పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. ఈ మేరకు కార్యదర్శులకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రిమండలి సమావేశాన్ని గత నెల 28నే నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించినా.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేసింది. కోడ్ ముగియడంతో సమావేశానికి సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా చివరి మంత్రిమండలి సమావేశం జరిగింది. ఎజెండాకు సంబంధించి అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆసరా పింఛన్ పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేసింది. జులై 1వ నుంచి వాటి పంపిణీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులకు మంత్రిమండలి ఆమోదం తెలపాలి. కొత్త రెవెన్యూ, పురపాలక చట్టాల గురించి ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వాటిని మంత్రిమండలిలోపెట్టి ఆమోదం తీసుకోవాలని సీఎం భావిస్తున్నారు. దీంతోపాటు కొత్త సచివాలయ నిర్మాణం గురించి కూడా మంత్రిమండలిలో చర్చించి.. నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నట్లు సమాచారం. నీటిపారుదల ప్రాజెక్టుల వ్యయపరిమితికి సంబంధించి మూడేళ్ల క్రితం జారీ చేసిన జీవో నంబరు 46 కాలపరిమితి ముగిసింది. దాన్ని కొనసాగించాలా? వద్దా? అనే దానిపై నిర్ణయం తీసుకోవాలి. కాళేశ్వరం, శ్రీశైలం ఎడమగట్టు కాలువ, మిషన్ కాకతీయల గురించి చర్చించనున్నారు. ఇవిగాక ఉద్యోగులకు సంబంధించిన మధ్యంతర భృతి, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై ఏపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడంతో అందరి దృష్టి తెలంగాణ ప్రభుత్వంపై పడింది. ఇప్పటికే పీఆర్సీ దీనిపై అధ్యయనం చేస్తోంది. విద్య, వైద్యరంగాలకు సంబంధించిన అంశాలూ పెండింగ్‌లో ఉన్నాయి. మంత్రిమండలి ఎజెండాకు సంబంధించి మంగళవారం కూడా సీఎం కేసీఆర్ అధికారులతో చర్చించనున్నారు.

నీతి ఆయోగ్, జీఎస్టీ మండలి భేటీలకు సీఎం కేసీఆర్

- 14న దిల్లీకి పయనం

నీతి ఆయోగ్ అయిదో సమావేశం ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం దిల్లీలో జరగనుంది. దీనికి అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించారు. మరోవైపు 20న దిల్లీలోనే జీఎస్టీ మండలి సమావేశం జరగనుంది. ఈ భేటీకి ఆర్థిక మంత్రులకు ఆహ్వానం పంపించారు. ఆర్థికమంత్రిగానూ కేసీఆర్ బాధ్యతలు నిర్వహిస్తున్నందున.. ఈ రెండు సమావేశాలకు ఆయన హాజరు కావాల్సి ఉంది. రెండోసారి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న నీతి ఆయోగ్ సమావేశాలు కీలకంగా మారాయి. నీటి సంరక్షణ, కరవు-ఉపశమన చర్యలు, ఆకాంక్షిత జిల్లాలు, వ్యవసాయ విధానంలో సంస్కరణలు, వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెట్ కమిటీ చట్టం, నిత్యావసర సరకుల చట్టం-1955 తదితర అంశాలపై చర్చించనున్నారు. వ్యవసాయ సంస్కరణలకు సీఎం కేసీఆర్ ఆది నుంచీ ప్రాధాన్యం ఇస్తున్నారు. రైతుబంధు, రైతుబీమా వంటివి దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. వ్యవసాయాన్ని ఉపాధి హామీకి అనుసంధానం చేయాలని కేసీఆర్ మొదటి నుంచీ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నీతిఆయోగ్ సమావేశానికి వెళ్లాలని ఆయన నిర్ణయించారు. ఈ నెల 14నే కేసీఆర్ దిల్లీకి వెళ్తారు. మరోవైపు 20న జరగనున్న జీఎస్టీ మండలి సమావేశం కూడా ముఖ్యమైనదే. ఈ రెండింటిపై మంగళవారం సీఎం అధికారులతో చర్చించనున్నట్లు తెలిసింది.

కేంద్ర హోంమంత్రితో గవర్నర్ భేటీ

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయని ఉమ్మడి గవర్నర్ నరసింహన్ అన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సోమవారం సమావేశమైన ఆయన ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాలూ బాగా పనిచేస్తున్నాయని, పరస్పరం సహకరించుకుంటున్నాయని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న భవనాల సమస్య తొలుత పరిష్కారమైందని, అదేవిధంగా ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రులు కూర్చొని మాట్లాడుకుంటారని చెప్పారు.

S.I. కానిస్టేబుల్ T/M & E/M
రాబోయే S.I. కానిస్టేబుల్ ఫలితాలలో ప్రభంజనం సృష్టించబోతున్న అగ్రగామి సంస్థ ...HIP
Long Term కొత్తబ్యాచ్ 12-06-19 నుండి ప్రారంభం
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్
బిల్‌సుభేనగర్, Hyderabad
9848262600, 9849771902

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office: Rajendranagar: Hyderabad-500 030.
Advt.No.5997/Exams/2019(1) Date:10-06-2019
ADMISSION NOTIFICATION
ONLINE applications are invited from eligible female candidates for admission into B.Sc.(Hons.) Community Science for the academic year 2019-20. The Application, Prospectus and other details are available on the University website www.pjtsau.edu.in. The last date for application is 04-07-2019 (4 PM).
Dr. S. SUDHEER KUMAR, REGISTRAR

ఒరిగిన జ్ఞానశిఖరం

(మొదటి పేజీ తరువాయి)

రెండేళ్లుగా బహుళ అవయవాల సమస్యలతో బాధపడిన గిరీశ్ కర్నాడ్ నెల రోజులుగా ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. తన శ్వాసకోశాలు పూర్తిగా దెబ్బతిన్నా కృత్రిమ శ్వాస వ్యవస్థతోనే పలు ఆందోళనలు, చర్చల్లో ఆయన పాల్గొన్నారు. చలనచిత్రాల్లో నటించారు. మత ఛాందసాన్ని, మూఢ విశ్వాసాలను ముక్కుసూటిగా ప్రశ్నించారు. తన పార్థివ శరీరాన్ని ప్రజలు, రాజకీయ నేతల సందర్శనకు ఉంచకుండా కుటుంబ సభ్యుల మధ్యే అంతిమ సంస్కారాలు జరపాలని ఆకాంక్షించేవారు. ఆయన కోరిక మేరకే గిరీశ్ కర్నాడ్‌కు ప్రభుత్వ లాంఛనాలు లేకుండానే సోమవారం మధ్యాహ్నం 2.10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు సన్నిహితులైన సాహితీవేత్తలు, కొందరు మంత్రులు పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు చేయడం ఆనవాయితీ అని కర్ణాటక ప్రభుత్వం గుర్తుచేసినా కుటుంబసభ్యులు సున్నితంగా తిరస్కరించారు. ఆయన మృతికి సంతాపంగా ప్రభుత్వ సెలవుతోపాటు మూడు రోజుల సంతాప దినాలను కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది.

వరించిన అవార్డులెన్నో..

ఎన్నెన్నో అవార్డులు కర్నాడ్‌ను వెతుక్కుంటూ వచ్చాయి. 1972లో సంగీత నాటక అకాడమీ పురస్కారం, 1974లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్, అదే ఏడాది సాహిత్య అకాడమీ పురస్కారం, 1998లో జ్ఞానపీఠ పురస్కారం, 1998లో కాళిదాస సమ్మాన్, రాజ్యోత్సవ పురస్కారాలు ఆయన్ని వరించాయి. కన్నడ, హిందీ భాషల్లో ఏడు ఫిలింఫేర్ అవార్డులను సొంతం చేసుకున్న మనత కర్నాడ్‌కే దక్కుతుంది. పురాణాలు, చరిత్ర, వర్తమాన అంశాలను సాహిత్య వస్తువుగా ఆయన ఎంచుకునేవారు.

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

గిరీశ్ కర్నాడ్ మృతిపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతాపం తెలిపారు. దేశ సాంస్కృతిక రంగం చిన్నబోయిందని ఆవేదన చెందారు. తన బహుముఖ ప్రజ్ఞతో జ్ఞాపకాల్లో ఉండిపోతారని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నివాళులర్పించారు. అన్ని భాషల చలనచిత్రాల్లో అసమాన నటనను ప్రదర్శించారని గుర్తుచేశారు. తనకు నచ్చిన అంశాలపై సూటిగా మాట్లాడగలరని పేర్కొన్నారు. మాజీ ప్రధాని హెచ్.డి.దేవేగౌడ, ముఖ్యమంత్రి కుమారస్వామి, కేంద్ర మంత్రి సదానందగౌడ, బీజేపీ కర్ణాటక అధ్యక్షుడు యడ్యూరప్పలు ట్వీట్ ద్వారా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నాటక, సాహిత్య రంగాల్లో సేవ: కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ కన్నడ నాటక రచయిత, నటుడు, దర్శకుడు, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత గిరీశ్ కర్నాడ్ మృతికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దేశ నాటక, సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేసిన ఆయన సేవలు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులుగాంచాయని సీఎం కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

కర్నాడ్ పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న కర్ణాటక మంత్రి డి.కె.శివకుమార్

యంత్రం కదిలేదెన్నడు?

(మొదటి పేజీ తరువాయి)

వారిగా వ్యవసాయశాఖ తీసుకుని ఆన్‌లైన్‌లో రైతులకు తెలపాలి. ఈ ధరలను తీసుకునే ముందు ఇతర రాష్ట్రాల్లో అదే యంత్రానికి ధర ఎలా ఉందో తనిఖీ చేయాలి. సాధ్యమైనంత తక్కువ ధరను ఖరారు చేయాలి. దీనికి టెండర్లు పిలవాల్సిన అవసరం లేదు. నేరుగా కంపెనీల నుంచి ధరల పట్టిక తీసుకుని వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాలి. ఏ ఒక్క కంపెనీదో కొనండని రైతులకు చెప్పవద్దు. సదరు యంత్రం ధర ఎంత, దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ వివరాలను మాత్రమే ఆన్‌లైన్‌లో వెల్లడించాలి. అన్నదాత తనకు ఇష్టమైన జేబు కీరుకున్న కంపెనీ నుంచి కొనుక్కోవచ్చు. ధరల పట్టికను ఆన్‌లైన్‌లో పెట్టేముందు ప్రతీ యంత్రం నాణ్యతను వ్యవసాయశాఖ తనిఖీ చేయాలి. నాసిరకం యంత్రాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలి. యంత్రాన్ని రైతు కొనుక్కోవాలంటే పూర్తి ధరను ముందే చెల్లించాలా లేక రాయితీ పోను మిగతాది చెల్లించాలా అన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. రాయితీ పోను మిగతా సొమ్ము చెల్లిస్తే సరిపోతుందని నిర్ణయిస్తే మరి రాయితీ సొమ్మును రైతు ఖాతాలో ముందే వేయాలి. అది జరగాలంటే ఈ ఏడాది వ్యవసాయ యంత్రాల పథకానికి రూ.750 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యవసాయశాఖకు రావాలి. ఇప్పటివరకూ ఎన్నికల కోడ్ కారణంగా నిధులేమీ రాలేదు. ఒకవేళ రాయితీ రైతు ఖాతాలో తరువాత వేస్తాం...ముందుగా పూర్తి ధరను కంపెనీకి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తే అన్నదాతలు ఒకేసారి సొంతంగా వేలాది రూపాయలు వెచ్చించి కొంటారా అనేది అనుమానమేనని ఓ వ్యవసాయాధికారి తెలిపారు. ఉదాహరణకు ట్రాక్టర్ ధర రూ.4 లక్షల నుంచి 8 లక్షల వరకూ ఉంది. రాయితీగా సగం వరకూ వచ్చే అవకాశం ఉంది. ఈ రాయితీ సొమ్ము ముందు ఇవ్వకుండా పూర్తి మొత్తాన్ని రైతు ముందుగానే కంపెనీకి చెల్లించాలంటే సాధ్యం కాదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పాత పద్ధతిలోనే టెండర్లు పిలిచి ధరలు ఖరారు చేసి కంపెనీలను యథావిధిగా రైతులకు రాయితీ పోను మిగతా సొమ్ముకు యంత్రాలను ఇచ్చేయాలా అనే మరో ప్రతిపాదనను కూడా ప్రభుత్వానికి పంపారు. దీనిని ప్రభుత్వం ఆమోదించినా యంత్రాల పంపిణీ త్వరగా జరుగుతుందనేది కష్టమేనని తెలుస్తోంది. గత రెండేళ్లుగా యంత్రాలిచ్చిన కంపెనీలకు రాయితీ బకాయిలు ఇంకా చెల్లించాల్సి ఉంది. ఈ పథకంపై ప్రభుత్వంతో చర్చించి త్వరగా నిర్ణయం తీసుకుంటామని వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జా 'ఈనాడు'కు చెప్పారు.

ఈనాడు 1869 - 2019 మహత్మాజీ 150వ జయంతి వేడుకలు
అహింస ముందు కరగాల్సిందే!
ఎంతటి కఠిన లోహమైనా... కొలిమిలో ఓ స్థాయి వేడిమికి తలవంచాల్సిందే. అలాగే ఎంతటి పాషాణ హృదయాలైనా కూడా 'అహింస' అనే ఉష్ణానికి కరగిపోవటం తథ్యం. మనం ఎంతటి అపరిమితమైన వేడినైనా పుట్టించగల సామర్థ్యం అహింసకు ఉందని గుర్తించాలి!
- మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

11-6-2019 మంగళవారం

శ్రీ వికారి నామ సంవత్సరం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
నవమి: రా. 2.24 తదుపరి దశమి
ఉత్తర నక్షత్రం: మ. 2.44 తదుపరి హస్త
అమృత ఘడియలు: ఉ. 8.00 నుంచి 11.50 వరకు
వర్జ్యం: రా.10.37 నుంచి 12.07 వరకు
దుర్ముహ

నూతన పుర చట్టానికి తుది రూపు!

- ఒకే చట్టం.. అందులోనే వేర్వేరుగా అంశాలు
- పురపోరుకు ఇదే ప్రాతిపదిక
- జీహెచ్ఎంసీ, జలమండలికి ప్రత్యేకం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో పురపాలక ఎన్నికల నేపథ్యంలో కొత్త పురపాలకచట్టం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. రాష్ట్రంలోని పురపాలక సంఘాల పాలకవర్గాల గడువు జులై మూడో తేదీతో ముగియనున్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఏకీకృత పురపాలక చట్టాన్ని తెచ్చేందుకు కసరత్తు పెంచింది. కొత్త చట్టం ద్వారానే పురపాలక ఎన్నికలు నిర్వహించాలనే ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో పురపాలకశాఖ ఉన్నతాధికారులు ఈ దిశగా పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. పురపాలక ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైకోర్టులో పిటిషన్ దాఖలైనందున.. ఎన్నికలు పూర్తి చేయడానికి గడువుపై నిర్ణయం తీసుకోనుంది. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, పట్టణ ప్రణాళిక, హైదరాబాద్ నగరపాలక సంస్థ, హైదరాబాద్ జలమండలి తదితర సంస్థలు పురపాలన పరిధిలోనే ఉన్నా వేర్వేరు చట్టాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏకీకృత పురపాలక చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ చట్టం రూపకల్పనపై సారించింది.

హైదరాబాద్‌లో భిన్న పరిస్థితులు

హైదరాబాద్ నగర పాలక సంస్థలకు రాష్ట్రంలోని ఇతర నగర పాలక సంస్థలకు పలు అంశాల్లో వ్యత్యాసం ఉంది. హైదరాబాద్ నగర పాలకసంస్థ చట్టంలోనే పూర్తి అంశాలతో పాటు నగరంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా చట్టంలో అనేక అంశాలను పొందుపరిచారు. ఇదే సమయంలో రామగుండం, నిజామాబాద్ లాంటి చిన్న నగరపాలక సంస్థలను హైదరాబాద్‌తో సమానంగా భావించి నిబంధనలు రూపొందిస్తే అమలులో పలు సమస్యలు వస్తాయని గుర్తించారు. ఒకేచట్టం ఉన్నా హైదరాబాద్‌ను ప్రత్యేకంగా పేర్కొనాల్సిన పరిస్థితి ఉందని పురపాలకశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. భవన నిర్మాణ నిబంధనలు సహా అనేక అంశాలను అన్ని నగరాలకు ఒకేలా రూపొందించడం సరికాదని.. అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే చట్టంలో ఈ అంశాలను పొందుపరుస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

హైదరాబాద్ మహానగరం నీటి అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్ జలమండలిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇది కూడా ప్రత్యేక చట్టం కింద నడుస్తోంది. రాష్ట్రంలో ఇతర నగరాలు, మిగిలిన నగర పాలక సంస్థల్లో నీటి సరఫరాను ఆ సంస్థలే చూస్తున్నాయి. ఇలా హైదరాబాద్‌కు ఇతర ప్రాంతాలకు ఉన్న భిన్న పరిస్థితులు ఉన్నందున.. చట్టంలో హైదరాబాద్‌ను, ఇతర నగర పాలక సంస్థలను వేరుగా చూపాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

స్థాయీసంఘాల బాధ్యతల్లో మార్పులు

పురపాలక చట్టంలో కీలక మార్పులపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లలో కీలకంగా ఉన్న స్థాయీసంఘాల విధివిధానాలను మార్చనున్నారు. కార్పొరేటర్లను భాగస్వామ్యం చేసేలా ఈ చట్టాన్ని రూపొందించనున్నారు. మేయర్‌లు లేదా చైర్‌పర్సన్‌లు, మిగిలిన కార్పొరేటర్లు, కౌన్సిలర్ల జవాబుదారీతనం పెంచేలా అనేక అంశాలను చట్టంలో చేర్చడంపై కసరత్తు చేస్తున్నారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రజాప్రతినిధులు జవాబుదారీతనం.. కొత్త చట్టంలో కీలకాంశాలుగా ఉన్నాయి. పట్టణ ప్రణాళికకు ప్రత్యేకచట్టం ఉంది. ఇది పురపాలనలో భాగమైనప్పటికీ స్వతంత్ర వ్యవస్థగా కొనసాగుతోంది. కొత్త చట్టంలో పట్టణ ప్రణాళిక విభాగం పూర్తిగా పురపాలన ఆధీనంలోకి రానుంది. పురపాలక కమిషనర్ లేదా డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ విభాగం కొనసాగనుంది. రెండు మూడు రోజుల్లో కొత్త పురపాలక చట్టంపై కసరత్తు కొలిక్కి వస్తుందని పురపాలకశాఖ ముఖ్య అధికారి తెలిపారు.

అనధికార సిబ్బందిపై వేటు

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రక్షాళన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఎన్నేళ్లుగా పనిచేస్తోన్న అనధికార సిబ్బందిపై వేటుపడింది. పదిరోజులుగా ఎవరూ విధులకు హాజరు కావడంలేదు. ఈ ప్రక్షాళనతో అధికారులపై పని ఒత్తిడిపెరిగినా అవినీతి తగ్గుతుందని ఉన్నతాధికారులుఅభిప్రాయపడుతున్నారు. ప్రతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, ఒకరిద్దరు ప్రైవేటు సిబ్బంది ఉంటారు. వీళ్లకు రిజిస్ట్రేషన్ శాఖకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ సిబ్బంది కొరత, పెరిగిన పని ఒత్తిడిని తగ్గించుకోడానికి సబ్ రిజిస్ట్రార్లు అనధికారికంగా వీరిని కొనసాగిస్తూ వస్తున్నారు. వారి ద్వారా కొందరు అవినీతికి పాల్పడుతుండగా.. మరికొందరు వారికి జీతాలు ఇవ్వాలనే కారణం చూపి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల యాదగిరి గుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి చేసిన ఏసీబీ అధికారులు అక్కడ ఏడుగురు ప్రైవేటు సిబ్బంది పనిచేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో ఆ ఏడుగురికి సబ్ రిజిస్ట్రారే జీతాలు ఇస్తున్నట్లు, ఇందుకోసమే అయన వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేల్చారు. వాచ్చిన నివేదిక మేరకు అప్రమత్తమైన ఉన్నతాధికారులు ప్రైవేటు సిబ్బందిని తొలగించాలంటూ ఈ నెల 1న అన్ని జిల్లాల రిజిస్ట్రార్లను మౌఖికంగా ఆదేశించారు. "రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రైవేటు సిబ్బందిని ఉంచకూడదు. జిల్లా రిజిస్ట్రార్ నిర్వహించే తనిఖీల్లో శాఖతో సంబంధం లేని సిబ్బంది ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. కార్యాలయాల్లోకి మధ్యవర్తులను, దస్తావేజు లేఖరులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దు. కారణాలు లేకుండా దస్త్రాలను అపరిష్కృతంగా ఉంచడం, స్కానింగ్ చేయకుండా ఆపడం చేయొద్దు. ఆదేశాల అమలులో విఫలమైతే సబ్ రిజిస్ట్రార్లే అందుకు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది" అంటూ ఆదేశాలిచ్చారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 450 మంది అనధికార సిబ్బందిపై వేటు పడినట్టు సమాచారం. శాఖలో రిజిస్ట్రార్ మొదలు అడెంటర్ వరకు అన్ని స్థాయిలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తే ఇలాంటి సమస్యలే రావని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

'మల్లన్నసాగర్' చెక్కులు మాయం

- రూ.50 లక్షలు అక్రమంగా డ్రా
- సిద్దిపేట వన్‌టౌన్ ఠాణాలో కేసు నమోదు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- పరారీలో నిందితులు
- తాజాగా సొత్తు స్వాధీనం
- ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

సిద్దిపేట - న్యూస్‌టుడే

కొమురవెల్లి మల్లన్న సాగర్ జలాశయ ముంపు బాధితులకు పంపిణీ చేయాల్సిన చెక్కుల్లో రెండు మాయమయ్యాయి. ఆర్డీవో కార్యాలయం కేంద్రంగా ఈ అక్రమం జరిగింది. ఈ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ (ఆర్డీవో సీసీ) సందీప్ వీటిని మాయం చేసినట్లుగా అధికారుల విచారణలో తేలడంతో కలెక్టర్ కృష్ణభాస్కర్ సోమవారం అతన్ని సస్పెండ్ చేశారు. ఒక చెక్కు ద్వారా రూ.50 లక్షలు డ్రా చేసిన కొండపాక మండలం దుద్దెడకు చెందిన చాంద్‌పాషాపై ఈ నెల 7న సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులిద్దరూ పరారీలో ఉన్నారు. చాంద్‌పాషా కుటుంబసభ్యుల ద్వారా అధికారులు సోమవారం రూ.50 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారించి నివేదిక అందజేయాలని డీఆర్వో చంద్రశేఖర్‌ను కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆదేశించారు. చెక్కులు మాయమయ్యాక దాదాపు నాలుగు నెలలకు ఉన్నతాధికారులు గుర్తించడం గమనార్హం.

సిద్దిపేట జిల్లాలోని తొగుట మండలంలో కొమురవెల్లి మల్లన్నసాగర్ జలాశయ నిర్మాణం చేపట్టారు. ఈ మండలంలో ఆరు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఇందులో భాగంగా భూసేకరణ చేపట్టి పరిహారం కింద చెక్కులను నిర్వాసితులకు అందజేస్తున్నారు. ఈ ప్రక్రియ వేగంగా జరిగేందుకు కలెక్టర్.. ఖాళీ చెక్కులపై సంతకాలు చేసి అధికారులకు అప్పగిస్తున్నారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వీటిని పంపిణీ చేయాల్సి ఉండగా రెండు చెక్కులు మాయమయ్యాయి. ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సందీప్ వీటిని తస్కరించినట్లుగా అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. వీటిని కొండపాక మండలం దుద్దెడకు చెందిన చాంద్‌పాషా అనే వ్యక్తికి సదరు ఉద్యోగి అందజేశారు. దుద్దెడలోని ఓ బ్యాంకులో జనవరి చివరలో రూ.50 లక్షలను చాంద్‌పాషా డ్రా చేశారు. ఏప్రిల్‌లో మరో చెక్కు ద్వారా రూ.2.60 కోట్లు డ్రా చేయడానికి యత్నించగా, బ్యాంకులో ఆ మేర డబ్బులు లేకపోవడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఈ అంశాన్ని రెవెన్యూ శాఖ అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఈ శాఖలోని డివిజన్ స్థాయి అధికారి దృష్టికి దాదాపు 20 రోజుల కిందటే వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. వెంటనే స్పందించి పోలీసులకు ఈ విషయం చేరవేయక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాన్ని అంతర్గతంగా పరిష్కరించడానికి యత్నించినా సఫలీకృతం కాకపోవడంతో ఈ నెల 6న పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు ఉపక్రమించగానే వారు పారిపోయారు. చాంద్‌పాషా తరచూ దుబాయి వెళ్తుంటాడు. పోలీసులు పట్టుకోవడానికి యత్నిస్తున్న క్రమంలో అతను అదృశ్యమయ్యాడు. దీంతో దేశంలోనే ఎక్కడైనా ఉన్నాడా లేదంటే దుబాయి పారిపోయాడా.. అన్నది తేలాల్సి ఉంది. అధికారుల వద్ద ఉండాల్సిన చెక్కులు ఆర్డీవో కార్యాలయ ఉద్యోగి వద్దకు ఎలా వచ్చాయన్నది ప్రశ్నార్థకం. సదరు ఉద్యోగి ఒక్కడే మాయం చేశాడా, దీనికి మరెవరైనా సహకరించారా.. అన్న వివరాలు కూడా తేలాల్సి ఉంది. జనవరిలో చెక్కులు మాయమయ్యాక నెలలు గడిచాక గానీ అధికారులు విషయాన్ని గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 7న పోలీసులు కేసు నమోదు చేసినా గోప్యంగా ఉంచారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కృష్ణభాస్కర్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సందీప్‌ను సస్పెండ్ చేశారు. చెక్కులు మాయం వెనుక సందీప్‌తో పాటు మరో ఇద్దరు ఉద్యోగుల హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది.

సీఎం కేసీఆర్‌కు పుస్తకాలు అందజేస్తున్న జూలూరు గౌరీశంకర్

కేసీఆర్‌పై మూడు పుస్తకాలు

సీఎంకు అందజేసిన జీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్

ఈనాడు, హైదరాబాద్: జీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ 'ఎందరొచ్చినా, తెలంగాణ విజయగాథ, సమ్మోహనాస్త్రం' శీర్షికలతో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మూడు పుస్తకాలు రాశారు. వీటి తొలి ప్రతులను సోమవారం ప్రగతిభవన్‌లో ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. వ్యాసాల సంకలనం 'ఎందరొచ్చినా', అయిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై తెలంగాణ విజయగాథ, కేసీఆర్ శాసనసభ ఎన్నికల్లో చేసిన ప్రసంగాలతో 'సమ్మోహనాస్త్రం' పేరిట పుస్తకాలను సిద్ధంచేసినట్లు గౌరీశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆయనను అభినందించారు. మారంరాజు సత్యనారాయణ రాసిన 'గ్రామాయణం' పుస్తకాన్ని కూడా గౌరీశంకర్ సీఎంకు అందజేశారు.

పశుసంవర్ధక శాఖకు రూ.6.37 కోట్లు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: గోపాలమిత్రులకు గౌరవ వేతనాలు, ఇతర అలవెన్సుల కింద రూ.6.37 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులిచ్చింది. ఆ మేరకు మొత్తాన్ని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌కు మంజూరు చేస్తూ సోమవారం కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు పంపారు.

ఇండియాబుల్స్‌హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ చైర్మన్, డైరెక్టర్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలైంది.

DR. K.N. MODI UNIVERSITY 76 Years
NEWAI, JAIPUR, (RAJ.) • www.dknmu.org
Nominal Fee | 100% Career Oriented | Limited Seats
B.Sc. Agriculture + ABM
South India Office: Heave Rich Technologies Pvt Ltd
Suite No: 110, Aditya Trade Centre, Paassport Office Building, Ameerpet, Hyderabad
admissions@heaverich.in, admission@dknmu.org
9666948456, 7569173663, 9100757996, 8875010040

భారత్ నుంచి పారిపోయి తమ దేశంలో తలదాచుకుంటున్న వివాదాస్పద ఇస్లాం ప్రవచకుడు జకీర్ నాయక్‌ను అప్పగించటానికి నిరాకరించే హక్కు మలేసియాకు ఉందని ఆ దేశ ప్రధాని మహతీర్ మహమద్ తెలిపారు.

4వ, 5వ, 6వ తు॥ పిల్లలలకు
సైనిక్‌స్కూల్స్, నవోదయ
KUSHAL RUSHIKESH
కరీంనగర్ సైనిక్ 2019 స్టేజ్ 2nd మార్క్‌తో పాటు 18 విద్యార్థులు విజయ సైనిక్ స్కూల్స్, ఏ.పి.యస్. నవోదయ 20 జిల్లాలో బాస్ 20లో మా ట్యూటర్. కర్ణాటక సైనిక్‌కి 10కి 10 సీట్లతో మొత్తంగా 93 సీట్లు సాధించిన 21 సంలుగా 100పైగా నవోదయ విద్యల క్రాంత్ కీస్ రెసిడెన్షియల్ స్కూల్ & జనియర్‌కాలేజ్. Hyd. సర్ధాంద్, విజయవాడ్ Ph: 9032252521, 9030409797

LIC HFL LIC HOUSING FINANCE LTD
Building homes. Nurturing relationships.
ఆన్‌లైన్ హోమ్ లోన్ బోనాంజా
₹7000/-* విలువ గల గిఫ్ట్ ఓచర్ పొందండి (రుణవితరణపై)
హోమ్ లోన్ సంవత్సరానికి @ 8.80% నుంచి
ఆన్‌లైన్‌లో www.lichousing.comలో దరఖాస్తు చేసుకోండి
*పరిమిత కాల ఆఫర్. ఆన్‌లైన్ దరఖాస్తుకు మాత్రమే చెల్లుతుంది. లోన్ ఎలిజిబిలిటీ హెచ్.ఎల్.ఎఫ్.లో విచక్షణాధికారం మేరకు ఉంటుంది.

వారం రోజుల్లో తెలంగాణకు భవనాల అప్పగింత

- సీఎస్ అధ్యక్షతన జరిగిన ఇరు రాష్ట్రాల అధికారుల సమావేశంలో నిర్ణయం
- సామగ్రి తరలింపు ప్రారంభం
- సచివాలయం, శాసనసభ, మంత్రులు, ఎమ్మెల్యేల నివాస సముదాయాలు ఖాళీ

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేటాయించిన భవనాలన్నింటినీ వారం రోజుల్లోగా తెలంగాణకు అప్పగించనున్నారు. ఈ మేరకు రెండు రాష్ట్రాల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ, ఏపీ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ విభాగాల అధికారులు సమావేశమయ్యారు. తెలంగాణ నుంచి రామకృష్ణారావు, ఏపీ నుంచి ప్రేమ్‌చంద్రారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవనాల అప్పగింత ప్రక్రియ గురించి చర్చించారు. ఇప్పటికే ముఖ్యమంత్రుల స్థాయిలో నిర్ణయం తీసుకోవడంతో పాటు గవర్నర్ ఆదేశాలు జారీ చేయడంతో దాని అమలుకు చర్యలు ప్రారంభించారు. సోమవారం నుంచి భవనాల్లోని సామగ్రి, కంప్యూటర్లు, దస్త్రాల తరలింపు ప్రారంభమైందని ఏపీ అధికారులు వెల్లడించారు. మూడు, నాలుగు రోజుల్లో అన్ని భవనాల్లో ఈ తంతును పూర్తి చేస్తామని వెల్లడించారు. ఏపీ సచివాలయం వినియోగించిన భవనాలను తెలంగాణ సాధారణ పరిపాలన శాఖకు, శాసనసభ భవనాలను తెలంగాణ శాసన సభా కార్యదర్శికి, ఎమ్మెల్యేల క్వార్టర్లు, మంత్రుల గృహ సముదాయాలను రోడ్లు భవనాల శాఖ ఎస్టేట్ అధికారికి అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ప్రభుత్వం వాడిన భవనాలపై రూ. 14.5 కోట్ల మేరకు ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బకాయిలు ఉన్నాయని తెలంగాణ అధికారులు తెలిపారు. బకాయిలను రద్దు చేయాలని ఏపీ అధికారులు కోరగా... దీనిపై సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని సీఎస్ జోషి వెల్లడించారు.

హైదరాబాద్‌లోని ఏపీ సచివాలయం నుంచి సామగ్రి తరలిస్తున్న సిబ్బంది

సామగ్రి తరలింపు

సోమవారం సచివాలయం, శాసనసభ, ఎమ్మెల్యేలు, మంత్రుల నివాస సముదాయాలు, ఆప్కో, ఏపీఎస్ఎఫ్‌సీ, సంక్షేమభవన్ తదితర కార్యాలయాల్లోని సామగ్రిని ఏపీ అధికారులు తరలించారు. అవి దాదాపుగా ఖాళీ అయ్యాయి. ఆయా కార్యాలయాల అధికారులు భారీ వాహనాలను తెచ్చి వాటిలో పర్నీచర్‌ను తీసుకెళ్లారు. మరికొన్ని భవనాల్లో మంగళవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ప్రస్తుతం HCL లో ఉద్యోగం చేస్తున్న విద్యార్థులు

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు HCL లో IT Engineer ఉద్యోగం
ఉద్యోగం చేస్తూనే degree పూర్తి చేసే అవకాశం
ఉద్యోగ వివరాలు
• Application and Infrastructure support, Testing and CAD support - రంగాలలో ప్రవేశ స్థాయి ఉద్యోగాలు
• విజయవంతంగా శిక్షణ పూర్తి అయిన తరువాత ఏడాదికి 2.0 లక్షల నుండి 2.2 లక్షల వేతనం.
IT ఉద్యోగ శిక్షణ
• 12 నెలల శిక్షణ,ప్రతి నెల 10,000 వేతనం.
• ఫీజు: 2 లక్షలు +Taxes. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు మరియు శిక్షణ తదుపరి HCL లో విధులు చేపట్టిన మొదటి సంవత్సరము నుండి EMI ప్రారంభమవును
ఉద్యోగముతో పాటు ఉన్నత విద్య
*HCL నుండి నిధుల సహాయముతో SASTRA UNIVERSITY నుండి BCA (3 Years) లేదా BITS PILANI నుండి B.Sc. (4 Years) పూర్తిచెయుట తప్పనిసరి.
విద్యార్హతలు
• ఇంటర్మీడియట్ 60% మరియు ఆ పై మార్కుల ఉత్తీర్ణత.
• గణితం /వ్యాపార గణితం తప్పనిసరి.
• 2018, 2019 ఏడాదిలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు మాత్రమే.
*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి.
WALKIN FOR SELECTION / INTERVIEW PROCESS
Adilabad: Skill Training Center, Bright Light Society ,H.No.6-8-57/4, Bhuktpur, Radheshyam Complex, NH No.7 Road, Adilabad - 504001
Nizamabad: Indian Red Cross Society, Nizamabad District Branch, Behind Thasildar office, Khaleelwadi, Nizamabad – 503001
Manchiryala: Vivekavardhini Degree & PG College , Behind Bus Stand Manchiryala-504208
Siddipet: Skill Training Center, Bright Light Society, H.No.17-186/1, Shivaji Nagar, Siddipet, Telangana – 502103
Hanmakonda: Sri Balaji Jr College,H.No.2-9-780/1,2-9-780/2, TNGOs Colony, 100ft Road,Waddepally, Hanmakonda
For more details, give a missed call to 8448 386 391
Website: www.hcltechbees.com | Email techbee.telangana@hcl.com
HCL
$ 8.5 BILLION / 125,000 MINDS / 41 COUNTRIES
HCL does not have any partners/ vendors for training & recruitment for jobs in HCL Vijayawada. Candidates are advised to contact HCL Vijayawada.

మేడిగడ్డ బ్యారేజీ కరకట్టలకు 10 హెక్టార్ల అటవీ భూమి

మహారాష్ట్ర వైపు కేటాయింపులకు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ బ్యారేజీ సమీపంలో.. మహారాష్ట్ర వైపు కట్ట, కరకట్టల నిర్మాణానికి వీలుగా 10 హెక్టార్ల అటవీభూమికి అనుమతులను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రకటన వెలువడింది. బ్యారేజీలో నిల్వ ఉండే జలాల వల్ల మహారాష్ట్ర వైపు గల అటవీ ప్రాంతంలో కొంత.. ముంపునకు గురయ్యే అవకాశముంది. దీంతో ఇక్కడ కరకట్టలు నిర్మించాల్సి ఉంటుంది. అటవీ భూమికి సంబంధించి, మొదటి దశ అనుమతి నెలరోజుల క్రితమే వచ్చింది. ఈ భూమికి ప్రత్యామ్నాయంగా మరో పది హెక్టార్లలో అటవీ అభివృద్ధికి నిధులను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది.

ఆపద్బంధు పథకం గడువు పెంపు

ఈనాడు, హైదరాబాద్: ప్రమాద సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన నిరుపేదలకు ప్రభుత్వం అందించే ఆపద్బంధు పథకం గడువును నవంబరు 1 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదం, ప్రకృతి విపత్తు, ఇతరత్రా కారణాలతో ప్రాణాలుపోయిన వారికి సంబంధించి, ఈ పథకం ద్వారా జిల్లాల కలెక్టర్లు రూ.50 వేల వంతున మొత్తాలను పరిహారం కింద అందజేస్తారు. పథకం అమలును ప్రభుత్వం ఏటా పొడిగిస్తూ వస్తోంది. విధివిధానాలతో ఉత్తర్వులను సోమవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కమిషనర్ రాజేశ్వర్ తివారీ జారీచేశారు.

ఐటీ గ్రిడ్ డైరెక్టర్లకు ముందస్తు బెయిలు

- అశోక్ ప్రతి రోజూ పోలీసుల ఎదుట హాజరుకావాలని షరతు
- శ్రీలక్ష్మికి హాజరు నుంచి మినహాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: డేటా చౌర్యం కేసులను ఎదుర్కొంటున్న ఐటీ గ్రిడ్స్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్లు దాకవరం అశోక్, దాకవరం శ్రీలక్ష్మిలకు సోమవారం హైకోర్టు షరతులతో ముందస్తు బెయిలు మంజూరు చేసింది. రూ.25 వేల చొప్పున రెండు హామీకత్తులు సమర్పించాలని, పాస్‌పోర్టులను స్వాధీనం చేయాలని ఆదేశించింది. హైదరాబాద్ విడిచి వెళ్లరాదని స్పష్టం చేసింది. ప్రతి రోజూ పోలీసుల ఎదుట హాజరుకావాలని అశోక్‌ను ఆదేశించిన న్యాయస్థానం మరో డైరెక్టర్ శ్రీలక్ష్మికి ఆ షరతు నుంచి మినహాయింపు ఇచ్చింది. ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ ఐటీ ఇండియా గ్రిడ్స్ లిమిటెడ్ డైరెక్టర్లు అశోక్, శ్రీలక్ష్మిలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

అంతకుముందు అశోక్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్.రమేశన్ వాదనలు వినిపిస్తూ 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి జూప్రాగ్‌కు వచ్చిన సమాచారం డేటా గ్రిడ్స్ కంపెనీకి వెళ్లింది. దీన్ని తెలుగుదేశం పార్టీ ఆధికార యాప్ నిమిత్తం వినియోగించుకుంటోందన్న ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వ్యవహారంలో డేటా ఇచ్చిన కంపెనీపై కేసు పెట్టాలి తప్ప డైరెక్టర్లపై కాదు. డేటా లీక్ చేసిన వ్యక్తిపై ఐటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి తప్ప, ఐపీసీ కింద కాదు" అని వాదించారు. డేటా చౌర్యం జరిగిందంటూ అధార్ అధికారులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఐటీ చట్టం కింద నమోదయ్యే కేసులు బెయిలబుల్ అని, అందువల్ల ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు. శ్రీలక్ష్మి తరఫున ఏపీ మాజీ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ డైరెక్టర్‌గా ఉన్నంత మాత్రాన కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ఈ వాదనలతో ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది హరేన్ రావల్ విభేదించారు. "ఏడు కోట్ల మందికి చెందిన సమాచారం ఇతరుల వద్దకు చేరింది. వారి చిరునామాతో సహా ఇతర వివరాలన్నీ కంపెనీకి చేరాయి. ఎన్నికల సంఘం వద్ద ఉండాల్సిన కలర్ ఫొటో గుర్తింపు కార్డులు కూడా ఐటీ గ్రిడ్స్‌కు వెళ్లాయి. ఈ కేసులో 19 మంది సాక్షులను విచారించాం. తని ఖీలో మాకు లభించిన డేటాను ఎఫ్ఎస్ఎల్‌కు పంపి, ఆ నివేదిక అందిన తర్వాత సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నాం. మార్చి నుంచి చిరునామ నిమిత్తం నోటీసులు ఇచ్చినా నిందితులు స్పందించడం లేదు. మూణ్నెళ్లుగా కనిపించని వీరు ఇప్పుడు కోర్టు ముందు హాజరై బెయిలు కోరడం సరికాదు" అని పేర్కొన్నారు. హార్డ్ డిస్క్‌లోని సమాచారాన్ని ధ్వంసం చేయాలంటూ వారి ఉద్యోగులకు ఆదేశాలు అందుతున్నాయని, అక్కడున్న సీసీ కెమెరాలను కూడా వారి ఆదేశాలతోనే ధ్వంసం చేస్తున్నారని, శ్రీలక్ష్మి డైరెక్టర్ హోదాలో కంపెనీ రోజువారీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. నిందితులు బెయిలు ఇవ్వాల్సిన వ్యక్తులు కాదని, పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి అశోక్, శ్రీలక్ష్మిలకు షరతులతో ముందస్తు బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈనాడు

ఉమ్మడి వికాసమే లక్ష్యంగా...

పొరుగువారి కష్టాల్ని మనవిగా భావించడం, మన సంతోషంలో ఇరుగుపొరుగు వారికి పాలుపంచడం సమున్నత భారతీయ సంస్కృతీ విశేషం. దాని నుంచి పురుడు పోసుకొన్నదే 'ఇరుగుపొరుగు దేశాలకు అగ్రప్రాధాన్యం' అన్న మోదీ ప్రభుత్వ విధానం! దానికి కట్టుబాటు చాటుతూ భారత ప్రధాని మోదీ- రెండు ద్వీప దేశాలు మాల్దీవులు, శ్రీలంకల్లో జరిపిన పర్యటనకు విశేష ప్రాధాన్యం ఉంది. మూడు దశాబ్దాల క్రితం అబ్దుల్ గయూమ్ సారథ్యంలోని ప్రభుత్వంపై శ్రీలంక దుండగులు తిరుగుబాటు చేయగా, మాల్దీవుల విజ్ఞప్తి మేరకు యుద్ధప్రాతిపదికన సైన్యాన్ని పంపి ఆ దేశాన్ని ఆదుకొన్న ఆపద్బాంధవిగా భారత్ నిలిచింది. 'భారత్‌కే తొలి ప్రాధాన్యం' అన్నది మాల్దీవుల చిరకాల విధానమైనా దాన్ని తుంగలోతొక్కి, చైనా పంచన చేరి దేశాన్ని రుణాల ఊబిలో ముంచేసిన అబ్దుల్ యమీన్ అయిదేళ్ల పీడనకు నిరుడు తెరపడిన నేపథ్యంలో- సరైన ఆసరా కోసం ఆ చిరుదేశం ఆశగా ఎదురుచూస్తున్న వేళ ఇది. శనివారం ఒక్కరోజు ఆ దేశంలో పర్యటించిన మోదీ- దేశాధ్యక్షుడు ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్‌తో విస్తృతంగా చర్చలు జరపడమే కాదు, మజ్లిస్ (మాల్దీవుల పార్లమెంటు)ను ఉద్దేశించీ ప్రసంగించారు. రక్షణ, సముద్రతల భద్రతలతోపాటు ఆరు కీలక ద్వైపాక్షికాంశాలపై కుదిరిన ఒప్పందాలకు జతపడి కేరళలోని కోచినుంచి మాల్దీవులకు ఫెరీ సేవలు అందుబాటులోకి తేవాలన్న నిర్ణయం- మైత్రీలతల్ని మరింతగా విరబూయించేదే. మోదీ శ్రీలంకలో గడిపింది పట్టుమని అయిదు గంటలే అయినా, ఉగ్రవాదం ఉండేలు దెబ్బకు విలవిల్లాడిపోయిన దేశంలో అది నింపిన నైతిక స్థైర్యం మాటలకందనిదే! బాంబు దాడులతో కకావికలమైపోయిన చర్చిని ప్రత్యేకంగా దర్శించిన మోదీ, అక్కడ ఉన్న కాసేపట్లోనే దేశాధ్యక్షుడు, ప్రధాని, విపక్ష నేతలతోపాటు ఆయా ప్రావిన్సుల ముఖ్యమంత్రులతోనూ భేటీ అయ్యి ఉగ్రవాదమే ఉమ్మడి శత్రువని ఘంటాపథంగా చాటారు. కేవలం 24 గంటల వ్యవధిలో 15 రాచకార్యాలను చక్కబెట్టిన ప్రధాని మోదీ- ఉపఖండంలో చైనా అగ్రవాదాన్ని, పాక్ ఉగ్రవాదాన్ని నిలువరించే వ్యూహాత్మక కార్యాచరణతో నెగ్గుకొచ్చారనడంలో సందేహం లేదు!

అయిదేళ్ల క్రితం తొలిసారి పదవీ ప్రమాణ స్వీకారోత్సవ వేళ సార్క్ దేశాధినేతల్ని సాదరంగా ఆహ్వానించిన మోదీ, మలిదఫాలో బిమ్స్‌టెక్ (బంగాళాఖాత పరీవాహక ప్రాంతాల సాంకేతిక ఆర్థిక సహకార కూటమి) దేశాధినేతలకు, కిర్గిజిస్థాన్, మారిషస్‌లకు ఆతిథ్యం ఇవ్వడం గమనార్హం. ఇండియాలో నెత్తుటి నెగళ్లు ఎగదోస్తున్న పాకిస్థాన్ తన ఉగ్రవాద పంథాను ఎంతకూ మార్చుకోకపోబట్టే దాన్ని పక్కనపెట్టేలా 'బిమ్స్‌టెక్' వైపు మొగ్గిన మోదీ ప్రభుత్వం- ఆ ప్రాంతీయ బృందంలో సభ్యురాలు కాకపోయినా, అత్యంత సమీప దేశంగా మాల్దీవుల్ని తొలి పర్యటనలో సమాదరించడం విశేషం! మౌలిక సదుపాయాల పరికల్పన పేరిట మాల్దీవులపై చైనా 300 కోట్ల డాలర్ల రుణభారం మోపగా, నిరుడు డిసెంబరులో 140 కోట్ల డాలర్ల ఆర్థిక సహకార ప్యాకేజీని భారత ప్రభుత్వం ప్రకటించింది. మాల్దీవులు, శ్రీలంకల్లో సైనిక నౌకాస్థావరాల నిర్మాణం ద్వారా ఇండియా చుట్టూ ఉచ్చు బిగించడానికి జనచైనా పావులు కదపడం తెలిసిందే. ఆ దురాలోచన పసిగట్టి ఆ రెండు దేశాలూ వెనక్కి తగ్గిన తరుణంలో- అవసరానికి అక్కరకొచ్చే నేస్తంగా స్వీయ ప్రాధాన్యాన్ని ఇండియా రుజువు చేసుకోవాల్సింది. హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని శాంతిభద్రతలతో విరాజిల్లేలా చేయడమే లక్ష్యంగా 2015లోనే మోదీ ప్రభుత్వం- సాగర్ (సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. చైనా మీద పైచేయి సాధించే వ్యూహంలో భాగంగా శ్రీలంకలో భారీ సైనిక స్థావర నిర్మాణానికి అమెరికా ఒత్తిడి తెస్తోందని పలు వార్తాకథనాలు చాటుతున్నాయి. బీజింగ్, వాషింగ్టన్ల ఆధిపత్య ప్రదర్శనల యుద్ధక్షేత్రంగా శ్రీలంక మారకుండా, ప్రచ్ఛన్నయుద్ధకాలం నాటి అఫ్గాన్‌లా అది మరో రావణ కాష్ఠమై రగలకుండా కాచుకోవడానికి దిల్లీ, కొలంబోల మధ్య స్నేహసేతు నిర్మాణం సత్వరం మరింత పటిష్ఠంగా సాగాలి!

అందరి తోడుగా సమష్టి ప్రగతి (సబ్ కా సాత్ సబ్ కా వికాస్) అన్నది భాజపా నినాదం. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రాంతీయ కూటములు, సమాఖ్యల ఏర్పాటుకు ప్రేరకమైందీ అదే వ్యూహాత్మక విధానం. దక్షిణాసియా దేశాల నడుమ సౌహార్దాన్ని పంచి, స్వేచ్ఛావాణిజ్యంతో సంపద పెంచి అందరి బాగుకూ భరోసా ఇవ్వాలన్న సత్సంకల్పంతో 'సార్క్' ఏర్పాటైనా- దాని పరిధిలోని దేశాల మధ్య వాణిజ్యం కనిష్ఠస్థాయిలో ఒక్క శాతానికి అటుఇటుగా తారట్లాడుతోంది. అదే ఆసియాన్ దేశాల నడుమ అంతర్గత వాణిజ్య పరిమాణం వాటి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పది శాతంగా నిగ్గుతేలుతోంది. ఉగ్ర వంచనల పాకిస్థాన్ 'సార్క్' స్ఫూర్తిని దశాబ్దాలుగా కుళ్లబొడుస్తున్నందున- బిమ్స్‌టెక్, బీబీఐఎన్ (బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్) వంటి ఉపకూటముల ద్వారా ప్రగతి వ్యూహాల్ని పరుగు పెట్టించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. దక్షిణాన శ్రీలంక, మాల్దీవులతోనూ అదే తరహా చొరవకు ప్రయత్నాలు మొదలయ్యాయి. పుల్వామా దాడుల తరవాత పాకిస్థాన్ ఉగ్రనైజాన్ని ఇండియా సైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సభ్యదేశాల కళ్లకు కట్టడంతో, ఇస్లామాబాద్‌పై విస్తృత ఆర్థిక ఆంక్షల వలపరచుకొంటోంది. ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ వచ్చేవారం జరగనుండటంతో- భారత్ సరిహద్దు వెంబడి ఉగ్రవాద శిక్షణ శిబిరాల్ని పాక్ మూసేసింది. ఈ ఒత్తిడిని ఇలాగే కొనసాగించి దాయాది గడ్డపై ఉగ్రవాదం పూర్తిగా మలిగిపోయేలా చూడటం, పిమ్మట పాకిస్థాన్‌నూ ప్రగతిశీల ప్రాంతీయ కూటముల్లో భాగస్వామిగా అక్కున చేర్చుకోవడం- భారత విదేశాంగ విధాన లక్ష్యాల్లో ఒకటి కావాలి. 'సబ్ కా సాత్- సబ్ కా వికాస్' సాధ్యం కావాలంటే, జరగాల్సిందే అది!

వెలుగుల వెనక... నష్టాల చీకట్లు

- ఎన్నికల వరాలతో రాష్ట్ర ప్రభుత్వాల పెడపోకడలు
- కొన్న కరెంటుకు సొమ్ములు చెల్లించని డిస్కమ్‌లు
- పేరుకుపోతున్న బకాయిలతో జెన్‌కోలు విలవిల
- నష్టాల సంద్రంలోకి విద్యుత్ పంపిణీ సంస్థలు

విద్యుత్ రంగంలో తక్షణం సంస్కరణలు తెస్తామని కేంద్రం తాజాగా చెబుతోంది. తీసుకున్న అప్పులు కట్టలేక ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న థర్మల్ కేంద్రాల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. వీటిని వేలం వేసి విక్రయించడానికి చేపట్టిన చర్యలు పూర్తికాలేదు. మరోవైపు విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో)ల కరెంటు కొంటున్న విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు సకాలంలో సొమ్ము చెల్లించకపోవడతో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఏడాది వ్యవధిలోనే ఈ బకాయిలు ఏకంగా 63 శాతం పెరిగిపోయాయి. ప్రపంచంలో విద్యుదుత్పత్తిలో మూడోస్థానం, వినియోగంలో నాలుగో స్థానంలో భారత్ ఉంది. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్‌రంగంలో అత్యధిక పెట్టుబడులను ఆకర్షించే దేశాల్లోనూ భారత్ పోటీపడుతోంది. 2017-22 మధ్యకాలంలో భారత విద్యుత్ రంగంలో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. ఈ రంగంలో ఆర్థికంగా ఎలాంటి ఆస్థిరత ఏర్పడినా పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం పడే అవకాశాలున్నాయి. అంతిమంగా సామాన్యులు వాడే కరెంటు బిల్లుల మోత తప్పదు. దేశంలో కరెంటు ఉత్పత్తికి ప్రధానంగా విద్యుదుత్పత్తి కేంద్రాలున్నా కొనేందుకు పలు రాష్ట్రాలు ముందుకు రాక ఉత్పత్తి తగ్గుతోంది. పలు రాష్ట్రాల్లో అప్రకటిత కరెంటు కోతలు అమలులో ఉన్నాయి. పూర్తి స్థాపిత సామర్థ్యంలో సగం వరకే థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాలు ఉత్పత్తి చేసి అమ్మిన వాటిని కొన్న డిస్కమ్‌లు తిరిగి సకాలంలో సొమ్ము చెల్లించడం లేదు.

ఎన్నికలతోనే లంకె

విద్యుత్ రంగానికి, దేశంలో జరిగే ఎన్నికలకు నేరుగా సంబంధముంది. కరెంటు ఛార్జీలు ఇష్టానుసారం పెంచితే ప్రజలు ఓట్లు వేయరనే భయం రాజకీయ పార్టీలకు అధికంగా ఉంది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల క్రతువు ముగిసిన పదిరోజుల్లోనే పంజాబ్‌లో ఛార్జీల వడ్డన ఆదేశాలు వెలువడ్డాయి. యూనిట్‌కు సగటున ఎనిమిది పైసల వరకూ అదనంగా ఛార్జీలు పెంచేందుకు పంజాబ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) ఆదేశాలిచ్చింది. దీనివల్ల ఈ ఏడాది గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి యూనిట్‌కు కనిష్ఠంగా రూ.4.99 నుంచి గరిష్ఠంగా 7.11 దాకా వసూలు చేస్తారు. మధ్యప్రదేశ్‌లో మరో విచిత్రం జరిగింది. ఎన్నికల ప్రకటన వెలువడటానికి ముందు... అక్కడి డిస్కమ్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని(2019-20)కి 1.59 శాతం మేర కరెంటు ఛార్జీలు పెంచితే సరిపోతుందని ఆ రాష్ట్ర ఈఆర్‌సీకి నివేదిక ఇచ్చాయి. దానిపై ఈఆర్‌సీ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన అయిదు రోజులకే అదే రాష్ట్రం అదే డిస్కమ్‌లు కరెంటు ఛార్జీలను 12 శాతం పెంచాలని అదే ఈఆర్‌సీకి మరో నివేదికిచ్చాయి. ఎన్నికలున్నాయనే ఇన్నిరోజులు ఆగి ఇప్పుడిలా పెంచుతున్నారా అని అడిగితే, 2013-14 నష్టాలు పూడ్చుకోవడానికే 12 శాతం మేర ఛార్జీల పెంచాలని అడిగినట్లు సమాధానమిచ్చాయి. 2013-14లో వచ్చిన నష్టాల గురించి 2019 ఫిబ్రవరిలో తెలియకుండా ఎన్నికలు ముగిశాక మే నెలలోనే ఎలా తెలిసిందనే ప్రశ్నకు సమాధానం ఉండదు.

దేశంలోనే అతిపెద్దదైన ఉత్తర్ ప్రదేశ్ నుంచే భాజపాకు అత్యధిక పార్లమెంటు స్థానాలు వచ్చాయి. దీని వెనక మరో మతలబు ఉంది. ఎన్నికలు ఉన్నని రోజులూ రాష్ట్ర ప్రజలకు అక్కడి భాజపా ప్రభుత్వం 24 గంటలూ కరెంటు సరఫరా చేసింది. ఫలితాలు వెలువడిన తరవాత ఒక్కసారిగా పాత పద్ధతిలో కరెంటు కోతలు ప్రారంభించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఓడించిన అమేథీ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగినంత కాలం రోజంతా కరెంటు సరఫరాతో ప్రజలు సంతోషభరితులయ్యారు. ఎన్నికలవగానే కోతలతో అల్లాడుతున్నామనే రాష్ట్ర ప్రజల ఆవేదన విద్యుత్ రంగంలో రాజకీయాలకు ప్రత్యక్ష తార్కాణం. అఖిలకి ప్రధాని ప్రాతినిధ్యం వహించే చారిత్రక వారణాసి నగరంలోనూ కోతలు మొదలయ్యాయి. దేశంలో డిస్కమ్‌లన్నీ కంపెనీ చట్టం కింద నమోదై ఏర్పాటయ్యాయి. అవి వాణిజ్య ధృక్పథంతో ఇతర కంపెనీల మాదిరిగానే పనిచేయాలి. అంటే నిరంతరం ఆదాయ, వ్యయాలను సరిచూసుకుంటూ వాణిజ్య కోణంలో ఇతర కంపెనీలకు దీటుగా పనిచేస్తేనే ఆర్థికంగా మునిగిపోకుండా ఉంటాయి. కానీ వాటిని ఆయా రాష్ట్రాలను ఏలే రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల నేతలు శాసిస్తూ కంపెనీ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. వీరి చర్యలవల్ల విద్యుత్ కంపెనీలు వందల కోట్ల రూపాయల నష్టాలను మూటగట్టుకుంటూ ఎప్పుడు పుట్టి మునుగుతుందో తెలియదన్నట్లుగా పనిచేస్తున్నాయి. ప్రజల సంక్షేమం కోసం ఛార్జీలను ఏళ్లకు ఏళ్లు పెంచడం లేదని రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ మాటలు వినసొంపుగానే ఉంటాయి. మరి డిస్కమ్‌లు విద్యుత్తును ఎళ్లకిడి నుంచి ఎంత ధరకు కొంటున్నాయి, ఈ కొనుగోళ్లకు పెడుతున్న ఖర్చులను తిరిగి అమ్ముకునేటప్పుడు రాబట్టుకోవాలి కదా! కానీ కరెంటును అమ్ముకునేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఓట్లు, ఎన్నికల్లో గెలుపే ప్రాతిపదికగా ఛార్జీలను నిర్ణయిస్తున్నాయి. అలాంటప్పుడు కరెంటు కొనుగోలు, అమ్మకపు ధరల మధ్య వ్యత్యాసాన్ని పూడ్చేందుకు రాయితీ రూపంలో నిధులను డిస్కమ్‌లకు ఇవ్వాలని విద్యుత్ చట్టం చెబుతోంది. పలు రాష్ట్రప్రభుత్వాలు ఈ నిబంధనను సరిగ్గా అమలుచేయడం లేదు. ఇదే డిస్కమ్‌ల పాలిట శాపమవుతోంది. దేశవ్యాప్తంగా 2015 నాటికి డిస్కమ్‌లు రూ.2.50 లక్షల కోట్ల నష్టాల్లో మునిగిపోయాయని కేంద్ర ప్రభుత్వం మూడున్నరేళ్ల క్రితం 'ఉజ్వల్ డిస్కం హామీ యోజన(ఉదయ్) పథకాన్ని అమలులోకి తెచ్చింది. అప్పటి అప్పుల్లో 75 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేయించింది. దీంతో డిస్కమ్‌లు ఆర్థికంగా గట్టెక్కి, లాభాల బాట పడతాయని కేంద్రం ఊదరగొట్టింది. పాత అలవాటు మారడం అంత సులభం కాదన్నట్లు రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లీ ఛార్జీలు పెంచకుండా, రాయితీ నిధులు విడుదల చేయకుండా పాత పద్ధతిలోనే పయనించడం వల్ల డిస్కమ్‌లు మళ్లీ నష్టాలు, అప్పుల్లో కూరుకుపోతున్నాయి. ఎన్నికలు ఉన్నందువల్ల పలు రాష్ట్రాలు గతేడాది నుంచి ఛార్జీలను పెంచడం మానేశాయి. దీనివల్ల కొన్ని రాష్ట్రాల డిస్కమ్‌ల చెల్లింపులు ఆరేడు వందల రోజులైనా రాక జెన్‌కోలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. పేరుకే అవి స్వతంత్ర కంపెనీలు. రోజువారీ పాలన అంతా రాష్ట్ర ప్రభుత్వాల కనుసన్నల్లో జరగాల్సిందే. మనిషి మనుగడకు విద్యుత్ ఎంతో అవసరం. దాన్ని ఉచితంగా ఇవ్వాలనడం సహేతుకం కాదు. ఓట్ల కోసం ఉచిత కరెంటు ఇస్తామనడం రాజకీయ పార్టీలూ చెప్పరాదు. యూనిట్ కరెంటు ఉత్పత్తి చేయడానికి అయిదేళ్ల క్రితమే రూ.5.20 ఖర్చయినట్లు జాతీయ గణాంకాలు చెబుతున్నాయి. డిస్కమ్‌లకు అందుతున్న మొత్తం రూ.4.60 మాత్రమే. యూనిట్‌కు 60 పైసల నష్ట డిస్కమ్‌లు భరించడం వల్ల నష్టాలు పెరిగిపోతున్నట్లు 'కేంద్రీయ విద్యుత్ మండలి(సీఈఏ) అంచనా. ఇదంతా నాలుగేళ్ల క్రితం నాటి లెక్క. ప్రస్తుతం యూనిట్ కరెంటు ధర సగటున ఆరు రూపాయలకుపైనే ఉంటోంది. బహిరంగ విపణిలో గరిష్ఠ గిరాకీ ఉన్న సమయంలో ఇంతకన్నా తక్కువ ధరకు రావడం లేదు. ఈ ధరకు కొని అమ్ముకునే డిస్కమ్‌లు ఆ మేర సొమ్మును రాబట్టలేక నష్టాల పాలవుతున్నాయి.

దేశంలో స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం తీరు (మెగావాట్లు)

పంచవర్ష ప్రణాళిక	మెగావాట్లు	పంచవర్ష ప్రణాళిక	మెగావాట్లు
6వ ప్రణాళిక	42,584	10వ "	1,32,329
7వ ప్రణాళిక	63,636	11వ "	1,99,877
8వ "	85,795	12వ "	3,19,606
9వ "	1,05,045	ప్రస్తుతం	3,56,100

(గమనిక: గత ఏప్రిల్‌లో ఒకరోజు గరిష్ఠ కరెంటు డిమాండు 1,76,810 మెగావాట్లు. స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 3,56,100 మెగావాట్లలో ఇది 49.65 శాతం మాత్రమే. అంటే మొత్తం ఉత్పత్తి సామర్థ్యంలో వినియోగం సగం కూడా లేదు.)

జాతీయ తలసరి విద్యుత్ వినియోగం (యూనిట్లు)

సంవత్సరం	యూనిట్లు	సంవత్సరం	యూనిట్లు
2005-06	631.4	2016-17	1122
2010-11	818.8	2017-18	1149
2015-16	1075	2018-19	1181

స్వేచ్ఛగా పనిచేస్తేనే..

విద్యుత్ రంగంలో ఆర్థిక కష్టాలు తీరాలంటే కరెంటు కొనుగోలు, ఛార్జీల నిర్ణయంలో హేతుబద్ధత ఉండాలి. ఓట్ల కోసం తక్కువ ధర కరెంటు ఇచ్చే రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల నుంచి కేంద్రమే నేరుగా నిధులు రాబట్టి డిస్కమ్ ఖాతాల్లో జమచేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలను అడ్డుకోలేక కేంద్రం అప్పుడప్పుడు 'ఉదయ్' లాంటి పథకాలు తెచ్చి, నష్టాలను తిరిగి రాష్ట్రాల నెత్తినే రుద్దుతోంది. ఈ సమస్యల నుంచి డిస్కమ్‌లను గట్టెక్కించడానికి విద్యుత్ చట్టంలో సవరణల ద్వారా సంస్కరణలు తేవడానికి కేంద్రం యోచిస్తోంది. విద్యుత్ సరఫరా, పంపిణీని విడదీయాలనేది ఇందులో కీలకాంశం. ఇళ్లకు, పరిశ్రమలకు కరెంటు పంపిణీ చేసే వ్యవస్థలను నగరాలు, ప్రాంతాలవారీగా ప్రత్యేక డిస్కమ్‌లకు అప్పగించాలనే ప్రతిపాదన ఉంది. ఇందులో ప్రైవేటుకు భాగస్వామ్యం కల్పించాలనీ యోచిస్తోంది. దీనివల్ల డిస్కమ్‌ల ఆర్థికభారం తగ్గించవచ్చని అంచనా. కానీ రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకుండా డిస్కమ్‌లను ఆర్థికంగా పరిపుష్టం చేయడం అంత సులభం కాదు. పేద ప్రజలకు రాయితీపై కరెంటు ఇవ్వడం మంచిదే. అందుకు డిస్కమ్‌లపై పడే ఆర్థికభారాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించినట్లుగా రికార్డులో రాయడంతోనే సరిపెట్టరాదు. ఏటా రాష్ట్ర బడ్జెట్లలోనే పూర్తి నిధులు కేటాయించాలి. ప్రస్తుత విధానాలు ఇలాగే కొనసాగితే డిస్కమ్‌లతో పాటు జెన్‌కోలూ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతాయి. విద్యుత్ రంగం సంక్షోభంలో చిక్కుకుంటుంది. అప్పుడు విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. దేశంలో కరెంటు పుష్కలంగా అందుబాటులో ఉన్నా దాన్ని కొని ప్రజలకు నిరంతరం సరఫరా చేసేలా రాష్ట్రాలను కేంద్రం ఒప్పించాలి. ఇలా నిరంతర సరఫరాలో తెలుగు రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. నిరంతర సరఫరా వల్ల కరెంటు ఉత్పత్తి, వినియోగం పెరగడంతో డిస్కమ్‌లు, జెన్‌కోలకు ఆదాయం అధికమై లాభాలొస్తాయి. ఉన్న కరెంటును వాడుకోక, వాడుకున్న దానికి సొమ్ములివ్వక అస్తవ్యస్త విధానాలతో విద్యుత్ సంస్థలను అలాగే వదిలేస్తే- చివరికి మిగిలేది చీకట్లేనని పాలకులు గుర్తించాలి!

– మంగమూరి శ్రీనివాస్

రాజకీయ రణస్థలం

బెంగాల్ భూమి రాజకీయ రణస్థలంగా మారింది. తృణమూల్, భాజపాల మధ్య రగులుకొన్న చిచ్చు క్రమంగా బౌతికదాడులకు పాల్పడి కార్యకర్తలు ఒకరొకరు చంపుకొనేదాకా చేరింది. సంక్షోభం ముదరడంతో రాష్ట్రంలో రాజకీయ విజయోత్సవ ప్రదర్శనలన్నింటిపైనా నిషేధం విధిస్తూ తృణమూల్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. కొంతకాలంగా తృణమూల్‌కు చెందిన కౌన్సిలర్లు పెద్దయెత్తున భాజపాలోకి వలసపోతున్నారు. మరీ ముఖ్యంగా బరాక్‌పూర్, డార్జిలింగ్ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో ఈ తరహా గోడదూకుళ్లు జోరుగా సాగుతున్నాయి. పరిస్థితి చేయిదాటిపోతోందన్న విషయం గమనించిన మమతా బెనర్జీ నష్ట నివారణకు రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సాయం అర్థించారు. 2020లో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలు, ఆ తరవాత 2021లో జోటుచేసుకోనున్న అసెంబ్లీ ఎలెక్షన్లలో తృణమూల్ తరఫున పనిచేసేందుకు ప్రశాంత్ కిశోర్‌ను ఆమె నియమించారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థిగా వామపక్షాలు ఉండేవి. కానీ, 2011నుంచి వామపక్షాలను వరస ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ మట్టికరిపించింది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ బంగలో సీపీఎ(ఎం) ఒక్క పార్లమెంటు స్థానం కూడా గెలుచుకోలేకపోయింది. ఆ పార్టీ ఓట్లు కూడా 27శాతంనుంచి ఏడు శాతానికి కోసుకుపోయాయి. వామపక్ష ఓట్లలో అత్యధికం భాజపా అభ్యర్థులకు వెళ్ళడం గమనార్హం. చివరికి కాంగ్రెస్ కూడా కేవలం రెండు సీట్లతోనే సరిపెట్టుకోవాల్సిన స్థితి తలెత్తింది. సీట్ల సర్దుబాట్లు కుదరకపోవడంవల్ల వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య పొత్తు సాకారం కాలేదు. ఫలితంగా పార్టీలన్నీ దాదాపు విడివిడిగానే పోటీ చేశాయి. ఫలితంగా భాజపా అనూహ్యంగా 18 సీట్లు చేజిక్కించుకోగలిగింది.

గడచిన మూడేళ్లుగా పశ్చిమ బంగలో భాజపా ప్రాధాన్యం పెరుగుతోంది. తృణమూల్ కాంగ్రెస్‌ను విడిచిపెట్టి ముకుల్ రాయ్ భాజపాలో చేరినప్పటినుంచీ కమలదళం బలం పుంజుకొంటోంది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అనేకమంది నాయకులను ఏదో రకంగా ఆకర్షించి తమ పార్టీలో చేర్చుకోవడంకోసం దాపికింద నీరులా భాజపా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. డబ్బు మూటలతో తమ నాయకులను భాజపా కొనుగోలు చేస్తోందంటూ తృణమూల్ అధినేత్రి గట్టిగా విమర్శిస్తున్నారు. అవతలి పార్టీ సభ్యులను ఆకర్షించి తమ పార్టీ తీర్థం ఇప్పించే ప్రయత్నాలు పశ్చిమ్ బంగలో అయిదేళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ బ్రహ్మాండమైన విజయాలను నమోదు చేసి అధికారం చేజిక్కించుకొంది. ఆ విజయోత్సాహంలో కాంగ్రెస్, వామపక్షాల నాయకులను, కార్యకర్తలను తృణమూల్ కాంగ్రెస్ నయానో భయానో ఆకర్షించి తమ పార్టీలో చేర్చేసుకొంది. కాంగ్రెస్‌నుంచి వలసలను ప్రోత్సహించి, ఒకరకంగా ఆ పార్టీ బాళీ కావడానికి మమత కారణమయ్యారు. పార్టీ నాయకులంతా ఒకరొకరుగా భాజపా బాటపడుతున్న నేపథ్యంలో ఇప్పుడు అదే పరిస్థితిని తృణమూల్ కాంగ్రెస్ ఎదుర్కొంటోంది. 2018నాటి పంచాయతీ ఎన్నికల్లో చోటు చేసుకున్న హింస, పార్టీలోని వివిధ వర్గాల మధ్య అంతర్గత పోరు, రాష్ట్ర ఉద్యోగులకు సరైన సమయంలో కరవు భత్యం చెల్లించకపోవడం, వాహన దోపిడులను పోలీసులు వేధించడం వంటివన్నీ ప్రజాభిప్రాయాన్ని తృణమూల్‌కు వ్యతిరేకంగా మార్చాయి. పార్టీకోసం ప్రాణం పెట్టి పనిచేసే కార్యకర్తలు ఉన్నప్పటికీ- వారెవరూ జరిగిన నష్టాన్ని పూడ్చలేకపోయారు. మరోవంక బడుగు బలహీనవర్గాల్లో, సామాన్య ప్రజావళిలో తనపట్ల అభిమానం చెక్కుచెదరలేదన్న; తాను నిలబడితే చాలు ఓట్ల వృష్టి కురుస్తుందన్న మమతా బెనర్జీ మితిమీరిన విశ్వాసం ఆ పార్టీని దెబ్బకొట్టింది. మమతా బెనర్జీ ఏకపక్ష వైఖరి గురించి ఎంత చెప్పుకొన్నా- రాష్ట్రాభివృద్ధికి ఆమె చేసిన కృషి మాత్రం విస్మరించలేనిది. ఏ దశలోనూ అభివృద్ధి పనులు నిలిచిపోకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ఆమె అహరహం శ్రమించారు. ఆమె కృషి వల్ల రాష్ట్రవ్యాప్తంగా తాగునీటికి, విద్యుత్తుకు ఇబ్బందిలేని వాతావరణం నెలకొంది. నష్టాల్లో కూరుకుపోయిన చేనేత, హస్తకళల రంగానికి మమతా బెనర్జీ కొత్త ఊపిరులూదారు. ప్రపంచ బెంగాల్ వ్యాపార సదస్సులు నిర్వహించి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను పెద్దయెత్తున సమీకరించగలిగారు. తృణమూల్ సర్కారు అమలు చేసిన కొన్ని ప్రణాళికలకు ఐక్యరాజ్య సమితి గుర్తింపు సైతం లభించింది. రోడ్డు రవాణా, సబ్‌వేలు, ప్రభుత్వ వైద్యశాలలు వంటివి లోపాలకు తావులేని రీతిలో పనిచేస్తున్నాయి.

మమతా బెనర్జీ

పశ్చిమ్ బంగలో ముదురుతున్న సంక్షోభం

అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా రాజకీయంగా మాత్రం తృణమూల్‌కు ఊహించని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సింగూరులో పదేళ్ల క్రితం బలవంతపు భూసేకరణను తూర్పారపడుతూ వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీయెత్తున ప్రజాందోళనలు నిర్వహించిన మమతా బెనర్జీ అదే పునాదిగా ఎన్నికల్లో విజయఢంకా మోగించారు. తాజాగా సింగూరు పార్లమెంటు స్థానాన్ని భాజపా కైవసం చేసుకోవడం మమతను నిర్వాంతపరచిన పరిణామం. సార్వత్రిక ఎన్నికల తరవాత కేంద్ర, రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణం పెరిగింది. ప్రధాని సారథ్యంలో జూన్ 15న జరపతలపెట్టిన 'నీతి ఆయోగ్' సమావేశానికి హాజరుకాబోనని మమత ఇప్పటికే ప్రకటించారు. 'నీతి ఆయోగ్' చేతిలో పరిమిత ఆర్థిక అధికారాలున్నాయని, దానివల్ల రాష్ట్రాలకూ ఎలాంటి ప్రయోజనమూ ఒనగూరదని వివరిస్తూ ప్రధాని మోదీకి మమతా బెనర్జీ రెండున్నర పేజీల లేఖ రాశారు. అనుకున్నది అనుకున్నట్లుగా మాట్లాడే తత్వం మమతా బెనర్జీది! అయితే కేంద్రంతో నిరంతరం ఘర్షణ వైఖరి కొనసాగించడంవల్ల రాష్ట్రాభివృద్ధిపరంగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన కుదరకపోవచ్చు. తటస్థంగా ఉంటూ కేంద్రం నుంచి అనుకున్నవన్నీ రాబట్టుకోగలుగుతున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఈ విషయంలో మమతా బెన

ధర్నాచౌక్‌లో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను నిమ్స్‌కు తరలిస్తున్న పోలీసులు ★ నిమ్స్‌లో విలేకరులతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి, పొన్నాల, జానారెడ్డి, కోమటిరెడ్డి, వి.హనుమంతరావు, సలీం అహ్మద్, విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లు రవి తదితరులు

భట్టి ఆమరణ దీక్ష విరమణ

- నేడు కలెక్టరేట్ల ఎదుట కాంగ్రెస్ ధర్నా: ఉత్తమ్

పంజాగుట్ట, కవాడిగూడ-న్యూస్‌టుడే

ఫీరాయింపుల చట్టాన్ని తుంగలోకి తొక్కి తెరాస పార్టీ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుందని నిరసిస్తూ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను విరమించారు. రెండురోజులుగా ఆహారం తీసుకోకపోవడం వల్ల ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండటంతో కాంగ్రెస్ నేతలు భట్టితో దీక్ష విరమింపజేశారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో లేని సమయంలో దీక్ష చేస్తున్న భట్టిని పోలీసులు అరెస్టు చేసి అంబులెన్స్‌లో నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కొందరు కార్యకర్తలు పోలీసుల చర్యను ప్రతిఘటించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నిమ్స్‌లో వైద్యులకు సహకరించకుండా భట్టి తన దీక్షను కొనసాగించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని వైద్యులు కాంగ్రెస్ నేతలకు వివరించారు. విక్రమార్క రక్తపోటు, చక్కెర స్థాయుల్లో సమస్య తలెత్తిందని చిక్కుడపల్లి ఏసీపీ నరసింహారెడ్డి చెప్పడంతో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ భట్టికి నిమ్మరసమిచ్చి దీక్ష విరమింపజేశారు.

అవసరమైతే సుప్రీంను ఆశ్రయిస్తాం: ఉత్తమ్

రాష్ట్రంలో కాంగ్రెస్ శాసనసభాపక్షం విలీనంపై రాష్ట్రపతికి పిర్యాదు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్‌లో చర్చ లేవనెత్తుతామని ప్రకటించారు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని ఇది విచారణకు రానుందని అవసరమైతే న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. ఆయన నిమ్స్ ఆస్పత్రి వద్ద విలేకరులతో మాట్లాడారు. విలీనాన్ని నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. తెరాసకు 88 మంది ఎమ్మెల్యేలు ఉన్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎందుకు కొనుగోలు చేశారని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రశ్నించే గొంతు ఉండకూడదని తెరాస కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని తెలిపేందుకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కూడా కోరామన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని తెరాస ప్రయత్నిస్తోందన్నారు.

ప్రభుత్వ పతనం ప్రారంభం: కోమటిరెడ్డి

కేసీఆర్ ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న కేసీఆర్.. కనీసం మంత్రివర్గంలో కూడా దళితులకు అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. వచ్చే నాలుగేళ్లలో కాంగ్రెస్ ప్రజాపోరాటాలు చేసి రాబోయే ఎన్నికల్లో వంద అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటుందని చెప్పారు. విలీనంపై తెరాసను కాంగ్రెస్ కార్యకర్తలు నిలదీయాలని వి. హనుమంతరావు పిలుపునిచ్చారు. పంజాగుట్ట కూడలిలో తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని దళితుల సాయంతో అక్కడే ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

విలీనాన్ని ఖండిస్తున్నాం: చాడ వెంకటరెడ్డి

తెరాసలో సీఎల్పీ విలీనం దుర్మార్గమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నేత చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. విలీనాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తెజస అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ విలీనాన్ని ఆమోదించడం సరికాదన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు.

ఇది రాజ్యాంగ విరుద్ధం: మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తెరాసలో విలీనం చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ అన్నారు. ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి విధానాలను ప్రోత్సహించరాదన్నారు. రాజ్యాంగంలోని షెడ్యూలు 10 ప్రకారం విలీనానికి 2/3 వ వంతు ఆమోదం ఉండాలని 12 మంది ఎమ్మెల్యేలు వేర్వేరు సందర్భాల్లో ఆ పార్టీ నుంచి వెళ్లిపోయారన్న అంశాన్ని గుర్తించాలన్నారు.

నిమ్స్‌లో భట్టికి పలువురి పరామర్శ

నిమ్స్‌లో పలువురు నేతలు భట్టిని పరామర్శించారు. సీనియర్ నేత కె.జానారెడ్డి, పార్టీ నేతలు సలీం అహ్మద్, బోసురాజు, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు డి.శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, తెదేపా నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీలు కేపీవీ రామచంద్రరావు, మల్లు రవి తదితరులు ఉన్నారు.

పోలీసుల సంక్షేమానికి చర్యలు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ బహిరంగ సభలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

గోల్కొండ, న్యూస్‌టుడే: దేశంలోని పోలీసుల సంక్షేమం, గృహవసతికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. దీనిపై ఇప్పటికే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలను రాసినట్లు వివరించారు. సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, ఇండో-టిబెటిన్ పోలీసుల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట గోల్కొండ తులసీనగర్ లంకలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఒక్క సీఆర్‌పీఎఫ్‌లోనే 4 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. జమ్ముకశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్ర భద్రతా ఏర్పాట్ల సమీక్ష బాధ్యతను మోదీ, అమిత్‌షా తనకు అప్పగించారన్నారు. త్వరలో అక్కడికి వెళ్లి భద్రతాపరంగా తీసుకోవాల్సిన అంశాలపై అధికారులతో చర్చిస్తానన్నారు. యాత్ర సందర్భంగా ఏ చిన్న సంఘటన కూడా జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిరక్షణ తమ ముందు ఉన్న తక్షణ సవాళ్లని వివరించారు. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఏ మాత్రం రాజీపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ, ఏపీ విభజన అంశాల పరిష్కారానికి మోదీ సర్కార్ చర్యలు తీసుకుంటోందన్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. బాజపా నగర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోడు రైతుల హక్కుల రక్షణ సభ

- ఏటూరునాగారంలో నిర్వహణ
- తెజస అధ్యక్షుడు కోదండరాం వెల్లడి

పోడు రైతుల హక్కుల రక్షణ సభ గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న కోదండరాం, విశ్వేశ్వర్‌రావు

ఈనాడు, హైదరాబాద్, గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజన పోడు రైతుల హక్కుల రక్షణ కోసం ఈనెల 11న (మంగళవారం) తెలంగాణ జన సమితి(తెజస) ఆధ్వర్యంలో 'పోడు రైతుల హక్కుల రక్షణ సభ' పేరిట బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సభ జరుగుతుందని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో దీనికి సంబంధించిన గోడపత్రాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ. .ఎన్నికల అర్భాటాలతో గిరిజన, ఆదివాసీల భూ సమస్యలు మరుగున పడుతున్నాయని, కొన్ని రోజుల్లో వారి జీవనానికి ప్రమాదం రాబోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోడు రైతుల హక్కులు పట్టించుకోకుండా ప్రభుత్వం ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోయిందని విమర్శించారు. హరితహారం పేరిట పోడుభూముల చుట్టూ కందకాలు తవ్వుతున్నారని ఆరోపించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతో గిరిజనులపై పిడుగుపడినట్లు అయిందన్నారు. అటవీ హక్కుల చట్టం పరిధిలో ఆదివాసీలకు హక్కులు అమలు చేయాలనే దిశగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు కోదండరాం వెల్లడించారు. సమావేశంలో పార్టీ నేత విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైపరీత్యాల నిర్వహణ నిధుల వాడకంపై శ్వేతపత్రం కావాలి: మర్రి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాల నిర్వహణకు సంబంధించి కేంద్రం నుంచి అందిన నిధుల వినియోగం తీరుపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, 2005లో నాటి కేంద్రప్రభుత్వం తెచ్చిన చట్టనిబంధనల కింద 2016-17 సంవత్సరానికి రాష్ట్రానికి సాయంగా రూ.1500 కోట్ల నిధులు వచ్చాయన్నారు. ఆ తర్వాత ఇప్పటివరకు ఎన్ని నిధులు వచ్చాయో, వాటి నుంచి బాధిత రైతులకు ఎంత చెల్లించారో గణాంకాలు బయటపెట్టాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం సరిగ్గా స్పందించడం లేదని కేంద్రం చెబుతుండటం గమనార్హమన్నారు. ఆ నిధుల వాడకం తీరుతెన్నులు పలు అనుమానాలకు తావిస్తున్నాయని, అందుకే చిత్తశుద్ధి అంటూ ఉంటే సర్కారు తక్షణమే శ్వేతపత్రం వెలువరించాలని ఆయన అన్నారు.

ట్వీటూ... డిలీటూ..

- ఏపీ గవర్నర్‌గా సుష్మ అంటూ కేంద్ర మంత్రి హర్షవర్ధన్ ట్వీట్
- ఆపై ఖాతా నుంచి తొలగింపు

ఈనాడు, దిల్లీ: కేంద్ర మంత్రి హర్షవర్ధన్ సోమవారం ఒక ట్వీటు చేసి కొద్దిసమయంలోనే దాన్ని డిలీట్ చేశారు. ఈ సంచలన ట్వీటుపై విన్నాలిప్రాయాలు వ్యక్తమయ్యాయి. "బాజపా అగ్రనేత, కేంద్ర విదేశాంగశాఖ మాజీ మంత్రి సుష్మాస్వరాజ్‌కు శుభాకాంక్షలు. సుష్మాస్వరాజ్ జీ ఆంధ్రప్రదేశ్‌కు గవర్నర్‌గా నియమితులయ్యారు" అంటూ ట్వీట్ చేశారు. కొద్దిసేపటికే ఆయన తన ట్విటర్ ఖాతా నుంచి ఆ ట్వీట్‌ను తొలగించారు. సోమవారం పలు రాష్ట్రాల గవర్నర్లు.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలవడం.. కేంద్ర మంత్రి హర్షవర్ధన్ ట్వీట్ చేయడం దేశ రాజధాని దిల్లీలో పలు ఊహాగానాలు హల్‌చల్ చేశాయి. సోమవారం నాడే తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్.. అమిత్‌షాను కలవడంతో ఈ ట్వీట్‌కు మరింత బలం చేకూరింది. అయితే కేంద్రమంత్రి తాను చేసిన ట్వీట్‌ను డిలీట్ చేశారని ఓ వార్తా సంస్థ ట్వీట్ చేయడంతో ఈ ఊహాగానాలకు తెరపడింది. కాగా ఈ విషయం అవాస్తవమని సుష్మాస్వరాజ్ సోమవారం రాత్రి ట్విటర్‌లో పేర్కొన్నారు.

విలీనం రాజ్యాంగ విరుద్ధం

- హైకోర్టును ఆశ్రయించిన భట్టి, ఉత్తమ్

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభ పక్షాన్ని తెలంగాణ రాష్ట్ర సమితి(తెరాస)లో విలీనం చేస్తూ ఈ నెల 6 న స్పీకర్ సచివాలయం జారీ చేసిన బులెటిన్‌ను సవాలు చేస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒక రాజకీయ పార్టీ శాసనసభ పక్షాన్ని.. మరో రాజకీయ పార్టీలో విలీనం చేసే అధికారం ఎన్నికల సంఘానికే ఉంటుందని, స్పీకర్‌కు కాదని పేర్కొన్నారు. స్పీకర్ ఆదేశాలతో జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలను తెరాసలో విలీనం చేస్తూ.. స్పీకర్ సచివాలయం జారీ చేసిన బులెటిన్ రాజ్యాంగంలోని పదో షెడ్యూలు, అధికరణ 101, 191, 324కు విరుద్ధమన్నారు. ఈ బులెటిన్ జారీ చేస్తూ తీసుకున్న నిర్ణయంపై న్యాయసమీక్ష చేయడానికి కోర్టులు జోక్యం చేసుకోవచ్చన్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2, 6(1)లను పట్టించుకోకుండా పార్టీ విలీనంపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కు లేదన్నారు. దాన్ని సస్పెండ్ చేయడంతోపాటు పార్టీ పిరాయింపుల కింద 12 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌పై 90 రోజుల్లో నిర్ణయం వెలువరించేలా ఆదేశించాలని కోరారు. ఎమ్మెల్యేలను విలీనం చేసే అవకాశాలున్నందున తాము ముందుగానే కేవియట్ దాఖలు చేశామని తెలిపారు. దీంతో నిర్ణయం తీసుకునే ముందు నోటీసు ఇవ్వాల్సి ఉండగా ఆ పనిచేయలేదన్నారు. తమ వాదనను పట్టించుకోకుండా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పార్టీ విలీనం నిర్ణయం తీసుకునేటప్పుడే తాము దాఖలు చేసిన కేవియట్ ఆధారంగా నోటీసులు ఇచ్చేలా ఆదేశాలివ్వాలంటూ గతంలో ఇదే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘంతో పాటు స్పీకర్ సచివాలయానికి, కేంద్రానికి హైకోర్టు నోటీసులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే స్పీకర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ తరఫున గెలుపొంది పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటంతో ఎమ్మెల్యేలపై ఎన్నికల సంఘానికి, స్పీకర్‌కు పిర్యాదు చేశామని, అవి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విలీన ప్రక్రియలో తెరాస అధినేత కుట్ర కనిపిస్తోందని ఆరోపించారు. విలీన నిర్ణయం వెలువడక ముందే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తెరాస అభ్యర్థులకు బీఫారం ఇచ్చే బాధ్యతను 12 మంది ఎమ్మెల్యేలకు తెరాస బాధ్యతలు అప్పగించడాన్ని చూస్తే ముందస్తు కుట్ర అర్థమవుతోందని పేర్కొన్నారు. విలీనానికి ముందు తమ వాదన వినాలంటూ ఏప్రిల్ 22, 27 తేదీల్లో వినతి పత్రాలు ఇచ్చామని, జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. శాసనసభా పార్టీ, రాజకీయ పార్టీలు వేర్వేరు కాదని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలు మార్లు స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని విలీనానికి దేశవ్యాప్తంగా మద్దతు అవసరమన్నారు. పార్టీ నిర్ణయం తీసుకోకుండా శాసనసభాపక్షాన్ని విలీనం చేయడం చెల్లదన్నారు. ఇందులో ప్రతివాదులుగా శాసనసభా సచివాలయం, బ్రైబ్యునల్ (స్పీకర్), ఎన్నికల సంఘంతోపాటు 12 మంది ఎమ్మెల్యేలను పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని, ఇంతకు ముందు ఓ పిటిషన్ పెండింగ్‌లో ఉందని, ఎమ్మెల్సీల విలీనంపై మరో పిటిషన్ దాఖలు చేశామని వారి తరపు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. అన్ని పిటిషన్లను కలిపి విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. వీటిపై మంగళవారం విచారణ జరిగే అవకాశం ఉంది.

బోనాల నిర్వహణకు రూ.15 కోట్లు

జులై 4 నుంచి వైభవోపేతంగా ఉత్సవాలు

ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే ప్రసిద్ధి గాంచిన హైదరాబాద్ ఆషాఢ బోనాల ఉత్సవాలను వైభవోపేతంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.15 కోట్లు కేటాయించారన్నారు. బోనాల ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో తలసాని, హోంమంత్రి మహమూద్ అలీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. 'ఈ సారి జీహెచ్ఎంసీ ద్వారా రూ.22 కోట్లతో దేవాలయాల అలంకరణలు, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి పనులు చేపడుతున్నాం. హైదరాబాద్ మెట్రో రైల్.. భక్తుల సౌకర్యార్థం అదనపు ట్రిప్పులను నడుపుతుంది. ఉత్సవాలకు అవసరమైన ఏనుగును అటవీ శాఖ సిద్ధం చేస్తుంది' అన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బోనాలకు గతంలో కంటే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. 26 దేవాలయాలకు పట్టు వస్త్రాలు పంపుతామని, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, జీఎంఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అదర్ సిన్హా, ఇంటర్నీ పోలీసు కమిషనర్ జితేందర్, జీహెచ్ఎంసీ కమిషనర్, జలమండలి ఎండీ దానకిశోర్, దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

జులై 4 : గోల్కొండ బోనాలు
జులై 21 : సికింద్రాబాద్ మహంకాళి బోనాలు
జులై 28 : పాతబస్తీలో బోనాలు

ఉపాధి పనుల పగ్గాలు పంచాయతీలకే!

- పథకం అమల్లో ఇక వాటిదే కీలక పాత్ర

'ఉపాధి హామీ' మండలి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

ఈనాడు, హైదరాబాద్: ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించిన పగ్గాలు ఇక గ్రామ పంచాయతీల చేతుల్లోకి రానున్నాయి. ఈ మేరకు సోమవారం సమావేశమైన 'రాష్ట్ర ఉపాధి హామీ పథకం మండలి' ఓ నిర్ణయం తీసుకొంది. దీని ప్రకారం గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల గుర్తింపు, వాటి అమలు బాధ్యతలన్నీ పూర్తిగా పంచాయతీలకే ఉంటాయి. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇతర మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డితో పాటు కరీంనగర్ జడ్పీ చైర్పర్సన్ తుల ఉమ, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పనుల్లో పంచాయతీలకు ప్రాధాన్యం కల్పిస్తూ చాలాకాలం క్రితమే కేంద్రం మార్గదర్శకాలిచ్చినప్పటికీ, క్షేత్రస్థాయి సహాయకులకే సర్వాధికారాలూ కట్టబెడుతూ వచ్చారు. ఇటువంటి పరిస్థితిలో మార్పు తేవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించడంతో, అందుకు అనుగుణమైన నిర్ణయాలను ఈ సమావేశం తీసుకొంది. వీటిని అనుసరించి ఇకముందు ప్రతి గ్రామంలోనూ హరిత హారం కోసం నర్సరీల ఏర్పాటు, పొలాల్లో కుంటల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ పనులకు ప్రాముఖ్యం లభిస్తుంది. పనులు చేసిన కూలీలకు వెంట వెంటనే ప్రతిఫలం చెల్లించేలా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపడుతుంది. ఏ తరహా పనులను చేపట్టాలన్నా, వాటికి ముందుగా గ్రామసభ ఆమోదం తప్పనిసరి. పంచాయతీలు ప్రాధాన్య క్రమంలో పనులను ఎంపిక చేసి, తగిన ఆదేశాలను ఇచ్చిన తర్వాతే క్షేత్ర సహాయకులు వాటిని చేపట్టాలి. ప్రతి పంచాయతీలోనూ ప్రజల పిర్యాదుల కోసం ఒక పెట్టె ఏర్పాటు చేస్తారు. పలు కొత్త పంచాయతీలు అవతరించినందున, ఆ భవనాల నిర్మాణాలకు ఉపాధి నిధులను వినియోగిస్తారు. స్వచ్ఛంద సేవాసంస్థల సహకారానికి కృషిచేస్తారు. రోడ్ల వెంబడి విరివిగా మొక్కలను నాటేందుకు ఉపాధి నిధులను వెచ్చిస్తారు. ప్రస్తుత సంవత్సరంలో పాఠశాలలకు మరుగుదొడ్లు, గ్రామీణ సంతలు, కందకాల నిర్మాణాల వంటివి చేపడతారు. వాటి కోసం మొత్తం 12 కోట్ల పనిదినాలను కేంద్రం కేటాయించగా, ఇంతవరకు 5.7 కోట్ల పనిదినాలను కూలీలకు కల్పించి రూ.947 కోట్లను ఖర్చుపెట్టినట్లు అధికారులు తెలిపారు. వేతనాల రూపంలో రూ.843 కోట్లు, సామగ్రికి రూ.59 కోట్లు ఖర్చయినట్లు చెప్పారు. పథకం అమలు ప్రారంభం నుంచి చూసినప్పుడు, 2018-19లో అత్యధికంగా రూ.3,027 కోట్లు వ్యయమైనట్లు వెల్లడించారు.

డిజిటల్ సంతకాలైన అందరికీ 'రైతుబంధు'

- 54.56 లక్షల మందికి ఉన్న 1.40 కోట్ల ఎకరాలకు సాయం
- కలెక్టర్లతో సమీక్షలో సీఎస్ జోషి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లతో మాట్లాడుతున్న సీఎస్ జోషి

ఈనాడు, హైదరాబాద్: కొత్త పట్టాదారు పాసుపుస్తకంపై సోమవారం (ఈ నెల 10) వరకూ తహసీల్దార్ డిజిటల్ సంతకం పూర్తయిన రైతులందరి ఖాతాల్లో పెట్టుబడి సాయం కింద రైతుబంధు నిధులు జమ చేయాలని సీఎస్ ఎస్.కె.జోషి కలెక్టర్లను ఆదేశించారు. తహసీల్దార్ రైతు వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేసి వేలిముద్రతో డిజిటల్ సంతకం చేస్తేనే పాసుపుస్తకం ఇస్తారు. ఇప్పటివరకూ 54.56 లక్షల మందికి చెందిన కోటీ 40 లక్షల ఎకరాలకు పాసుపుస్తకాలు ఇచ్చినట్లు రెవెన్యూ శాఖ ప్రభుత్వానికి నివేదించిందని ఆయన ప్రకటించారు. రైతుబంధు పథకం, కొత్త జనాభా లెక్కల సేకరణ(2020-21)కి సంబంధించిన అంశాలపై సోమవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. పలు శాఖల ముఖ్యకార్యదర్శులు, కమిషనర్లు ఇందులో పాల్గొన్నారు. జోషి మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుబంధు సొమ్ము జమయ్యేలా చూడాలన్నారు. గతేడాది ఖరీఫ్, రబీలో రైతుబంధు సాయం అందని వారి విన్నపాలను ఇక పరిగణలోకి తీసుకునేదిలేదని స్పష్టంచేశారు. సోమవారం వరకూ 17.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1,870 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రైతుబంధు సాయం వద్దనుకునే రైతులు 'గివ్ ఇట్ అప్' దరఖాస్తును సమీపంలోని వ్యవసాయాధికారికి ఇవ్వాలన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని వ్యవసాయశాఖను ఆదేశించారు. 'అటవీ భూముల యాజమాన్య హక్కు పత్రం' (ఆర్ఓఎఫ్ఆర్) కలిగిన రైతుల వివరాలను గిరిజన సంక్షేమ శాఖ నుంచి తీసుకోవాలన్నారు. ఈ రైతుల వివరాలను కలెక్టర్లు గిరిజన శాఖకు పంపాలని చెప్పారు.

సరిహద్దుల మార్పుల వివరాలివ్వండి

జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగంగా 2010 నుంచి వచ్చే డిసెంబరు ఆఖరు వరకూ పట్టణాలు, గ్రామాల సరిహద్దుల్లో ఏర్పడే మార్పుల రికార్డుల వివరాలను వెంటనే పంపాలని జోషి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో కొత్తగా వెలసిన కాలనీల వివరాలు సేకరించాలన్నారు. జనాభా లెక్కల కార్యక్రమంపై నిర్దిష్ట కాల పరిమితితో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జాదవ్ సరేశ్

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. జగిత్యాల-ధర్మపురి రహదారి సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి ద్విచక్ర వాహనంపై అర్ధరాత్రి 12.15 గంటలకు వస్తున్న ఒర్సు సరేశ్(27)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో అర్ధరాత్రి చల్‌గల్ గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జాదవ్ జాదవ్(45)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇతను అల్లీపూర్‌లో పొక్లెయిన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరి మృతదేహాలను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఝార్ఖండ్‌లో ఘోర ప్రమాదం: 11 మంది మృతి

22 మందికి గాయాలు

హజారీబాగ్: ఝార్ఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇనుప లోడుతో ఆగి ఉన్న లారీని బిహార్‌లోని పట్నా వెళ్లే బస్సు ఢీకొనడంతో బస్సులో ఉన్న ముగ్గురు మహిళలు, ఒక బాలుడు సహా 11 మంది మరణించారు. మరో 22 మంది గాయపడ్డారు. హజారీబాగ్ జిల్లాలోని రెండో నెంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం సంభవించింది. బస్సు డ్రైవరు కూడా

'నేను నా వృత్తిని ప్రేమిస్తున్నాను'

- ఉపాధ్యాయుల్లో ప్రేరణ నింపేందుకు విద్యాశాఖ సరికొత్త నినాదం
- ఇదే అంశంపై టీచర్లకు వ్యాసరచన పోటీలు

ఈనాడు, హైదరాబాద్: పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని విశ్వసిస్తున్న విద్యాశాఖ.. వారిలో ప్రేరణ నింపేందుకు 'నేను నా వృత్తిని ప్రేమిస్తున్నాను' అనే నినాదంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు దీన్ని అమలు చేయనున్నారు. కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) ప్రణాళికను విడుదల చేసింది. మండల వనరుల కేంద్రాల నుంచి రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది దాకా అందరూ తాము పనిచేస్తున్న స్థలంలో వారి టేబుల్‌పై 'నేను నా వృత్తిని/చేస్తున్న పనిని ప్రేమిస్తున్నాను' అని పెద్దగా రాసి ప్రదర్శించాలి. ఆయా సంస్థల అధిపతులు దీని ప్రాధాన్యాన్ని సిబ్బందికి వివరించి అవగాహన కల్పించాలి.

- ◆ ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులకు 'నేను నా వృత్తిని ప్రేమిస్తున్నాను' అనే నినాదంపై తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూలలో వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. అందులో నుంచి ఉత్తమమైన ఒక దాన్ని ప్రధానోపాధ్యాయుడు ఎంపిక చేయాలి. ఆ వ్యాసాన్ని పాఠశాల అసెంబ్లీ సమావేశంలో, ప్రతి తరగతి గదిలో చదివి వినిపించాలి. ఎంపికైన వ్యాసాన్ని ఎంఈఓ కార్యాలయానికి పంపించాలి.
- ◆ మండలంలోని అన్ని పాఠశాలల నుంచి అందిన వ్యాసాల్లో ఒక్కొక్క భాషకు ఒకటి చొప్పున ఎంఈఓ ఎంపిక చేసి డీఈఓకు పంపించాలి.
- ◆ మండలాల నుంచి అందిన వ్యాసాల్లో ఒక్కొక్క భాషకు మూడింటిని డీఈఓ ఎంపిక చేసి హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీకి పంపించాలి.
- ◆ ఒక్కో భాషకు 3 చొప్పున ఉత్తమ వ్యాసాలను ఎస్‌సీఈఆర్‌టీ ఎంపిక చేయాలి. వాటితో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఒక పుస్తకాన్ని రూపొందించాలి.

మార్కుల వివరాలు అప్‌లోడ్ చేయండి

ఈనాడు, హైదరాబాద్: ఎంసెట్ రాసినా ర్యాంకులు దక్కనివారు వెంటనే ఇంటర్ లేదా సమాన విద్యకు సంబంధించిన మార్కులను ఎంసెట్ వెబ్‌సైట్ (www.eamcet.tsche.ac.in) ద్వారా నేరుగా అప్‌లోడ్ చేయాలని ఎంసెట్ కన్వీనర్ యాదయ్య తెలిపారు. సీబీఎస్‌ఈ మార్కులను ఇవ్వకపోవడంతో పాటు కొందరు విద్యార్థులు ఇంటర్ హాల్‌టికెట్ సంఖ్య తప్పుగా నమోదుచేయడం, మరికొందరు ప్రథమ సంవత్సరం హాల్‌టికెట్ సంఖ్య ఇవ్వడం, తెలంగాణ సాంకేతిక విద్యామండలి ఇంటర్ ఫలితాలను ఇంకా ప్రకటించకపోవడం.. వంటి కారణాల వల్ల కొందరికి ర్యాంకులు కేటాయించలేదని ఆయన వివరించారు. ర్యాంకులు పొందినవారు వెబ్‌సైట్ నుంచి ర్యాంకు కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

83 డిగ్రీ కళాశాలలకు గుర్తింపు నిరాకరణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 83 ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ఈ సారి అనుబంధ గుర్తింపు ఇచ్చేందుకు విశ్వవిద్యాలయాలు నిరాకరించాయి. తెలంగాణలో 1,110 డిగ్రీ కళాశాలలు ఉండగా.. అందులో 980 కళాశాలలు 'దోస్త్' పరిధిలో ఉన్నాయి. మరో 47 కాలేజీలు సొంతంగా ప్రవేశాలు నిర్వహించుకుంటున్నాయి. మిగతా 83 కళాశాలలకు మాత్రం ఆయా వర్సిటీలు ప్రవేశాల అనుమతి నిరాకరించాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో డిగ్రీ కోర్సులు అందించేందుకు ఆయా కళాశాలలకు అర్హత లేదని పేర్కొంటూ 2019-20 విద్యా సంవత్సరానికి అనుబంధ గుర్తింపు(అఫిలియేషన్) ఇవ్వలేదు. వీటిలో అత్యధికంగా కాకతీయ, ఓయూ, మహాత్మాగాంధీ వర్సిటీల పరిధిలోని కళాశాలలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. అందుకే ఈ సారి సీట్ల సంఖ్య కూడా తగ్గింది. గతేడాది 'దోస్త్' పరిధిలోని కళాశాలల్లో 4.03 లక్షల డిగ్రీ సీట్లుండగా.. ఈ సారి ఆ సంఖ్య 3.83 లక్షలకు తగ్గింది.

విద్యావలంటీర్లను కొనసాగించండి

మంత్రి జగదీశ్‌రెడ్డికి సంఘం బాధ్యుల వినతి

నాంపల్లి, కంట్రి, న్యూస్‌టుడే: హైకోర్టు ఆదేశాల మేరకు గతేడాది రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసిన విద్యావలంటీర్లను ఈ విద్యా సంవత్సరం కూడా కొనసాగించాలని తెలంగాణ విద్యావలంటీర్ల సంఘం రాష్ట్ర బాధ్యులు విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో వారు మంత్రిని కలిశారు. పాఠశాలలు బుధవారం నుంచి పునఃప్రారంభం అవుతున్నా.. వలంటీర్లను కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యావలంటీర్ల నియామకాలు చేపట్టకపోతే చాలా పాఠశాలలు మూతపడే ప్రమాదముందని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివానంద్‌స్వామి, ప్రధాన కార్యదర్శి జోగినాథ్‌యాదవ్, ఉపాధ్యక్షులు భిక్షం తదితరులున్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

సరోజినీ దామోదరన్ ఫౌండేషన్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఉపకార వేతనాలు అందించడం కోసం తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభ కలిగిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సరోజినీ దామోదరన్ ఫౌండేషన్ పేర్కొంది. వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉన్న కుటుంబాల పిల్లలు అర్హులని, 2018-2019 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 90 శాతం లేదా 9 జీపీఏ మార్కులు, దివ్యాంగులైతే 7.5 జీపీఏ మించి సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి ఇంటర్‌లో ఏడాదికి రూ.6 వేల చొప్పున, తదుపరి ఎంచుకున్న కోర్సుకు రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకు అందజేస్తామన్నారు. దరఖాస్తులు జూన్ 30 వరకు స్వీకరిస్తామని, వివరాలకు 8367751309, 6300319827 నంబర్లలో సంప్రదించవచ్చని, లేదా వెబ్‌సైట్: www.vidyadhan.org ను చూడవచ్చని వెల్లడించారు.

ఇంటర్‌లో ఛేజా.. ఎంసెట్‌లో డేలా..

- ఎంసెట్‌లో అర్హత సాధించని వారు వేలల్లోనే
- ఏటా 80 శాతం లోపే అర్హులు

ఈనాడు - హైదరాబాద్

ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధిస్తున్న విద్యార్థుల్లో అత్యధికులు ఎంసెట్‌లో బోల్తా పడుతున్నారు. ఇంటర్లో తమ పిల్లలు సాధించిన మార్కులు చూసి ఎంసెట్‌లోనూ మంచి ర్యాంకు వస్తుందని ఆశలు పెట్టుకుంటున్న పలువురు తల్లిదండ్రులకు నిరాశే ఎదురవుతోంది. ఇంటర్లో పార్శ్వపుస్తకాలు చదివినా మంచి మార్కులు సాధించవచ్చని, అదే ఎంసెట్‌లో మాత్రం సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉంటేనే రాణిస్తారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందుకే ఇంటర్లో 75% మార్కులు సాధిస్తున్నవారు 60శాతానికిపైగా ఉండగా, ఎంసెట్‌లో మాత్రం 50% మార్కులు తెచ్చుకునే వారు 10-12శాతమే ఉంటున్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం తాజా ఫలితాల్లో మొత్తం 2.47 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 1,49,574 (60.40%) మంది 75%, ఆపైన మార్కులు (ఏ గ్రేడ్) సాధించారు. ఏ గ్రేడ్ సాధించిన మొత్తం విద్యార్థుల్లో 85,654 మంది ఎంపీసీ, 38,898 మంది బైపీసీ గ్రూపు వారే ఉన్నారు. ఎంసెట్ ఇంజినీరింగ్‌లో మాత్రం కేవలం 10-12% మందే 50% మార్కులు సాధిస్తున్నారు. 160 మార్కులకు ఎంసెట్ నిర్వహిస్తుండగా అందులో 80 మార్కులు కూడా సాధించలేని వారే 85-90% ఉంటున్నారు.

సగం మార్కులు దాటేవారు 12శాతం లోపే

ఎంసెట్‌లో సగం మార్కులు, ఆపైన సాధిస్తున్న వారు వందకు 12 మందిలోపే ఉంటున్నారు. దీనిపై 2016 గణాంకాలను పరిశీలిస్తే మొత్తం 1,03,923 మంది ఎంసెట్ ఇంజినీరింగ్ రాయగా.. వారిలో 11,469 (11%) మందే 80, ఆపై మార్కులు సాధించారు. 50 మార్కుల్లోపు సాధించినవారు 70,568 మంది. ఏటా ఒక శాతం అటుఇటుగా ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. తాజా ఎంసెట్-2019 ఫలితాల్లో 1,08,213 మంది అర్హత సాధించగా వారిలో 81 మార్కులు దాటిన వారు కేవలం 4343 మంది మాత్రమే. అంటే 4 శాతం మాత్రమే. ఇక 80 మార్కులను కూడా కలుపుకుంటే అది 11 శాతం మంది మాత్రమే ఉన్నారు. ఎంసెట్‌లో 25% మార్కులు.. అంటే 160కి 40 తెచ్చుకున్నవారే ఉత్తీర్ణులైనట్లు లెక్క. వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావడానికి అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం కనీస మార్కుల్లేవు. ఎంసెట్ రాసే మొత్తం విద్యార్థుల్లో 20% మందికి కనీస మార్కులూ రావడంలేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో కలిపిచూస్తే ఆ శాతం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. సబ్జెక్టును లోతుగా అర్థం చేసుకోకుండా పైపైన చదవడం వల్లే ఇలాంటి సమస్య వస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇంటర్లో 850 మార్కులు దాటినవారూ ఏటా వందల సంఖ్యలోనే ఎంసెట్‌లో అర్హత సాధించలేకపోతున్నారు. ఎంసెట్ నిర్వహణలో పాలుపంచుకుంటున్న ఆచార్యులు, ఎంసెట్ శిక్షణ నిపుణులు అది నిజమేనని అంగీకరిస్తున్నారు.

రెండు పరీక్షలకూ తేడా ఏమిటి?

ఇంటర్	ఎంసెట్
ఒక్కో పేపర్‌కు 3 గంటల సమయం	మొత్తం 3 గంటల సమయం
ప్రశ్నల్లో ఛాయిస్ ఉంటుంది	ఛాయిస్ ఉండదు
క్లిష్ట పాఠ్యాంశాలను వదిలేసినా అధిక మార్కులు వచ్చే అవకాశం	అన్ని పాఠ్యాంశాలనూ చదవాల్సిందే
గతంలో వచ్చిన ప్రశ్నలే వస్తాయి	అలాంటి పరిస్థితి చాలా అరుదు
జవాబు కొంత రాసినా మార్కులు కొన్ని వేస్తారు	అందుకు అవకాశం లేదు
ఆంగ్లం, సంస్కృతం సబ్జెక్టులు ఉంటాయి	భాషా సబ్జెక్టులు ఉండవు
బట్టీపట్టినా 80% మార్కులు సాధించవచ్చు	సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉంటేనే సాధ్యం

నాలుగేళ్లుగా ఎంసెట్ ఇంజినీరింగ్‌లో ఇదీ పరిస్థితి

సంవత్సరం	అర్హులు (శాతం)
2019	82.47
2018	78.24
2017	74.75
2016	77.88
2015	70.65

ఈసారి అధ్యయనం చేస్తున్నాం

ఏటా ఎంసెట్ రాసేవారిలో 75-80% మాత్రమే అర్హత సాధిస్తున్నారు. 20 శాతానికిపైగా విద్యార్థులు కనీస మార్కులు 40 కూడా సాధించడం లేదు. వారిలో ఇంటర్లో ఉత్తమ మార్కులు సాధించిన వారు ఎందరనేదీ ఇప్పటివరకు అధ్యయనం చేయలేదు. సాఫ్ట్‌వేర్ ద్వారా సమాచారం సేకరిస్తున్నాం. దానివల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేయడానికి ఉపయోగపడుతుంది.

– ఆచార్య యాదయ్య, కన్వీనర్, ఎంసెట్

1,05,433 మందికి డిగ్రీ సీట్లు

- అత్యధికంగా బీకాంలో 39,277 మందికి సీట్లు
- 43 కళాశాలల్లో సున్నా ప్రవేశాలు
- ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు ఈ నెల 15
- దోస్త్ మొదటి విడత సీట్ల కేటాయింపు
- 15 వరకు రెండో విడత రిజిస్ట్రేషన్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 980 డిగ్రీ కళాశాలల్లో 3,83,514 సీట్లకుగాను మొత్తం 1,05,433 మంది విద్యార్థులకు సీట్లు దక్కాయి. అంటే 2,78,081 సీట్లు మిగిలిపోయాయి. మొత్తం సీట్లు పొందిన విద్యార్థుల్లో 40,375 మంది బాలురు, 65,058 మంది బాలికలు ఉన్నారు. అంటే సీట్లొచ్చిన బాలికలు 62% ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 43 కళాశాలల్లో ఒక్కరూ వచ్చి కాలు ఇన్వెస్టుపోవడంతో వాటిల్లో ఈ సారి సున్నా ప్రవేశాలే. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మొదటి విడత సీట్లను సోమవారం సాయంత్రం కేటాయించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి, దోస్త్ కన్వీనర్ ఆచార్య ఆర్.లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ తదితరులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. వెబ్ ఆప్షన్లు తక్కువ ఇవ్వడం వల్ల 5,996 మందికి సీట్లు దక్కలేదని వారు తెలిపారు. ఈ నెల 15 లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీట్లు కోల్పోతారని తెలిపారు.

దోస్త్‌లో లేని కళాశాలల్లో చేరితే బోధనా రుసుములకు అర్హులు కాదు

దోస్త్ పరిధిలో ఉన్న కళాశాలల్లో ప్రవేశాలు పొందితేనే ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తిస్తుందని దోస్త్ కన్వీనర్ లింబాద్రి తెలిపారు. దోస్త్‌లో లేకుండా సొంతంగా ప్రవేశాలు నిర్వహించుకునే కళాశాలల్లో చేరితే బోధనా రుసుములకు అర్హత ఉండదని తెలిపారు. కొన్ని కళాశాలలు న్యాయస్థానానికి వెళ్లి సొంతంగా ప్రవేశాలు నిర్వహించుకొనేందుకు అనుమతి తెచ్చుకున్నాయని తెలిపారు. ఈ నెల 10 నుంచి 15 వరకు రెండో విడత రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. పదుల సంఖ్యలోని కళాశాలల్లో 25% లోపు సీట్లు కూడా భర్తీ అయ్యే పరిస్థితి లేదు.

- ◆ సీట్లు పొందిన మొత్తం 1,05,433 మందిలో అత్యధికంగా 39,277 మంది బీకాం విద్యార్థులే. అయితే గతానికి భిన్నంగా ఈసారి బీఎస్‌సీ కోర్సును లైఫ్ సైన్సెస్, బీఎస్‌సీ ఫిజికల్ సైన్సెస్ పేరిట విభజించారు. ఆ రెండిటిని కలిపితే 52,435 మంది బీఎస్‌సీలో చేరినట్లు లెక్క.
- ◆ 75,184 మందికి వారు ఇచ్చుకున్న మొదటి ఆప్షన్ ప్రకారమే సీట్లు దక్కాయి.

విశ్వవిద్యాలయాల వారీగా సీట్లు పొందిన వారు

వర్సిటీ	బాలురు	బాలికలు	మొత్తం
ఓయూ	18,291	26,435	44,726
కేయూ	10,685	16,325	27,010
శాతవాహన	3,583	8,772	12,355
తెలంగాణ	3,147	5,508	8,655
పాలమూరు	2,766	4,455	7,221
మహాత్మాగాంధీ	1,903	3,557	5,460
టీఎస్ ఎస్‌వీటీటీ	0	6	6
మొత్తం	40,375	65,058	1,05,433

(గమనిక: ఎస్‌వీటీటీలో డిప్లొమా కోర్సులో ప్రవేశాలు)

పులి దాడిలో పశువుల కాపరి మృతి

వారం రోజుల్లో మూడో సంఘటన

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సింధివాహి ప్రాంతంలో వరసగా జరుగుతున్న పులి దాడుల్లో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. సమీప అడవుల్లో పశువులను మేపే ఆదివారం రాత్రి ఇంటికి తిరిగొస్తున్న తుంబీరాం (60) అనే వృద్ధుడు పులి పంజాకు బలయ్యారని, ఇటువంటి సంఘటన జరగడం వారం రోజుల్లో ఇది మూడోసారని అటవీ శాఖ వర్గాలు తెలిపాయి. తాజా సంఘటనతో ఆగ్రహించిన గ్రామవాసులు సోమవారం ఆందోళనకు దిగారు. ప్రాణరక్షణకు ప్రభుత్వం హామీ ఇచ్చేదాకా మృతదేహాన్ని కదిలించేది లేదంటూ, బైఠాయించి నినాదాలు చేశారు. అధికారులు వచ్చి నచ్చజెప్పడంతో, ఆ తర్వాత ఆందోళన విరమించారు.

17న కొత్త గురుకుల పాఠశాలల ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 119 బీసీ గురుకులాల్లో ఈ నెల 17 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త గురుకులాల్ని సంబంధిత జిల్లా మంత్రులు లేదంటే ఎమ్మెల్యేలు ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్రంలోని బీసీ గురుకులాల సంఖ్య 142 నుంచి ఇక 261కి చేరనుంది. తెలంగాణ ఏర్పాటుకు ముందు 19 మాత్రమే ఉండగా.. ఇప్పుడు కళాశాలలతో కలిపి 280కి చేరుకున్నాయి. గురుకుల పాఠశాలల్లో దాదాపు 91,680 మంది విద్యార్థులు ఉండగా, 5,335 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని సీఎం వివరించారు. బీసీ గురుకులాలతో కలిపి రాష్ట్రంలో మొత్తం గురుకుల పాఠశాలలు 906కు, డిగ్రీ కళాశాలలు 53కు చేరుకున్నాయని వెల్లడించారు. నూతన పాఠశాలలకు భవనాలను గుర్తించి, అవసరమైన సదుపాయాలు కల్పించామని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమీక్షలో తెలిపారు. వీటిలో ఈ ఏడాదికి 5, 6, 7 తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. కొత్త పాఠశాలల్లో 3,689 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిందని, రానున్న నాలుగేళ్లలో విడతల వారీగా భర్తీ చేస్తామన్నారు.

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో ప్రవేశాలు అలస్యమవుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో నేటికీ అడ్మిషన్లు పూర్తికాలేదు. ఐదో తరగతి ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశపరీక్ష (గురుకుల సెట్) ఫలితాలు ఆలస్యంగా వెల్లడించడం, మిగతా బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రవేశాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితాలు వెల్లడించి దాదాపు 20 రోజులు గడుస్తున్నా ఇంకా తొలివిడత అడ్మిషన్లు పూర్తికాలేదు. తదుపరి ఖాళీల గుర్తింపు, సీట్ల భర్తీ పూర్తయ్యేసరికి మరో నెలరోజులకు పైగా సమయం పట్టే అవకాశాలున్నట్లు సంక్షేమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సారూ.. ఎప్పటికి చేర్చుకుంటారు?

గురుకులాల్లో ప్రవేశాలు జాప్యం

47,740 సీట్లకు... 1.35 లక్షల మంది పోటీ

గురుకులాల్లో ప్రవేశాలకు పేదవర్గాల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాదికి ఐదోతరగతి ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 1.35 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 47,740 సీట్లకు వీరంతా పోటీపడ్డారు. ఏటా సెట్ ఫలితాలను మే మొదటి వారంలో విడుదల చేసేవారు. ఈ ఏడాది దాదాపు రెండు వారాలు ఆలస్యంగా ఫలితాలు ఇవ్వడంతో ప్రవేశాల ప్రక్రియపై ప్రభావం పడింది. మరోవైపు 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్షలు నిర్వహించినా, ప్రవేశాల ప్రక్రియ పూర్తికాలేదు. గురుకులాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు అవసరమైన పత్రాలు సమకూర్చుకోవడంలోనూ జాప్యం జరుగుతోంది. అప్పటివరకు చదివిన పాఠశాలలు ఐదిలీ పత్రం (టీసీ), మార్కుల వివరాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నాయి. సొసైటీల వారీగా సీట్లు పొందిన విద్యార్థులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం ఆలస్యమవుతోంది. ఈ పత్రాలు సమర్పించిన తరువాతే ప్రవేశాలకు అనుమతి ఇస్తున్నారు.

TSIRTC ఈ-టెండరు ప్రకటన

No. C2/10(10)/2019-OPD(M&C), Dt. 11.06.2019

TSRTC వివిధ మౌళ్యమాలన్లార (1) బస్సు స్టేషన్స్‌లో డిజిటల్ టి.వి.లను ఆపర్చి కార్యా ప్రకటనలు (2) సూపర్ లక్జరీ, డీలక్స్ బస్సులపైన ప్రకటనలు, (3) టిప్ టికెట్స్ పైన ప్రకటనలు(4) అన్ని బస్సు స్టేషన్‌లలో టి.వి.ల ద్వారా ప్రకటనలు మరియు (5) వివిధ తోస్థ బస్సుల్లోని డైనింగ్ లోస్ (సమయసూచిక బోర్డు) పైన ప్రకటనలు కొరకు కాంట్రాక్టర్ల నియామకానికి ఆన్ లైన్ విధానంలో టెండర్లు కోరుచున్నది. మరిన్ని వివరాలకొరకు మా వెబ్ సైట్: http://www.tsrtc.telangana.gov.in ను దర్శించగలరు. సం/- ఛీఫ్ ట్రాఫిక్ మేనేజర్(M&C) & ప్రొక్యూర్(CP)

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

ఇ-టెండరు నోటీసు

ACSR స్ప్రింగర్ కండక్టర్ యొక్క సరఫరా కొరకు టెండర్ స్పెసిఫికేషన్ నెం. TSPM/22-19/2019 రాష్ట్రా టిఎస్‌జెన్‌కో & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరుతున్నది. టెండరుదారులు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మార్కెట్ పైన, అనగా www.tender.telangana.gov.in నుండి తదుపరి వివరాలను పొందవచ్చును మరియు టెండరు షెడ్యూలును డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. కాంటాక్ట్ నెంబర్లు ఫోన్: 040-23390000 (ఎక్స్‌టెన్షన్: 3660/3583/3687/3332), 040-23303730. www.tstransco.in

RO No.: 14/19 సం/- చీఫ్ ఇంజినీర్/P&MM

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

మార్కెటింగ్ విభాగం ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

టి.టి.డి., తిరుమల మార్కెటింగ్ విభాగం పరిధిలో రిగులేషన్స్‌కు అనుగుణ్యం సరఫరా చేసినట్టు ఈటెండర్ ఆహ్వానించబడినది. అధిక వివరాలకొరకు లాగిన్ అప్డేట్‌లకు దర్శించండి http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in రంగంలో టెండర్ పి.ఓ నెం 88 యొక్క "సాలా" మరియు "తమలపాకు" అనుపత్ర చేసినట్టనుటకు- మార్కెటింగ్‌కు పంపిన చేయబడినది. తదుపరి వివరాలకొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 0877-2263910, 2264555. ఫ్యాక్స్ నెం.0877-2264554.

క్రమ సంఖ్య	వస్తువు పేరు	పరిమాణం	టెండరు విలువ (డిపాజిట్ (ఫ్రీ) రూపాలో)	డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ మరియు మూసివేసే తేదీలు
1.	వేపకడగల గుజలు	10,000 కేజీలు	25,000/-	10-06-2019 - 18-06-2019
2.	టీ డస్ట్ బ్యాగ్స్	30,00,000 సంఖ్యలు	25,000/-	10-06-2019 - 25-06-2019
3.	చెట్నీపొడి మరియు ఉత్తరేణుము పప్పొడి బరలు	30 కెజి	51,000/-	11-06-2019 - 18-06-2019
4.	ఫాలిథిన్ లంచ్ బ్యాగ్ బరువు	1,40,00,000 సంఖ్యలు	7,00,000/-	11-06-2019 - 25-06-2019
5.	గార్డెన్ బ్యాగులు (బయోడిగ్రేడబుల్)	4,00,000 సంఖ్యలు	1,00,000/-	11-06-2019 - 25-06-2019
6.	25 cms లావు ప్లైన్ (సన్నం/ఎనెమిక్/ పిగ్మెంటెడ్) గడగడ కొబ్బరికాయలు	10,50,000 సంఖ్యలు	4,00,000/-	12-06-2019 - 26-06-2019

Roc.No.PR4/13907/Adv.No.106/PRO/2019, Dated: 10.06.2019 కార్యనిర్వహణాధికారి

జీఓ అమలుపై సీఎస్‌కు లేఖ

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థుల బడిసంచి బరువును తగ్గించడానికి 2017 జులై 12న విద్యాశాఖ జీఓ జారీచేసినా.. దాని అమలు కాగితాలకే పరిమితమైందని, ఇకనైనా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి లేఖ రాశారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ నూతన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్. పక్కన శాంతికుమారి, శంకర్, సీహెచ్ ప్రభాకర్

ఆన్‌లైన్‌లో ఐపీఎం సేవల సమాచారం

ప్రారంభించిన మంత్రి ఈటల

ఈనాడు, హైదరాబాద్: ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం) అందిస్తోన్న సేవలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆహార పదార్థాలు, నీళ్లలో కల్తీని గుర్తించడం, నాణ్యత ప్రమాణాలను నిర్ణయించడం, ఆయా జబ్బులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు చేయడం, చేర్పేరు దేశాలకు వెళ్లాలనుకునే వారికి అంతర్జాతీయ టీకాలను ఇవ్వడం తదితర సేవలను ఐపీఎం నిర్వహిస్తోంది. ఇక నుంచి ఈ సేవలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చనున్నారు. సచివాలయంలో సోమవారం ఐపీఎం నూతన వెబ్‌సైట్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, ఐపీఎం సంచాలకులు డాక్టర్ శంకర్, అంతర్జాతీయ టీకాల విభాగం అధికారి డాక్టర్ సీహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా వెబ్‌సైట్‌ను తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా మంత్రి ఈటల సూచించారు.

ప్రభుత్వం వెంటాడుతోంది

- అక్రమంగా వచ్చిన నిధులతోనే టీవీ 9 ఏర్పాటు
- సీబీఐ, ఈడీలకు ఫిర్యాదులివ్వడంతోనే వేధింపులు
- రవిప్రకాశ్ సంచలన ఆరోపణ.. హైకోర్టుకు నివేదన
- శివాజీకి వాటాల బదలాయింపే కుట్ర
- వాదనలు వినిపించిన పోలీసులు
- ముందస్తు బెయిలు పిటిషన్‌పై నేడూ విచారణ



ఈనాడు, హైదరాబాద్: దురుద్దేశంతో ప్రభుత్వం తనను వెంటాడుతోందని టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్ హైకోర్టుకు నివేదించారు. అప్పట్లో టీవీ 9 ఏర్పాటు సమయంలో మారిషస్ నుంచి పెమా నిబంధనలకు విరుద్ధంగా రూ. 60 కోట్ల నిధులు వచ్

కీడెంచీ.. మేలెంచీ..

అతి సర్వత్ర వర్జయేత్. అంటే అతి ఎక్కడా వద్దని! ఇది ముందస్తు ఆరోగ్య పరీక్షలకూ (స్క్రీనింగ్) వర్తిస్తుంది. జబ్బుల ఆనవాళ్లను ముందే పట్టుకోవటానికి, వాటిని నివారించుకోవటానికివి ఎంతగానో తోడ్పడతాయనటంలో ఎలాంటి సందేహం లేదు. మనదేశం సాంక్రమికేతర జబ్బుల నిలయంగా మారిపోయిన ప్రస్తుత తరుణంలో ఇవి అవసరం కూడా. కానీ ఎవరికీ, ఎప్పుడు, ఎలాంటి పరీక్షలు అవసరమన్నదీ కీలకమే. పరీక్షలు నిర్వహించే ప్రయోగశాలల సామర్థ్యం, పరీక్షల విధి విధానాలు, సాంకేతిక పరిజ్ఞాన పరిమితుల దృష్ట్యా అన్ని ఫలితాలు సరిగా రావాలనేమీ లేదు. కొన్ని తప్పుగానూ రావొచ్చు. కొన్ని పరీక్షలు అసలు జబ్బులనే పట్టుకోలేకపోవచ్చు. ఇది మానసిక వేదనకు, తప్పుడు చికిత్సలకు దారితీయొచ్చు. అందుకే మాస్టర్ హెల్త్ చెకప్‌లు, కంప్లీట్ బాడీ చెకప్‌ల పేరుతో అందరికీ మూకుమ్మడిగా పరీక్షలు చేసేయటం ఏమంత సమంజసమైన పద్ధతి కాదని.. వీటి విషయంలో కీడెంచి మేలెంచాలనే భావన పుంజుకుంటోంది.



డా॥ ఎన్.కృష్ణారెడ్డి
డైరెక్టర్
కేర్ కార్డియాక్ సెంటర్
బంజారాలు రోడ్‌మక్క హాస్పిటల్
విద్యానగర్, హైదరాబాద్

ఆరోగ్య సంరక్షణను రెండు రకాలుగా చూడొచ్చు. ఒకటి- జబ్బులకు చికిత్స చేయటం. రెండోది- అసలు జబ్బుల బారినపడకుండా ముందే జాగ్రత్త పడటం. ముందస్తు ఆరోగ్య పరీక్షల లక్ష్యం ఇదే. మున్ముందు ఎలాంటి జబ్బులు వచ్చే అవకాశముందో తెలుసుకోవటానికి.. ఏదైనా లేదా కనబడితే ముందుగానే వాటిని నివారించుకోవటానికివి తోడ్పడతాయి (ప్రైమరీ ప్రివెన్షన్). ఉదాహరణకు- ఎవరికైనా ముందస్తు మధుమేహం ఉన్నట్టు తేలితే అది పూర్తిస్థాయి మధుమేహానికి దారితీయకుండా చూసుకోవచ్చు. లేదూ త్వరగా దాని బారినపడకుండా కాపాడుకోవచ్చు. ఆరోగ్య పరీక్షలతో ఒనగూడే మరో ప్రయోజనం ఆయా జబ్బుల ముప్పు అధికంగా గలవారిలో సమస్యను ముందుగానే గుర్తించే వీలుండటం (సెకండరీ ప్రివెన్షన్). వీటిని ఆరంభంలోనే గుర్తిస్తే ముదరకుండా చూసుకోవచ్చు. అంతేకాదు, ఆయా జబ్బులతో ముడిపడిన తీవ్రమైన సమస్యలు దరిజేరకుండా కాపాడుకోవచ్చు. ఉదాహరణకు- ఎవరికైనా గుండెజబ్బు ఉందనుకోండి. మున్ముందు గుండెపోటు, గుండె వైఫల్యం, హఠాత్తుగా మరణించటం వంటి వాటిని ముందస్తు పరీక్షలతో కనిపెట్టుకుంటూ అప్రమత్తంగా ఉండొచ్చు. ఒకవేళ సమస్యాత్మకంగా పరిణమిస్తోందని అనిపిస్తే ముందుగానే చికిత్స ఆరంభించొచ్చు.

- డా॥ ఎ.అశ్వినీకుమార్
ప్రొఫెసర్ అఫ్ మెడిసిన్

చవక యావలో పడొద్దు

ముందస్తు పరీక్షల విషయంలో వయసు, కుటుంబ చరిత్ర, లింగ భేదం, ఆహార, విహారాలు, జీవనశైలి వంటి విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం విరివిగా అందుబాటులోకి వస్తున్న మాస్టర్ హెల్త్ చెకప్‌ల వంటివి చాలావరకు ఇలాంటి శాస్త్రీయ పద్ధతిని పాటించటం లేదనే చెప్పాలి. తక్కువ ధరలకే బోలెడన్ని పరీక్షలంటూ ఊరించటమూ చూస్తున్నాం. 'ఒక్క రక్తం సమూనాతోనే చాలా పరీక్షలు చేస్తున్నారు కదా. దీంతో వచ్చే నష్టమేంటి?' అని వాదించేవారూ లేకపోలేదు. ఖర్చు సంగతి పక్కపెడితే అసలు అన్ని పరీక్షలు అవసరమా? అన్నది ప్రధానమైన ప్రశ్న. పరీక్షలు నిర్వహించే ప్రయోగశాలల్లో అన్నిసార్లూ ఒకేలా, కచ్చితమైన ఫలితాలే రావాలనేమీ లేదు. 5-10% ఫలితాలు తప్పుగానూ రావొచ్చు. జబ్బు లేకపోయినా ఉన్నట్టు తేలితే కలిగే మానసిక వేదన అంతా ఇంతా కాదు. అనవసర చికిత్సలు, మందులతో ఇల్లు, ఒళ్లు గుల్లవుతాయి. జబ్బు ఉన్నా లేనట్టు తేలితే సమస్య రోజురోజుకీ ముదిరిపోతుంది. మనదేశంలో మందులకు 30%, పరీక్షలకు 20-30% ఖర్చు పెడుతున్నారని అంచనా. అందువల్ల అనవసర పరీక్షలకు తావివ్వకుండా చూసుకోవటమే ఉత్తమం.

ఫలితాల విశ్లేషణ కీలకం

కొన్నిసార్లు వయసులను బట్టి కూడా నార్మలా? కాదా? అన్నది బేరీజు చేయాల్సి ఉంటుంది. 60 ఏళ్ల వృద్ధుడికి ఎకోకార్డియోగ్రామ్ పరీక్ష చేశారనుకోండి. గుండె వైఫల్యం (డయాస్టాలిక్ డిస్‌ఫంక్షన్) ఉన్నట్టు తేలినంతమాత్రాన అది సమస్యాత్మకం కాబోవచ్చు. వయసుతో పాటు గుండె కండరం గట్టిపడటం వల్ల అలాంటి ఫలితం వచ్చి ఉండొచ్చు. అదే చిన్న వయసులో గుండె వైఫల్యం సూచనలు కనబడితే మాత్రం సమస్యాత్మకంగానే భావించాలి. ఇలా ఆయా అంశాలను బట్టి ఫలితాలను బేరీజు చేయటమనేది చాలా కీలకం. ఇప్పుడు ఇలాంటి నిపుణుల సంఖ్య తగ్గిపోతుండటం దురదృష్టకరం.

అనవసరంగా చేస్తే తీవ్ర అనర్థాలు

ఒక సీటీ యాంజియోగ్రామ్ 250 ఎక్స్‌రేలతో సమానం! అంటే అవసరం లేకపోయినా ఒకసారి సీటీ యాంజియోగ్రామ్ చేస్తే 250 ఎక్స్‌రేలతో సమానమైన రేడియో ధార్మికశక్తి ప్రభావానికి గురైనట్టే. ముఖ్యంగా చిన్న వయసులో ఎక్కువ రేడియో ధార్మికశక్తికి గురైతే మున్ముందు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. సీటీ యాంజియోగ్రామ్ వంటివి చేసేటప్పుడు రక్తంలోకి అయోడిన్ కాంట్రాస్ట్ కూడా ఇస్తుంటారు. కిడ్నీ జబ్బు ముప్పునకు దగ్గర్లో ఉన్నవారికిది మరింత చేటు చేస్తుంది. ముఖ్యంగా మధుమేహులకి క్రియాటినైన్ 1.2 కన్నా తక్కువన్నా అయోడిన్ కాంట్రాస్ట్ ఇచ్చిన తర్వాత ఉన్నట్టుండి కిడ్నీలు దెబ్బతినటం చూస్తున్నాం. ఇలాంటి తీవ్రమైన అనర్థాలు నూటికి 5 మందిలోనే కనబడొచ్చు గానీ దానికి ఆస్కారం ఇవ్వటం ఎందుకు? అవసరమైనప్పుడు సీటీ యాంజియోగ్రామ్ పరీక్ష తప్పదు. ఇలాంటి పరీక్షలతో కలిగే లాభాలతో పోలిస్తే నష్టాలు తక్కువగా ఉన్నప్పుడు చేయటంలో తప్పులేదు. కానీ అనవసరంగా చేయకపోవటమే ఉత్తమం కదా. మానసిక ఒత్తిడి, భయాల వంటివన్నీ పక్కనపెడితే తీవ్రమైన అనర్థాలకు దారితీసే సీటీ యాంజియోగ్రామ్, శరీరానికి కేత పెట్టి చేసే యాంజియోగ్రామ్ వంటి పరీక్షల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. వైద్యరంగం మీద ప్రజలకు నమ్మకం సడలకుండా చూసుకోవటం అవసరం. పరీక్షలకూ ఒక పరిమితి ఉందని తెలుసుకోకుండా అందరికీ గంపగుత్తగా నిర్వహించటంలో అర్థం లేదని గుర్తించాలి. అవసరమైనవారికి, అవసరమైన పరీక్షలు చేయటం ఎంత ముఖ్యమో.. అనవసరంగా పరీక్షలు చేయకపోవటం, చేయించుకోకపోవటం కూడా అంతే ముఖ్యం.

కొన్ని కీలక పరీక్షలు

సీరం క్రియాటినైన్

ఇది కిడ్నీల పనితీరును తెలుసుకోవటానికి తోడ్పడే పరీక్ష. చాలామంది క్రియాటినైన్ నార్మల్‌గా (1.2) ఉంటే అంతా బాగానే ఉందనుకుంటుంటారు. కానీ కిడ్నీలు 50 శాతం వరకు దెబ్బతిన్నా క్రియాటినైన్ నార్మల్‌గానే ఉండొచ్చు. అందువల్ల తొలిదశ కిడ్నీజబ్బును తెలుసుకోవటానికి కిడ్నీల వడపోత సామర్థ్యం (జీఎఫ్ఆర్) కూడా కీలకం. దీన్ని వయసు, లింగ భేదం వంటి అంశాల ఆధారంగా అంచనా వేస్తారు. అందువల్ల రిపోర్టులో జీఎఫ్ఆర్ విలువను కూడా తప్పకుండా పేర్కొనాలి. ఇది 90 కన్నా తక్కువకు చేరుకుందంటే కిడ్నీ జబ్బు మొదలైందనే అర్థం. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. నిపుణుల సూచనల మేరకు తరచుగా పరీక్ష చేయించుకోవాలి.

ఎవరికి?
- దీర్ఘకాలంగా అధిక రక్తపోటు గలవారికి, మధుమేహం నియంత్రణలో లేనివారికి, కుటుంబంలో ఎవరైనా కిడ్నీజబ్బులు గలవారికి, నొప్పి మందులు అతిగా వేసుకునేవారికి, తరచుగా మూత్ర ఇన్‌ఫెక్షన్లకు గురయ్యేవారికి ఇది అవసరం.

మూత్రంలో సుద్ద

కిడ్నీజబ్బు తొలిదశలో చాలావరకు ఎలాంటి లక్షణాలూ కనబడవు. లక్షణాలు కనబడేసరికే కిడ్నీలు ఎంతోకొంత దెబ్బతిని ఉండొచ్చు. దీన్ని ముందుగానే గుర్తించటానికి మూత్రంలో ప్రోటీన్ (అల్బ్యూమిన్ వంటి ప్రోటీన్లు) పరీక్ష ఉపయోగపడుతుంది. మూత్రంలో చిన్న పట్టీని ముంచి చేసే పరీక్షలో పలితం 2 ప్లస్ అని తేలితే 300మి.గ్రా./డీఎల్ కన్నా ఎక్కువ ప్రోటీన్ పోతుందనే అర్థం. అంతకన్నా ముందే సమస్యను తెలుసుకోవటానికి మూత్రంలో సుద్ద (మైక్రో అల్బ్యుమినూరియా) పరీక్ష ఉపయోగపడుతుంది. ఇది 30 మి.గ్రా. లోపు ఉంటే బాధపడాల్సిన పనిలేదు. 30-300 మి.గ్రా. ఉంటే జాగ్రత్తగా ఉండాలి. అదే 300 మి.గ్రా. కన్నా మించితే మందులు తప్పనిసరి.

ఎవరికి?
- మధుమేహం, అధిక రక్తపోటు గలవారికి. మధుమేహంతో బాధపడేవారికి ఏటా ఈ పరీక్ష చేయాల్సి ఉంటుంది.

హెపటైటిస్ పరీక్ష

ఇది కాలేయజబ్బును పట్టుకునే పరీక్ష. హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ నివారణకు ఇప్పుడు పుట్టగానే టీకా ఇస్తున్నారు. హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్‌కు టీకా లేదు. వీటిని గుర్తించటానికి పరీక్షలు అవసరం.

ఎవరికి?
- రక్తం ఎక్కించుకున్నవారికి
- రక్త పరీక్షలు, డయాలసిస్, సర్జరీల వంటివి చేసే వైద్య సిబ్బందికి
- మాదకద్రవ్యాల అలవాటు గలవారికి
- కాలేయ ఎంజైమ్‌లు అస్తవ్యస్తమైనవారికి

ఎల్ఎఫ్‌టీ

ఇది కాలేయం పనితీరును తెలిపే పరీక్ష. ఇందులో రక్తంలో ఏఎల్‌టీ, ఏఎస్‌టీ, ఏఎల్‌పీ, అల్బుమిన్, టోటల్ ప్రోటీన్ స్థాయిలు తెలుస్తాయి. వీటి ఆధారంగా కాలేయం దెబ్బతింటుంటే ముందుగానే గుర్తించొచ్చు.

ఎవరికి?
- మద్యం అలవాటు గలవారికి, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లు గలవారికి, కుటుంబంలో ఎవరికైనా కాలేయ కణితులు తలెత్తినవారికి

కొలనోస్కోపీ

ఇది మలద్వార క్యాన్సర్ నివారణకు తోడ్పడే పరీక్ష. ఇందులో పెద్దపేగులోకి కెమెరాతో కూడిన గొట్టం పరికరాన్ని పంపించి లోపల ఏవైనా మార్పులు ఉన్నాయో చూస్తారు. పెద్దపేగులో బుడిపెల వంటివి క్యాన్సర్‌కు దారితీయొచ్చు. పరీక్ష చేసే సమయంలో ఇలాంటివి కనిపిస్తే వెంటనే తొలగిస్తారు. దీంతో క్యాన్సర్ బారినపడకుండా చూసుకోవచ్చు. దీన్ని ప్రతి ఐదేళ్లకు ఒకసారి చేయాల్సి ఉంటుంది. కొందరికి మలంలో రక్తం పోతుందేమో అనేదీ తెలుసుకోవటానికి పరీక్ష చేయాల్సి ఉంటుంది.

ఎవరికి?
- 50 ఏళ్లు పైబడినవారికి, కుటుంబంలో ఎవరైనా క్యాన్సర్ బారినపడ్డవారికి, పెద్దపేగులో బుడిపెలు గలవారికి

మామోగ్రామ్

ఇది రొమ్ము క్యాన్సర్‌ను ముందే పట్టుకోవటానికి తోడ్పడే పరీక్ష. ఇందులో రొమ్ములో గడ్డలేవైనా ఏర్పడుతుంటే వెంటనే తెలిసిపోతుంది. గతంలో 40 ఏళ్లు దాటిన స్త్రీలందరికీ మామోగ్రామ్ అవసరమని చెప్పేవారు. అయితే ఆరోగ్యంగా ఉన్న అందరికీ మామోగ్రామ్ చేసినా పెద్దగా తేడా కనబడటం లేదని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతకన్నా రొమ్ములను ఎవరికి వారు జాగ్రత్తగా పరిశీలిస్తుంటే చాలావరకు రొమ్ముక్యాన్సర్ ఆనవాళ్లను ముందుగానే పట్టుకోవచ్చని వివరిస్తున్నాయి.

ఎవరికి?
- కుటుంబంలో ఎవరైనా రొమ్ముక్యాన్సర్ బారినపడ్డవారికి, సంతానం లేనివారికి, రేడియేషన్ ప్రభావానికి గురైనవారికి

సాంక్రమికేతర జబ్బులే ఎక్కువ

ఒకప్పుడు మనదేశంలో ఇన్‌ఫెక్షన్ల వంటి సాంక్రమిక జబ్బులే ఎక్కువ. మరణాలు కూడా ఎక్కువగానే ఉండేవి. పరిశుభ్రత, సార్వత్రిక టీకా కార్యక్రమాల వంటి జాగ్రత్తలతో వీటిని చాలావరకు అదిగమించగలిగాం కూడా. అలా అని ఆనందించటానికి లేదు. మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, పక్షవాతం, క్యాన్సర్ల వంటి సాంక్రమికేతర జబ్బులు ఇప్పుడు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. మనదేశంలో సంభవిస్తున్న మరణాల్లో 61% మరణాలకు సాంక్రమికేతర జబ్బులే కారణమవుతున్నాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంటోంది. వీటిల్లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది గుండెజబ్బు, పక్షవాతం, అధిక రక్తపోటు గురించే. సాంక్రమికేతర జబ్బుల మరణాల్లో ఇవే 45% వరకు కారణమవుతుండటం గమనార్హం. దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్య (22%), క్యాన్సర్లు (12%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మరి వీటిని నివారించుకోలేమా? తప్పకుండా నివారించుకోవచ్చు. ఇందుకు జీవనశైలిని మార్చుకోవటంతో పాటు ముందుస్తు ఆరోగ్య పరీక్షలూ ఎంతగానో తోడ్పడతాయి.

గుండెజబ్బుల నివారణకు..

మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు.. ఈ మూడు గుండెకు ప్రధాన శత్రువులు. వీటి బారినపడకుండా చూసుకుంటే గుండెజబ్బుల బారినపడకుండా జాగ్రత్త పడినట్టే. అందువల్ల 30 ఏళ్లు పైబడిన అందరూ రక్తపోటు, కొలెస్ట్రాల్, పరగడుపున రక్తంలో గ్లూకోజు పరీక్షలు చేయించుకోవటం అత్యవసరం. ముందు జాగ్రత్త కోసం వీటిని ప్రతి మూడేళ్లకు ఓసారి చేయించుకుంటే సరిపోతుంది. అలాగే శరీర ఎత్తు-బరువుల నిష్పత్తి, నడుము చుట్టుకొలత చూసుకోవటమూ ముఖ్యమే.

- **రక్తపోటు (బీపీ) పరీక్ష:** చాలా తేలికైన పరీక్షే అయినా దీనికీ ఒక పద్ధతుంది. మనకు రక్తపోటు రోజంతా ఒకేలా ఉండదు. మారిపోతూ ఉంటుంది. మెట్లు ఎక్కటం, వేగంగా నడవటం వంటి పనులు చేసిన వెంటనే రక్తపోటు పరీక్ష చేస్తే పై/మొదటి సంఖ్య ఎక్కువగా కనబడుతుంది. తలనొప్పి, తలతిప్పు వంటివి ఉన్నప్పుడూ రక్తపోటు ఎక్కువగానే ఉంటుంది. కాబట్టి బీపీ పరీక్ష ఎప్పుడు చేయాలనేది కూడా ముఖ్యమేనన్నది గుర్తుంచుకోవాలి. అలాగే కనీసం 3 సార్లు పరీక్ష చేసి.. అన్నిసార్లూ ఎక్కువుంటేనే సమస్య ఉన్నట్టు నిర్ధరించాలి. రక్తపోటు 120/80 లోపు ఉండటం ఉత్తమం. అంతకు మించిపోతుంటే జాగ్రత్త అవసరం. ఒకవేళ 140/90 దాటితే చికిత్స తీసుకోవటం తప్పనిసరి.
- **పరగడుపున గ్లూకోజు పరీక్ష:** మధుమేహం ముప్పును తెలుసుకోవటానికి ప్రాథమికంగా ఈ పరీక్షే సరిపోతుంది. రక్తంలో గ్లూకోజు పరగడుపున 110 ఎంజీ/డీఎల్ లోపు ఉండటం మంచిది. ఇది 110-120 మధ్యలో ఉంటే త్వరలో మధుమేహం వచ్చే అవకాశముందని.. 126 కన్నా ఎక్కువుంటే మధుమేహం వచ్చిందని అర్థం. పరగడుపున గ్లూకోజు పరీక్ష చేయటం కుదరకపోతే ర్యాండమ్ గ్లూకోజు పరీక్ష చేయించుకోవచ్చు. ఇందులో గ్లూకోజు 200 ఎంజీ/డీఎల్ లోపు ఉంటే బాధపడాల్సిన పనిలేదు. ఒకవేళ 200 కన్నా ఎక్కువుంటే మధుమేహానికి సూచిక కావొచ్చు. ఇలాంటివాళ్లు పరగడుపున గ్లూకోజు పరీక్ష కూడా చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం హెచ్‌బీఏ1సీ పరీక్ష అందుబాటులో ఉంది. ఇందులో మూడు నెలల కాలంలో రక్తంలో గ్లూకోజు సగటు తెలుస్తుంది. ఇది 5.7 లోపుంటే భయపడాల్సిన అవసరం లేదు. 5.7 నుంచి 6.4 ఉంటే త్వరలో మధుమేహం వచ్చే అవకాశముందని అర్థం. 6.5, అంతకన్నా ఎక్కువుంటే మధుమేహంలోకి అడుగు పెట్టినట్టే.
- **కొలెస్ట్రాల్ పరీక్ష:** ఇందులో మొత్తం కొలెస్ట్రాల్‌తో పాటు చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్), మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) మోతాదులూ తెలుస్తాయి. హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్ తక్కువగా ఉన్నకొద్దీ గుండెజబ్బు ముప్పు పెరుగుతూ వస్తుంటుంది. ఇది స్త్రీలకు 45 కన్నా ఎక్కువ, మగవారికి 40 కన్నా ఎక్కువుండాలి. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 100 కన్నా తక్కువే ఉండాలి. మధుమేహులల్లోనైతే 90కి మించకూడదు. ఇక టోటల్ కొలెస్ట్రాల్ 240 దాటితే ఎక్కువగా ఉన్నట్టు భావిస్తుంటారు. కానీ ఇది 160 కన్నా మించకపోవటమే మంచిది.
- **బీఎంఐ పరీక్ష:** ఇది శరీర ఎత్తు-బరువుల నిష్పత్తిని తెలియజేసే పరీక్ష. బీఎంఐ 25 కన్నా తక్కువుండటం మంచిది. అలాగే నడుం చుట్టుకొలత ఆడవారికి 35 అంగుళాల లోపు, మగవారికి 40 అంగుళాల లోపు ఉండాలి. ఇది పెరుగుతున్నకొద్దీ గుండెజబ్బు ముప్పూ పెరుగుతుంది.

సమస్య - సలహా

ఒకటే మగత..?

సమస్య: నాకు 80 ఏళ్లు. గత ఏడాదిన్నరగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బాగా మగతగా ఉంటోంది. ఎలెక్ట్రోలైట్ పరీక్షలో సోడియం తక్కువగా ఉన్నట్టు తేలింది. దీనికి మందులు వాడుతున్నాను గానీ పెద్దగా ఫలితం లేదు. నాకు బీపీ ఉంది. మాత్రలు వాడుతున్నాను. నిద్ర మాత్రలు కూడా వేసుకుంటున్నాను. అసలు నాకు మగత ఎందుకు వస్తోంది?

– గ్రంధి నాగేశ్వరరావు, రాజమండ్రి

సలహా: మీ సమస్యకు కారణం కనిపిస్తూనే ఉంది. అది రక్తంలో సోడియం తగ్గిపోవటం. దీనికి దీర్ఘకాల కిడ్నీజబ్బు కారణం కావొచ్చు. సాధారణంగా వయసుతో పాటు కిడ్నీ పనితీరు తగ్గుతుంది. మీరు మధుమేహం ఉందో లేదో తెలియజేయలేదు. మధుమేహం మూలంగానూ కిడ్నీల పనితీరు మందగించి సోడియం తగ్గిపోవచ్చు. అందువల్ల కిడ్నీల పనితీరును తెలిపే మూత్ర పరీక్ష, బ్లడ్ యూరియా, సీరమ్ క్రియాటినైన్ పరీక్షలు అవసరం. మీరు వాడుతున్న మాత్రలు మంచివే. మజ్జిగలో గానీ, బార్లీ నీళ్లలో గానీ ఉప్పు వేసుకొని తాగితే రక్తంలో సోడియం పెరుగుతుంది. పెద్ద వయసులో మెదడుకు రక్త ప్రసరణ తగ్గటం కూడా మగతకు కారణమే. సూక్ష్మ రక్తనాళాల్లో రక్తప్రసరణ తగ్గితే మతిమరుపు, మగత, తల తిరగటం తలెత్తొచ్చు. పార్కిన్సన్స్ అనే నాడీ సమస్యలోనూ మగత రావొచ్చు. మరో ముఖ్యమైన కారణం- థైరాయిడ్ హార్మోన్ తగ్గటం. పెద్ద వయసులో థైరాయిడ్ గ్రంధి పనితీరు సరిగా ఉండదు. దీంతో మగత, బద్ధకం, నిస్సత్తువ వంటివి వేధిస్తాయి. మీరు నిద్ర మాత్రలు వాడుతున్నాననీ రాశారు. వీటితో ఉదయం పూట మగతగా ఉండి కళ్ల మూతలు పడుతుంటాయి. అలాగే దురదలకు వేసుకునే అలర్జీ మాత్రలు, దగ్గు మందులు కూడా మగతను కలగజేస్తాయి. కాబట్టి మీరు వాడుతున్న మందులతో మగత వస్తుందేమో తెలుసుకోవాలి. కొందరికి రక్తహీనతతోనూ మగత రావొచ్చు. అందువల్ల రక్తశాతం ఎంత ఉందో కూడా చూసుకోవాలి. అన్నింటికన్నా ముఖ్యవిషయం- నలుగురితో అంతగా కలవలేకపోవటం. పెద్ద వయసులో ఇంట్లో మాట్లాడేవారు తక్కువ. దీంతో నిరుత్సాహం ఆవరిస్తుంది. ఏ వ్యాపకమూ లేకపోతే చురుకుదనం తగ్గిపోయి, మగత ముంచుకురావొచ్చు. కాబట్టి వీలైనప్పుడల్లా తోటి వయసు వారిని కలుసుకొని, కబుర్లు చెప్పుకోవటం మంచిది. పత్రిక చదివే అలవాటుంటే కొనసాగించాలి. టీవీతో కొంతసేపు కాలక్షేపం చేయాలి. మనుమలు, మనుమరాళ్లతో కబుర్లు చెప్పాలి. ఆటలు ఆడాలి. ఇవన్నీ చురుకుగా ఉండేలా చేస్తాయి. మగత రాకుండా కాపాడతాయి.

మీ ఆరోగ్య సమస్యలను సంబేహలను పంపాల్సిన చిరునామా
సమస్య – సలహా **సుఖీభవ** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in

ఎవిస్ హాస్పిటల్
(హైదరాబాద్)లో
కాళ్లలో నరాలవాపు వెరికోస్ వెయిన్స్‌కు సురక్షిత, అత్యాధునిక లేజర్ చికిత్స

1)ఎవిస్ హాస్పిటల్లో ఎండీ డాక్టర్ రాజా.బి.కొప్పాల గారు విదేశాలలో శిక్షణ పొంది కుట్లు, కోతలు, రక్తస్రావం లేని సిరల లేజర్‌చికిత్సలో విశేషానుభవం సాధించారు.
2) ఎవిస్ ఆసుపత్రి అత్యుత్తమ ప్రమాణాలతో కలిగినందున అమెరికన్ కాలేజీ ఆఫ్ ఫ్లెబాలజీ (ఏసిపి) అనుమతి లభించింది. ఇటువంటి గుర్తింపు భారతదేశంలో ఎవిస్ హాస్పిటల్‌కే మాత్రమే వుంది.
3) ఎవిస్ ఆసుపత్రిలో పేషెంట్‌ను నిలబెట్టి ఉచితంగా డాప్లర్ టెస్ట్ చేస్తారు. దీనివల్ల అసలు సమస్య స్పష్టంగా తెలుస్తుంది. ఎవిస్ ఆసుపత్రిలో ఇన్స్యూరెన్స్ లీయంబర్స్ మెంట్ తదితర వివరాలు తెలుపడానికి, తగులీతిలో సాయం పడటానికి ప్రత్యేక విభాగం వుంది.
4) సర్జరీ తర్వాత ఎవిస్ ఆసుపత్రి కాళ్లపై వుండ్లు తగ్గేవరకు బాధ్యత తీసుకుంటుంది. మీ వుండ్లు తగ్గేవరకు ప్రత్యేక విభాగం పర్యవేక్షిస్తుంది.
5) ఆసుపత్రిలో మందులు, అన్ని సైజుల స్టాకింగ్స్ లభిస్తాయి. ఎవిస్ ఆసుపత్రిలో ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థ ఉన్నందున మీరు కాల్ చేస్తే తిరిగి కొద్దిసేపట్లోనే సమాధానం చెబుతారు.

గడ్డలు/కణితులు (ఫైబ్రాయిడ్స్) వల్ల గర్భసంచి తొలగింపులేని చికిత్స.

ఎవిస్ హాస్పిటల్స్ ప్రత్యేకత
- మాతృత్వ అవకాశం సురక్షితం.
- కోతవద్దు - మూతచాలు.
- ఒక్కరోజులో డిశ్చార్జి!!

వెరికోస్ వెయిన్స్, ఫైబ్రాయిడ్స్, చికిత్సల కొరకు సంప్రదించండి **99895 27715**
ఎవిస్ హాస్పిటల్స్
జూబ్లీహిల్స్ రోడ్ నెం.1, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రక్కన, హైదరాబాద్. ఫోన్: 040-22 22 77 99

గర్భసంచిలో గడ్డల నుంచి ఉపశమనం

ప్రమాదకరమేమీ కావు. అయినా భయపెడతాయి. గర్భసంచిలో తలెత్తే గడ్డలు, కంతులు (ఫైబ్రాయిడ్లు) ఇలాంటివే. మహిళల్లో సుమారు 50% మందిలో ఇవి ఏర్పడుతుంటాయి. కొందరికివి ఉన్నట్టు కూడా తెలియదు. ఎందుకంటే చాలామందిలో ఎలాంటి లక్షణాలూ ఉండవు. కానీ కొందరిలో నెలసరి సమయంలో రక్తస్రావం ఎక్కువ కావటం, నొప్పి, తరచుగా మూత్రానికి వెళ్లాలని అనిపించటం వంటి ఇబ్బందులు తలెత్తుతుంటాయి. సమస్య తీవ్రతను బట్టి వీటికి మందులు, శస్త్రచికిత్స వంటివి సూచిస్తారు. అయితే జీవనశైలిని మార్చుకోవటం కూడా బాగానే ఉపయోగపడుతుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. దీంతో ఫైబ్రాయిడ్ల ముప్పు తగ్గటమే కాదు.. నొప్పి వంటి లక్షణాల నుంచీ తప్పించుకోవచ్చని చెబుతున్నాయి.

- యాపిళ్లు, టమోటాలు, పచ్చగోబీ, క్యాబేజీ వంటివి ఫైబ్రాయిడ్ల ముప్పు తగ్గటానికి తోడ్పడుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అందువల్ల తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవటం మంచిది.
- అధిక రక్తపోటుకు, ఫైబ్రాయిడ్లకు బలమైన సంబంధం ఉందోందని పరిశోధకులు గుర్తించారు. కాబట్టి అధిక రక్తపోటు బారినపడకుండా చూసుకోవటం మేలు.
- ఒత్తిడి తగ్గించుకోవటమూ ముఖ్యమే. ఎందుకంటే ఒత్తిడి మూలంగానూ ఫైబ్రాయిడ్ల ముప్పు పెరగొచ్చని పరిశోధకులు పేర్కొంటున్నారు. యోగా, ధ్యానం వంటి పద్ధతులతో ఒత్తిడి తగ్గుతుంది. కంతులతో తలెత్తే లక్షణాలూ తగ్గుముఖం పడతాయి.
- నెలసరి సమయంలో నొప్పి తలెత్తుతుంటే కాళ్ల కింద దిండు పెట్టుకొని పడుకుంటే కాస్త ఉపశమనం కలుగుతుంది. లేదంటే పక్కకు తిరిగి పడుకొని మోకాళ్లను ఛాతీ వద్దకు లాక్కొంటే పీప మీద ఒత్తిడి తగ్గుతుంది. ఇది నొప్పి తగ్గటానికి తోడ్పడుతుంది.

ఈనాడు సినిమా



శ్రద్ధా కపూర్

'సాహో' సందడి షురూ

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సాహో'. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతోంది. శ్రద్ధా కపూర్ కథానాయిక. సుజిత్ దర్శకుడు. యువీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఆగస్టు 15న విడుదల చేయనున్నారు. గురువారం 'సాహో' నుంచి ట్రైలర్ వస్తోంది. "అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కించిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో ఉంటాయి. వాటి కోసం చాలా ఖర్చు పెట్టాం. షేడ్స్ ఆఫ్ సాహో పేరుతో రెండు టీజర్లను విడుదల చేశాం. వాటికి మంచి స్పందన వచ్చింది. మధి, సాబు సిరిల్, శ్రీకర్ ప్రసాద్ లాంటి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పనిచేశారు. యాక్షన్ సన్నివేశాల్ని హాలీవుడ్ నిపుణుల పర్యవేక్షణలో తీర్చిదిద్దాం. అవి అభిమానుల్ని అలరిస్తాయి. నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి"ని దర్శక నిర్మాతలు తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

టబు

వెంకటేష్

'కూలీ నెం.1'లో జంటగా నటించారు వెంకటేష్, టబు. తెలుగులో టబుకి తొలి చిత్రమిదే. తొలి అడుగుతోనే స్టార్‌గా మారిపోయింది. ఆ సినిమా వచ్చి ఇరవై ఏళ్లు గడిచాయి. ఆ తరవాత వెంకీ - టబు కలసి నటించలేదు. ఇంతకాలానికి వీరిద్దరూ వెండితెరపై సందడి చేయబోతున్నట్లు సమాచారం. బాలీవుడ్‌లో విజయవంతమైన చిత్రం 'దే దే ప్యార్ దే'. అజయ్‌దేవగణ్, టబు, రకుల్‌ప్రీత్ సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని తెలుగులో వెంకటేష్‌తో రీమేక్ చేస్తున్నారు. టబు పాత్ర మళ్లీ ఆమెకే దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయమై చిత్రబృందం ఇప్పటికే టబుని సంప్రదించగా, తను సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. వెంకటేష్ ప్రస్తుతం 'వెంకీ మామ'తో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన తరవాతే 'దే దే ప్యార్ దే' రీమేక్ పట్టాలెక్కవచ్చు. దర్శకుడు, ఇతర చిత్రబృందం వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

చూసినవాళ్లకు నవ్వులు తీసినవాళ్లకు డబ్బులు

అరుణ్ పవార్

"పాత్రలు, అవి చేసే హంగామా చూసి ప్రేక్షకులు నవ్వుకోవాలి. తీసిన నిర్మాతకి డబ్బులు రావాలి. అలాంటి సినిమాలే తీస్తా. 'వజ్రకవచధర గోవింద' కూడా ఆ తరహా చిత్రమే" అన్నారు అరుణ్ పవార్. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి నరేంద్ర, జీవీఎస్ రెడ్డి నిర్మాతలు. సప్తగిరి కథానాయకుడు. శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో పవార్ విలేకర్లతో మాట్లాడారు.

● కథంతా ఓ వజ్రం చుట్టూ తిరుగుతుంది. గోవింద అనే దొంగ పాత్రలో సప్తగిరి నటించాడు. గోవింద దొంగగా మారడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. అవి చూసి ప్రేక్షకులు కన్నీరు పెట్టుకోవడం ఖాయం. ఓ వజ్రం ద్వారా ఊరిని కాపాడిన గోవిందుడి కథ ఇది. వినోదాత్మకంగా మలిచాం. జబర్దస్త్ బృందంపై వచ్చే సన్నివేశాలు అలరిస్తాయి. ఈ సినిమాతో పరిశ్రమలో నాపై నమ్మకం కలుగుతుందని ఆశిస్తున్నాను.

● నాది నెల్లూరు. ఇంటర్ అయ్యాక హైదరాబాద్ వచ్చి విజువల్ ఎఫెక్ట్స్ నేర్చుకున్నాను. 'అతడు' సినిమా నుంచీ 'అఆ' వరకూ దర్శకుడు త్రివిక్రమ్ వద్ద పనిచేశా. అప్పుడప్పుడూ కొన్ని ఆలోచనలు చెబితే త్రివిక్రమ్ గారు ప్రోత్సహించారు. కొన్ని లఘు చిత్రాలు తెరకెక్కించా. 'బెస్ట్ యాక్టర్స్' అనే చిత్రాన్నీ తీశా. నా పొరపాట్లు తెలుసుకున్నాను. అనంతరం 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' చేసే చాన్స్ వచ్చింది. సప్తగిరితో ఇది రెండో సినిమా. ఆయనతో ఎన్ని సినిమాలు చేయడానికైనా సిద్ధమే.

సైనికులకు సలామ్

సుమన్, హరనాథ్, తమ్మారెడ్డి భరద్వాజ

హరనాథ్ కథానాయకుడుగా నటిస్తూ స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కెప్టెన్ రాణా ప్రతాప్'. సుమన్, నిషి, జ్యోతిరెడ్డి ఇతర ప్రధాన పాత్రధారులు. సోమవారం హైదరాబాద్‌లో తమ్మారెడ్డి భరద్వాజ ఆడియో సీడీలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "డాక్టర్‌గా ప్రాణాలు పోస్తున్నారు హరనాథ్ పొలిచర్ల. సినిమాలపై ఉన్న పిచ్చితో తెలుగు సినిమాలు తీస్తున్నారు. మన ప్రాణాలు కాపాడే సైనికుల కథతో ఈ చిత్రం తెరకెక్కించడం అభినందనీయం" అన్నారు. హరనాథ్ మాట్లాడుతూ "ఓ వీర జవాన్ చుట్టూ నడిచే కథ. జొన్నవిత్తుల రాసిన 'వీరసైనికా లేచిరా' పాట చిత్రానికి ప్రాణం. 21న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" న్నారు. "మేజర్‌గా మంచి పాత్రలో నటించాను. హరనాథ్‌కి విజయం దక్కాల"న్నారు సుమన్. గీత రచయిత జొన్నవిత్తుల, నిషి, ప్రాన్, వంశీ, వడ్డేపల్లి కృష్ణ, రవీంద్రనాథ్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు లేకపోతే కిక్కే లేదు

తాప్సీ

తొలి సినిమాతోనే కుర్రాళ్ల మనసుల్ని ఝుమ్మనిపించిన అందం... తాప్సీ. ఆ తర్వాత వరుసగా అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకొంది. హిందీలో వరుస విజయాలతో దూసుకెళుతున్నా... తెలుగుని మరిచిపోలేదు. ఆమె తాజాగా తెలుగు, తమిళ భాషల్లో నటించిన 'గేమ్ ఓవర్' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా తాప్సీ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది. ఆ విషయాలివీ...

నాయిక ప్రాధాన్య చిత్రాలే చేస్తున్నట్టున్నారు

సినిమా దర్శకుల మాధ్యమం. మిగిలిన వాళ్లంతా సినిమాకి పనిముట్లుగా ఉపయోగపడతాం. ఐదారేళ్లుగా దర్శకుల ఆలోచనలకి తగ్గట్టుగానే పనిచేస్తున్నా. 'గేమ్ ఓవర్' మొదలైన సమయంలో ఇది సోలో హీరోయిన్ కథ, దీన్ని నా భుజాలపైనే మోయాలనే విషయాలు గుర్తుకే రాలేదు. కానీ విడుదల దగ్గర పడుతున్నకొద్దీ ఒత్తిడి పెరిగింది.

'గేమ్ ఓవర్' చేయడానికి ప్రేరణ ఏంటి?

అశ్విన్ శరవణన్ స్క్రిప్టు ఆసక్తికరంగా అనిపించింది. వెంటనే నిర్మాత శశికాంత్‌తో సినిమా చేయడానికి సిద్ధం అని చెప్పా. ఇలాంటి కాన్సెప్టుని హాలీవుడ్‌లోనూ చూడలేదు. దర్శకుడు ఇదివరకు తమిళంలో చేసిన 'మాయ' తెలుగులో 'మయూరి'గా విడుదలైంది. నేనూ తమిళంలో 'కాంచన 2' తర్వాత సినిమా చేయలేదు. అలా ఈ సినిమాని తెలుగు, తమిళ భాషల్లో మొదలు పెట్టాం. అనురాగ్ కశ్యప్ ఈ సినిమాని చూసి హిందీతో పాటు విదేశాల్లోనూ విడుదల చేయాలని నిర్ణయించారు.

ఇందులో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

వీడియో గేమ్ ప్రోగ్రామ్ డిజైనర్‌గా కనిపిస్తా. సినిమాలో ప్రమాదానికి గురైన అమ్మాయిగా నటించాను. 60 శాతం వరకు వీల్ ఛైర్‌లోనే కనిపిస్తాను. ఆ ప్రమాదం ఎలా జరిగింది? ఏడాది తర్వాత మళ్లీ తన జీవితం ఎలాంటి ఆటుపోట్లకి గురైందన్నది తెరపైనే చూడాలి. శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎంతో శ్రమించాను. 25 రోజులు వీల్ ఛైర్‌లో కూర్చోవాల్సి వచ్చింది.

'బద్లా', 'పింక్' చిత్రాల్లో అమితాబ్ బచ్చన్‌తో పనిచేయడం ఎలా ఉంది?

అభిషేక్ బచ్చన్‌తో నటిస్తున్నప్పుడు ఎలా ఉంటుందో... అమితాబ్‌తో నటించడమూ అంతే. ఆయన బాగా కలిసిపోతుంటారు. మేమిద్దరం కలిసి చేయబోయే మూడో చిత్రం కూడా ఇలాగే విజయవంతం కావాలి.

'బద్లా'తో రూ.వంద కోట్ల నాయిక అయ్యారు. మీపై అంచనాలు పెరుగుతాయేమో..

అంచనాలు లేకపోతే నటుల జీవితంలో కిక్కే లేదు. సినిమా గురించి ప్రేక్షకులు ఎదురుచూడటం, మాట్లాడుకోవడం ఆనందాన్నిచ్చే విషయమే. ఇకపైనా నా ప్రతి సినిమా రూ.వంద కోట్లు సాధించాలి.

వాణిజ్య ప్రధానమైన చిత్రాలు... గ్లామర్ పాత్రలకి దూరమయ్యానని అనిపించిందా?

అందంగా కనిపించే కథానాయకులు చాలా మంది ఉన్నారు. భిన్నమైన కథల కోసం నాలాంటి నాయికల్ని ఎంపిక చేసుకుంటున్నారు. గ్లామర్ ప్రధానమైన పాత్రలు చేయడానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ అందులో కూడా మంచి కథ ఉండాలి.

తెలుగు నుంచి ఎలాంటి కథలస్తున్నాయి?

మంచి కథలు వస్తున్నాయి. అందుకే తప్పనిసరిగా ఇక్కడ ఏడాదికొక సినిమా చేస్తున్నా. ఈమధ్య కూడా మూడు కథలు విన్నాను. తమిళంలో ఒక సినిమా చేయడానికి ఒప్పుకొన్నా. తెలుగు సినిమా గురించి చర్చలు సాగుతున్నాయి.

నెంబర్ గేమ్‌లతో అలసిపోయాను. నీ స్థానం 3, 2 అంటూ! దగ్గరికి వచ్చేసరికి నువ్వు కాదు, మరొకరు అనేవాళ్లు (నవ్వుతూ). అందుకే ఆ పోటీ నుంచి నేను తప్పుకుని, ప్రత్యేకంగా నాదైన దారిని ఎంచుకొన్నా. ఇప్పుడు ఆ దారిలోనే నేనొక్కదాన్నే. దక్షిణాది ప్రేక్షకులకి సినిమాలపై ప్రత్యేకమైన ప్రేమ. ప్రతి వారం సినిమా కోసం ఎదురు చూస్తుంటారు. నటులపై ప్రేక్షకులకుండే ప్రేమ కూడా ఎక్కువే. హిందీలో అయితే సినిమా బాగుందంటేనే చూసొద్దామని థియేటర్‌కి వెళ్లే వాళ్లే ఎక్కువ. పరిశ్రమల మధ్య నేను గమనించిన తేడా అదే.

'ఆనంద భైరవి'లో గిరీష్ కర్నాడ్

'మాల్గుడి డేస్' ధారావాహికలో...

నాటకం నా ఆత్మ... సినిమా నా శరీరం!

గిరీష్ కర్నాడ్

'ధర్మచక్రం'

నాటక రంగం నుంచి వచ్చిన సినీ నటుల్ని ఒక్కసారి పరిశీలించండి. వాళ్ల నటన, భావోద్వేగాలు, పాత్రని ఆకళింపు చేసుకునే విధానం వేరుగా ఉంటుంది. 'ఇది నటనా?' అని ఆశ్చర్యపోయేంత సహజ సిద్ధంగా కనిపిస్తుంది. గిరీష్ కర్నాడ్ అలాంటి నటుడే. 'శంకర్ దాదా ఎంబీబీఎస్'లో కొడుకుని డాక్టర్‌గా చూసుకుని మురిసిపోయే తండ్రి పాత్రకీ, 'ధర్మచక్రం'లో కన్నకొడుకుపైనే కక్ష కట్టే స్వార్థపు తండ్రి పాత్రకీ ఎంత వ్యత్యాసం ఉందో కదా. ఆ వ్యత్యాసం పేరు... గిరీష్ కర్నాడ్. 'మెరుపు కలలు'లోని తండ్రి ఒకలా 'ప్రేమికుడు'లో తండ్రి మరోలా ఆలోచిస్తాడు. ఆ ఆలోచన పేరు... గిరీష్ కర్నాడ్. ఆ పేరులానే ఆయన పాత్రలూ గంభీరంగా సాగిపోతుంటాయి. గిరీష్ కవి, రచయిత, దర్శకుడు, అభ్యుదయవాది... ఇలా ఆయనలో ఎన్నో కోణాలున్నాయి. బహుముఖ ప్రజ్ఞాశాలి అనే పదానికి సిసలైన నిర్వచనం ఆయన. 'నాటకం నా ఆత్మ.. సినిమా నా శరీరం' అని చెప్పుకునే గిరీష్... ఇప్పుడు ఆత్మని ఇక్కడే ఉంచేసి, శరీరాన్ని వదిలేసి వెళ్లిపోయారు. ఆయన నడిచొచ్చిన దారి, చూపించిన మార్గం, వదిలి వెళ్లిన ఆలోచనలు ఆదర్శం.. అనుచరణీయం.

మహారాష్ట్రలోని మథేరన్‌లో 1938 మే 19న గిరీశ్ కర్నాడ్ జన్మించారు. ఉత్తర కన్నడలోని శిరిలో ప్రాథమిక విద్య, ధార్వాడలో డిగ్రీ చదివారు. విదేశాల్లో చదవాలన్న లక్ష్యంతోనే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేందుకు గణితాన్ని ప్రత్యేక సబ్జెక్టుగా ఎంచుకున్నారు. రోడ్స్ ఉపకార వేతనంతో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో రాజనీతి, ఆర్థిక శాస్త్రాల్లో ఎంఏ చదివారు. ఆ దశలోనే సాహితీవేత్తలు కీర్తినాథ్ గుప్త, శివరామ్ కారత్, జి.వి.జోషి తదితరులతో సాన్నిహిత్యం ఏర్పడింది. ధార్వాడలోని మనోహర గ్రంథాలయంలో సభ్యత్వం పొంది సాహిత్యం వైపు దృష్టి సారించారు. తన 23వ ఏటనే రచయితగా కన్నడ నాటకం 'యయాతి'తో భారతీయ పురాణాల్లోని పాత్రలను ఆధునిక సమాజానికి పరిచయం చేశారు. అనంతరం జానపదం, చరిత్రల్లోని పాత్రలతో వర్తమాన సమాజాన్ని మేలుకొలిపే ప్రయత్నం చేశారు. తుగ్లక్ (1964), హయవదన (1972), అంజుమల్లిగె (1977), హిట్టిన హంజ (1980), నాగమండల (1988), తలదండ (1990), అగ్ని మత్తు మాలే (1995), మదువె అల్లం (2006), ఫ్లవర్, బెంద కల్లు అన్‌టోల్డ్ (2012) లాంటి నాటకాలను వెలువరించి విశేషంగా ఆకట్టుకున్నారు. కన్నడంలోనే కాకుండా తన సాహిత్యాన్ని హిందీ, ఆంగ్ల భాషలకూ పరిచయం చేశారు. కన్నడం తర్వాత గిరీశ్‌కు అంతటి పేరు తెచ్చిన రచనలు ఆంగ్లంలోనే ఉన్నాయి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రెస్ మేనేజర్‌గా పని చేసిన గిరీశ్ కర్నాడ్ రచనపై ఆసక్తితో రాజీనామా చేశారు. ఆయన నాటకాల ఆధారంగా రూపొందిన నాటకాలు విదేశాల్లోనూ ప్రదర్శితమయ్యాయి. రంగస్థలంలో చేసిన సాహిత్య సేవకు 1998లో ఆయన్ను జ్ఞానపీఠ్ పురస్కారం వరించింది. నాటక రంగంలో సాహిత్య సేవకు జ్ఞానపీఠ్ అందుకున్న ఏకైక రచయిత గిరీశ్ కర్నాడ్ కావటం విశేషం.

నాటక రచనే నా జీవన సర్వస్వం

నటన, దర్శకత్వం కంటే తనకు నాటక రచనే ప్రీతిపాత్రమైందని ఒకానొక సందర్భంలో తన మనసులో మాట బయట పెట్టారు గిరీష్. సమాంతర సినిమా మొదలుకొని కమర్షియల్ చిత్రాల వరకూ ఎన్నింటి కోసమో ముఖానికి రంగేసుకున్నా అవి పొట్ట నింపడానికే తప్ప నాటక రచనలా మనసు నింపలేకపోయాయని గిరీష్ చెప్పేవారు. "గతంలో నేను నటించిన చిత్రాలను చూసుకున్నప్పుడు ఏమిటీ నేను నటించడానికి ఇంతలా ఇబ్బందిపడ్డాను అనిపిస్తుంది. నేను రాసిన తొలి కన్నడ నాటకం 'యయాతి'ని గుర్తు చేసుకుంటే ఎంత బాగా రాశానో అనిపిస్తుంటుంది. అందులోని వసివాడని వసివాడితనం నా చిత్రాల్లో ఎందుకు లేదనే బాధ నన్ను వెంటాడుతుంది. ఏది ఏమైనా నాటక రచనే నా జీవన సర్వస్వం. నటిస్తున్నా... దర్శకత్వం వహిస్తున్నా నా అంతరాంతరాల్లో నాటక రచనకు సంబంధించిన ఆలోచనల ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది" అని ఓ సందర్భంలో చెప్పారు గిరీష్.

సినిమాలవైపు...

డబ్బు సంపాదించేందుకు చలన చిత్ర రంగం.. ఆత్మ సంతృప్తి కోసం రంగస్థలాన్ని వేదికగా మార్చుకున్నానంటారు గిరీష్. 1970లో విఖ్యాత కన్నడ సాహితీవేత్త యు.ఆర్.అనంతమూర్తి రచించిన 'సంస్కార' ఆధారంగా తీసిన చిత్రంతో నటుడిగా ఆయన చిత్రరంగానికి పరిచయం అయ్యారు. 1971లో కన్నడ చిత్రం 'వంశ వృక్ష'కు దర్శకత్వం వహించి తొలి చిత్రంతోనే గొప్ప గుర్తింపు పొందారు. నటుడిగా కళాత్మక చిత్రాలే కాదు.. వ్యాపార విలువలున్న చిత్రాల్లోనూ నటించారు గిరీశ్. జీవనోపాధి కోసం చిత్రాల్లో నటిస్తూనే తనకు ఇష్టమైన రచయితల కథలకు దర్శకత్వం వహిస్తూ, తన సాహిత్య పరంపరనూ కొనసాగించారు. కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మలయాళ చిత్ర రంగాల్లో గిరీశ్ కర్నాడ్ పరిచయం అక్కరలేని నటుడిగా, దర్శకుడిగా మారారు. తన జీవిత కాలంలో 13 సినిమాలకు దర్శకత్వం వహించి 92 చిత్రాల్లో నటించారు. తెలుగులో ఆనంద భైరవి, శంకర్‌దాదా ఎంబీబీఎస్, ధర్మచక్రం, ప్రేమికుడు, రక్షకుడు, కొమరం పులి లాంటి చిత్రాల్లో నటించారు. 'మృచ్ఛకటికం' అనే సంస్కృత నాటకం ఆధారంగా ఆయన దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'ఉత్సవ్' ఓ అద్భుత దృశ్యకావ్యంగా నిలిచి గిరీష్ కర్నాడ్ కళాత్మక హృదయానికి అద్దం పట్టింది. ఆయన చివరిగా కనిపించిన చిత్రం 'టైగర్ జిందా హై'. కన్నడ చిత్రం 'అప్పా దేశీ' విడుదల కావాల్సి ఉంది. ఆర్కే. నారాయణ్ 'మాల్గుడి డేస్'లో గిరీష్ నటన మర్చిపోలేం. ఆయన పరిచయం చేసిన నటులు కన్నడ నటులు విష్ణు వర్ధన్, శంకర్ నాగ్‌తో పాటు అమ్రిశ్ పురి, ఓంపురి, శేఖర్ సుమన్, సోనాలి కులకర్ణి లాంటి వారు ఉన్నారు.

పురస్కారాల రారాజు

గిరీశ్ కర్నాడ్ అందుకోని పురస్కారం లేదంటే అతిశయోక్తి లేదు. సాహిత్యంలో జ్ఞానపీఠ్ మొదలుకుని పద్మశ్రీ, పద్మభూషణ్, కన్నడ సాహిత్య పరిషత్తు, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, కాళిదాస సమ్మాన్, రాజ్యోత్సవాలతో పాటు యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా పురస్కారాలు అందుకున్నారు. తాను తొలిసారిగా దర్శకత్వం వహించిన 'వంశ వృక్ష'తో ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. ఆయన స్క్రిప్ట్‌పై అందించిన 'భూమిక', 'చెలువె' చిత్రాలకు జాతీయ పురస్కారాలు లభించాయి. నటుడిగా, దర్శకుడిగా 6 ఫిల్మ్‌ఫేర్, 5 రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. వీటితో పాటు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అందించే గుబ్బి వీరణ్ణ, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పురస్కారాలు అందుకున్నారు.

పోరాట స్ఫూర్తి

ఎనిమిది పదుల వయసు దాటినా గిరీశ్ కర్నాడ్‌లో ఆ ఛాయలు కనిపించేవి కావు. రచయితగా, దర్శకుడిగా, నటుడిగా రాణిస్తూనే, దేశవ్యాప్తంగా హేతువాదులు, లౌకిక వాదులు చేపట్టే ఆందోళనల్లో తన గొంతు వినిపించేవారు. 2017లో ప్రముఖ కన్నడ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య తర్వాత మత ఛాందసంపై సాహితీవేత్తలంతా సాగించిన ప్రతి పోరాటంలోనూ గిరీశ్ పాత్ర ఉంది. అప్పటికే ఆరోగ్యం క్షీణించినా కృత్రిమ శ్వాస ద్వారానే సామాజిక సమస్యలపై పోరాడుతూ తన చివరి సినిమా 'టైగర్ జిందా హై'లోనూ అనారోగ్యంతోనే నటించి కళలు, సమాజం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు.

– ఈనాడు డిజిటల్, బెంగళూరు

ప్రేమ రిస్కే

రవిచంద్ర, సాయి శ్రీవి, యుగేష్

రవిచంద్ర, యుగా యుగేష్, సాయి శ్రీవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఇష్క్ ఈజ్ రిస్క్'. రాజ్‌కింగ్ దర్శకుడు. ఎన్.చంద్రశేఖర్ నిర్మాత. చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమని కొత్త కోణంలో ఆవిష్కరించే కథ ఇది. ప్రేమలోని సవాళ్లను హాస్యభరితంగా చూపించబోతున్నాం" అన్నారు. కథా బలమున్న చిత్రమిదన్నారు నిర్మాత. జీవా, చమ్మక్‌చంద్ర, తాగుబోతు రమేష్, నల్లవేణు, బండ రమ, మాధవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జగన్.ఎ, సంగీతం: డేవిడ్.

వసుంధర

ఉదయం అయిదు గంటలు... సూరీడు అప్పుడే తన వెలుగులు విరజిమ్ముతూ బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఊరంతా నిర్మానుష్యంగా ఉంది. ఆ సమయంలో గ్రామంలో రయ్... రయ్... మంటూ స్కూటీల చప్పుడు. ఓ మహిళా రైతు పితికిన పాలను కేంద్రంలో పోసేందుకు వెళుతోంది. మరో మహిళా రైతు తన తోటలో నీళ్లు పారించేందుకు బయలుదేరింది. జగిత్యాల జిల్లాలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఈ స్కూటీల సందడి రోజంతా కనిపిస్తుంది.

మహిళా రైతులు... రైడింగ్ రాణులు

జగిత్యాల పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీపూర్ గ్రామం అన్ని రంగాల్లోనూ ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికే సాగులో అధిక దిగుబడి సాధించారు. గ్రామంలో సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకుని పంట ఉత్పత్తులను రైతులే విక్రయిస్తూ గుర్తింపు పొందారు. ఆ ఊరి పేరునే బ్రాండ్‌గా మార్చి బియ్యాన్ని అమ్ముతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇప్పుడు ఎక్కడా లేని విధంగా గ్రామంలో మహిళా రైతులు స్కూటీలు నేర్చుకొని వారే స్వయంగా పొలాలకు వెళ్లి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 100 వరకు స్కూటీలు ఉన్నాయి. ఇక్కడ అయిదు వేల జనాభా, 1500 కుటుంబాలున్నాయి. ఇందులో వ్యవసాయాధారిత కుటుంబాలు 1200. వీళ్ల పసుపు, మొక్కజొన్న, వరి, కూరగాయలను సాగు చేస్తున్నారు. మిగతా గ్రామాలతో పోల్చుకుంటే ఈ ఊరిలోని మహిళా రైతులు పూర్తిగా భిన్నం. నాట్లు వేయటం, కలుపు తీయటం, నీళ్ల పారించడం, మందులు పిచికారి చేయడం, కూరగాయలు తెంపడం, మార్కెట్లో అమ్మడం ఇలా అన్ని పనుల్లో పురుషులతో పోటీగా పాల్గొంటున్నారు. ఒకప్పటితో పోలిస్తే కూలీలను పిలవడం, వారిని పొలం దగ్గరికి చేర్చడం, కూరగాయలను మార్కెట్లో విక్రయించడం, పశువులకు మేతను తీసుకురావడం... ఇలా స్కూటీతో చేయగలిగిన అన్ని పనులు చేస్తున్నారు. సులభంగా నేర్చుకోవడానికి వీలుండడం, సమయం కలిసి వస్తుండటంతో గ్రామంలో ఎక్కువ మంది మహిళా రైతులు స్కూటీలు నడపడం నేర్చుకుంటున్నారు.

మా పనులు మేమే చేసుకుంటాం...

-యాళ్ల పద్మ

గతంలో మేం తోటలోకి వెళ్లడానికి కాలి నడకన లేదంటే మగవాళ్ల ద్విచక్రవాహనాలపై దింపాల్సి వచ్చేది. ఇప్పుడు స్కూటీలు నేర్చుకోవడంతో మా పని మేమే చేసుకుంటున్నాం. కూలీలను పిలవడానికి, పంట పొలాల్లోకి చేరుకోవడానికి ఇలా ప్రతి విషయంలో సమయం ఆదా అవుతోంది. ఒకరిని చూసి ఒకరు స్కూటీలను కొనుక్కుని నేర్చుకుంటున్నారు.

మా ఊరు అన్నింట్లో ముందే...

-పన్నాల మమత

గ్రామంలో అందరం కలిసిమెలిసి ఉంటాం. ఇక్కడ రైతులు ఆధునిక పద్ధతులు ఉపయోగిస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. మహిళా రైతులం పురుషులకు ఎందులో తక్కువ కాదు అని నిరూపించుకుంటున్నాం. వ్యవసాయ పనులకు రోజూ స్కూటీలనే ఉపయోగిస్తున్నాం.

-గుమ్మడి గంగాధర్, జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే

కాలం ఏదైనా విరబూసిన పూలు వర్ణవైవిధ్యంతో ఆకట్టుకుంటాయి. అదే ఇప్పటి ఫ్యాషన్. ఆకులు, కొమ్మలు, మొగ్గలు, లతలు... వంటివన్నీ దుస్తుల్లోనే కాదు నగలు, ఇతర యాక్సెసరీల్లోనూ అందంగా అల్లుకుపోతున్నాయి. వాటిని ఎలా ఎంచుకోవాలో తెలిస్తే మనమూ మెరిసిపోవచ్చు. ఆ సూచనలే చెబుతున్నారు డిజైనర్ నిహారికారెడ్డి.

పూల ఫ్యాషన్... పులకరించే!

లేత వర్ణాలపైనే కాదు... ఇప్పుడు ముదురు రంగులపైనా పూల సొగసు ముచ్చటగా కనిపిస్తుంది. పట్టుచీరల నుంచి క్యాజువల్‌వేర్ వరకూ అన్నింటిపైనా వీటిదే పై చేయి. కాంటెంపరరీ నగల నుంచి ఖరీదైన వజ్రాభరణాలవరకు, కాళ్ల చెప్పుల నుంచి చెవిపోగుల వరకూ అన్నింటిపైనా ఈ పూలతలు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి.

- కాస్త సన్నగా కనిపించాలనుకునేవారికి సింథటిక్, క్రేప్, జార్జెట్, షిఫాన్ బాగుంటాయి అనేది తెలిసిందే. ఆ వస్త్రాలపై పూలతలు ఉండేలా చూసుకుంటే ట్రెండ్‌ని అనుసరిస్తున్నట్లే. పట్టు చీరలు, లినెన్ వంటి వస్త్రాలపైనా ఫ్లోరల్ డిజిటల్ పెయింటింగ్, ప్రింట్లు ఆకట్టుకుంటున్నాయి.
- బరువుగా ఉండే కాటన్ సిల్క్, రాసిల్క్ వంటివాటిపైనా పూల అందాలు రెట్టింపు మెరుపుని తెచ్చిపెడుతున్నాయి. అందుకే నవవధువులు వీటిని ఎంచుకుంటున్నారు. నేలను తాకే గౌన్లు, లెహెంగాలుగా కుట్టించుకుంటున్నారు. ఇవి రిసెప్షన్లు, మెహందీ వేడుకలకు చక్కగా నప్పుతాయి.
- పూల అందాలకు కాస్త ఆధునికత జోడిస్తే చాలు... ఎలాంటివారికైనా బలే నప్పుతాయివి. ఈ రెండింటి మేళవింపుతో ఎంచుకునే ఇండో వెస్టర్న్ డ్రెస్‌లు కార్పొరేట్ స్టైలికి బాగుంటాయి. సాదా రంగులో క్రాప్ స్టైల్ టోతోప్యాంట్-టాప్‌లకు జతగా పొడవాటి ఫ్లోరల్ జాకెట్‌తో ట్రెండీగా కనిపించొచ్చు.
- కాలేజీ అమ్మాయిలు ఫ్లోరల్ ప్రింట్లని వైవిధ్యంగా ప్రయత్నించొచ్చు. సాదా రంగు డ్రెస్ చేతుల అడుగున ఫ్లోరల్ బెల్ట్స్ పెట్టించుకుని, జతగా అదే రంగు పూల ప్రింటున్న పలాజో వేసుకుంటే చాలు. మోకాలివరకూ ఉండే పూల గౌన్లు కాలేజీకి వేసుకెళ్లొచ్చు. బాక్స్ ప్లీటెడ్ పూల స్కర్టు మీదకు సాదా బ్లవుజు నప్పుతుంది. ఫ్లోరల్ లాంగ్ స్కర్టు మీదకు అంచులుండే పూల ఎంబ్రాయిడరీ దుపట్టా మెప్పిస్తుంది.
- పార్టీవేర్‌గా ప్రింటెడ్ ఫ్లోరల్ కంటే ఎంబ్రాయిడరీ రకాలు అదిరిపోతాయి. ఆడంబరంగా కనిపించే పట్టు చీరపై భారీ ఎంబ్రాయిడరీ బ్లవుజు అంతగా నప్పదు. ఇలాంటప్పుడు చేతులపై ఓ గీతలా పూల ఎంబ్రాయిడరీని చేయించుకుని చూడండి.
- చిన్నచిన్న పార్టీలకు... హ్యాండ్‌లూమ్, బాడీ వంటి చీరలు ఎంచుకుని, పూల డిజైను ఉన్న బ్లవుజులు వేసుకోవచ్చు. అనార్కలీ డ్రెస్ మెడ దగ్గర ఫ్లోరల్ త్రెడ్ ఎంబ్రాయిడరీ చేయించుకుని వేసుకోవచ్చు. సాదా డ్రెస్ ఉన్నప్పుడు... భుజం, మెడ, చేతుల దగ్గర ఫ్లోరల్ త్రెడ్‌వర్క్ బాగుంటుంది. కాప్రాన్, ట్యూనిక్‌లను అచ్చంగా పూలడిజైనుతోనే ఎంచుకోవచ్చు.
- రెట్రో స్టైల్ బ్లవుజులు, లినెన్, పట్టు, బాడీ వంటి చీరలపై కంప్యూటర్ పూల ప్రింట్లు, హ్యాండ్ పెయింటింగ్‌లు ఇప్పుడు హాట్‌స్టా ట్రెండ్. ఇవి ప్రత్యేక సందర్భాలకు చక్కని ఎంపిక.
- నగలు- యాక్సెసరీల విషయానికి వస్తే... ఏ ఫ్లెయిన్ దుస్తులు మీదకయినా ఫ్లోరల్ స్టడ్స్, నగలు బాగుంటాయి. చిన్న చిన్న పూలతో చేసిన గొలుసులు పార్టీలుక్‌ని తెచ్చిపెడతాయి. అచ్చంగా దుస్తులు పూల పనితనంతోనే ఉంటే... బెల్ట్, హ్యాండ్‌బ్యాగ్, చెప్పులు కూడా అదే డిజైనులో ప్రయత్నించొచ్చు.

అతడితో వేగలేకపోతున్నా!

నేను ప్రభుత్వ టీచరుగా పనిచేస్తున్నా. పెళ్లయిన ఏడాది వరకు నా భర్త బాగానే ఉన్నాడు. పాప పుట్టాక చిన్న చిన్న విషయాలకి సైతం నన్ను అనవసరంగా కొడుతున్నాడు. పెళ్లికి ముందు నుంచే అతడికి మరో అమ్మాయితో అక్రమ సంబంధం ఉంది. దాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నాడు. కొడుకుని మందలించాల్సిన అత్త అతడికి సహకరిస్తోంది. నేను వెళ్లిపోతే అమెనిచ్చి పెళ్లి చేస్తానని బెదిరిస్తోంది. పాప మొదటి పుట్టినరోజు జరిగిన మర్నాడే అతడు తీవ్రంగా కొట్టడంతో పుట్టింటికి వచ్చేశా. ఫోన్ చేసి అసభ్యంగా తిడుతున్నాడు. నేనిక అతనితో బతకలేను. పోలీసులకు ఫిర్యాదు చేయాలనుకుంటున్నా. అతడు నాతో మాట్లాడిన ఫోన్ రికార్డులు ఆధారాలుగా ఉన్నాయి. అతడిపై ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయొచ్చు? సలహా ఇవ్వగలరు.

- ఓ సోదరి

✔ మీ సమస్య గృహహింస నిరోధక చట్టం పరిధిలోకి వస్తుంది. నాలుగ్గోడల మధ్య కుటుంబ సభ్యులపై జరిగే శారీరక, మానసిక హింసను గృహహింసగా పరిగణిస్తారు. అది కేవలం మహిళలకే పరిమితం కాదు. తల్లిదండ్రులు, భర్త, పెద్దలు, పిల్లలు...అందరికీ వర్తిస్తుంది. మీరు ఇక అతనితో కలిసి బతకలేనని అనుకుంటే హిందూ వివాహచట్టం సెక్షన్ 13(1)ఎ ప్రకారం క్రూరత్వానికి రుజువులు చూపి విడాకులు పొందవచ్చు. మీరు ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు కాబట్టి మీకు భరణం రాదు. మీ పాప భవిష్యత్తు కోసం మెయింటెనెన్స్ అడగొచ్చు. సెక్షన్ 13(1)ప్రకారం పెళ్లి అయిన భర్త/భార్య... ఇతరులతో అక్రమ సంబంధం పెట్టుకుంటే దాన్ని కారణంగా చూపి విడాకులు పొందవచ్చు. దాన్ని క్రిమినల్ నేరంగా చూపకూడదని 2018లో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. మిమ్మల్ని మీ భర్త కొట్టిన, తిట్టిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి ఉండాల్సింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మీరు రికార్డు చేసిన ఆడియో క్లిప్పింగులని ఆధారంగా చూపించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. ఒకవేళ కేసు రిజిస్టర్ చేయకపోతే నేరుగా అసాల్ట్ కింద ప్రైవేట్ కంప్లయింట్ కోర్టులో ఫైల్ చేయొచ్చు. నేర నిరూపణకి మీ దగ్గర గట్టి సాక్ష్యాధారాలు ఉండాలి. మిమ్మల్ని శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడని గృహహింస నిరోధక చట్టం కింద పోలీస్‌స్టేషన్‌లోని ప్రొటెక్షన్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేయండి. అక్కడి నుంచి పంపిన రిపోర్టు ఆధారంగా అతని మీద డీపీసీ కేసు నమోదు చేయొచ్చు. దానిలో మీ అత్తమామల్నీ ప్రతివాదులుగా చేర్చవచ్చు. గృహహింస చట్టంలోని సెక్షన్‌లు 18,19,20,21,22 కింద ప్రొటెక్షన్ ఆర్డర్, రెసిడెన్స్ ఆర్డర్, మానిటరీ బెనిఫిట్స్, వైద్యఖర్చులు, మీ దగ్గర నుంచి తీసుకున్న డబ్బు, వస్తువులు, పిల్లల సంరక్షణ కోసం భత్యం వంటివన్నీ పొందవచ్చు. సెక్షన్ 21 కింద కస్టడీ కోసం, సెక్షన్ 22 ప్రకారం కాంపన్సేషన్ అంటే ఇన్నాళ్లు మీరు పడ్డ మానసిక, శారీరక బాధలకు ధనరూపంగా తిరిగి పొందవచ్చు. ముందుగా డీపీసీ కేసు వేసి తరువాత విడాకుల కేసు వేయండి. మీ నుంచి విడాకులు అతడు కోరుకుంటున్నదే కాబట్టి దాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవచ్చు. ఈ కేసులో అతనిమీద నేరం నిరూపణ అయితే మీకు రావలసిన సొమ్ము వస్తుంది. మీకు విడాకులు తీసుకోవడానికి కారణం కూడా నిరూపితమవుతుంది. వరకట్నం కింద కేసు పెట్టొచ్చు. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 498ఎ కింద మిమ్మల్ని అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తుంటే దానికి తగిన సాక్ష్యాధారాలు ఉంటే ఆ కేసూ పెట్టండి కానీ తప్పుడు కేసులు మాత్రం వద్దు. దేనికైనా ముందు కౌన్సెలింగ్ చేస్తారు. మీకు న్యాయం జరుగుతుంది.

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి
న్యాయవాది

మీ ప్రశ్నలు ఇరవై vasulegal@eenadu.net కు పంపించగలరు.

స్పినాచ్ టోస్ట్

అమ్మచేత కమ్మగా

కావల్సినవి: బ్రెడ్‌స్లైసులు - ఆరు, వెన్న - పావుకప్పు, ఉడికించిన బంగాళాదుంప ముద్ద - ముప్పావుకప్పు, పచ్చిమిర్చి - రెండు (సన్నగా తరగాలి), పాలకూర తరుగు - ఆరకప్పు, అమ్‌చూర్‌పొడి, కారం, చాట్‌మసాలా - అరచెంచా చొప్పున, గరంమసాలా - పావుచెంచా, ఉప్పు - తగినంత, నువ్వులు - పెద్ద చెంచా.

తయారీ: ఓ గిన్నెలో బంగాళాదుంప ముద్ద తీసుకోవాలి. అందులో పచ్చిమిర్చి తరుగు, పాలకూర తరుగు, అమ్‌చూర్‌పొడి, చాట్‌మసాలా, కారం, గరంమసాలా, ఉప్పు వేసి కలపాలి. బ్రెడ్‌స్లైసులపై ఈ మిశ్రమాన్ని పరిచి, కొన్ని నువ్వుల్ని చల్లి, నొక్కినట్లు చేయాలి. ఇప్పుడు పొయ్యిమీద పెనం పెట్టి... కొద్దిగా వెన్న రాయాలి. దీనిపై రెండు బ్రెడ్‌స్లైసుల్ని ఉంచి, ఎర్రగా కాల్చాలి. ఇలా మిగిలినవీ చేసుకుంటే చాలు.

బంగారం వెండి

10న ముగింపు-క్రితం

	తమిళనాడు (రూ. లలో)	
అర్మెంట్ (గ్రా)	3,111	3,142
వెండి (గ్రా)	39.90	40.31

	హైదరాబాద్		విజయవాడ		ఫ్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24 క్రా)	33,630	33,880	33,610	33,880	33,550	33,650	33,630	33,880	33,490	33,690
అర్మెంట్	31,410	31,640	31,150	31,400	30,970	30,110	31,130	31,420	31,150	31,340
వెండి(కిలో)	37,750	38,254	38,900	38,300	37,900	38,300	37,800	38,300	38,000	38,000

ఉద్యోగినులకు వ్యాయామం చేసేందుకు సమయం ఉండదనేది వాస్తవమే. అలాగాని వ్యాయామాన్ని పూర్తిగా పక్కన పెట్టేయాలని లేదుగా. దినచర్యలో భాగంగానే కొన్ని కసరత్తులు చేయొచ్చు. ఎలాగంటే...

ఇరవై నిమిషాలు చాలు!

- పనిలో భాగంగా ఫోను మాట్లాడుతున్నారా... కూర్చోకుండా అటూ ఇటూ తిరుగుతూ మాట్లాడండి. ఈ సూత్రం ఆఫీసులోనే కాదు... ఇంటికీ వర్తిస్తుంది. ప్రతి రెండుగంటలకోసారి కుర్చీలోంచి లేచి రెండు నిమిషాలైనా నడవండి. అవకాశం వచ్చినప్పుడల్లా నిల్చునేందుకు, నడిచేందుకు ప్రయత్నించండి. నడుముభాగంలో కొవ్వు పేరుకోకుండా ఉంటుంది.
- నిల్చున్నా, కూర్చున్నా నిటారుగా ఉన్నారా లేదా అనేది గమనించుకోండి. అదేపనిగా కూర్చోవడం వల్ల కండరాలు అలసిపోతుంటాయి కాబట్టి రోజులో కనీసం రెండుసార్లు స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి.
- మీ దినచర్యలో ఇరవైనిమిషాలు వ్యాయామం కోసం పెట్టుకోండి. నడవండి లేదా ఫిట్‌నెస్ నిపుణుల సలహాతో కొన్ని వ్యాయామాలు చేసేలా చూడండి. మీకంటూ ఓ క్రమశిక్షణ అలవడుతుంది. వ్యాయామం మానేసే పరిస్థితి ఉండదు.

- వ్యాయామం వల్ల ఫలితం కలగాలంటే... ఆహారంపైనా దృష్టి పెట్టాలి. ముందు పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంటి ఆహారం తినడం, వీలైనంతవరకూ పండ్లు, కూరగాయలు ఎంచుకోవడం, నీళ్లు ఎక్కువగా తాగడం.. వంటివన్నీ మీకెంతో మేలుచేస్తాయి.

ప్రవేశపరీక్షల ర్యాంకులు ప్రకటించేశారు. ఇప్పుడు ఇంజినీరింగ్ అభ్యర్థులకు కొత్త ప్రశ్న ప్రారంభమైంది. ఇష్టమైన బ్రాంచి తీసుకోవాలా... మంచి కాలేజీలో చేరాలా? చిక్కు సమస్యే. ఒక్కొక్కరూ ఒక్కోరకంగా చెబుతుంటారు. ఎటూ తేల్చుకోలేని సందిగ్ధత. ఇది ఏటా అందరికీ ఎదురయ్యే ఇబ్బందే. నిజానికి రెండూ ముఖ్యమే. కానీ మనకున్న అవకాశాలూ, మన ఇష్టానిష్టాలు, భవిష్యత్తు... ఇంకా ఇతర అంశాలను బేరీజు వేసుకొని అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలి. విద్యార్థుల అభిరుచులు, ఆసక్తులను ప్రధానంగా పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేసుకోవాలి.

చదువు

10

ఈనాడు

కరీంనగర్

మంగళవారం జూన్ 11, 2019

■ e-mail: edc@eenadu.in

అడుగేసే ముందు.. అన్నీ చూసుకో!

ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్‌లో చేరాలనుకునే అభ్యర్థులు, తల్లిదండ్రుల ముందు ఎన్ని రకాల ప్రశ్నలు... మంచి కళాశాలలో చేరాలా.. నచ్చిన బ్రాంచిని ఎంచుకోవాలా? ఏ కాలేజీ మంచిదో ఎలా తెలుస్తుంది? ఏ బ్రాంచి తీసుకోవాలి? ఇప్పుడు అవకాశాలు బాగా ఉన్న బ్రాంచిలకి తర్వాత భవిష్యత్తు బాగుంటుందా? ఫలానా బ్రాంచి తీసుకుంటే చదవగలుగుతారా? ఈ సందేహాలతోపాటు ఏ ర్యాంకుకి ఏ కాలేజీలో సీటు వస్తుంది? అయ్యో.. ఆ బ్రాంచి రావాలంటే ఇంకా మంచి ర్యాంకు కావాలి కదా? కాలేజీ ముఖ్యం అనుకుంటే కావాల్సిన బ్రాంచి అందడం లేదు. బ్రాంచి ప్రధానం అని భావిస్తే కాలేజీ సరిగా ఉండటం లేదు. ఏం చేయాలి? ఏమీ పాలుపోవడం లేదు. టాప్ ర్యాంకర్లు మినహా మిగతా అభ్యర్థులందరూ దాదాపు ఇవే ప్రశ్నలతో సతమతమవుతుంటారు. ఇంత గందరగోళానికి గురికావాల్సిన పనిలేదు. మనకి ఏం కావాలో తేల్చుకోడానికి కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటి ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవచ్చు.

ఏ విషయం గురించి తెల్సుకోవాలన్నా.. అన్నీ వ్యక్తిగతంగా తెలుసుకోవాలి. సీనియర్లతో మాట్లాడాలి. కాలేజీలకు సంబంధించి తెలిసిన అన్ని వివరాలను పరిశీలించాలి. ప్రాంగణాలను సందర్శించాలి. మౌలికవసతులను గమనించాలి.

మరికొన్ని అంశాలు

కాలేజీ, బ్రాంచిల్లో ఏది ముఖ్యమని నిపుణులను ప్రశ్నిస్తే రెండూ అనే సమాధానమే ఎక్కువగా వస్తోంది. కాస్త వివరంగా చెబితే.. కొద్దిగా కాలేజీ వైపు మొగ్గు చూపుతున్నారు. మంచి వసతులు ఉన్న కాలేజీ అయితే ఏ బ్రాంచి అయినా పర్వాలేదని చెబుతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఫలానా బ్రాంచినే కావాలని పట్టుబట్టడం సమంజసం కాదంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఒక్కటే కాకుండా కోర్ బ్రాంచిలైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ తదితరాలకు సంబంధించి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు జరిగే కాలేజీలను ఎంచుకోవడం మంచిదంటున్నారు.

కాలేజీలు ఏర్పాటు చేసుకునే కన్సల్టెంట్ల మాయలో పడకుండా ఉండటం మరో ముఖ్యమైన అంశం. కమిషన్ల కోసం అభ్యర్థులను ప్రలోభ పెట్టే అవకాశాలు ఉన్నాయి. వాళ్లు చెప్పిన ఏ విషయాన్నైనా గుడ్డిగా నమ్మకుండా స్వయంగా చెక్ చేసుకోవాలి.

ఏ రంగంలో పనిచేయాలనుకుంటున్నారనే అంశం కూడా బ్రాంచి నిర్ణయంపై ప్రభావం చూపుతుంది. ఇంజినీరింగ్ అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. సీఎస్ఈ, ఐటీ వంటివి తీసుకుంటే విదేశాలు, ప్రైవేటు రంగాల్లో అవకాశాలు ఎక్కువ. కానీ రెండు రంగాల్లోనూ ఉద్యోగాలు వెతుక్కోవాలని భావించే వారికి మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ బ్రాంచిలు ఉత్తమం.

అరుదైన బ్రాంచిలను ఎంచుకుంటే అవకాశాలు తక్కువై అటూ ఇటూ కాకుండా పోతామనే అపోహ కూడా చాలామందిలో కనిపిస్తుంది. ఇది నిజం కాదు. సాఫ్ట్‌వేర్, కోర్ బ్రాంచిల తర్వాత ముఖ్యమైన ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమికల్ ఇంజినీరింగ్, నావెల్ ఆర్కిటెక్చర్ అండ్ మెరైన్, జియోఇన్‌ఫర్మేటిక్స్ వంటి వాటిని ఎంచుకుంటే అవకాశాలు ఉన్నాయి. తక్కువ సీట్లు ఉండటం వల్ల ఈ నిపుణులకు డిమాండ్ ఎక్కువగానే ఉంది. పరిశ్రమల అవసరాలను, ప్రస్తుత ధోరణులను పరిశీలించి అభ్యర్థుల అభిరుచులు, ఆసక్తులకు అనువైన మార్గాన్ని ఎంచుకోవడం అన్ని విధాలుగా ఉత్తమం.

ఇంజినీరింగ్ బ్రాంచా.. కళాశాలా?

బ్రాంచీ ముఖ్యమని భావిస్తే..!

ఎంత ఆలోచించినా ఏ బ్రాంచి తీసుకోవాలి అనేది ఎంతకీ తెగని సమస్యగా కనిపిస్తుంది. కానీ కొన్ని వివరాలను సేకరించుకోవడం ద్వారా ఒక మంచి నిర్ణయానికి రావచ్చు. మొదట అందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే మంచి బ్రాంచి, చెడ్డ బ్రాంచి అని ఏదీ లేదు. దేని ప్రత్యేకత దానిదే. విద్యార్థుల అభిరుచులు, ఆసక్తులు, భవిష్యత్తులో తాము ఏం చేయాలనుకుంటున్నారనే అంశాల ఆధారంగా మాత్రమే నిర్ణయం తీసుకోవాలి. ఇంజినీరింగ్‌లో వందల సంఖ్యలో స్పెషలైజేషన్లు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్, ఆటోమొబైల్ వంటి మౌలికమైన బ్రాంచిలు దాదాపు అన్ని కళాశాలల్లో ఉన్నాయి. కొన్ని కాలేజీలు, ప్రైవేటు యూనివర్సిటీలు కొత్త కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నాయి. అన్నింటినీ పరిశీలించాలి.

ఫలానా బ్రాంచి తీసుకుంటే జీతాలు ఎక్కువనే అపోహలు ఉన్నాయి. ఆ బ్రాంచిలో చేరిన అందరికీ అలాంటి జీతాలు లేవనే సత్యాన్ని గ్రహించాలి. నిజానికి ఏ ఇంజినీరుకైనా పెద్ద జీతం అందుతోందంటే అందులో బ్రాంచి గొప్పదనం కన్నా ఆ అభ్యర్థి శ్రమే ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని విస్మరించకూడదు. నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఏ బ్రాంచిలో ఇంజినీరింగ్ చేసినా మంచి జీవితాన్ని అందుకోవచ్చు. అందుకే అభిరుచులకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలి.

ఇప్పుడు ఈ బ్రాంచికే డిమాండ్ అంటూ కొందరు ప్రచారం చేస్తుంటారు. అలాంటి వాటిని అసలు నమ్మవద్దు. ఇప్పుడు డిమాండ్ ఉంటే నాలుగేళ్ల తర్వాత ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కానీ ప్రతి బ్రాంచికి ప్రత్యేకమైన డిమాండ్ ఉంటుంది. అందులో విద్యార్థి శ్రమతో సాధించుకునే నైపుణ్యాల ఆధారంగానే ఉద్యోగ జీవితం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్ తదితరాలు ఉద్యోగసాధనలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

ఏ బ్రాంచిలైనా అవకాశాలు కాలక్రమంలో మారుతుంటాయి. కొత్త కొత్త పరిశోధనలు, ఆవిష్కరణలు వాటిపై ప్రభావాన్ని చూపుతాయి. అందుకే డిమాండ్ ఉందని ఇష్టంలేని బ్రాంచిలో చేరితే తర్వాత తంటాలు పడాల్సి ఉంటుంది.

విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కాలేజీలు కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. ఏయే బ్రాంచిలకు ఎలాంటి ప్రోగ్రామ్‌లు జరుగుతున్నాయో గమనిస్తే కొంత సమాచారం లభిస్తుంది. ప్రతి కాలేజీలో అన్ని బ్రాంచిలు సమానంగా ఉండటం సాధ్యం కాదు. కానీ కొన్ని బ్రాంచిలకు కొన్ని కాలేజీల పేర్లు ప్రత్యేకంగా వినిపిస్తుంటుంది. కారణం అలాంటి కార్యక్రమాల ప్రణాళికను అమలు చేయడమే.

ఎంసెట్-2019 మాక్ కౌన్సెలింగ్
www.eenadupratibha.net లో

కాలేజీ ప్రధానం అనుకుంటే!

1. మంచి కాలేజీ ముఖ్యం అనుకునేవారు ముందుగా దానికి న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు ఉందా అని చెక్ చేసుకోవాలి. విద్యా సంస్థ నిర్దిష్ట ప్రమాణాలను పాటిస్తేనే న్యాక్ గుర్తింపు ఇస్తుంది. ఆ గుర్తింపు ఉన్న కాలేజీలోనే చేరడం మంచిది. తర్వాత ఆ కళాశాల నిర్వహించే ఇంజినీరింగ్ బ్రాంచిలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్) గుర్తింపు ఉందో లేదో చూసుకోవాలి. దీన్ని ప్రభుత్వం ఏఐసీటీఈ (అల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ద్వారా ఇస్తుంది. ప్రతి బ్రాంచికి విడివిడిగా ఎన్‌బీఏ గుర్తింపు తీసుకోవాలి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధన ఉంటేనే ఎన్‌బీఏ పత్రం అందుతుంది. భవిష్యత్తులో ఉద్యోగాలకు ఎలాంటి అడ్డంకులు ఎదురవకుండా ఉంటాయి.

2. తర్వాత చూడాల్సింది కరిక్యులమ్ (బోధనా ప్రణాళిక), సిలబస్. దీన్ని విశ్వవిద్యాలయాలు నిర్దేశిస్తాయి. అటానమస్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలు కరిక్యులమ్, సిలబస్‌లను స్వయంగా నిర్ణయించుకుంటాయి. అయితే ఈ రెండూ భవిష్యత్తు అవసరాలకు ఎంతవరకు దీటుగా ఉన్నాయో పరిశీలించుకోవాలి. అప్‌డేట్ కాని సిలబస్‌ల వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉంది.

3. కాలేజీ చెక్ చేశారు. సిలబస్ ఓకే. ఇప్పుడు ఆ పాఠ్యప్రణాళికను సమర్థంగా అమలు చేయడానికి తగిన అధ్యాపకులు ఉన్నారో లేదో తెలుసుకోవాలి. తగిన విద్యార్హతలు, అనుభవం ఉన్న లెక్చరర్లు ఉన్నారా? వారికి పరిశ్రమలతో పరిచయం లేదా పనిచేసిన అనుభవం ఉందా? పరిశోధన పేపర్లను ప్రచురించారా? ఇంజినీరింగ్ సంబంధిత పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి ఉన్నారా? ఇవన్నీ ఉంటే మంచి అధ్యాపక బృందం ఉన్నట్టే. కనీసం తీసుకునే బ్రాంచికి సంబంధించి అయినా ఈ వివరాలను పరిశీలించుకోవాలి.

4. అధ్యాపకుల అర్హతలు, అనుభవాలతోపాటు తగినంత మంది సిబ్బంది ఆ కాలేజీలో ఉన్నారో లేదో చూసుకోవాలి. ఏఐసీటీఈ తాజా నిబంధనల ప్రకారం స్టూడెంట్, ప్యాకల్టీ రేషియో 1:20. ఇంకా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిష్పత్తినీ పరిశీలించాలి.

5. అధ్యాపకుల తర్వాత ముఖ్యమైనది కాలేజీలోని మౌలిక వసతులు. లైబ్రరీ, ప్రయోగశాలలు సరిగా ఉన్నాయో లేదో చూడాలి. కొత్త కొత్త ఆవిష్కరణలకు తగిన ప్రోత్సాహం ఇస్తున్నారా, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శిక్షణ ఉందా? ఉంటే ఎలా ఉంది తదితర వివరాలను సేకరించుకోవాలి.

6. ఇంజినీరింగ్ అంటే కేవలం డిగ్రీ కాదు. ఇతర జీవన నైపుణ్యాలను నేర్చుకునే వేదిక కూడా. విద్యార్థి రోజులో ఎక్కువ భాగం ఇక్కడే గడుపుతారు. అందుకు అనువైన వాతావరణ పరిస్థితులను పరిశీలించాలి. క్రమశిక్షణ, తగినంత స్వేచ్ఛ కాలేజీలో ఇస్తున్నారో లేదో చూడాలి. ఈ సమాచారం సీనియర్ విద్యార్థులను అడగటం ద్వారా తెలుసుకోవచ్చు. ప్రాజెక్టులు, ప్రయోగాల వివరాలను తెలుసుకోవాలి. సహవిద్యార్థులతో సంప్రదింపులకు వీలు, ఆటలకు ప్రోత్సాహం ఎలా ఉన్నాయో చూడాలి. వీలైతే క్రీడా మైదానాలను సందర్శించాలి.

7. కాలేజీ ప్రతిష్ఠ కూడా విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఫలానా కళాశాల విద్యార్థి అనగానే ఒక అభిప్రాయం ఎదుటివారిలో ఏర్పడుతుంది. స్థాపన నుంచి అభివృద్ధి చెందిన విధానం కాలేజీకి ప్రజల్లో ఒక పేరును తెస్తుంది. క్రమశిక్షణను, విలువలను పాటించే కళాశాలల విద్యార్థులకు ఉద్యోగాల ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.

8. కాలేజీ వివరాల సేకరణ అనేక రకాలుగా చేయవచ్చు. వాటిలో కరపత్రాలు, ప్రకటనలు కూడా ఉన్నాయి. కేవలం వాటినే ఆధారం చేసుకొని అడ్మిషన్లు తీసుకోకూడదు. అలా అని పూర్తిగా విస్మరించకూడదు. ప్రకటనల్లో, కరపత్రాల్లో ఆయా కళాశాలల యాజమాన్యాలు ఇచ్చిన సమాచారాన్ని స్వయంగా పరిశీలించి తెలుసుకోవాలి. పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఏయే ప్రోగ్రామ్‌లను చేపడుతున్నారో అడగాలి.

అన్నీ పరిశీలించిన తర్వాత కాలేజీ దూరంగా ఉందని చేరకుండా ఉండవద్దు. తగిన ఏర్పాట్లు చేసుకొని మంచి కళాశాలలోనే చేరడం శ్రేయస్కరం.

అధ్యాపకులు, వసతులకు ప్రాధాన్యం

బ్రాంచా, కాలేజా అని అడిగితే ముందుగా కాలేజీకే ప్రాధాన్యం ఇవ్వాలి. కావాల్సిన బ్రాంచిలో చేరిన తర్వాత ఆ కళాశాలలో మౌలిక వసతులు లేకపోతే ఇబ్బంది పడాల్సి ఉంటుంది. మంచి పేరున్న కాలేజీలో ఏ బ్రాంచి తీసుకున్నా భవిష్యత్తు ఉంటుంది. కాలేజీని ఎంచుకునే ముందు అక్కడి ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరిశీలించాలి. ఎన్‌ఆర్ఎఫ్ ర్యాంకులు, డిజిటల్ లైబ్రరీ వంటి అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. సరైన వసతులు, అధ్యాపకులు ఉంటేనే విద్యార్థికి ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటుంది. బ్రాంచి ఏదైనా డిగ్రీ పూర్తయ్యేనాటికి అభ్యర్థులు టాప్‌లో ఉండాలి. అరకొర మార్కులతో పాసైతే లాభం లేదు. దాంతోపాటు కమ్యూనికేషన్ (ఓరల్, రిటెన్), లాజిక్, వివిధ టెక్నాలజీను ఉపయోగించడం వంటి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి.

- ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రిన్సిపల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీ.

అన్ని బ్రాంచీలు మంచివే

పరిశ్రమలకు అన్ని ఇంజినీరింగ్ బ్రాంచిలూ అవసరమే. అన్నీ మంచివే. సర్క్యూట్ బ్రాంచిల (ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్) తర్వాత మెకానికల్, సివిల్, కెమికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచిలకు మంచి అవకాశాలు ఉంటున్నాయి. ఆసక్తి ఉంటే అరుదైన బ్రాంచిలను ఎంచుకోడానికి ఆలోచించాల్సిన అవసరం లేదు. నావెల్ ఆర్కిటెక్చర్ అండ్ మెరైన్, పెట్రోలియం ఇంజినీరింగ్ వంటి వాటిల్లో తక్కువ సీట్లు ఉండటం వల్ల నిపుణుల కొరత ఉంది. దీంతో వీరికి ఉద్యోగాలు వెంటనే లభిస్తున్నాయి. ఆంధ్రాయూనివర్సిటీలో జియో ఇన్‌ఫర్మేటిక్స్‌లో బీటెక్ చేసినవారిని టీసీఎస్ ప్రత్యేకంగా ఎంపిక చేసుకోవడాన్ని ఐదుకు ఉదాహరణగా చెప్పవచ్చు. దీంతోపాటు బ్రాంచి ఏదైనా మంచి కాలేజీ చూసుకొని చేరడం ముఖ్యం. మౌలిక వసతులు, సరైన అధ్యాపకులు లేకపోతే ఎంత మంచి బ్రాంచిలో చేరినా ప్రయోజనం ఉండదు.

- ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, ఆంధ్రాయూనివర్సిటీ

నోటీస్ బోర్డు

ప్రవేశాలు

హెరిటేజ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ

బనారస్ హిందూ యూనివర్సిటీ 2019-20 సంవత్సరానికిగానూ కింది పీజీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు: ఎంఏ ఇన్ హెరిటేజ్ మేనేజ్‌మెంట్ **కాలవ్యవధి:** రెండేళ్లు **సీట్ల సంఖ్య:** 50 **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. **ఎంపిక:** ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఆధారంగా. **పరీక్ష తేదీ:** జులై 16 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 26

వెబ్‌సైట్: http://bhuonline.in/

టెక్స్‌టైల్ ప్రాసెసింగ్‌లో పోస్ట్ డిప్లొమా

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ 2019-20 సంవత్సరానికిగానూ పోస్ట్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు: పోస్ట్ డిప్లొమా ఇన్ టెక్స్‌టైల్ ప్రాసెసింగ్

కాలవ్యవధి: 1 1/2 సంవత్సరాలు (మూడు సెమిస్టర్లు)

ప్రాంగణాలు: వారణాసి (ఉత్తర్ ప్రదేశ్), సేలం (తమిళనాడు).

స్టైపెండ్: నెలకు రూ.1500 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా లేదా బీఎస్సీ ఉత్తీర్ణత. **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ చివరి తేదీ: జూన్ 25

వెబ్‌సైట్: http://handlooms.nic.in/

ఆధునిక వ్యవసాయంలో ఉచిత శిక్షణ

మెదక్ జిల్లాలోని బేయర్ - రామానాయుడు విజ్ఞాన జ్యోతి స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్.. ఆధునిక వ్యవసాయ విధానాల్లో ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **కాలవ్యవధి:** 6 నెలలు **కోర్సు ప్రారంభం:** జులై 2019 **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణత. అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.60,000 మించకూడదు. గ్రామీణ వ్యవసాయ నేపథ్యం, వ్యవసాయంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. **వయసు:** 16-20 ఏళ్ల లోపు ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్/ ఈమెయిల్ **చివరి తేదీ:** జూన్ 25 dmvjird@gmail.com

వాక్-ఇన్స్

సీఎస్ఐఆర్ - ఐహెచ్‌బీటీ

పాలంపూర్ (హిమాచల్‌ప్రదేశ్)లోని సీఎస్ఐఆర్ - ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరిసోర్స్ టెక్నాలజీ (ఐహెచ్‌బీటీ) తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ పర్సనల్ బర్రికి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది. **పోస్టులు-ఖాళీలు:** జూనియర్ రిసెర్చ్ ఫెలో/ జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో-05, ప్రాజెక్ట్ అసిస్టెంట్ (లెవెల్ 2/ లెవెల్ 1)-05 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ/ బీఫార్మసీ, బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, నెట్ ఉత్తీర్ణత. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా. **వాక్‌ఇన్ తేదీ:** జూన్ 25, 26 **వేదిక:** సీఎస్ఐఆర్ - ఐహెచ్‌బీటీ, పాలంపూర్ (హిమాచల్‌ప్రదేశ్). **వెబ్‌సైట్:** www.ihbt.res.in

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో.

అగ్రి బీఎస్‌సీ చేరాలంటే..

మా అబ్బాయి ఇంటర్ పూర్తిచేశాడు. అగ్రి బీఎస్‌సీ చదవాలనుకుంటున్నాడు. ఎంసెట్‌లో ఎంత ర్యాంకు వస్తే ఉచిత సీటు వస్తుంది? ప్రైవేటు కళాశాలలు, వాటి ఫీజుల గురించి తెలపండి. కోర్సు పూర్తిచేశాక పోటీపరీక్షలకు అర్హత ఉంటుందా? తనకున్న ఉద్యోగావకాశాలేంటి?

- పార్వతి, అనంతపురం

వ్యవసాయం, పాడి, పౌల్ట్రీ వంటి రంగాల్లో ఆసక్తి ఉన్నవారు ఇంటర్మీడియట్ పూర్తిచేశాక బీఎస్‌సీ అగ్రికల్చర్ కోర్సును ఎంచుకోవడం ఉత్తమం. తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్ ర్యాంకు ద్వారా ఈ కోర్సుల్లోకి ప్రవేశాన్ని పొందొచ్చు. ఓపెన్ కేటగిరీలో 300లోపు ర్యాంకు తెచ్చుకున్నవారికి ప్రభుత్వ సీటు వచ్చే అవకాశం ఉంది. ఇక ప్రైవేటు కళాశాలల విషయానికొస్తే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ, జవహర్ భారతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, మహారాజా కాలేజ్ వంటివి ఎంచుకోవచ్చు. ఫీజు రూ.50,000 వరకూ ఉండే అవకాశముంది.

కోర్సు పూర్తిచేసినవారు డిగ్రీ అర్హతతో ఉండే అన్ని పోటీప రీక్షలకూ అర్హులవుతారు. వీరు అగ్రికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్లాంటేషన్ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లాంటి ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశాలున్నాయి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

మీ ప్రశ్నలు పంపాల్సిన మెయిల్ ఐడీ: edc@eenadu.in

వరుణుడా.. ఖరీఫ్‌పై కనికరం ఏదీ?

- 20 జిల్లాల్లో చినుకు జాడలేదు
- గత 10 రోజుల్లో 11 శాతం వర్షపాతం లోటు
- కొన్ని జిల్లాల్లో లోటు 90 శాతం
- భూమిని దున్నితే వేడి సెగలు
- కేరళ దాటని నైరుతి
- మరో 3 రోజులు వడగాలులు
- ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం
- వర్షాభావంపై విపత్తు నిర్వహణ సమావేశం నేడు

ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు లేకున్నా వరుణుడిపై భారం వేసి బేల గ్రామంలో ఓ రైతు సోమవారం అరుగాలం శ్రమకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల క్రితం పడిన తేలికపాటి జల్లులతో బీటీ పత్తి విత్తనాలను విత్తుతున్నట్లు రైతు అవినాశ్ చెప్పారు. మొత్తం ఆరు ఎకరాలకు బోరు ఉన్నా నీరు రావడం లేదు. వర్షాలు పడకపోతే ఇలాంటివి ఎండిపోతాయని జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్త జగదీశ్వర్ చెప్పారు. తేలికపాటి వర్షాలను నమ్ముకుని విత్తితే నష్టాలు తప్పవని రైతులకు సూచించారు.

ఈనాడు - హైదరాబాద్

వరుణుడి జాడలేదు..భానుడి భగభగలతో వానాకాలం లోనూ వడగాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో 45 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలతో ఉక్కిబోతలు, వేడిసెగలు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల 44 నుంచి 44.9 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 3 రోజులు ఇదేస్థాయిలో ఎండలు, అక్కడక్కడా తేలికపాటి జల్లులుంటాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 10 వరకూ రాష్ట్ర సాధారణ వర్షపాతంలో 11 శాతం లోటు ఏర్పడింది. అంతకుముందు 3 నెలలు(మార్చి, ఏప్రిల్, మే) సాధారణ వర్షపాతంలో 57 శాతం లోటు ఏర్పడిందని వాతావరణ శాఖ ప్రకటించింది. జూన్ 10వ తేదీ వచ్చినా నైరుతి రుతుపవనాలు ఇంకా కేరళ దాటి పైకి రాలేదు. మరోవైపు అరేబియా సముద్రంలో వాయుగుండం ఏర్పడటంతో రుతుపవనాల నుంచి తేమను లాగేస్తోంది. దీని ప్రభావం తెలంగాణపై ఉండదని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు 'ఈనాడు'కు చెప్పారు.

సెగలు.. పొగలు

ఈ నెల ఒకటి నుంచి పదో తేదీ వరకూ రాష్ట్రంలో 27 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాలి. 24.3 శాతం నమోదైంది. వరంగల్ అర్బన్ జిల్లాలో 27.4 మి.మీ.కి 2.8, వరంగల్ గ్రామీణ జిల్లాలో 32.1కు 5.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాల్లో వర్షపాతం లోటు ఏకంగా 83 నుంచి 90 శాతానికి చేరడంతో దుక్కులు కూడా దున్నలేక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఉత్తర తెలంగాణలో జూన్ మొదటి వారంలోనే బీటీ పత్తి, మినుము, పెసర, మొక్కజొన్న వంటి పంటల విత్తనాలను విత్తడం ఆనవాయితీ. ఇటీవల తేలికపాటి జల్లులు పడటంతో అక్కడక్కడా రైతులు దుక్కులు దున్ని విత్తుతున్నారు. ఒకసారి తేలికపాటి జల్లులు పడగానే తొలకరి వచ్చిందని రైతులు భావిస్తున్నారు మరో మూడు రోజుల దాకా రాష్ట్రంలో రుతుపవన వర్షాలు పడే సూచనలు లేవు. వ్యవసాయశాఖ రాయితీపై విక్రయించే విత్తనాల అమ్మకాలూ అంతంతమాత్రంగా ఉన్నాయి. తేలికపాటి వర్షాలు పడుతున్న కొద్ది ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలు విక్రయించే బీటీ పత్తి విత్తనాలను ఎక్కువగా కొంటున్నారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం అన్ని శాఖల అధికారులు, శాస్త్రవేత్తలతో విపత్తు నిర్వహణ సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. పూర్తి వివరాలతో రావాలని అన్ని విభాగాలకు సోమవారం ఆదేశాలిచ్చారు.

50 మిల్లీమీటర్లు దాటితేనే విత్తాలి

– రుమాండ్ల జగదీశ్వర్, పరిశోధన సంచాలకుడు, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

రుతుపవనాలు ఆగమనానికి ముందు తేలికపాటి వర్షాలు పడటం సహజం. రాష్ట్రంలో 50 నుంచి 60 మిల్లీమీటర్ల వరకూ వర్షపాతం నమోదైన తరువాతే వర్షాధార భూముల్లో పంటల సాగుకు విత్తాలి. భూమిలో కనీసం 15 నుంచి 20 సెంటీమీటర్ల లోతు వరకూ తేమ ఉండేలా వర్షాలు బాగా పడాలి. ఇప్పుడు కురుస్తున్న తేలికపాటి వర్షాలకు అంత తేమ రాదు.

- ఈ నెలలో ఎండలు అధికంగా ఉన్నందున తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్ 15048) రకం వరి నార్లు పోయవద్దు.
- రాష్ట్రంలో బీటీ పత్తి అధికంగా సాగు చేస్తారు. సరైన వర్షాలు పడకుండా ఈ విత్తనాలు విత్తినా మొలకలు సరిగా రావు. వచ్చిన బతకవు.
- మినుము, పెసర, కంది వంటి పంటల విత్తనాలను జూన్ 15 నుంచి వర్షాలు పడితే విత్తాలి. కందిలో జొన్న లేదా మొక్కజొన్న, వేరుసెనగలో ఏదో ఒకదానిని అంతర పంటగా సాగుచేస్తే ఆదాయం పెరుగుతుంది.
- వర్షాలు ఆలస్యమైనందున తక్కువ కాలంలో చేతికొచ్చే వంగడాల సాగునే ఎంచుకోవాలి. ఆరునెలల పాటు సాగుకాలం ఉండే సాంబ మసూరి వరి వంగడం వేయవద్దు.

కృష్ణమూర్తికి కేటీఆర్ పరామర్శ

మాదాపూర్, న్యూస్‌టుడే: కొద్దిరోజులుగా కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ ఎంఎస్ఐడీసీ) ఛైర్మన్ వర్యాద కృష్ణమూర్తిని సోమవారం తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరామర్శించారు. గుండెనొప్పితో ఈ నెల 7వ తేదీన వైద్యశాలలో చేరిన కృష్ణమూర్తికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు రెండు స్టెంట్లు వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. పరామర్శించిన కేటీఆర్ వెంట ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి పి.మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, గట్టు రాంచందర్ ఉన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న కేటీఆర్

మునివాహన సేవకు అంతర్జాతీయ గుర్తింపు

అమెరికా కమిషన్ నివేదికలో ప్రత్యేక ప్రస్తావన

మొయినాబాద్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని చిలుకూరు బాలాజీ ఆలయ హూజారి సీఎస్ రంగరాజన్ 'మునివాహన సేవ'కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆయన గతేడాది ఒక దళిత భక్తుడిని భుజాలపై ఎక్కించుకుని, నగరంలోని జియాగూడ రంగనాథస్వామి ఆలయ ప్రవేశం చేయించారు. ఈ అంశాన్ని అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'ఆన్ రెలిజియన్ ఫ్రీడం' జాతీయ కమిషన్ ఏటా 'మత స్వేచ్ఛ'పై రూపొందించే నివేదికలో ప్రస్తావించింది. మతస్వేచ్ఛ ప్రపంచవ్యాప్తంగా ఏ దేశాల్లో అమలవుతోంది.. వంటి అంశాలను పరిశీలించి ఈ కమిషన్ నివేదికను రూపొందిస్తుంటుంది. ఇందులో భాగంగా 2018-19 ఏప్రిల్ వరకు అన్ని దేశాల్లో జరిగిన మతపర సంఘటనలు, అట్టడుగు వర్గాలను ఏ విధంగా ఉన్నత స్థితికి తీసుకువెళ్లారో అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. 'భగవంతుని ముందు అందరూ సమానమనే నినాదంతో ఈ సేవ నిర్వహించాం. ఇదే అంశాన్ని అమెరికా ప్రభుత్వ జాతీయ కమిషన్ తన నివేదికలో పొందుపరచడం ఆనందం కలిగించింది' అని రంగరాజన్ పేర్కొన్నారు.

దళిత భక్తుడిని భుజాలపై ఎత్తుకొని ఆలయ ప్రవేశం చేయిస్తున్న రంగరాజన్ (పాత చిత్రం)

రక్తం లేకున్నా..సుఖ ప్రసవం!

- కలెక్టర్ చొరవతో గిరిజన మహిళకు ఇంటి దగ్గరే వైద్యం
- ఫలించిన స్వచ్ఛంద సేవకుడి ప్రయత్నం

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన జ్యోతి

పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా ఉన్న వారికీ ఏదో ఒక కారణం చూపి శస్త్ర చికిత్సతో ప్రసవం చేస్తున్న ఉదంతాలు కోకొల్లలు. అందుకు భిన్నంగా కనీస పరిమాణంలోనూ రక్తం లేని గిరిజన మహిళ ఇంటి దగ్గరే సాధారణ ప్రసవంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. దాని ఓ స్వచ్ఛంద సేవకుడి శ్రద్ధ, కలెక్టర్ చొరవ, వైద్యుల శ్రమ తోడైంది. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలోని గొత్తికోయ గ్రామం చిరుతానుపాడుకు చెందిన పద్దం జ్యోతి గర్భిణి. స్వచ్ఛంద సేవలో భాగంగా గత నెల 18న గ్రామానికి వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు నరేందర్ ఆమె రక్తంలో హీమోగ్లోబిన్ 3 గ్రాములు మాత్రమే ఉన్నట్టు(సాధారణంగా మహిళల్లో ఒక డెసీ లీటర్(లీటర్‌లో పదో వంతు) రక్తంలో 9 నుంచి 13.5 గ్రాములు ఉండాలి) గుర్తించి అవాక్కయ్యాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించాలని సూచించాడు. వాహన సౌకర్యం లేకపోవడంతో భర్త సాయంతో జెట్టిలో ఐదు కిలోమీటర్ల దూరం మోసుకొచ్చి మరీ తొలుత ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, తర్వాత అక్కణ్నుంచి అంబులెన్స్‌లో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించాడు. రక్త పరీక్షలు చేసిన వైద్యులు ఆమెకు రక్తం ఎక్కించారు. ఒక ప్యాకెట్ రక్తం ఎక్కిన వెంటనే జ్యోతి పారిపోయి ఇంటికి చేరుకుంది. మళ్లీ బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లినా ఆమె అలాగే చేసింది. సమాచారం అందుకున్న కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ ఆమెకు ఇంటివద్దే వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వినోద్‌ను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక ఏఎన్ఎంలు కొన్ని రోజులుగా నిత్యం ఆ గ్రామాన్ని సందర్శిస్తూ వైద్య సేవలు చేయడంతో జ్యోతి పరిస్థితి మెరుగైంది. సోమవారం తెల్లవారుజామున సాధారణ ప్రసవంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

గ్రామస్థాయిలో 'ప్రజావాణి'

- 'ములుగు-వెలుగు' కార్యక్రమానికి శ్రీకారం
- కలెక్టర్ నారాయణరెడ్డి వినూత్న ఆలోచనతో ముందడుగు

గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: రాష్ట్రంలో ఇప్పటివరకు మండల, జిల్లా స్థాయిలోనే 'ప్రజావాణి' నిర్వహిస్తుండగా.. సమస్యల పరిష్కారం గ్రామస్థాయి నుంచే ఆరంభం కావాలని ములుగు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ములుగు-వెలుగు' పేరిట గ్రామస్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమం నిర్వహణను సోమవారం జిల్లా వ్యాప్తంగా కార్యరూపంలోకి తీసుకొచ్చారు. ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు గ్రామాల్లోని ప్రజాసీకానికి ఏ స్థాయిలో సమస్య అయినా ఉన్న చోటు నుంచే పరిష్కారం చూపేలా దీన్ని రూపొందించారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో దీనిని విజయవంతం చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించారు.

గ్రామ కమిటీ ఆధ్వర్యంలో..

గ్రామ కార్యదర్శి, వీఆర్వో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎంలు ఇలా గ్రామస్థాయిలో ఉద్యోగులతో ప్రతి గ్రామంలో ఓ కమిటీ వేయించారు. దీని ఆధ్వర్యంలో ప్రతి సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరిస్తారు. వచ్చిన ఫిర్యాదు గ్రామ స్థాయిలో పరిష్కారమయ్యేదయితే అక్కడే పరిష్కరిస్తారు. మండల, జిల్లా స్థాయిది అయితే అక్కడి అధికారులే దానిని ఆయా శాఖల పైఅధికారులకు పంపిస్తారు. అక్కడి అధికారులు దరఖాస్తును తిరిగి గ్రామస్థాయిలో విచారణ జరిపించి పరిష్కరిస్తారు. 'ములుగు -వెలుగు' కార్యక్రమ నిర్వహణకు జిల్లా, మండల, గ్రామ సమన్వయకర్తలను నియమించారు. వచ్చిన ఫిర్యాదులు పరిష్కారమయ్యాయా లేదా అనేదానిపై ప్రతి శనివారం పరిశీలిస్తారు. గత ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కారమైనవి ఎన్ని? కానివి ఎన్ని? అనేది చూస్తారు. పరిష్కారం కాకుంటే ఏ కారణంగా కాలేదో తెలిగి నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తుదారుడికి తెలియజేసేవిధంగా చర్యలు తీసుకోనున్నారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లలేని వారికి గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కార మార్గం అందుబాటులోకి రావడంతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్థాయిలో పాలన బలోపేతానికే..:

– సీ. నారాయణరెడ్డి, కలెక్టర్

గ్రామస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యను అక్కడే పరిష్కరించేందుకు 'ములుగు- వెలుగు' కార్యక్రమాన్ని చేపట్టాం. పాలనను ప్రజల చెంతకు చేర్చాలనే ఓ ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. దీనివల్ల అధికారులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు కూడా మెరుగవుతాయి. ప్రభుత్వ అధికారుల గైర్హాజరు తగ్గుతుంది. ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించేందుకు, మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తారు. జిల్లా, మండల స్థాయి సమస్యలైనా గ్రామ స్థాయిలో ఫిర్యాదు చేసుకుంటే సరిపోతుంది. ఆ ఫిర్యాదును సంబంధిత అధికారికి చేర్చి పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ కొత్త కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

శాస్త్రీయ రీతిలో సమస్యలు తీర్చండి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రైళ్ల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు మూలకారణాలు తెలుసుకొని వాటిని సాంకేతిక, శాస్త్రీయ పద్ధతుల్లో పరిష్కరించాలని అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ ఆదేశించారు. ఆయన సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో సోమవారం అన్ని డివిజన్ రైల్వే మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కేవీ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

FACULTY WANTED
For a Leading Educational services firm in Vellore and Chennai
NEET, JEE MAINS & ADVANCED
Physics, Chemistry, Botany, Zoology and Mathematics
PGTs, Coordinators and Counsellors. Sr, Jr and Freshers
Pay upto 30 Lacs P.A + Perks
Apply to director@thelearningpoint.org
7901 000 007

Rane RANE ENGINE VALVE LIMITED MEDCHAL & AZIZ NAGAR
WANTED DIPLOMA TRAINEES UNDER NEEM SCHEME
The Candidates with Diploma in Mechacial Engineering / Automobile Engineering who are Willing to Learn Through Working on Machines on Shift Basis Can attend Personal Interview from 14-06-2019 to 15-06-2019 at Plot No-68-77, Industrial Estate, Medchal-501401. Medchal Malkajgiri Dist. Subsidized Canteen Facility is Available.
INTERVIEW TIMINGS: From 9.30 am to 4.0 pm.
Contact : GCA Naidu, 9177541830, Bala Krishna, 9963047038
chinaappalanaidu.ganta@ranegroup.com, d.balakrishnaiah@ranegroup.com

ETV BHARAT
ETV Bharat is a comprehensive digital national news platform conceived to deliver seamless news and information services, using video-centric Mobile App and Web Portals. It is one- of- its kind offering in India in terms of diverse content, depth, dedicated journalists network and pan-India reach offering services in 13 languages i.e. Telugu, Bengali, Hindi, Urdu, Tamil, Kannada, Malayalam, Gujarati, Marathi, Punjabi, Assamese, Odia and English.
ETV-Bharat needs;
CONTENT EDITORS / Sr.CONTENT EDITORS (ENGLISH)
Positions are based at Ramoji Film City
Incumbent must be Post Graduate in Journalism and Mass Communication with a minimum of 5 years of proven track record in content creation and publishing. Candidates with literature background with relevant experience in media can also be considered.
The candidate must be able to develop/elaborate the content, based on the stories sent by the reporters. He/She must be an expert in national and international subjects and below 35 years of age. Must have excellent writing skills in English, with ability to independently publish news content.
Familiarity with digital media is a must.
Candidates with exposure to Print/Television would be preferred.
Interested candidates can send their updated resumes; email to mkreddy.n@etvbharat.com

అంతర్జాతీయ విత్తన సదస్సులతో మేలు

హైదరాబాద్‌లో నిర్వహణకు ఏర్పాట్లు: సీఎస్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో విత్తన పరిశ్రమ మరింత అభివృద్ధి చెందడానికి అంతర్జాతీయ విత్తన సదస్సుల నిర్వహణ ఎంతో దోహదపడుతుందని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఎస్.కె. జోషి అభిప్రాయపడ్డారు. ఈ నెల 26 నుంచి హైదరాబాద్‌లో జరిగే విత్తన సదస్సులకు సంబంధిత అధికారులందరూ పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యనిర్వాహక కమిటీ తొలి సమావేశాన్ని సోమవారం ఆయన తన ఛాంబర్‌లో నిర్వహించారు. పలు దేశాల ప్రతినిధులు హాజరవుతున్నందున అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. సదస్సు పనుల పురోగతిని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి వివరించారు. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ సహకారంతో అంతకుముందు 24, 25 తేదీల్లో ఆఫ్రికా దేశాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. దీనికి తెలంగాణ విత్తన పరిశ్రమల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఇటువంటి సదస్సులు రాష్ట్రానికి సంబంధించి విత్తన ఎగుమతులకు, దిగుమతులకు బాగా ఉపకరిస్తాయని నోడల్ అధికారి డాక్టర్ కేశవులు పేర్కొన్నారు.

కోటి మొక్కలు నాటుతాం : సింగరేణి

ఈనాడు, హైదరాబాద్ : హరిత హారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కోటి మొక్కలు నాటాలన్నదే లక్ష్యమని సింగరేణి సంస్థ సోమవారం ప్రకటించింది. మొత్తం 50 రకాల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నామని తెలిపింది, గత నాలుగేళ్లలో 3.32 కోట్ల మొక్కలు నాటామని పేర్కొంది.

పరీక్ష తప్పి..మతి కోల్పోయాడు!

- పోలీసులను ఆశ్రయించిన తండ్రి

బాధిత విద్యార్థి కాలికి బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్తున్న కానిస్టేబుల్

జగిత్యాల, న్యూస్‌టుడే: పదో తరగతి తప్పిన విద్యార్థి ఆ మానసిక వేదనతో మతిస్థిమితం కోల్పోయాడు. ఐదేళ్లుగా వింతగా ప్రవర్తిస్తూ తల్లిదండ్రులు సహా గ్రామస్థులపై దాడులు చేస్తున్నాడు. విసిగిపోయిన కన్నవారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన వ్యక్తి(21) ఐదేళ్ల క్రితం పదో తరగతి తప్పాడు. సప్లిమెంటరీ రాసినా ఫలితం లేకపోవటంతో మానసికంగా కుంగిపోయి చివరికి మతిస్థిమితం కోల్పోయాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడేవాడు. కుమారుడిని ఏమీ అనలేక..విషయం బయటకు చెప్పలేక పాపం కన్నవాళ్లు ఇంతకాలం తల్లడిల్లుతూ వచ్చారు. చివరికి సోమవారం కొడిమ్యాల పోలీసులను ఆశ్రయించారు. వారు కుర్రాడిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మంగళవారం బాధితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి హైదరాబాద్ ఎర్రగడ్డ మానసిక వైద్యశాలకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

రైతు సమస్యలను పరిష్కరించండి

ఈనాడు, హైదరాబాద్: జరీఫ్ ప్రారంభమైనా అనేకమంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందలేదని తెలంగాణ రైతు సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. పాసు పుస్తకాల్లో లోపాలను చక్కదిద్దడంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించింది. పాసు పుస్తకాల జారీ మరింత అలస్యమయ్యే పక్షంలో పాం-1బి ఆధారంగానే రైతుబంధు పథకం ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరింది. తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.జంగారెడ్డి, టి.సాగర్, ఉపాధ్యక్షుడు అరిబండి ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, తదితరులు సోమవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌలురైతులకు కూడా గుర్తింపు కార్డులిచ్చి రైతులకు లభించే అన్ని ప్రయోజనాలను వారికీ అందించాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష రుణ మాఫీ ఉత్తర్వులను తక్షణమే విడుదల చేసి అమలు చేయాలని, నాణ్యమైన విత్తనాలు సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. తమ వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, రైతుల సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

గోదావరి నీటిని కృష్ణాబేసిన్‌లోకి మళ్లించడం లేదు

- సాగునీటి అవకాశం లేని ప్రాంతాలకే వినియోగం
- ఆంధ్రప్రదేశ్‌కు వాటా అనే ప్రశ్నే తలెత్తదు
- తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు.. చీఫ్ ఇంజినీర్ నరసింహారావు లేఖ

ఈనాడు - హైదరాబాద్

గోదావరి నీటిని కృష్ణాబేసిన్‌లోకి మళ్లించడం లేదని, సాగునీటి అవకాశం లేని ప్రాంత అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నందున ఆంధ్రప్రదేశ్‌కు వాటా అన్న ప్రశ్నే తలెత్తదని తెలంగాణ పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభించినప్పటి నుంచి గోదావరి నుంచి కృష్ణాలోకి మళ్లించే నీటిలో తెలంగాణకు వాటా ఉంటుందని, ఈ విషయం 1978 ఆగస్టు నాలుగున జరిగిన ఒప్పందంలోనే ఉందని వెల్లడించింది. పోలవరం ద్వారా కృష్ణా బేసిన్‌లోకి మళ్లించే నీటిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 45 టీఎంసీల వాటాను నాగార్జున సాగర్ ఎగువన ఉన్న కృష్ణాబేసిన్ ప్రాజెక్టులకు వినియోగించుకోవాలని ఉందని, సాగర్ పైన ఉన్నది తెలంగాణలోని ప్రాజెక్టులే కాబట్టి ఈ మొత్తం నీరు తమకే చెందుతుందని తెలంగాణ పేర్కొంటుండగా, ఆంధ్రప్రదేశ్ దీనికి అంగీకరించడం లేదు.

కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల, దేవాదుల తదితర ప్రాజెక్టుల ద్వారా 240 టీఎంసీల గోదావరి నీటిని తెలంగాణ కృష్ణా బేసిన్‌లోకి మళ్లిస్తుందని, ఇందులో తమకు వాటా ఉందని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖకు, కృష్ణా, గోదావరి బోర్డులకు లేఖలు రాసింది. ఈ విషయంలో తామేమీ చేయలేమని రెండు బోర్డులు చేతులెత్తేశాయి. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ నీటిపారుదల శాఖ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీర్ నరసింహారావు సోమవారం ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు ఓ లేఖ రాశారు.

కృష్ణాబేసిన్‌లో నీటి కేటాయింపులు లేని ప్రాంతంలో సాగుకు మాత్రమే వినియోగిస్తున్నామని, కృష్ణా నదికి గానీ, కృష్ణా నీటితో సాగవుతున్న ఆయకట్టుకు ఇవ్వడానికిగానీ మళ్లించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వాటా అన్నది ఉత్పన్నమేకాదని, పోలవరం నుంచి మళ్లించే నీటిలో వాటా ఇవ్వాలని 1978లో జరిగిన ఒప్పందంలోనే ఉందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని నీటిపారుదల శాఖ.. బోర్డులకు, జలవనరుల మంత్రిత్వశాఖకు తెలపనుంది.

ములాయం సింగ్‌కు అస్వస్థత

మేదాంత ఆస్పత్రిలో చికిత్స

గురుగ్రామ్: సమాజ్‌వాదీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ అస్వస్థతకు గురయ్యారు. ఆయనను సోమవారం రాత్రి లక్నవూ నుంచి గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రికి ప్రైవేటు విమానంలో తరలించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స జరుగుతున్నట్లు తెలిసింది. అంతకుముందు రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన ములాయంను లఖ్‌నవూలోని ఆయన నివాసానికి వెళ్లి యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ పరామర్శించారు. రక్తంలో అధిక చక్కెర స్థాయిలు, గుండె సంబంధిత రుగ్మతలతో ఆయన బాధపడుతున్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ	డోజోన్స్	నాస్‌డాక్	రూపాయి	ముడి చమురు
39785 ▲ 169	11923 ▲ 52	26080 ▲ 96	7839 ▲ 98	69.65 ▼ 19 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	62.82 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	10వ	మార్పు%
BRITANNIA IND	2994.30	3.28
TECH MAHINDRA	768.20	2.32
TCS	2231.50	2.28
INFOSYS	753.50	1.95
DR. REDDYS LAB	2629.25	1.88
BHARTI AIRTEL	363.45	1.78
HINDALCO IND	198.25	1.77

గ్రహణం (-)

నిఫ్టీ	10వ	మార్పు%
BPCL	389.65	-3.31
YES BANK	135.90	-2.86
COAL	259.30	-2.35
GAIL	307.25	-2.10
TATA MOTORS	166.20	-1.95
IOCL	160.65	-1.92
ONGC	164.65	-1.70

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	63.16	73.24
పౌండ్ స్టెర్లింగ్	80.34	93.17
యూరో	71.45	82.85
జపనీస్ యెన్/100	58.22	67.52
ఆస్ట్రేలియా డాలరు	44.04	50.96
సింగపూర్ డాలరు	46.24	54.78
ఫాయ్ వాన్/100	201.35	240.73
బహ్రెయిన్ దీనార్	170.69	195.60
కువైట్ దీనార్	188.80	235.10
ఒమన్ రియాల్	166.85	191.63
సౌదీ రియాల్	16.75	19.90
యూఎఈ దిర్హమ్	17.15	20.10
మలేషియా రింగిట్	14.86	18.27
వైస్డ్ యువాన్	7.09	11.5



ఇండియాకు Flipkart వచ్చేస్తాం..!

ఇ-కామర్స్ పోర్టళ్లు తాము విక్రయించే ప్రైవేటు లేబుల్ ఉత్పత్తుల్లో అధికభాగాన్ని దేశీయంగా సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందువల్ల సంస్థలకు ఖర్చులు తగ్గడంతో పాటు భాగస్వామ్యం ఏర్పరచుకున్న దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా తయారీ సంస్థలకు కలిసి వస్తోంది.

- ఫ్లిప్‌కార్ట్ దేశీయ తయారీ
- వాల్‌మార్ట్ ప్రైవేటు ఉత్పత్తులు ఇక్కడే
- సంస్థకు దిగుమతి సుంకాలు ఆదా
- ఇదే బాటలో అమెజాన్ కూడా

బెంగళూరు

వాల్‌మార్ట్ ఆధీనంలోని ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్, తాను విక్రయించే సరకు, వస్తువుల్లో అధిక భాగాన్ని దేశీయంగా సమీకరించడంపై దృష్టి పెట్టింది. వ్యయాలు తగ్గడమే దీనికి ప్రధాన కారణం. ఫ్లిప్‌కార్ట్‌కు కొన్ని ప్రైవేటు లేబుల్ బ్రాండ్లు ఉన్నాయి. ఈ బ్రాండ్లపై ఉత్పత్తులను గతంలో చైనా, మలేసియాల్లో తయారు చేసి, ఇక్కడకు దిగుమతి చేసుకునేవారు. వినియోగదారులు ఆర్డరు ఇచ్చినవుడు సరఫరా చేసేవారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, 'భారత్ తయారీ'పై మరింత దృష్టి పెడుతుందని భావిస్తున్నారు. ఇందుకనుగుణంగా తాము కూడా భారత్ తయారీ ఉత్పత్తులనే వినియోగదార్లకు చేరవేస్తున్నామని ప్రకటించుకునేందుకూ ఫ్లిప్‌కార్ట్‌కు తాజా పరిణామం దోహద పడుతుంది. దీంతోపాటు దిగుమతి సుంకాల వ్యయాలు, ఇతర ఖర్చుల రూపేణ సంస్థకు ఆదా అవుతుంది. ప్రైవేట్ లేబుల్ కింద 300 విభాగాల్లో విక్రయిస్తున్న సరకులు, ఉత్పత్తుల ధరలు తగ్గించే వీలు ఫ్లిప్‌కార్ట్‌కు ఏర్పడింది.

ఇవీ బ్రాండ్లు

మార్క్యు, పర్‌ఫెక్ట్ హోమ్స్, బిలియన్ అండ్ స్మార్ట్ బై.. వంటి ప్రైవేట్ లేబుల్ బ్రాండ్లపై ఫ్లిప్‌కార్ట్ పలు రకాల ఉత్పత్తులు విక్రయిస్తోంది. కంపెనీ విక్రయాల్లో వీటి వాటా 8 శాతం వరకు ఉంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, మస్క్యులైన వినియోగ వస్తువులు, వస్త్రాలు, ఖరీదైన ఆండ్రాయిడ్ టీవీలు, ఎయిర్ కండీషనర్లు, వాషింగ్‌మెషీన్లు, ఇతర చిన్నపాటి ఉపకరణాలు ప్రస్తుతం దేశీయంగానే సమీకరిస్తున్నారు. ఉపకరణాల్లో అయితే 50-60 శాతం దేశీయంగానే సమీకరిస్తున్నారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు కూడా దేశీయంగా ప్లాంట్లు నెలకొల్పేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటం కూడా ఇ-కామర్స్ సంస్థలకు కలిసి వస్తోంది.

రెండేళ్ల క్రితం 100 శాతం దిగుమతులే

'రెండేళ్ల క్రితం చూస్తే ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు 100 శాతం చైనా నుంచి దిగుమతి చేసుకున్నవి విక్రయించేవాళ్లం. ఇప్పుడు చూస్తే 50 శాతం తక్కువగానే అమ్ముతున్నాం. అదేవిధంగా గృహోపకరణాల (ఫర్నీచర్) అమ్మకాలు చేపట్టినప్పుడు, మలేసియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు అవి కూడా 50 శాతం తక్కువగానే దిగుమతి చేసుకుంటున్నాం' అని ఫ్లిప్‌కార్ట్ ప్రైవేట్ లేబుల్ వ్యాపార విభాగాధిపతి ఆదర్శ్ మేనన్ తెలిపారు. ప్రసిద్ధ బ్రాండ్లవి కొనుగోలు చేయాలా, ప్రైవేటు లేబుల్‌వా అనేది వినియోగదారులే వదిలేస్తామని వివరించారు. మొత్తం 150 పరిశ్రమలతో తమకు అనుబంధం ఉందని, ఇందులో 100 దేశీయంగానే ఉన్నాయని ఆదర్శ్ పేర్కొన్నారు. అయితే దేశీయంగా, చైనా, మలేసియాల్లో సమీకరించే ఉత్పత్తుల విలువను శాతాల్లో వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. వాల్‌మార్ట్ ప్రైవేటు లేబుల్ ఉత్పత్తులు కూడా దేశీయంగా తయారవుతున్నందున, తయారీ భాగస్వాములకు మేలు కలుగుతోందని గుర్తు చేశారు. స్థానికంగా సమీకరించడం వల్ల భారీఎత్తున అమ్మకాలకు వీలవుతోందని, అదేవిధంగా అంతర్జాతీయంగా విక్రయించేందుకు అవసరమైన నాణ్యతా ప్రమాణాలతో రూపొందించడం ఇక్కడి తయారీదార్లకు అలవాటవుతోందని విశ్లేషించారు. సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి (ఎంఎస్ఎంఈ) సంస్థల వృద్ధికి ఇది ఎంతో ఉపకరిస్తోందని తేల్చి చెప్పారు.

అధిక సుంకాల భారం నివారించేందుకు..

స్మార్ట్‌ఫోన్లతో పాటు అధిక విలువ కలిగిన ఎలక్ట్రానిక్స్‌పై దిగుమతి సుంకాల భారం అధికమవుతున్నందున, యాపిల్ వంటి అంతర్జాతీయ దిగ్గజం కూడా దేశీయంగా తయారీ చేపడుతోంది. ఫాక్స్‌కాన్, విస్ట్రాన్ వంటి భాగస్వాములతో కలిసి ఐఫోన్లను దేశీయంగా తయారు చేయిస్తోంది.

- అమెరికా దిగ్గజం అమెజాన్ అనుబంధ దేశీయ ఇకామర్స్ పోర్టల్ కూడా ప్రైవేటు లేబుల్ ఉత్పత్తులను ఇక్కడే సమీకరిస్తోంది. ఈ సంస్థ కూడా ఏసీలు, సెల్‌ఫోన్ ఉపకరణాలు, నిత్యావసరాలు, ఇళ్ల, వంట గదుల్లో ఉపయోగించే ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, శిశు సంరక్షణ ఉత్పత్తులను ప్రైవేటు లేబుళ్లవి విక్రయిస్తోంది.

సంప్రదాయ దుకాణదారుల నిరసన

ప్రైవేట్ లేబుల్ ఉత్పత్తుల విక్రయంపై రెండేళ్లుగా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లకు సంప్రదాయ దుకాణదారుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. వీటిని తక్కువ ధరలకు విక్రయిస్తూ, తమ అమ్మకాలకు, లాభాలకు ఆయా పోర్టళ్లు గండికొడుతున్నాయన్నది వ్యాపారుల ఆందోళన. తమ మనుగడే దెబ్బతినేలా ఉందని వారు నిరసన కార్యక్రమాలూ నిర్వహిస్తున్నారు. గత డిసెంబరులో ఇ-కామర్స్ విపణికి ప్రతిపాదించిన నిబంధనల ప్రకారం.. ప్రైవేటు లేబుళ్లను ఈ పోర్టళ్లు నిర్వహించకూడదు. అనంతరం దీన్నుంచి మినహాయింపు ఇచ్చారు.

- ఆయా విభాగాల్లో సరకులు/ఉత్పత్తుల నాణ్యత, ధరల పరంగా అంతరం ఉన్నప్పుడు మాత్రమే, తాము ప్రైవేటు లేబుల్ ద్వారా ప్రవేశిస్తున్నామన్నది ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వాదన.

భారత్‌లో సొంత ఆర్ & డీ కేంద్రం

- రియల్‌మి సీఈఓ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: స్మార్ట్ ఫోన్ల సంస్థ రియల్‌మి ఈ ఏడాది చివరికల్లా 10-15% మార్కెట్ వాటా సాధించాలని లక్ష్యంగా విధించుకుంది. గత ఏడాది లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఏడాదికి 15 కోట్ల మొబైళ్లు అమ్ముడవుతున్నాయనీ, ఇక ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 7% మార్కెట్ వాటా సాధించామని రియల్‌మి ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాధవ్ సేథ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన రియల్‌మి సీ2 ఫోన్లను ఆవిష్కరించారు. ఈ ఫోన్లు ఆఫ్‌లైన్ స్టోర్లలో జూన్ 15 నుంచి లభించనున్నాయి. విక్రయాలను పెంచుకునేందుకు వీలుగా 50 నగరాల్లో ఇప్పుడున్న 8,000 స్టోర్ల సంఖ్యను 2019 చివరికల్లా 150 పట్టణాల్లో 20,000 స్టోర్లకు విస్తరించేందుకు చూస్తున్నట్లు చెప్పారు. ఈ ఒప్పో అనుబంధ కంపెనీ దేశంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోంది. దేశీయ అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ఫోన్లను తయారు చేసేందుకు వీలుగా సొంత కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చూస్తున్నామని మాధవ్ తెలిపారు. ఫోన్లను పరిశీలించేందుకు మాళ్లలో ఎక్స్‌పీరియన్స్ స్టోర్లను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. భారత్‌లో ఒకటి రెండు నెలల్లో ఎక్స్ సిరీస్ పేరుతో 5జీ మొబైళ్లను విడుదల చేయబోతున్నామని ప్రకటించారు. వీటి ధర రూ.20వేల దరిదాపుల్లో ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం నాలుగు సిరీసులలో 8 మోడళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక మూడు రకాలుగా లభిస్తున్న సీ2 మొబైల్ ధర రూ.5,999 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు.

రియల్‌మి సీ2 మొబైళ్లను ప్రదర్శిస్తున్న మాధవ్ సేథ్

హీరో మోటోకార్ప్‌కు బీఎస్-VI గుర్తింపు

దిల్లీ: హీరో మోటోకార్ప్‌కు అరుదైన గుర్తింపు లభించింది. కంపెనీ స్ప్లెండర్ ఐస్మార్ట్ మోడల్‌కు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ) బీఎస్-VI గుర్తింపు దక్కింది. దేశంలో ఈ గుర్తింపు పొందిన తొలి ద్విచక్రవాహన సంస్థ హీరో మోటోకార్ప్‌యే కావడం గమనార్హం. తాజా గుర్తింపుతో బీఎస్-VI నిబంధనలతో స్ప్లెండర్ ఐస్మార్ట్ మోడల్ ఉత్పత్తిని కంపెనీ ప్రారంభించుకోవచ్చు. జయపూర్‌లో కంపెనీ ఆర్‌అండ్‌డీ హబ్‌లో బీఎస్-VI ఉద్గార నిబంధనలతో మోటార్‌సైకిల్ డిజైన్, అభివృద్ధి చేశారు. హీరో మోటోకార్ప్ ఉన్నతాధికారులకు ఐసీఏటీ డైరెక్టర్ దినేశ్ త్యాగి గుర్తింపు పత్రం అందజేశారు.

మార్కెట్ కబుర్లు

- భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ (బెల్) నుంచి రూ. 47.2 కోట్ల కొత్త ఆర్డరు దక్కించుకున్నట్లు ఆర్‌పీఐ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రకటించింది.
- ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో రూ.2,500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంటుకు పర్యావరణ అనుమతులు లభించినట్లు అల్ట్రాటెక్ సిమెంట్ వెల్లడించింది.
- న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన ఎరోస్ ఇంటర్నేషనల్ సంస్థ అక్కడి వాటాదార్ల నుంచి షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయబోతున్నట్లు ప్రకటించింది. వీటి విలువ 20 మిలియన్ డాలర్లు (సుమారు రూ.139 కోట్లు).
- ఎల్‌అండ్‌టీ సంస్థకు చెందిన నిర్మాణ విభాగానికి దేశీయంగా, అంతర్జాతీయంగా పలు పెద్ద ఆర్డర్లు లభించినట్లు సంస్థ తెలిపింది. రూ.2,500 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల విలువైన కాంట్రాక్టుల్ని పెద్ద ఆర్డర్లుగా ఎల్ అండ్‌టీ విభజించింది.
- జేపీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థను కొనుగోలు చేసేందుకు ఎన్‌బీసీసీ చేసిన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఓటు వేసేందుకు రుణదాతలకు అవకాశం ఉందని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ స్పష్టం చేసింది.
- దేశీయంగా అతి పెద్ద కార్ల తయారీ సంస్థ అయిన మారుతీ సుజుకీ గత నెలలో వాహన ఉత్పత్తిని గణనీయంగా 18.1 శాతం తగ్గించినట్లు ఎక్స్ఛేంజీలకు తెలిపింది.
- జమ్ము అండ్ కశ్మీర్ బ్యాంక్‌కు 3 నెలల కాలానికి తాత్కాలిక చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఆర్‌కే చిబ్బెర్ నియామకానికి ఆర్‌బీఐ ఆమోదం తెలిపింది.
- మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఎస్‌వీపీ విద్యుత్ ప్లాంట్లు నిర్మించడానికి రూ.520 కోట్ల ఆర్డర్లు దక్కించుకున్నట్లు బెల్ ప్రకటించింది.
- జేపోర్ అండ్ టీజీ అప్పరెల్ అండ్ డెకోర్ సంస్థను ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ (ఏబీఎఫ్‌ఆర్‌ఎల్) కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ కొనుగోలు విలువ సుమారు రూ.110 కోట్లు.
- తీవ్రమైన ప్లేక్ సోరియాసిస్ వ్యాధిని అదుపు చేసేందుకు ఉద్దేశించిన ఒక ఔషధ మూలకణం పై 'ఫేజ్- 2బి' దశలో సానుకూలమైన ఫలితాలు వచ్చినట్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ లిమిటెడ్ వెల్లడించింది.

ఐటీ షేర్లు నడిపించాయ్

- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- 11900 ఎగువకు నిఫ్టీ

సమీక్ష

సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు దన్నుగా నిలిచింది. మెక్సికోపై విధించిన సుంకాలను అమెరికా రద్దు చేయడంతో అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా మారాయి. బలహీన అమెరికా ఉద్యోగ గణాంకాలతో ఫెడ్ వడ్డీ రేట్ల కోత విధించొచ్చన్న అంచనాలు పెరిగాయి. అయితే ఎన్‌బీఎఫ్‌సీలపై ఆందోళనలు జోరుకు కళ్లెం వేశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 19 పైసలు తగ్గి 69.65 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 39,787.33 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 39,979.48 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే మదుపర్ల లాభాల స్వీకరణతో డీలాపడిన సూచీ.. ఒకానొకదశలో 39,619.97 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 168.62 పాయింట్ల లాభంతో 39,784.52 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ కీలకమైన 11,900 పాయింట్ల ఎగువకు చేరింది. 52.05 పాయింట్లు పెరిగి 11,922.70 దగ్గర స్థిరపడింది.

- మార్కెట్ విలువ పరంగా అత్యంత విలువైన కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను టీసీఎస్ వెనక్కినెట్టింది. సోమవారం ట్రేడింగ్ ముగిసేనరికి టీసీఎస్ మార్కెట్ విలువ రూ.8,37,194.55 కోట్లుగా నమోదైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.8,36,024.08 కోట్ల మార్కెట్ విలువతో పోలిస్తే, ఇది రూ.1,170.47 కోట్లు అధికం.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 లాభాలతో ముగిశాయి. టీసీఎస్ 2.39%, ఇన్ఫోసిస్ 1.93%, భారతీ ఎయిర్‌టెల్ 1.60%, ఐటీసీ 1.34%, ఎల్ అండ్ టీ 1.25%, యాక్సిస్ బ్యాంక్ 1.24%, పవర్‌గ్రిడ్ 1.23%, హెచ్‌సీఎల్ టెక్ 1.17%, హిందుస్థాన్ యునిలీవర్ 0.96%, టాటా స్టీల్ 0.94% దొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. యెస్ బ్యాంక్ 2.89%, టాటా మోటార్స్ 1.92%, కోల్ ఇండియా 1.89%, ఓఎన్‌జీసీ 1.67% మేర నష్టపోయాయి.

5 ఏళ్లు ప్రాక్టీస్ నుంచి తప్పించండి!

- ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ ఆడిటర్లపై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన ప్రభుత్వం

ముంబయి: ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు ఆడిటర్లుగా వ్యవహరించిన డెలాయిట్, బీఎస్ఆర్ అసోసియేట్స్ సంస్థలను ప్రాక్టీస్ నుంచి అయిదేళ్ల పాటు డీబార్ చేయాలని కోరుతూ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దరఖాస్తు సమర్పించింది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూపునకు ఉన్న 348 అనుబంధ సంస్థల్లో ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కూడా ఒకటి. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూపులోని ఒక్కో సంస్థ గత సెప్టెంబరు నుంచి డిఫాల్ట్ కావడంతో, అక్టోబరు 1న ప్రభుత్వం ఆ గ్రూపు బోర్డును రద్దు చేసి తన ఆధీనంలోకి తీసుకుంది. ఇదిలా ఉంటే, ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు 2017-18లో ఆడిటర్‌గా వ్యవహరించిన డెలాయిట్, ప్రస్తుత ఆడిటర్‌గా కొనసాగుతున్న బీఎస్ఆర్ అసోసియేట్స్‌లపై ప్రభుత్వం ఎన్‌సీఎల్‌టీకి వెళ్లింది. సంస్థలో ఆర్థిక అవకతవకలు జరుగుతున్న విషయం ఆడిటర్లకు తెలిసినా, వారు వాటిని గోప్యంగా ఉంచి ఆర్థిక ఫలితాలను ఆడిట్ చేసిన నేపథ్యంలోనే కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది.

రూ.225 కోట్లతో ఏఆర్ఎల్ టైర్స్ ఉత్పత్తి కేంద్రం

అమిత్ కుమార్ అగర్వాల్

ఈనాడు, హైదరాబాద్: వాహన టైర్లు, ట్యూబులు ఉత్పత్తి చేసే అగర్వాల్ రబ్బర్ లిమిటెడ్ (ఏఆర్ఎల్ టైర్స్) తెలంగాణలో నూతన ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తోంది. 40 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ ప్లాంటు కోసం దాదాపు రూ.225 కోట్ల పెట్టుబడిని పెడుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఈ సంస్థకు ఇప్పటికే ఇక్కడ రెండు ఉత్పత్తి కేంద్రాలున్నాయి. కొత్త ప్లాంటు సదాశివపేటలో నిర్మాణ దశలో ఉందని, వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఇది పూర్తికావచ్చని ఏఆర్ఎల్ టైర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ కుమార్ అగర్వాల్ తెలిపారు. ఇప్పటికే ఉన్న రెండు ప్లాంట్ల నుంచి రోజుకు 70 మెట్రిక్ టన్నుల టైర్లు ఉత్పత్తి అవుతుండగా.. కొత్త ప్లాంటు నిర్మాణం పూర్తయితే 150 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి చేరుకుంటుందని చెప్పారు. రోజుకు 50వేల ట్యూబులను ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ద్విచక్ర, మూడు చక్రాల వాహనాలతోపాటు, వ్యవసాయ యంత్రాలు, బస్సులు, ట్రక్కుల టైర్లను ఎక్కువగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. వీటితోపాటు తేలికపాటి విమానాలకు, రక్షణ రంగంలో వాడే వాహనాలకు ట్యూబులను ఉత్పత్తి చేస్తున్నట్లు వివరించారు. ప్రారంభంలో ట్యూబులను మాత్రమే తయారు చేసినప్పటికీ.. ఇప్పుడు టైర్ల ఉత్పత్తిలోనూ వృద్ధి సాధించినట్లు చెప్పారు. మొత్తం 1,700 మంది ఉద్యోగులు ఉన్నారనీ, కొత్త ప్లాంటు పూర్తిగా యాంత్రికమే అయినప్పటికీ 500 మందికి ఉద్యోగావకాశాలు ఉంటాయని చెప్పారు. ఏడాదికి రూ.300 కోట్ల టర్నోవర్‌ను సాధించామనీ, రానున్న మూడేళ్లలో రూ.1,000 కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా విధించుకున్నట్లు తెలిపారు. మొత్తం వ్యాపారంలో 50శాతానికి పైగా ఎగుమతుల నుంచే వస్తోందని, 50కి పైగా దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని పేర్కొన్నారు.

కోడిగుడ్లు

10వ ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(వందకు రూపాయలలో)

హైదరాబాద్	355	పరంగల్	358
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	400
బెంగళూరు	385	చెన్నై	420
11వ తేదీకి...		చిత్తూరు	413
విజయవాడ/గోదావరి	357	నమక్కల్	405

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 425.75 (425.20) 2374282
ASIAN PAINTS 1422.60 (1418.35) 800967
AXIS BANK LT 814.15 (804.00) 5923875
BAJAJ AUTO L 2989.80 (2961.40) 155660
BAJAJ FINANC 3519.60 (3509.45) 983274
BAJAJ FINSER 8304.45 (8202.35) 186362
BHARTI AIRTE 363.45 (357.10) 5882086
BHARTI INFRA 281.95 (279.65) 3384305
BPCL 389.65 (403.00) 5442044
BRITANNIA 2994.30 (2899.30) 477974
CIPLA 554.55 (549.50) 1708042
COAL INDIA L 259.30 (265.55) 4916941
DR. REDDYS 2629.25 (2580.70) 622985
EICHER MOTOR 20131.45 (19997.75) 42626
GAIL 307.25 (313.85) 7120560
GRASIM IND 880.95 (871.45) 1270546
HCL TECH 1091.20 (1079.60) 1028004
HDFC 2194.05 (2210.85) 2484187
HDFC BANK 2440.20 (2447.65) 1769285
HERO MOTOCOR 2745.00 (2762.80) 493407
HINDALCO IND 198.25 (194.80) 3880878
HINDUSTAN UN 1852.50 (1830.75) 814577
ICICI BANK 416.10 (416.60) 13074522
INDIABULLS H 733.35 (731.10) 7365637
INDIAN OIL 160.65 (163.80) 6905925
INDUSINDBANK 1551.65 (1552.20) 3211040
INFOSYS LTD 753.50 (739.10) 4435148
ITC 279.40 (275.25) 8615348
JSW STEEL LT 266.85 (262.40) 3704937
KOTAK MAHIND 1502.60 (1511.80) 1715150
LARSEN & TOU 1532.10 (1513.85) 1608705
M&M 646.95 (644.05) 2306052
MARUTI SUZIK 6969.95 (6946.25) 395116
NTPC LTD 135.00 (135.15) 7295669
ONGC 164.65 (167.50) 10866149
POWER GRID C 194.30 (191.75) 6317937
RELIANCE IND 1319.15 (1314.90) 5380148
SBI 344.30 (342.05) 20500542
SUN PHARMA 402.05 (399.25) 4966075
TATA CONSULT 2231.50 (2181.75) 2080593
TATA MOTORS 166.20 (169.50) 20209862
TATA STEEL L 486.05 (482.10) 6850917
TECH MAHINDR 768.20 (750.75) 2539412
TITAN IND 1277.00 (1268.95) 1516266
ULTRATECH 4597.85 (4572.85) 436601
UPL LIMITED 1016.40 (1019.45) 1504225
VEDANTA LIMI 165.20 (164.20) 6315883
WIPRO 297.10 (295.05) 7481893
YES BANK LTD 135.90 (139.90) 86396912
ZEE ENTERTAI 335.35 (340.20) 7567914

నిఫ్టీ నెక్స్ 50

ABB 1563.40 (1564.15) 196369
ACC 1589.40 (1596.50) 433071
AMBUJA CEMEN 223.10 (222.25) 2438810
ASHOK LEYLAN 90.70 (90.00) 15352497
AUROBIND PHA 627.15 (619.40) 1835124
AVENUE SUPER 1299.70 (1296.65) 194485
BAJAJ HOLDIN 3658.05 (3609.35) 41366
BANDHAN BANK 552.45 (559.25) 314593
BANK OFBAROD 117.95 (121.30) 27897842
BHEL 68.20 (68.50) 8628229
BIOCON LTD 530.35 (528.85) 1617739
BOSCH LTD 17085.45 (17052.00) 11388
CADILA HEALT 247.60 (242.70) 3582549
COLGATE PALM 1154.15 (1155.80) 189108
CONTAINER 533.75 (524.30) 366606
DABUR INDIA 409.30 (404.15) 2216371
DIVIS LAB 1561.05 (1566.25) 363052
DLF LIMITED 189.25 (190.05) 7653848
GENERAL INS 218.95 (218.80) 47686
GODREJ CONSU 691.90 (691.50) 501581
HAVELLS INDI 792.05 (788.65) 1193650
HDFC AMC LIM 1830.10 (1819.05) 63927
HDFC STAND L 450.15 (451.40) 1453151
HINDUSTAN ZI 241.80 (239.00) 862372
HPCL 305.60 (311.40) 4409258
ICICI LOMBAR 1189.60 (1191.70) 982236
ICICI PRU LI 379.00 (385.55) 2072780
IDEA CELLULR 12.80 (13.40) 49800929
INTERGLOBE A 1657.50 (1661.20) 659669
L&TFIN.HOLD 124.10 (124.95) 5937938
LUPIN 727.55 (730.20) 1022190
MARICO LIMIT 377.40 (373.85) 2323261
MCDOWELL 563.65 (551.30) 2199870
MOTHERSON 119.05 (114.55) 13373348
MRF 55594.55 (55597.50) 4118
NHPC LTD 24.75 (25.00) 2342404
NMDC LTD 104.25 (104.55) 2430534
ORACLE FIN S 3304.35 (3282.60) 19586
P&G HYG&HEAL 10944.40 (10873.05) 3068
PAGE INDUSTR 20167.00 (19961.45) 37907
PETRONET LNG 238.50 (238.05) 1633239
PIDILITE IND 1283.45 (1255.70) 602858
PIRAMAL ENTE 2125.45 (2106.45) 496755
SAIL 48.20 (48.30) 15443180
SBI LIFE INS 699.10 (698.45) 449355
SHREE CEMENT 20807.65 (20739.25) 26806
SHRIRAM TRAN 1076.05 (1092.60) 1354550
SIEMENS 1269.95 (1253.25) 436540
THE NEW INDI 160.70 (162.45) 33636
UNITED BREWE 1339.55 (1309.65) 503169

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 4 (4) 1360
AISHWARYA TE 2.45 (2.34) 78096
ALPHAGEO 456 (453.65) 413
AMAR RAJA BA 630.60 (616.75) 8701
ANDHRA BANK 23.90 (24) 41529
ANDHRA CEMEN 4.39 (4.46) 13515
ANDHRA PAPER 420.10 (422.05) 4179
ANDHRA PETRO 55.95 (54.85) 47957
ANDHRA SUGAR 338.60 (345.85) 8023
ANJANI PORTL 173.15 (170.05) 351
ASTRA MICROW 90.75 (88.75) 37522
AUROBINDO PH 627.15 (619.80) 78627
AVANTEL SOFT 261.85 (274.20) 1698
AVANTI FEEDS 352.10 (358.15) 20809
AVON ORG 2.40 (2.39) 983
BALAJI AMIN 400.65 (399.85)

గూగుల్‌కు వార్తలపై రూ.33,000 కోట్లు

2018లో ఆర్జించిన మొత్తం

వాషింగ్టన్: గూగుల్‌కు గతేడాది వార్తలపై రూ. 33,000 కోట్ల (4.7 బిలియన్ డాలర్ల) ఆదాయం లభించిందని ఒక అధ్యయనం వెల్లడించింది. గూగుల్‌లో శోధన, గూగుల్ న్యూస్ ద్వారా 2018లో ఇంతటి ఆదాయం గూగుల్‌కు లభించిందని న్యూస్ మీడియా అలయన్స్ (ఎన్ఎంఎ) తెలిపింది. అమెరికాలోని 2,000 వార్తా పత్రికలకు ఎన్ఎంఎ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆన్‌లైన్ ప్రకటనల ఆదాయం తగ్గిపోతున్నందున కొన్ని మీడియా సంస్థలు మూతబడుతున్నా, గూగుల్‌కు మాత్రం ఆదాయం బాగుందని ఎన్ఎంఎ అధ్యయనం విశదీకరించింది. దిగ్గజ టెక్నికల్ కంపెనీలు, ప్రసార మాధ్యమాల మధ్య అంతర్గత సంబంధాలపై చట్టసభల సంఘం మంగళవారం విచారించనున్న నేపథ్యంలో, వెలుగుచూసిన ఈ నివేదిక ప్రకారం..

- గూగుల్ వ్యాపారంలో వార్తలు ముఖ్యభూమిక పోషిస్తున్నాయి. గూగుల్‌కు 470 కోట్ల డాలర్ల ఆదాయం రావడంలో, వార్తలను రూపొందించిన విలేకరులకూ పాత్ర ఉంది.
- గతేడాది డిజిటల్ ప్రకటనల ద్వారా అమెరికా వార్తా పరిశ్రమ మొత్తం కలిపి 5.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.35,700 కోట్ల) ఆదాయం ఆర్జించగా, గూగుల్ అర్జన దీనికి సమీపంలో ఉండటం గమనార్హం.
- గూగుల్ ఆదాయంపై ఈ అంచనా సంప్రదాయకంగా నిర్వహించిందే. వినియోగదారులు వార్తలను శోధించే క్రమంలో వారు చేసే ప్రతి క్లిక్‌పై, గూగుల్‌కు లభించే వ్యక్తిగత డేటా విలువను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ సమాచారం నుంచి కూడా గూగుల్‌కు ఆదాయం లభించే వీలుంది.
- గూగుల్ ట్రెండింగ్ విచారణలో 40 శాతం క్లిక్‌లు వార్తలకు సంబంధించే ఉంటున్నాయి. ఈ వార్తల కోసం గూగుల్ ఏమీ చెల్లింపు జరపదు. కానీ వార్తా పత్రికల్లోని ప్రధాన శీర్షికలను గూగుల్ చూపుతుండటం గమనార్హం.
- గూగుల్‌తో పాటు ఫేస్‌బుక్ కూడా వార్తా పత్రికలకు ప్రధాన పంపిణీదార్లుగా ఉన్న సంగతి విదితమే. ఈ రెండు సైట్ల నుంచే 80 శాతం క్లిక్‌లు వేరే సైట్లకు దారితీస్తాయి. అయితే వినియోగదారులు ఆయా సైట్లకు ఆకర్షితులయ్యేలా గూగుల్, ఫేస్‌బుక్ ప్రత్యేక చర్యలేమీ తీసుకోవు. కానీ మధ్యవర్తిగా వ్యవహరించినందుకు ఆన్‌లైన్ ప్రకటనల ఆదాయంలో వాటా మాత్రం పొందుతుంటాయి. ఇందువల్ల వార్తా సంస్థలకు ఆదాయం తగ్గిపోతోంది.
- వార్తలనేవి పౌర సమాజాన్ని బలపరుస్తాయి. ఒకవేళ పాత్రికేయ వృత్తి కనుక అంతరిస్తే, పాఠకులు, రచయితలు, రాజకీయ నాయకులకు వేదన తప్పదు. గణతంత్ర పరిరక్షణకు పాత్రికేయ వృత్తి ఎంతో కీలకం.

పెద్దకార్లలో అగ్రగామి 'డిజైర్'

ముంబయి: భారత్‌లో ఎక్కువగా అమ్ముడుపోతున్న కాంపాక్ట్ సెడాన్‌గా 'డిజైర్' ఆగ్రస్థానం కొనసాగించిందని వాహన దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ప్రకటించింది. పదేళ్లకు పైగా డిజైర్ ఆగ్రస్థానంలో కొనసాగుతోందని తెలిపింది. ఇప్పటి వరకు కంపెనీ 19 లక్షలకు పైగా డిజైర్‌లను విక్రయించింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో మారుతీ 2.5 లక్షలకు పైగా డిజైర్‌లను అమ్మింది. సగటున నెలవారీ విక్రయాలు 21,000 యూనిట్లుగా నమోదయ్యాయి. కాంపాక్ట్ సెడాన్ విభాగంలో డిజైర్‌కు 55 శాతం మార్కెట్ వాటా ఉంది. ఆకర్షణీయమైన ఇంటీరియర్స్, అధునాతన భద్రతా ఫీచర్లు కలిగిన కొత్త డిజైర్‌ను కంపెనీ 2017లో విడుదల చేసింది. డేట్రైమ్ రన్నింగ్ ల్యాంప్స్, అలాయ్ వీల్స్, రేర్ ఏసీ వెంట్స్, స్మార్ట్‌ప్లే ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థ వంటి ఫీచర్లు ఉన్నాయి. 'మారుతీ సుజుకీ విజయగాథలో డిజైర్‌ది కీలక పాత్ర. డిజైర్‌తో కొత్త కాంపాక్ట్ సెడాన్ విభాగాన్ని సృష్టించాం. డిజైర్‌ను ఆదరించినందుకు వినియోగదారులకు కృతజ్ఞతలు' అని మారుతీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్, అమ్మకాలు) శశాంక్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

ఈనాడు బిజినెస్

తెలుగు రాష్ట్రాల్లో యాక్సిస్ బ్యాంక్ కొత్త శాఖలు

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఖాతాదారులను ఆకర్షించడంతోపాటు, డిపాజిట్ మొత్తాలను పెంచుకునేందుకు యాక్సిస్ బ్యాంక్ కొత్త శాఖలను ఏర్పాటు చేయబోతోంది. ఇప్పటికే తెలంగాణలో 135 శాఖలు ఉండగా, ఈ ఏడాదిలో కొత్తగా 20 శాఖలు, ఆంధ్రప్రదేశ్‌లోని 150శాఖలకు తోడు మరో 17 బ్రాంచీలను ప్రారంభిస్తామని యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్ రవి నారాయణ్ తెలిపారు. తెలంగాణలో 979, ఏపీలో 400 ఏటీఎంలు ఉన్నాయనీ, అవసరాన్ని బట్టి, వీటి సంఖ్య పెంచుతామన్నారు. శాఖల్లో సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌లను ఏర్పాటు చేస్తున్నామనీ, దీని వల్ల బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు సులువుగా, వేగంగా సేవలను అందించేందుకు వీలవుతుందని ఆయన అన్నారు.

బేసిక్ ఖాతాలకూ చెక్‌బుక్‌లు

ముంబయి: కనీస నిల్వ అవసరం లేని బేసిక్ ఖాతాదార్లకు చెక్‌బుక్‌తో పాటు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు బ్యాంకులకు అవకాశం లభించింది. బేసిక్ సేవింగ్స్‌బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాలకు సంబంధించి నిబంధనలను ఆర్‌బీఐ సడలించడమే ఇందుకు కారణం. ఈ సదుపాయాలు కల్పించాము కనుక, ఖాతాలో నగదు నిల్వ చేయాలని ఖాతాదార్లపై బ్యాంకులు ఒత్తిడి చేయకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం బేసిక్ ఖాతాలకు అమలవుతున్న సేవలకు అదనంగా చెక్‌బుక్ వంటి మరిన్ని సేవలను బ్యాంకులు అందించవచ్చు. వాటికి ఛార్జీలు ఉన్నాయా, లేదా అనేది బ్యాంకులు వెల్లడించాల్సి ఉంటుంది. ఈ సేవలందించినంత మాత్రాన అవి బీఎస్‌బీడీ ఖాతాలు కాకుండా పోవు. అందువల్ల ఎంతకాలమైనా ఉచిత కనీస సేవలు ఆ ఖాతాలకు అమలు కావాల్సిందే అని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అందరికీ ఆర్థిక సేవలు అందించాలనే భావనతో, కనీస నిల్వ అవసరం లేకుండా, ఎటువంటి ఛార్జీలు లేకుండా కొన్ని సేవలు అందించే ప్రాతిపదికన, బీఎస్‌బీడీ ఖాతాలను ప్రారంభించాలని గతంలో బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. ప్రస్తుతం అందిస్తున్న సేవలివీ..

- ఏటీఎం నుంచి నెలకు 4 సార్లు నగదు ఉపసంహరణకు అవకాశం కల్పిస్తూ ఏటీఎం/డెబిట్ కార్డు ఉచితంగా అందివ్వాలి.
- నెలలో ఎన్నిసార్లు, ఎంతమొత్తంలో అయినా బీఎస్‌బీడీ ఖాతాల్లో నగదు జమచేయొచ్చు.

వద్దులే కొన్నాళ్లు ఆగుదాం..!

- పేరుకుపోయిన ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల నిల్వలు
- మందకొడి గిరాకీనే కారణం
- ఉత్పత్తి నిలిపివేతకు కంపెనీలు నిర్ణయం

దిల్లీ: అమ్మకాలకు గిరాకీ అంతంతమాత్రంగా ఉండటంతో పేరుకుపోయిన నిల్వలను తగ్గించుకునేందుకు ఉత్పత్తిని నిలిపివేయాలని ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు, ద్విచక్ర వాహన కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటిల్లో మారుతీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ లాంటి దిగ్గజాలు ఉండటం గమనార్హం. మే నుంచే ప్లాంట్ల మూసివేత ప్రణాళికను ఇవి అమలు చేస్తున్నాయి. జూన్‌లోనూ దీనిని కొనసాగించనున్నామని ఇప్పటికే ప్రకటించేశాయి కూడా. అయితే ఈ పరిణామం వల్ల ఉత్పత్తి, అమ్మకాల వృద్ధి లక్ష్యాలను సాధించడం కంపెనీలకు కష్టమయ్యే అవకాశం ఉంది.

ప్యాసింజర్ వాహన నిల్వలు 5 లక్షలకు పైనే

జూన్ ప్రారంభం నాటికి డీలర్ల వద్ద ప్యాసింజర్ కార్ల నిల్వలు 5 లక్షలకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. వీటి విలువ సుమారు రూ.35,000 కోట్ల (5 బిలియన్ డాలర్లు) వరకు ఉండొచ్చని అంచనా. అందుకే ప్యాసింజర్ వాహనాలు తయారు చేసే 10 ప్రముఖ కంపెనీల్లో ఏడు కంపెనీలు మే, జూన్‌లో ప్లాంట్లను మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నాయి. 'గిరాకీకి బలహీన పరిస్థితులు నెలకొన్నప్పుడు తయారీని కొనసాగించడం, నిల్వలను పెంచడంలో అర్థం లేదు. అందుకే ఆధారంగా మేలో తమ ఉత్పత్తిని తగ్గించుకున్నామని, జూన్‌లోనూ దీనిని కొనసాగించనున్నామ'ని టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల విభాగం అధ్యక్షుడు మయాంక్ పరీక్ తెలిపారు. ద్విచక్రవాహనాల నిల్వల విషయానికొస్తే 30 లక్షకు వరకు ఉండొచ్చు. వీటి విలువ రూ.17,500 కోట్ల (2.5 బిలియన్ డాలర్లు) వరకు ఉంటుందని లెక్కగడుతున్నారు.

ఉత్పత్తి 20-25% తగ్గొచ్చు..

ప్లాంట్ల మూసివేత కారణంగా మే- జూన్ కాలంలో ఉత్పత్తి 20-25% మేర తగ్గొచ్చని విశ్లేషకులు అంచనా చేస్తున్నారు. దీని వల్ల డీలర్ల వద్ద, ప్లాంట్లలో పేరుకుపోయిన నిల్వలపై ఒత్తిడి తగ్గుతుందని అంటున్నారు. సాధారణం కంటే 50 శాతానికి మించి నిల్వలు పేరుకుపోవడంతో డీలర్లపై తీవ్ర ప్రభావం పడిందని అంటున్నారు. అమ్ముడుపోని విక్రయాలపై కూడా వారు జీఎస్‌టీ చెల్లించాల్సి వస్తుండటమే ఇందుకు కారణం. మే వరకు ఏడు నెలలుగా ప్యాసింజర్ వాహనాల విక్రయాలు తగ్గాయి. ఉద్యోగాల వృద్ధి నెమ్మదించడం, ఇంధన ధరలు పెరగడం, బ్యాంకింగేతర ఆర్థిక సంవత్సరాల్లో నగదు కొరత లాంటివి కొనుగోలుదారు సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం చూపడమే అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణం.

అది అసాధ్యమే

- 2025కు అన్నీ విద్యుత్తు ద్విచక్ర వాహనాల లక్ష్యం కష్టమే
- ఛార్జింగ్ స్టేషన్ల వంటి మౌలిక వసతులు భారీగా అవసరం
- దశలవారీ అమలే శ్రేయస్కరం
- బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్

దిల్లీ: పెట్రోల్/డీజిల్‌తో నడిచే ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌లను నిషేధించడంతో పాటు, ద్విచక్ర, త్రిచక్ర (ఆటో) వాహనాలన్నీ 2025 కల్లా పూర్తిగా విద్యుత్తుతో నడిచేలా చూడాలనుకోవడం అసాధ్యమని బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ కంపెనీ పేర్కొన్నాయి. వాస్తవిక దృక్పథంతో ప్రణాళికలు రూపొందించకపోతే, దేశంలో వాహన తయారీ రంగం గాడి తప్పుతుందని హెచ్చరించాయి. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (ఐసీఈ)లను ఆటోలకు విక్రయించడాన్ని 2023కు, 150 సీసీ ద్విచక్ర వాహనాలకు విక్రయించడాన్ని 2025 కల్లా నిలిపేయాలని ప్రభుత్వం యోచిస్తోందని వచ్చిన వార్తలపైన ఈ కంపెనీలు స్పందించాయి. దేశంలో విద్యుత్తు వాహనాల వినియోగానికి, సమగ్ర ప్రణాళికను వాస్తవిక దృక్పథంతో రూపొందించాలని వాహన తయారీదార్ల సంఘం (సియామ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో గడువులు నిర్దేశించే ముందు ప్రభుత్వం విస్తృతంగా సంప్రదింపులు జరపాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కూడా ప్రభుత్వానికి సూచించింది.

ఆచరణ సాధ్యం కాదు: రాజీవ్ బజాజ్

దేశంలో భారీ సంఖ్యలో తయారవుతున్న ద్విచక్ర, త్రిచక్ర వాహనాలన్నిటినీ 4-6 ఏళ్ల వ్యవధిలో విద్యుత్తుతో మాత్రమే నడిచేలా చూడాలనుకోవడం ఆచరణ సాధ్యం కాదు. ఏ తయారీ సంస్థ కూడా విద్యుత్తు విభాగంపై సరైన అనుభవం సాధించలేదు. ఒకవేళ 2020 ఏప్రిల్ నుంచి బీఎస్ 6 ప్రమాణాలు అమలు చేయాలని నిర్ణయించి, దానికి అత్యంత సమీప గడువులోనే విద్యుత్తుకు మారాలనడం సరికాదు. కార్లను వదిలేసి, ద్విచక్ర/త్రిచక్ర వాహనాలు మాత్రమే మారాలనడం ఏ రకంగా కాలుష్య నివారణకు ఉపయోగపడుతుందో తెలియాలి.

ఇలా చేయొచ్చు: దీనికి బదులుగా మరొక మధ్యేమార్గాన్ని అనుసరించవచ్చు. తొలిదశగా కార్పొరేట్ సగటు ఇంధన సామర్థ్య (కేఫే) ప్రమాణాలు అమలు చేయాలి. ఆదేవిధంగా దేశంలోనే అత్యంత కాలుష్యపూరిత నగరాలుగా మారిన వాటిలో అన్ని వాహనాలు విద్యుత్తుతోనే నడిచేలా 2023 లేదా 2025ను నిర్ణయించాలి. ఆయా నగరాలలో అమలు చేశాక, గడించిన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ఇతర ప్రాంతాలకు విస్తరింప చేయాలి.

వాహన తయారీ రంగమే ప్రమాదంలో పడుతుంది: వేణు శ్రీనివాసన్

కోట్ల మందిపై బలవంతంగా ఈ నిర్ణయాన్ని రుద్దాలనుకోవడం సరికాదు. ఇందువల్ల వినియోగదార్లే కాదు.. 40 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న వాహన తయారీ రంగమే ప్రమాదంలో పడుతుంది. దశలవారీగా, ఎటువంటి ఒడుదొడుకులు లేకుండా వాహనాలను విద్యుత్తు విభాగంలోకి మార్చడమే సరైనది. అధిక సామర్థ్యంతో పనిచేసే, సురక్షిత విద్యుత్తు వాహనాల తయారీకి కంపెనీలన్నీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. వినియోగదారులు కూడా ఆ విభాగానికి మారేందుకు సమయం ఇవ్వాలి. వారి సహకారంతోనే సులభంగా, విస్తృతంగా అమలు చేయడం సాధ్యపడుతుంది. సంప్రదాయ పెట్రోల్ బంకుల స్థానంలో, భారీగా ఛార్జింగ్ స్టేషన్ల అవసరం ఉంటుంది.

బీమా ప్రీమియంపై 18%

జీఎస్‌టీ

? నేను 2010 అక్టోబరులో ఫ్లాటు నిర్మాణం నిమిత్తం అగ్రిమెంటు కుదుర్చుకున్నాను. ఫ్లాటు విలువ రూ.12 లక్షలు. 2015 వరకు ఆ ఒప్పందం ప్రకారమే వాయిదాల పద్ధతిలో చెల్లించుకుంటూ వచ్చాను. 2012 లోపు నిర్మాణం పూర్తయ్యింది. ఇప్పుడు (జూన్, 2019లో) రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే జీఎస్‌టీ చెల్లించాలా? లేదా? చెల్లించాల్సి వస్తే ఎంత రేటు వర్తిస్తుందో తెలియజేయగలరు

- రామప్పన్నారావు, చీరాల

మీ ప్రశ్న ప్రకారం చూస్తే జీఎస్‌టీ అమల్లోకి రాకముందే మీరు చెల్లింపులన్నీ చేసినట్లు అర్థమవుతోంది. అందువల్ల మీరు రిజిస్ట్రేషన్ సమయంలో జీఎస్‌టీ చెల్లించనక్కర్లేదు. మీరు ఫ్లాటుకు డబ్బులు చెల్లించిన సమయంలో వ్యాట్, సేవా పన్నులు అమల్లో ఉన్నాయి. అందువల్ల వ్యాట్, సేవా పన్ను చెల్లించాల్సి ఉంటుంది తప్ప జీఎస్‌టీ కాదు. జీఎస్‌టీ చట్టంలోని నిబంధనల ప్రకారం.. జీఎస్‌టీ అమల్లోకి రాకముందు జరిగిన ఏ లావాదేవీకైనా సేవా పన్ను, వ్యాట్ చెల్లించకుంటే.. అప్పుడు జీఎస్‌టీ వర్తిస్తుంది. 2019 జూన్‌లో వర్తించే జీఎస్‌టీ రేటు.. నిర్మాణదారు ఎంపికపై ఆధారపడి ఉంటుంది. పాత జీఎస్‌టీ రేటు (12% లేదా 8%) లేదంటే కొత్త జీఎస్‌టీ రేట్లలో (5% లేదా 1%) దేనిని ఎంపిక చేసుకుంటే ఆ ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ముందుగా మీరు నిర్మాణదారును సంప్రదించి.. ఆయన దేనిని ఎంపిక చేసుకున్నారో అడిగి తెలుసుకోండి.



- సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

? నేను ఓ తయారీ సంస్థను నెలకొల్పాలని అనుకుంటున్నాను. జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌కు ఎలా దరఖాస్తు చేసుకోవాలనే విషయంపై గూగుల్ వీడియోల్లో చూసి దరఖాస్తు చేసుకున్నాను. అయితే పొరపాటున జీఎస్‌టీ రిజిస్ట్రేషన్- 13ను దాఖలు చేశాను. దాంతో 2019 మార్చిలో జీఎస్‌టీ యూఐఎన్/ ఎంబీసీ సంఖ్యను జారీ చేశారు. దానిని రద్దు చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కస్టమర్‌కేర్‌ను సంప్రదిస్తే.. జీఎస్‌టీ యూఐన్/ ఎంబీసీ సంఖ్యను రద్దు చేసుకోవడం కుదురదని చెప్పారు. ఇప్పుడు నేనేమి చేయాలో సలహా ఇవ్వగలరు

- శ్వేత

మీ ప్రశ్న ప్రకారం చూస్తే మీరు పొరపాటున యూఐఎన్ రిజిస్ట్రేషన్ పొందినట్లు అర్థమవుతోంది. మీరు సంబంధిత అధికార్లను సంప్రదించండి. జరిగినదంతా వివరిస్తూ ఉన్నతాధికారులకు, జీఎస్‌టీ నెట్‌వర్క్ అధికారులకు లేఖ రాయండి. ఎందుకంటే మీరు పొరపాటున పొందిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం కేవలం వాళ్ల చేతిలోనే ఉంది. రిజిస్ట్రేషన్ రద్దు అయ్యే వరకు ప్రతి నెలా శూన్య రిటర్న్‌లు దాఖలు చేయండి. లేకుంటే ఆలస్యం రుసుం చెల్లించాల్సి రావచ్చు.

? జీఎస్‌టీ శూన్య రిటర్న్‌లు దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తుంటే వెబ్ పేజీ తెరుచుకోవడంలేదు. ఈ సమస్య పరిష్కారానికి ఎవర్ని సంప్రదించాలో తెలియజేయగలరు

- గీతాంజలి ఎంటర్‌ప్రైజెస్

మీరు జీఎస్‌టీ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించండి. మీకు ఎదురవుతున్న సమస్యను ఇ-మెయిల్ లేదా ఫోన్ ద్వారా వివరించండి. అప్పుడు సమస్య పరిష్కారానికి సంబంధించి మీకు ఏమైనా సహాయం చేయగల్గుతారు. జీఎస్‌టీ లాగిన్ పేజీ కింద కుడివైపున జీఎస్‌టీ హెల్ప్‌డెస్క్, ఇ-మెయిల్, ఫోన్ నెంబర్లు ఉంటాయి.

? మేం విద్యుత్ డిజిటల్ మీటర్లను అమ్మే వ్యాపారం ఉంది. మా సంస్థకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ కూడా ఉంది. అయితే ఈ సంస్థ పేరు మీద మా ఇంటికి సంబంధించిన వస్తువులను ఏవైనా కొనుక్కుంటే జీఎస్‌టీ ఇన్‌పుట్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకునే వీలుందా? మెట్రో, బెస్ట్ ప్రైస్ కార్డులు కూడా ఉన్నాయి. వీటి మీదే ఇంటికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేస్తుంటాను. అందుకే దీనిపై నాకు సలహా ఇవ్వగలరు

- గిరిధర్, విజయవాడ

వ్యక్తిగత కొనుగోలుపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేసుకునేందుకు జీఎస్‌టీ చట్టంలోని నిబంధనల ప్రకారం వీల్లేదు. ఒకవేళ మీరు ఇలా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకొని ఉంటే.. వెంటనే దానిని రివర్సల్ చేసి ప్రభుత్వానికి చెల్లిస్తే మంచిది. జీఎస్‌టీ అధికారుల తనిఖీల సమయంలో ఈ విషయం బయటపడితే మీరు క్లెయిమ్ చేసుకున్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌నే కాదు దానిపైన వడ్డీని, జరిమానాను కూడా చెల్లించాల్సివస్తుంది.

? స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ అనే ఓ ప్రైవేట్ కంపెనీలో నేను జీవిత బీమా తీసుకున్నాను. నాలుగేళ్లుగా ప్రీమియం చెల్లిస్తున్నాను. అయితే ఇప్పుడు అదనంగా దానికి జీఎస్‌టీని కూడా చేరుస్తున్నారు. బీమాకు జీఎస్‌టీ వర్తిస్తుందా

- సత్యనారాయణ

అవును. బీమాకు 18% జీఎస్‌టీ వర్తిస్తుంది. అందువల్ల మీ నుంచి జీవిత బీమా సంస్థ జీఎస్‌టీని వసూలు చేస్తుండటం సరైనదే.

? మాకు ట్రేడింగ్ వ్యాపారం ఉంది. 2018-19లో అమ్మకాలు రూ.2.2 కోట్లుగా నమోదయ్యాయి. ప్రతి నెలా జీఎస్‌టీ రిటర్న్‌లు క్రమంతప్పకుండా దాఖలు చేస్తున్నాను. వాల్ల కు టర్నోవరు రూ.2 కోట్లు మించితే వేరే సీఏ ద్వారా ప్రత్యేకంగా ఆడిట్ చేసుకోవాల్సి ఉంటుందని మా ఆడిటర్లు చెబుతున్నారు. ఇందుకు విడిగా డబ్బులు చెల్లించాలని అంటున్నారు. జీఎస్‌టీఆర్-9ను దాఖలు చేయాలని సూచిస్తున్నారు. జీఎస్‌టీఆర్-9 అంటే ఆడిట్ నివేదికేనా? దీనిపై స్పష్టత ఇవ్వగలరు

- జగన్ మోహన్

మీ ఆడిటర్ చెప్పింది కరెక్టే. టర్నవరుతో సంబంధం లేకుండా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉన్న ప్రతి ఒక్కరు జీఎస్‌టీఆర్-9 వార్షిక రిటర్న్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. 2017-18 వార్షిక సంవత్సరానికి జీఎస్‌టీఆర్-9 దాఖలు గడువు 2019 జూన్ 30 కాగా.. 2018-19 వార్షిక సంవత్సరానికి 2019 డిసెంబరు 31. జీఎస్‌టీఆర్-9తో పాటు టర్నోవరు రూ.2 కోట్లు మించితే జీఎస్‌టీఆర్-9సీ రిటర్న్‌ను కూడా దాఖలు చేయాల్సి ఉంటుంది.

? మా పూర్వీకుల స్థలాన్ని నిర్మాణం నిమిత్తం ఓ నిర్మాణదారుకు అప్పగించాం. మొత్తం 15 ఫ్లాట్లు నిర్మించాల్సి ఉంది. స్వాధీన ధ్రువీకరణ పత్రం పొందాక మా వాటా కింద సెప్టెంబరు 19న ఏడు ఫ్లాట్లు ఇచ్చారు. మేం నిర్మాణదారుకు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందా? ఒకవేళ చెల్లించాల్సి వస్తే ఎంత? నిర్మాణదారుకు చెల్లించిన జీఎస్‌టీని తిరిగి ఎలా వసూలు చేసుకోవాలి

- సాయినాథ్.ఎం

నిర్మాణదారు మీకు అందించిన నిర్మాణసేవలకుగాను మీరు తప్పకుండా జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏ రేటు ప్రకారం చెల్లించాలనేది నిర్మాణదారు ఇష్టం. ఆయన పాత, కొత్త జీఎస్‌టీ రేట్లలో వేటిని ఎంపిక చేసుకుంటే ఆ ప్రకారమే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. మీరు నిర్మాణదారుకు ఏదైతే జీఎస్‌టీ చెల్లిస్తారో అది మీ వ్యయాల కిందకు వస్తుంది. అందుకే ఈ వ్యయాలను కూడా కలుపుకొని విక్రయ ధరను నిర్ణయించుకోండి. అప్పుడు మీరు చెల్లించిన జీఎస్‌టీని తిరిగి వసూలు చేసుకునే వీలుంటుంది. అదే సమయంలో ధర నిర్ణయించేటప్పుడు మార్కెట్ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోండి.

? 200 ఏళ్ల పాత కోర్టు భవనాన్ని కూల్చినప్పుడు రూ.30 లక్షల విలువైన రంగూన్ టేక్ వుడ్‌ను వేలం ద్వారా విక్రయించాం. ఈ వేలంలో విక్రయించిన టేక్‌వుడ్‌పై ఎంత జీఎస్‌టీ వర్తిస్తుంది

- ఈ.ఈ.(ఆర్‌లండ్‌జీ), కాకినాడ

సెంట్రల్ ట్యాక్స్ రేట్ నోటిఫికేషన్ సంఖ్య 04/2017, తేదీ: 28.6.2017 ప్రకారం. పాత లేదా వినియోగించిన లేదా నిరూపయోగ (స్క్రాప్) వస్తువులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉన్న వ్యక్తికి విక్రయిస్తే.. ఆ వ్యక్తి రివర్స్ ఛార్జీ పద్ధతిలో జీఎస్‌టీని చెల్లించాల్సి ఉంటుంది. మీ డిపార్ట్‌మెంట్ నుంచి పాత చెక్కులను జీఎస్‌టీ లైసెన్సు ఉన్న వ్యక్తి కొనుగోలు చేస్తే ఆ వ్యక్తి నుంచి మీరు పన్ను వసూలు చేయాల్సిన అవసరం లేదు. ఒకవేళ జీఎస్‌టీ లైసెన్సు లేని వ్యక్తి కొనుగోలు చేస్తే ఆ చెక్కు రకం ఆధారంగా 12% లేదా 18 శాతం జీఎస్‌టీ వసూలు చేయాల్సి ఉంటుంది.

? మేం జీఎస్‌టీ రెగ్యులర్ డీలర్‌గా లైసెన్సు తీసుకున్నాం. 2018-19లో సరఫరాదార్ల నుంచి డెబిట్ నోట్‌లు తీసుకున్నాం. జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌ల దాఖలు సమయంలో సాంకేతికత, సర్వర్ సమస్యల కారణంగా క్రెడిట్ నోట్స్ వివరాలను పొందుపర్చలేకపోయాం. ఈ కారణం వల్లే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కూడా రివర్స్ చేయలేదు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను రివర్స్ చేసే వీలుందా

- ఎస్.భాను కిరణ్

సెంట్రల్ ట్యాక్స్ సర్క్యులర్ సంఖ్య 26/2017, తేదీ: 29-12-2017 ప్రకారం 2018-19కి సంబంధించిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను 2019-20లో రివర్స్ చేసుకోవచ్చు. 2019 సెప్టెంబరు నెలకు రిటర్న్ దాఖలు చేసేలోపు రివర్స్ చేసే వీలుంటుంది. మీరు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను రివర్స్ చేసేటప్పుడు దానిపై వడ్డీ కూడా కట్టాల్సి ఉంటుంది.

మీ సందేహాలు పంపండి

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

వీడ్కోలు సమావేశంలో భార్య, తల్లితో యువీ

ఛాంపియన్

రాజు వెడలె..

ఈనాడు క్రీడావిభాగం

అది 2000 ఛాంపియన్స్ ట్రోఫీ.. మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణం భారత క్రికెట్‌ను కుదిపేశాక టీమ్‌ఇండియా ఆడిన తొలి టోర్నీ అది. కొత్త కెప్టెన్ గంగూలీ సారథ్యంలోని భారత జట్టు ఫిక్సింగ్ నుంచి అభిమానుల దృష్టిని ఆటపైకి మళ్లించాలని, మళ్లీ వారి మనసులు గెలవాలని పట్టుదలతో టోర్నీ బరిలోకి దిగింది. ఆస్ట్రేలియాతో భారత్‌కు క్వార్టర్‌ఫైనల్. మొదట భారతదే బ్యాటింగ్. 90 పరుగులకే 3 వికెట్లు పడ్డాయి. త్రిమూర్తులు సచిన్, గంగూలీ, ద్రవిడ్ పెవిలియన్‌కు చేరారు. అప్పుడే క్రీజులోకి వచ్చాడు.. ఇంకా మీసకట్టు రాని 18 ఏళ్ల కుర్రాడు. ఇటు చూస్తే జట్టు కష్టాల్లో ఉంది.. అటు చూస్తే మెక్‌గ్రాత్, బ్రెట్ లీ, గిలెస్పీ త్రయం భయపెడుతోంది. కానీ ఇంత ఒత్తిడిలో ఆ కుర్రాడు.. ఏ తడబాటూ లేకుండా వారిని ఎదుర్కొన్న తీరును.. ఆడిన షాట్లను.. మొత్తంగా అతడి ఇన్నింగ్స్‌ను అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు! ఆ ఇన్నింగ్స్‌తో క్రికెట్ ప్రపంచమంతటా అతడి పేరు మార్మోగిపోయింది. ఇక అతను వెనుదిరిగి చూసుకున్నది లేదు.

అంతర్జాతీయ క్రికెట్లో యువీ తొలి ఇన్నింగ్సే ఒక సంచలనం.. ఇక ఆ తర్వాత నాట్‌వెస్ట్ సిరీస్ ఫైనల్లో కైఫ్‌తో కలిసి అద్భుత ఛేదన.. 2007 టీ20 ప్రపంచకప్‌లో ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు.. 2011 ప్రపంచకప్‌లో బ్యాటుతో, బంతితో ఆల్‌రౌండ్ మెరుపులు.. ఇలా చెప్పుకోవడానికి యువీ కెరీర్లో అద్భుత ఘట్టాలెన్నో ఉన్నాయి. సచిన్, ద్రవిడ్, గంగూలీ లాంటి దిగ్గజాల తర్వాత ఆటగాడిగా ఒక స్థాయి, భారీగా అభిమాన గణం ఉన్న గొప్ప క్రికెటర్లలో యువరాజ్ అతనొకడనడంలో సందేహం లేదు. భారత పరిమిత ఓవర్ల క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప ఆటగాళ్లలో అతనొకడు. అంతే కాదు.. మన దేశం నుంచి వచ్చిన అత్యుత్తమ, అందమైన బ్యాటింగ్ శైలి ఉన్న ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్‌లో ఒకడు యువీ. ఆరు బంతుల్లో ఆరు సిక్సర్ల మెరుపులు మొదలుకుని భారత అభిమానులకు లెక్కలేనన్ని సార్లు అపరిమిత వినోదాన్ని అందించిన ఘనత యువీ సొంతం. చిన్న ఇన్నింగ్సే ఆడినా.. కాసేపే క్రీజులో ఉన్నా.. యువీ బ్యాటింగ్‌లో ఉండే మజానే వేరు. అతడి షాట్ల అందం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.

28 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు ప్రపంచకప్‌ను ముద్దాడేలా చేసి శతాధిక కోట్ల భారతీయుల్ని పులకించేలా చేసిన ఘనతలో ప్రధాన వాటా యువరాజ్‌దే. అతడి కెరీర్‌కు ఇంతకంటే సార్థకత ఏముంటుంది? కానీ ఇంతటి ఘనత సాధించిన ఏడాది తర్వాత అతను క్యాన్సర్‌తో పోరాడుతూ ఆసుపత్రి మంచం మీద ఉండటమే విధి వైచిత్రి! యువీకి అత్యుత్తమ చికిత్స అంది ఉండొచ్చు.. అతడికి డబ్బుకు లోటు లేకపోవచ్చు.. కానీ ప్రాణాంతక వ్యాధితో పోరాడి నిలబడి.. మళ్లీ మైదానంలోకి రావాలంటే ఎంత నిబ్బరం, పట్టుదల ఉండాలి? ప్రపంచకప్‌లో జట్టును ముందుకు నడిపిస్తున్న సమయంలోనే అతను తనకు తెలియకుండానే క్యాన్సర్‌తో పోరాడాడు. ఇక జట్టు బయటపడ్డాక కూడా కుంగిపోకుండా నిబ్బరంతో నిలిచాడు. క్యాన్సర్‌పై పోరాడి గెలిచాడు. మళ్లీ భారత జట్టులోకి కూడా పునరాగమనం చేశాడు. అదే ఆటలో విరామం దెబ్బ తీసిందో.. అనారోగ్యం ఒంట్లో సత్తువను తగ్గించిందో.. వయసు ప్రభావం పడిందో.. సహజంగానే లయ కోల్పోయాడో.. కారణం ఏదైనా కానీ.. పునరాగమనంలో యువీ తన 'స్థాయి' ఆట ఆడలేకపోయాడు. యువీ అందించిన సేవల్ని, ఎదుర్కొన్న ఒడుదొడుకుల్ని దృష్టిలో ఉంచుకుని భారత జట్టు అతడికి అవకాశాలిచ్చే విషయంలో ఉదారంగానే వ్యవహరించింది. కానీ అతను సద్వినియోగం చేసుకోలేదు. మూడేళ్ల విరామం తర్వాత పునరాగమనం చేసి కొన్ని నెలల పాటు టీమ్‌ఇండియాకు ఆడిన యువీ.. 2017లో జట్టుకు దూరమయ్యాడు. మళ్లీ టీమ్‌ఇండియా తలుపు తట్టలేకపోయాడు. సాధారణంగా ఒక ఆటగాడు వరుసగా విఫలమవుతుంటే.. అభిమానులకు కోపం వచ్చేస్తుంది. పనైపోయిందని.. తీసేయండని అంటారు. కానీ యువీ విషయంలో భిన్నం! అతను ఆడలేకపోతుంటే.. అయ్యో అనుకున్నారు. ఎన్నిసార్లు విఫలమైనా మళ్లీ రాణిస్తాడనే ఆశించారు. కొన్నేళ్ల పాటు జట్టుకు దూరమైనా మళ్లీ వస్తాడనే నమ్మారు. వచ్చాక మురిసిపోయారు. మళ్లీ వేటు పడితే బాధ పడ్డారు. తిరిగొచ్చి మైదానంలో, అభిమానుల నడుమ ఘనంగా వీడ్కోలు తీసుకోవాలని ఆశించారు. ఇలాంటి అభిమానం అందరు ఆటగాళ్లపై ఉండదు! యువీ ఆట మిగిల్చిన జ్ఞాపకాలు.. అతడు దించిన విజయాలిచ్చిన ఆనందం.. అతడి పోరాటం ఇచ్చిన స్ఫూర్తి అలాంటివి మరి!

> దేశం తరపున గొప్పగా ఆడిన పాజీకి శుభాకాంక్షలు. ఎన్నో మధురానుభూతులు.. విజయాల్ని అందించావు. భవిష్యత్తు గొప్పగా ఉండాలని కోరుకుంటున్నా ఛాంపియన్.
> – విరాట్ కోహ్లి

> యువీతో కలిసి ఆడటం చాలా ఆనందంగా ఉంది. క్రికెట్ చరిత్రలో నువ్వొక గొప్ప ఆటగాడిగా మిగిలిపోతావు. మా అందరికీ నువ్వు స్ఫూర్తి.
> – లక్ష్మణ్

> ఆటగాళ్లు వస్తారు.. వెళ్తారు. నువ్వు అరుదు. ఎన్నో ఒడుదొడుకుల్ని ధైర్యంగా ఎదుర్కొన్నావు. క్యాన్సర్‌ను జయించావు. బౌలర్లను బాదేశావు. హృదయాల్ని గెలిచావు.
> – వీరేంద్ర సెహ్వాగ్

> నీ కెరర్ అద్భుతం. జట్టుకు అవసరమున్న ప్రతిసారి ఛాంపియన్‌లా రాణించావు. మైదానంలో.. బయట కష్టకాలంలో నీ ప్రయాణం అందరికీ స్ఫూర్తి. రెండో ఇన్నింగ్స్‌కు శుభాకాంక్షలు. క్రికెట్‌కు అందించిన సేవలకు కృతజ్ఞతలు.
> – సచిన్

యువీరుడి నిష్క్రమణ

ఓ విధ్వంసక ఇన్నింగ్స్ ముగిసింది. ఓ ఉజ్వల కెరీర్‌కు తెర పడింది. ఎన్నో అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో ఎన్నో అపురూప విజయాలను అందించిన యువీరుడు భారమైన హృదయంతో ఆటకు 'సెలవు' చెప్పేశాడు. క్రికెట్‌తో తన 25 ఏళ్ల బంధం ముగిసినట్లు యువరాజ్ దుఃఖాన్ని అధిగమిస్తూ ప్రకటించాడు.

ముంబయి

తనదైన ఆటతో భారత క్రికెట్ అభిమానులను అలరించిన యువరాజ్ సింగ్ ఆటకు వీడ్కోలు పలికాడు. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన ఆతడు అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరవుతున్నట్లు సోమవారం ప్రకటించాడు. "22 గజాలతో నా అనుబంధం 25 ఏళ్ల నాటిది. వస్తూ పోతూ 17 ఏళ్లు అంతర్జాతీయ క్రికెట్ ఆడాక ఆటకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా. క్రికెట్ నాకు అన్నీ ఇచ్చింది. అందుకే ఈ రోజు ఇక్కడ ఉన్నా. భారత జట్టు తరపున 400 మ్యాచ్‌లు ఆడడం నా అదృష్టం" అని సోమవారం ఇక్కడ విలేకర్ల సమావేశం యువరాజ్ చెప్పాడు.

	మ్యా	ప	అ	స	స్ట్రైరేటు	సెం.	అ.శ
వన్డేలు	304	8701	150	36.55	87.67	14	52
టీ20లు	58	1177	77*	28.02	136.38	0	8
టెస్టులు	40	1900	169	33.92	57.97	3	11

మ్యా: మ్యాచ్‌లు, పరుగులు: అత్యధికం, స: సగటు, స్ట్రై.రే: స్ట్రైక్‌రేటు, సెం:సెంచరీలు, అ.శ: అర్ధశతకాలు

"క్రికెట్‌తో నా అనుబంధం చిత్రమైంది. ఆటపై ఎంతో ప్రేమ ఉంది. ఆయిష్టతా ఉంది. క్రికెట్ అంటే నా దృష్టిలో ఏంటో కచ్చితంగా చెప్పలేను. ఎలా పోరాడాలో ఈ ఆట నాకు నేర్పింది. పాఠాలనికి పడిపోవడమంటే ఏంటో ఈ ఆటతోనే తెలిసొచ్చింది. పాఠాళం నుంచి పైకి లేచి జీవితంలో ముందుకు సాగడమెలాగో కూడా ఆటే నేర్పించింది"

"క్రికెట్లో నేను విజయవంతమైన సందర్భాలకంటే విఫలమైన సందర్భాలే ఎక్కువ. కానీ నేనెప్పుడూ ఆశలు వదులుకోలేదు. తుది శ్వాస వరకు పోరాడుతూనే ఉంటా. క్రికెట్ నాకు నేర్పించిందదే. ఆట కోసం నా రక్తాన్ని, చెమటను ధారపోశా. ముఖ్యంగా దేశానికి ఆడేటప్పుడు ఎంతో శ్రమించా. క్యాన్సర్‌కు నన్ను ఓడించే అవకాశమివ్వలేదు"

"2011 ప్రపంచకప్ గెలవడం, 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలవడం, నాలుగు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు అందుకోవడం ఓ కలలాంటిది. ఆ తర్వాత క్యాన్సర్ బారిన పడడం ఓ కఠిన వాస్తవం. నా కెరీర్‌లోనే అత్యున్నత దశలో ఉన్నప్పుడు ఇది జరిగింది. ఆకాశాన్నందుకున్న వెంటనే మెరుపు వేగంతో నేలపై పడ్డట్టనిపించింది. అదంతా చాలా వేగంగా జరిగిపోయింది"

"నా క్రికెట్ కెరీర్‌లోనే 2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్ అత్యంత క్లిష్టమైన దశ. శ్రీలంకపై 21 బంతుల్లో కేవలం 11 పరుగులు చేశా. దాంతో చాలా కుంగిపోయా. నా కెరీర్ ముగిసిందనే అనుకున్నా. కానీ నాపై నమ్మకాన్ని నేనెప్పుడూ కోల్పోలేదు"

"క్యాన్సర్ నుంచి కోలుకుని పునరాగమనం చేశాక తీవ్ర ఒత్తిడికి గురయ్యా. ఎందుకంటే చాలా మంది నేను పూర్వంలా ఆడలేనని భావించారు. వాళ్లు తప్పని నిరూపించాలని భావించా"

"నేను ఇక ఐపీఎల్‌లోనూ ఆడను. బీసీసీఐ నుంచి, అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యా. నాలో ఇంకాస్త క్రికెట్ ఉంది. బోర్డు అనుమతితో భారత్ బయట టీ20 లీగ్‌లు ఆడాలనుకుంటున్నా. వచ్చే ఏడాది వరకు ఆడతానేమో. జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటున్నా. అంతర్జాతీయ కెరీర్ గురించి ఆలోచిస్తూ ఇన్నాళ్లు చాలా ఒత్తిడికి గురయ్యా"

"సౌరవ్ గంగూలీ నాయకత్వంలో నా కెరీర్‌ను ఆరంభించా. నా ఆరాధ్య ఆటగాడు సచిన్‌తోపాటు కుంబ్లే, లక్ష్మణ్, ద్రవిడ్, శ్రీనాథ్ వంటి ఇతర దిగ్గజాలతో కలిసి ఆడే గొప్ప అవకాశం నాకు దక్కింది. తన అధికారాన్ని ఉపయోగించడానికి గంగూలీ వెనుకాడేవాడు కాదు. ఇక ధోని ఒత్తిడిలోనూ ఎంతో శాంతంగా ఉంటాడు. చాలా తెలివైన వికెట్‌కీపర్. వీళ్లిద్దరూ చాలా ప్రత్యేకమైన సారథులు"

"యోయో టెస్టులో విఫలమైతే నువ్వు రిటైర్మెంట్ మ్యాచ్‌లో ఆడొచ్చని నాతో చెప్పారు. యోయో టెస్టులో విఫలమైతే నాకు రిటైర్మెంట్ మ్యాచ్ అవసరం లేదని చెప్పా. యోయో టెస్టులో నెగ్గా. మిగతాది నా చేతుల్లో లేదు"

క్రికెట్‌కు యువరాజ్ గుడ్‌బై

తొలి వన్డే: 2000 కెన్యాపై..
ఆఖరి వన్డే: 2017 వెస్టిండీస్‌పై

తొలి టెస్టు: 2003 న్యూజిలాండ్‌పై
ఆఖరి టెస్టు: 2012 ఇంగ్లాండ్‌పై

తొలి టీ20: 2007 స్కాట్లాండ్‌పై
ఆఖరి టీ20: 2017 ఇంగ్లాండ్‌పై

అవార్డులు..
2012: అర్జున అవార్డు
2014: పద్మశ్రీ

ఆరు బంతుల్లో ఆరు అర్లు

2007 టీ20 ప్రపంచకప్‌లో యువీ అద్భుతమే చేశాడు. ఇంగ్లాండ్ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ వేసిన ఓవర్లో 6 బంతుల్లో 6 సిక్స్‌లు బాది ప్రపంచరికార్డు సృష్టించాడు.

12 బంతుల్లో 50

2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌పై ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లు కొట్టిన మ్యాచ్‌లోనే యువీ 12 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసి మరో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇప్పటికీ ఇదే రికార్డు.

ప్రపంచకప్‌లో మ్యాన్ ఆఫ్ ద టోర్నీ

2011 వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయంలో యువీదే కీలక పాత్ర. 362 పరుగులు చేసిన అతను.. 15 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు అందుకున్నాడు.

బ్యాట్స్‌మన్‌గా మొదలైనా..

నేరుగా టాప్ గేర్‌తో కెరీర్‌ను మొదలుపెట్టిన యువీ.. దశాబ్దం పాటు భారత వన్డే జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా ఉన్నాడు. తక్కువ మ్యాచ్‌లోనే మిడిలార్డర్లో కీలక బ్యాట్స్‌మన్‌గా ఎదిగాడతను. బౌలింగ్ పార్ట్‌టైం స్పిన్నర్‌గా మొదలుపెట్టి.. ప్రతి మ్యాచ్‌లోనూ 10 ఓవర్ల కోటా పూర్తి చేసే స్పిన్నర్‌గా రూపాంతరం చెందాడు. నిఖార్సయిన ఆల్‌రౌండర్ అనిపించుకున్నాడు. ఇక భారత జట్టులో ఫీల్డింగ్ ప్రమాణాల్ని ఎంతగానో పెంచి.. ఈ విషయంలో తర్వాతి తరం క్రికెటర్లకు రోల్‌మోడల్‌గా నిలిచిన ఘనత కూడా యువీకే చెందుతుంది.

అతనో జెంటిల్‌మన్!

యువీ ఆటలో దూకుడు ఎలాంటిదో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఒకప్పుడు మైదానం బయట అతడికి 'ప్లేబాయ్' ఇమేజ్ ఉండేది. కానీ మైదానంలో అతనొక 'జెంటిల్‌మన్'. బ్యాటింగ్ చేసేటపుడు బౌలర్లు కవ్విస్తే.. బ్యాటుతో సమాధానం చెప్పేవాడు కానీ.. నోటికి పని చెప్పేవాడు కాదు. వివాదాల జోలికి వెళ్లకుండా.. సీనియర్లను గౌరవిస్తూ.. సహచరులతో, ప్రత్యర్థులతో ఎంతో స్నేహపూర్వకంగా, సరదాగా ఉండే అతడి వ్యక్తిత్వం కూడా అతడిని ప్రత్యేకంగా నిలబెట్టింది. అభిమానులకు మరింత ఇష్టుడిని చేసింది.

టెస్టుల్లో.. వ్చ్!

వన్డేల్లో గొప్ప ఆటగాడిగా పేరు తెచ్చుకున్నా.. టెస్టుల్లో మాత్రం యువీది వైఫల్యమే. సుదీర్ఘ ఫార్మాట్లో సత్తా చాటి జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకోవాలని యువీ ఎంతో కోరుకున్నాడు. కానీ అది ఫలించలేదు. డిఫెన్స్ ఆడలేని, సుదీర్ఘ సమయం క్రీజులో నిలవలేని బలహీనతలు టెస్టుల్లో అతడి స్థానానికి గ్యారంటీ లేకుండా చేసింది. ఎప్పుడో ఒకసారి ఓ మెరుపు ఇన్నింగ్స్ ఆడటమే తప్ప నిలకడ సాధించలేకపోయాడు. 40 టెస్టులాడిన యువీ.. 33.92 సగటుతో 1900 పరుగులే చేశాడు. అందులో 3 శతకాలు, 11 అర్ధశతకాలున్నాయి.

ఐపీఎల్ రికార్డు అతడిదే

ఐపీఎల్‌పై యువరాజ్‌ది ప్రత్యేకమైన ముద్ర. లీగ్ ఆరంభమైనపుడు 'ఐకాన్' హోదా అందుకున్న సూపర్ స్టార్లలో అతనొకడు. పంజాబ్ కెప్టెన్‌గా కొన్ని సీజన్లు జట్టును నడిపించిన యువీ.. తర్వాత వివిధ జట్లకు ఆడాడు. 2014లో బెంగళూరు అతడిపై రూ.14 కోట్లు వెచ్చిస్తే.. తర్వాతి సీజన్‌కు దిల్లీ అతడిని రూ.16 కోట్లకు కొంది. ఐపీఎల్ చరిత్రలోనే వేలంలో అత్యధిక ధర ఇదే. అతే ఈ సీజన్‌కు యువీ అమ్ముడవడమే కష్టమైంది. చివర్లో ముంబయి అతడిని కోటి రూపాయలకే తీసుకుంది. కానీ అతనీసారి రాణించలేదు.

మెరుపు.. మరక!

యువరాజ్ కెరీర్లో అత్యున్నత దశ అంటే 2011 ప్రపంచకప్పే. ఆ టోర్నీలో బ్యాటుతో, బంతితో అతడి ప్రదర్శనలు భారత్‌కు ఎంతగా ఉపయోగపడ్డాయో తెలిసిందే. భారత్ విజేతగా నిలిచిన 2007 టీ20 ప్రపంచకప్‌లో కూడా యువీ తన వంతు పాత్ర పోషించాడు. అయితే భారత్ ఒక ప్రపంచకప్ కోల్పోవడంలో యువీ కొంతమేర బాధ్యుడైన మాట కూడా వాస్తవం. 2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో యువీ 21 బంతులాడి 11 పరుగులే చేయడం భారత్ అవకాశాల్ని దెబ్బ తీసింది. యువీ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. రిటైర్మెంట్ ప్రకటన సందర్భంగా యువీ సైతం ఆ వైఫల్యాన్ని గుర్తు చేసుకున్నాడు.

చాంపియన్స్

సెమీఫైనల్లో భారత్

● ఎఫ్ఐహెచ్ సిరీస్ హాకీ ఫైనల్స్ టోర్నీ

అక్షదీప్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ సిరీస్ హాకీ ఫైనల్స్ టోర్నీలో బ్రైటిల్ ఫేవరెట్ భారత్ సెమీఫైనల్కు దూసుకెళ్లింది. సోమవారం భారత్ 10-0తో ఉజ్బెకిస్థాన్‌ను చిత్తు చేసింది. అక్షదీప్‌సింగ్ (11, 26, 53 నిమిషాలు) హ్యాట్రిక్ సాధించాడు. వరుణ్‌కుమార్ (4, 22 ని), మన్‌దీప్‌సింగ్ (30, 60వ ని) రెండేసి గోల్స్ కొట్టగా... అమిత్ రోహిదాస్ (15వ ని), నీలకంఠ శర్మ (27వ ని), గుర్‌సహిబిత్ సింగ్ (45వ ని) ఒక్కో గోల్ కొట్టారు. ఫుల్-ఎలో భారత్ ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో గెలిచి అగ్రస్థానంలో నిలిచి సెమీస్ బెర్తు సాధించింది.

ధావన్ వేలికి స్కానింగ్

నాటింగ్‌హామ్: భారత ఓపెనర్ శిఖర్ ధావన్ వైద్య పరీక్షకు వెళ్లనున్నాడు. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ధావన్ బొటన వేలికి బంతి తాకి వాచింది. కౌల్టర్‌నైల్ వేసిన షార్ట్ పిచ్ బంతి ధావన్ బొటన వేలికి బలంగా తగిలింది. శిఖర్.. ప్రాథమిక చికిత్స తీసుకుని బ్యాటింగ్‌ను కొనసాగించాడు. ఫీల్డింగ్‌కు మాత్రం రాలేడు. ముందు జాగ్రత్తగా ధావన్ వేలికి మంగళవారం స్కానింగ్ తీయనున్నారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండకపోవచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

హృదయాన్ని తాకింది

వీవీఎస్ లక్ష్మణ్

దక్షిణాఫ్రికాపై మాదిరే ఆస్ట్రేలియాపైనా భారత్ సాధికార విజయం సాధించింది. ఈ గెలుపులో ధావన్ భాగస్వామ్యం.. మిడిలార్డర్ మెరుపులు.. భువనేశ్వర్ బౌలింగ్ ఆకట్టుకున్నాయి. విజయాల్లో ప్రతి ఒక్కరు భాగమవడం జట్టు పరంగా అతిపెద్ద సానుకూలాంశం. తొలుత బ్యాటింగ్ చేయాలన్న నిర్ణయం సరైనది. పిచ్‌పై పచ్చిక ఉన్నా.. కమిన్స్, స్టార్క్‌ల బౌలింగ్‌ను ధావన్, రోహిత్‌ల జోడీ సమర్థంగా ఎదుర్కొంది. లయ దొరకబుచ్చుకున్న తర్వాత ధావన్ మరింత జోరందుకున్నాడు. ఈ సెంచరీ అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. పామ్‌ను కొనసాగించిన రోహిత్ మరో చక్కటి ఇన్నింగ్స్‌తో అలరించాడు. కోహ్లి క్రీజులో నిలదొక్కుకోవడంతో చివర్లో హిట్టర్లు దంచేశారు. హార్దిక్‌ను నాలుగో స్థానంలో పంపడం మంచి నిర్ణయం. అద్భుతమైన షాట్లతో అదరగొట్టాడు. ధోని, రాహుల్ సైతం బ్యాటుకు పని చెప్పడంతో 325 అనుకున్న స్కోరు కాస్తా 352కు చేరుకుంది.

లోతైన బ్యాటింగ్.. అనుభవం ఉన్నా కూడా అంతపెద్ద లక్ష్యం ఆసీస్‌కు సవాలే. బుమ్రా, భువనేశ్వర్ గొప్పగా బౌలింగ్ చేశారు. స్వభావానికి భిన్నంగా వార్నర్ బ్యాటింగ్ చేశాడు. క్రీజులో కుదురుకున్న స్మిత్, స్టాయినిస్‌లను కువి ఔట్ చేశారు. తర్వాతి ఓవర్లో మాక్స్‌వెల్‌కు చాహల్ కళ్లం వేశాడు. అక్కడ్నుంచి మ్యాచ్ టీమ్‌ఇండియా చేతుల్లోనే ఉంది. భారత అభిమానులు స్మిత్‌ను గేలి చేయడంపై కోహ్లి స్పందించిన తీరు హృదయాన్ని తాకింది.

మ్యాచ్ ఆగింది.. దక్షిణాఫ్రికా ఖాతా తెరిచింది

● వర్షం వల్ల విండీస్‌తో మ్యాచ్ రద్దు

సౌథాంప్టన్: ఎట్టకేలకు ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా పాయింట్ల ఖాతా తెరిచింది. కానీ విజయాల బోణీ మాత్రం కొట్టలేకపోయింది. సోమవారం వెస్టిండీస్‌తో దక్షిణాఫ్రికా మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడమే దానికి కారణం. వర్షం కారణంగా మ్యాచ్ జరిగే వీలు లేకపోవడంతో అంపైర్లు రెండు జట్లకు చెరో పాయింటు కేటాయించారు. అంతకుముందు టాస్ గెలిచిన వెస్టిండీస్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దాంతో మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను.. విండీస్ బౌలర్ కాట్రెల్ బెంబేలెత్తించాడు. ఆమ్లా (6), మర్‌క్రమ్ (5)లను వెనక్కు పంపిన అతను ప్రత్యర్థిని గట్టిదెబ్బ తీశాడు. ఐతే దక్షిణాఫ్రికా 7.3 ఓవర్లలో 29/2తో ఉన్న దశలో వర్షం రావడంతో మ్యాచ్ నిలిపివేశారు. వర్షం ఎంతకు తగ్గే అవకాశం లేకపోవడంతో మ్యాచ్‌ను రద్దయింది. "వర్షం వల్ల మ్యాచ్‌లు రద్దు కావడం చిరాకుగా ఉంటుంది. రెండు జట్లు పలితం కోరుకుంటాయి. కానీ వాతావరణాన్ని మనం నియంత్రించలేం. మ్యాచ్‌ను వికెట్లు కోల్పోకుండా ప్రారంభించాలి. కానీ మేం తొందరగా వికెట్లు కోల్పోయాం. ప్రత్యర్థి జట్టులో మెరుగైన బౌలర్లున్నారు" అని డుప్లెసిస్ తెలిపాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	టై/ర	పా	నె.రేట్
న్యూజిలాండ్	3	3	0	0	6	+2.163
ఇంగ్లాండ్	3	2	1	0	4	+1.307
భారత్	2	2	0	0	4	+0.539
ఆస్ట్రేలియా	3	2	1	0	4	+0.483
వెస్టిండీస్	3	1	1	1	3	+2.054
శ్రీలంక	3	1	1	1	3	−1.517
పాకిస్థాన్	3	1	1	1	3	−2.412
బంగ్లాదేశ్	3	1	2	0	2	−0.714
దక్షిణాఫ్రికా	4	0	3	1	1	−0.952
అఫ్గానిస్థాన్	3	0	3	0	0	−1.493

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, నె: నెట్ రన్‌రేట్

ఇవేం బెయిల్స్ బాబోయ్

లండన్

ప్రపంచ కప్‌లో ఎల్‌ఈడీ బెయిల్స్‌పై దుమారం రేగుతోంది. వికెట్లను బంతి బలంగా తాకినా బెయిల్స్ కింద పడకపోవడం అన్ని జట్లను అసహనానికి గురిచేస్తుంది. ప్రపంచ కప్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా సుమారు 10 సందర్భాల్లో బంతి వికెట్లను తాకినా బెయిల్స్ పడలేదు. ఆదివారం టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియాల మధ్య మ్యాచ్‌తో బెయిల్స్ వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. బుమ్రా వేసిన బంతి డేవిడ్ వార్నర్ బ్యాట్‌ను తాకుతూ లెగ్ స్టంప్‌ను బలంగా తాకింది. అయినా వికెట్ల మీద నుంచి బెయిల్స్ కదల్లేదు. ఈ మ్యాచ్‌లో వార్నర్ బతికిపోయినా.. బెయిల్స్ వ్యవహారంలో ఎక్కువ నష్టపోయింది ఆసీసే. దాదాపు ఐదు సందర్భాల్లో బంతి స్టంప్స్‌ను తాకినా బెయిల్స్ పడకపోవడంపై ఆసీస్ గుర్రుగా ఉంది. బంతి వికెట్లను తాకగానే ఎల్‌ఈడీ బెయిల్స్‌లోని లైట్లు వెలుగుతాయి. ఇందుకోసం బెయిల్స్‌లో చాలా వైర్లు ఉంటాయి. ఎక్కువ వైర్లు ఉండటం వల్ల బెయిల్స్ బరువు పెరిగిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐతే ఎల్‌ఈడీ బెయిల్స్ బరువు.. సంప్రదాయ బెయిల్స్ బరువు కంటే ఎక్కువ ఉండదని ఐసీసీ స్పష్టంచేసింది.

ఆశ్చర్యానికి గురిచేస్తోంది

"స్టంప్స్‌ను బంతి బలంగా తాకాల్సిందే. బ్యాట్స్‌మన్‌గా నా అభిప్రాయమిది. కొన్నిసార్లు బెయిల్స్ పడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అదీ ఫాస్ట్ బౌలర్ల బౌలింగ్‌లో. ధోని స్టంప్స్‌ను పరిశీలించాడు. ఏ సమస్య లేదన్నాడు. వికెట్లూ వదులుగానే ఉన్నాయి. మరి వార్నర్ విషయంలో ఎందుకలా జరిగిందో అర్థంకాలేదు. ఇలాంటి సంఘటనల్ని ఏ జట్టు సమర్థించదు. బంతి వికెట్లను తాకినా బ్యాట్స్‌మన్ ఔటవకపోవడం సరికాదు. బంతి స్టంప్స్‌ను తాకినా బెయిల్స్ లైట్లు వెలగడం లేదు. ఒకవేళ లైట్లు వెలిగినా బెయిల్స్ మళ్లీ యథా స్థానంలోకి వస్తున్నాయి. ఇన్నిసార్లు ఇలా జరగడం నేనెప్పుడూ చూడలేదు"

– కోహ్లి

బంతి తాకినా బెయిల్ కింద పడని సందర్భాల్లో కొన్ని..

ఇంగ్లాండ్ × దక్షిణాఫ్రికా

రషీద్ వేసిన బంతిని డికాక్ రివర్స్ స్వీప్ ఆడాడు. బ్యాట్‌ను తాకిన బంతి లెగ్‌స్టంప్‌ను బలంగా తాకినా బెయిల్స్ కిందపడలేదు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే బంతి బౌండరీకి దూసుకెళ్లింది. డికాక్‌కు 4 పరుగులొచ్చాయి.

ఇంగ్లాండ్ × బంగ్లాదేశ్

స్టోక్స్ లెగ్‌స్టంప్ లైన్‌లో విసిరిన బంతి మహ్మద్ సైఫుద్దీన్ బ్యాటు లోపలి అంచును తాకుతూ స్టంప్‌ను తగిలింది. సైఫుద్దీన్ ఔటయ్యాడనే ఇంగ్లాండ్ ఆటగాళ్లు భావించారు. కానీ స్టంప్స్ మీద నుంచి బెయిల్స్ కిందపడకపోవడంతో సైఫుద్దీన్ ఔటవలేదు.

ఆస్ట్రేలియా × వెస్టిండీస్

స్టార్క్ బౌలింగ్‌లో క్రిస్ గేల్ బ్యాటును తాకుతూ వెళ్లిన బంతిని వికెట్ కీపర్ ఒడిసిపట్టుకున్నాడు. గట్టిగా శబ్దం రావడంతో అంపైర్ ఔటిచ్చాడు. గేల్ సమీక్ష కోరాడు. బంతి బ్యాట్‌ను తాకలేదని రిప్లేలో తేలింది. థర్డ్ అంపైర్ గేల్‌ను నాటౌట్‌గా ప్రకటించాడు. మరి శబ్దం ఎక్కడి నుంచి వచ్చిందని ఆరా తీయగా.. బంతి స్టంప్స్‌ను తాకినట్లు స్పష్టమైంది. సుమారు 140కిమీ వేగంతో దూసుకొచ్చిన బంతి స్టంప్స్‌ను తాకినా బెయిల్స్ కదల్లేదు.

ప్రపంచకప్‌లో ఈనాడు

శ్రీలంకకు బంగ్లా సవాల్

● మధ్యాహ్నం 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

43 లంక, బంగ్లా ఆడిన వన్డేలు. వీటిలో 36 లంక గెలిస్తే.. 7 బంగ్లా నెగ్గింది.

3 ప్రపంచకప్‌లో బంగ్లాతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో లంకే గెలిచింది.

జంపా జేబులో ఏముందంటే..

లండన్: భారత్‌తో మ్యాచ్‌లో ఆడమ్ జంపా పదే పదే జేబులో చేతులు పెట్టుకోవడం బయటకు తీసి బంతిపై రుద్దడంతో అతనేమైనా టాంపరింగ్‌కు పాల్పడుతున్నాడా అని సామాజిక మధ్యమాల్లో అనుమానాలు వ్యక్తం అయిన సంగతి తెలిసిందే. అయితే జంపా అస్త్రమానం జేబులో చేతులు పెట్టుకుంది హ్యాండ్ వార్మర్ (వేడి పుట్టించే వస్త్రం) కోసమే అయి ఉంటుందని అతని సహచరుడు ఆరోన్ ఫించ్ అన్నాడు. "జంపా జేబులో చేతులు పెట్టుకున్న ఫొటోలు నేను చూడలేదు. అతనికి హ్యాండ్ వార్మర్‌లు జేబులో పెట్టుకునే అలవాటు ఉంది. ప్రతి మ్యాచ్‌లోనూ అతను ఇవి వాడతాడు. దీనిపై ఎక్కువ వ్యాఖ్యానించదలుచుకోలేదు" అని ఫించ్ అన్నాడు.

ఏపీలో వరాల తొలకరి

- గత ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులన్నీ రద్దు
- పారుగు సేవల సంస్థలు, కన్సల్టెన్సీలు రద్దు
- ఆర్టీసీ విలీనానికి మంత్రివర్గ ఉపసంఘం
- విద్యుత్ ఒప్పందాల పునఃసమీక్ష
- ప్రస్తుత ఇసుక విధానం రద్దు
- కార్డుదారుల ఇంటికే బియ్యం, నిత్యావసరాలు
- గ్రామ వలంటీర్లకు విద్యార్హతల నిర్ణయం
- ఆసుపత్రి సలహా సంఘం ఛైర్మన్లుగా ఎమ్మెల్యేలే
- మంత్రివర్గ తొలి సమావేశంలో కీలక నిర్ణయాలు

రైతులకు..

- 2014 నుంచి చెల్లించాల్సిన పెట్టుబడి రాయితీ రూ.2వేల కోట్లు వెంటనే విడుదల
- రైతు యూనిట్‌గా ఏడాదికి రూ.12,500 చొప్పున పెట్టుబడి సాయం
- రూ.2వేల కోట్లతో విపత్తుల సహాయ నిధి
- రూ.3వేల కోట్లతో మార్కెట్ స్థిరీకరణ నిధి
- ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా రాష్ట్ర రైతు కమిషన్ ఏర్పాటు
- ఒక్కో రైతుకు 5 జీవాలు, 5 పశువులకు ఉచిత బీమా
- పంటరుణాలకు వైఎస్ఆర్ వడ్డీలేని రుణాల పథకం
- రైతులకు ఉచిత బోర్ల తవ్వకం కోసం 200 రిగ్‌ల కొనుగోలు
- రైతు బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయం

వైద్యం

- ఆసుపత్రి సలహా సంఘం ఛైర్మన్లుగా ఎమ్మెల్యేలే
- ఫోన్ చేసిన 20 నిమిషాల్లో 104, 108 వచ్చేలా చర్యలు
- ఇతర రాష్ట్రాల్లో వైద్యం చేయించుకున్నా ఆరోగ్యశ్రీ వర్తింపు

ఒప్పందాల సమీక్ష

- ఇప్పటివరకూ చేసుకున్న విద్యుత్ ఒప్పందాల పునఃసమీక్ష
- అగ్రిగోల్డ్ బాధితులకు రూ.1150 కోట్లు
- ప్రస్తుతం అమల్లో ఉన్న ఇసుక విధానం రద్దు
- గ్రామ వలంటీర్లకు విద్యార్హతలు ఖరారు

ఉద్యోగులకు..

- భాగస్వామ్య పింఛను పథకం రద్దు
- కార్యాచరణకు ఆర్థికమంత్రి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- 1 నుంచి ప్రభుత్వోద్యోగులకు 27 శాతం తాత్కాలిక భృతి
- దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.815 కోట్ల మేర అదనపు భారం
- 4.24 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి
- ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణపై మంత్రివర్గ ఉపసంఘం

వేతనాల పెంపు

- గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల్లో రిసోర్సుపర్సన్లు, యానిమేటర్లకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం
- అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాన్ని రూ.10,500 నుంచి రూ.11,500కు, అంగన్‌వాడీ ఆయాల వేతనాన్ని రూ.6 వేల నుంచి రూ.7 వేలకు పెంపు
- హోంగార్డులకు తెలంగాణలో చెల్లిస్తున్న వేతనం కంటే రూ.వెయ్యి ఎక్కువ ఇవ్వాలని నిర్ణయం
- అన్ని శాఖల్లోని పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.18 వేల వేతనం ఇచ్చే అంశంపై ఆయా శాఖల కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు
- ఆశావర్కర్ల వేతనం రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంపు

విద్య

- జనవరి 26 నుంచి అమ్మఒడి
- బిడ్డలను బడికి పంపే తల్లులకు ఏడాదికి రూ.15 వేలు
- ప్రైవేటు పాఠశాలల్లో 25% సీట్లు పేద, మధ్య తరగతి వారికి తప్పనిసరి
- దశలవారీగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

ఆర్టీసీ

- సర్కార్ చేతికి ఆర్టీసీ!
- విలీనానికి మంత్రివర్గ ఉపసంఘం.
- ఈ ప్రక్రియపై అధ్యయనానికి నిపుణుల కమిటీ.

ఇళ్లు

- వైఎస్ఆర్ పేరిట నాలుగేళ్లలో 25 లక్షల ఇళ్ల నిర్మాణం.
- ఉగాదినాటికి ఇళ్ల స్థలాల పంపిణీ.



ఏపీ మంత్రివర్గ తొలి సమావేశం ఎన్నికల హామీల అమలు దిశలో కీలక అడుగులు వేసింది. రైతు, శ్రామిక, ఉద్యోగ వర్గాలకు వరాలను అందించింది. ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఉద్యోగుల చిరకాల డిమాండ్ కంట్రిబ్యూటరీ పింఛను పథకం రద్దుకు ముందడుగు వేసింది. జులై ఒకటో తేదీ నుంచి అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 27శాతం మధ్యంతర భృతిని ఆమోదించింది. అంగన్‌వాడీలు, ఆయాలు, హోంగార్డులు, ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలను పెంచింది. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకానుంది. బిడ్డలను బడికి పంపే తల్లులకు ఏడాదికోసారి రూ.15వేలు అందించే 'అమ్మ ఒడి'ని జనవరి 26నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. రైతు యూనిట్‌గా ఏడాదికి రూ.12,500 చొప్పున పెట్టుబడి సాయం అందించే ప్రతిపాదనను ఆమోదించింది. 2014 నుంచి చెల్లించాల్సిన పెట్టుబడి రాయితీ రూ.2వేల కోట్లు తక్షణమే విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి నేతృత్వంలో రైతు కమిషన్ ఏర్పాటు కానుంది. రైతులకు వడ్డీలేని రుణాలను ప్రభుత్వం అందించనుంది. అగ్రిగోల్డు బాధితులకు చెల్లించేందుకు రూ.1150 కోట్లను న్యాయస్థానంలో జమ చేయాలని నిర్ణయించింది. ఇతర రాష్ట్రాల్లో వైద్యం చేయించుకున్నా ఆరోగ్యశ్రీ వర్తింపజేయనుంది. వైఎస్ఆర్ పేరిట నాలుగేళ్లలో 25 లక్షల ఇళ్లను నిర్మించనుంది. అర్హులైన పేదలకు ఉగాదినాడు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామ వలంటీర్ల నియామకంపై విద్యార్హతలను ప్రకటించింది. గత ప్రభుత్వ నిర్ణయాలను మంత్రివర్గం సమీక్షించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇసుక విధానాన్ని నిలిపేసింది. విద్యుత్ ఒప్పందాలను పునఃసమీక్షించనుంది.

- ఈనాడు, అమరావతి

విస్పష్టంగా విధాన నిర్ణయాలు!

● మంత్రుల ప్రమేయంతోనే ప్రతిపాదనలు: ఏపీ సీఎం జగన్

ఈనాడు-అమరావతి: కొత్త ప్రభుత్వ తొలి మంత్రిమండలి సమావేశం ఎలా జరగబోతోంది, యువ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దీనిని ఎలా నిర్వహిస్తారన్న ఆసక్తి సర్వత్రా నెలకొన్న నేపథ్యంలో పలు కీలకాంశాలపై సీఎం నిర్దిష్టమైన నిర్ణయాలను తీసుకున్నారు. భారీగా నిధులు వ్యయమయ్యే అంశాలైనా ఎలాంటి షరతులేకుండా పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిందేనని ఆదేశించారు. మొదటి భేటీలోనే తన వ్యవహారశైలి గురించి కాస్త కటువుగానే అందరికీ వివరించారు. ఆయా శాఖలకు మంత్రులే సుప్రీం అని, వారి ప్రమేయం లేకుండా ఏ విధాన నిర్ణయ ప్రతిపాదనా ఉండరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. చిన్న మరక కూడా పడకుండా వ్యవహరించాలని, కక్కుర్తి పడినా, అవినీతి ఆరోపణలు వచ్చినా తొంగిస్తానని మంత్రులకు చెప్పారు.

పర్చింపకుండా ప్రకటిస్తే సహించబోనన్న సీఎం

ప్రభుత్వ విధాన నిర్ణయాలేవైనా తన దృష్టికి తీసుకురాకుండా, తనతో చర్చించకుండా ప్రకటనలు చేస్తే సహించబోనని సీఎం స్పష్టం చేశారు. 'మంత్రులుగా మీరు బద్దాం అయితే ప్రభుత్వం బద్దాం అయినట్లే... ఎట్టి పరిస్థితుల్లో దీనిని అనుమతించబోను' అని చెప్పారు. సోమవారం ఉదయం పదిన్నర గంటలకు సమావేశం ఉంటుందని ముందుగా నిర్ణయించినా, పావుగంట ముందుకు జరిపినట్లు ఆదివారం రాత్రి మంత్రులకు సమాచారం పంపారు. ఖచ్చితంగా పదింపావుకే భేటీ ప్రారంభమవగా.. మంత్రులు ఎలా వ్యవహరించాలో పావుగంట పాటు వివరించారు. సీఎం ఒకింత గట్టిగానే తన వైఖరిని వెల్లడించటంతో అందరూ నిశ్శబ్దంగా ఉండిపోగా... ఆయనే కల్పించుకుని వాతావరణాన్ని తేలికపరిచారు.

ఏ శాఖకైనా మంత్రే సుప్రీం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటంపై ఉన్న తాదికారులు ఒక నివేదికను మంత్రిమండలి సమావేశంలో ప్రవేశపెట్టగా... ఆ శాఖ మంత్రి ప్రమేయం లేకుండా నివేదిక ఎలా తయారుచేశారని సీఎం ప్రశ్నించారు. 'అసలు మంత్రే లేకుండా నివేదిక ఎలా రూపొందించారు? విధాన నిర్ణయం ఎలా తీసుకుంటారు? ఏ శాఖకైనా సంబంధిత మంత్రే సుప్రీం' అని తేల్చి చెప్పారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై రవాణా, ఆర్థిక శాఖల మంత్రులు పేర్ని నాని, రాజేంద్రనాథ్ రెడ్డిలు సభ్యులుగా కమిటీ వేస్తున్నట్లు అప్పుడిక్కడ ప్రకటించారు.

కేబినెట్ సమావేశం మినిట్స్ సైతం ముఖ్యమంత్రే స్వయంగా రాశారు. రైతు భరోసా, అమ్మ ఒడి, వివిధ వర్గాలకు ఆర్థిక సాయం రూపంలో భారీగా నిధులు ఖర్చవుతాయి కదా... ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుందా అని కొందరు మంత్రులు సందేహాలు లేవనెత్తారు. నిధుల అంశాన్ని తనకు వదిలేయాలని, మెరుగ్గా ఎలా అమలుచేయాలో సూచనలివ్వండి అంటూ జవాబిచ్చారు.

కొత్తరకం మాంసభక్షక మొక్కలు

అంటారియో: కీటక భక్షక మొక్కల గురించి చాలామంది వినే ఉంటారు! వీనస్ ఫ్లైట్రాప్, సన్‌డ్యూస్ వంటి కొన్ని మొక్కలు చిన్న చిన్న కీటకాలను ఆరగిస్తుంటాయి. తద్వారా తమ మనుగడకు అవసరమైన పోషకాలను సముపార్జించుకుంటాయి. అయితే, కెనడాలోని అంటారియోలో శాస్త్రవేత్తలు సరికొత్త మాంస భక్షక మొక్కలను గుర్తించారు. 'పిచర్ మొక్కలుగా వాటిని పిలుస్తున్నారు. అవి చిన్న చిన్న పురుగులను కాకుండా ఏకంగా మానవ చేతి వేలు పరిమాణంలో ఉండే ఉభయచర జీవులైన సాలమాండర్లను ఆరగించేస్తున్నాయి. కెనడాలోని తడి నేలల్లో పిచర్ మొక్కలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. కీటక భక్షక మొక్కలుగా శాస్త్రవేత్తలు చాలా ఏళ్ల క్రితమే వాటిని గుర్తించారు. పురుగులు, సాలీళ్లను అవి ఆరగిస్తుంటాయి. అయితే, అంటారియోలోని ఆల్గోంక్విన్ పార్కు బురద నేలల్లో పిచర్ మొక్కలు సాలమాండర్లను కూడా భక్షిస్తున్నట్లు గ్వెల్ఫ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తాజాగా గుర్తించారు. ఈ మొక్కల పత్రాలు గంట ఆకారంలో ఉంటాయి. వాటిలో వర్షపు నీరు నిల్వ ఉంటుంది. పత్రాల్లోకి ప్రవేశించిన సకశేరుక సాలమాండర్లను ప్రత్యేక జీర్ణ ఎంజైములు, ఉష్ణం, నీటిలోని ఇతర జీవుల సాయంతో పిచర్ మొక్కలు జీర్ణం చేసుకుంటాయి. బురద నేలల్లో నైట్రోజన్ తక్కువగా ఉండటంతో.. ఆ పోషకాన్ని సంగ్రహించుకునేందుకే సాలమాండర్లను మొక్కలు ఆరగిస్తుండొచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

ఆ ఆరుగురు దోషులే

- కథువా అత్యాచార కేసులో ముగ్గురికి జీవిత ఖైదు
- మిగతావారికి ఐదేళ్ల జైలు
- తీర్పు వెలువరించిన స్థానిక కోర్టు

పఠాన్‌కోట్

దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన కథువా కేసులో దోషులకు స్థానిక కోర్టు శిక్షలను ఖరారు చేసింది. 8 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన ఈ పాశవిక ఘటనలో అరుగురు నిందితులను దోషులుగా తేల్చింది. వారిలో ముగ్గురికి జీవిత ఖైదు తోపాటు రూ.లక్ష చొప్పున జరిమానా విధించింది. సాక్ష్యాధారాల ధ్వంసం అభియోగాలను ఎదుర్కొంటున్న మరో ముగ్గురికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. ఒక నిందితుడిని విడుదల చేసింది. రహస్య విచారణ కావడంతో కోర్టు ప్రాంగణం వెలుపలే మీడియా ఉండిపోయింది.

జమ్మూకశ్మీర్‌లోని కథువాలో ఉన్న ఒక ఆలయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. స్వయానా ఆ గుడికి సంరక్షణదారుగా ఉన్న రెవెన్యూశాఖ మాజీ ఉద్యోగి సాంజీరామ్ ప్రధాన నిందితుడు. అతడితోపాటు ప్రత్యేక పోలీసు అధికారి దీపక్ ఖజూరియా, పర్వేశ్ కుమార్‌లను రణబీర్ శిక్షా స్మృతి (ఆర్‌పీసీ)లోని నేరపూరిత కుట్ర, హత్య, సామూహిక అత్యాచారం, సాక్ష్యాధారాల ధ్వంసం, బాధితురాలికి మత్తు మందు ఇవ్వడం వంటి అభియోగాల కింద కోర్టు దోషులుగా తేల్చింది. వీరికి జీవిత ఖైదు, రూ.లక్ష చొప్పున జరిమానా విధించింది. వీరిని చనిపోయే వరకూ జైల్లోనే ఉంచాలని స్పష్టంచేసింది. వీరికి వివిధ అభియోగాల కింద కూడా జైలు శిక్షలను ఖరారు చేసింది. వాటన్నింటినీ ఏకకాలంలోనే అనుభవించాలని స్పష్టం చేసింది. సాంజీరామ్ నుంచి రూ.4లక్షలు లంచం తీసుకొని సాక్ష్యాధారాలను ధ్వంసం చేసిన నేరం కింద ఎస్సై ఆనంద్ దత్తా, హెడ్ కానిస్టేబుల్ తిలక్ రాజ్, ప్రత్యేక పోలీసు అధికారి సురేంద్ర వర్మలను దోషులుగా తేల్చింది. వీరికి ఐదేళ్ల కారాగార శిక్ష, రూ.50 వేల చొప్పున జరిమానాను ఖరారు చేసింది. జరిమానా చెల్లించకుంటే అదనంగా మరో ఆరు నెలల పాటు జైల్లో గడపాలని వారికి స్పష్టం చేసింది. సాంజీరామ్ కుమారుడైన ఏడో నిందితుడు విశాల్ జంగోత్రను సంశయ లబ్ధి కింద కోర్టు విడుదల చేసింది. అతడి విడుదలపై ఎగువ కోర్టులో అపీలు దాఖలు చేసే అంశాన్ని పరిశీలించనున్నట్లు ప్రాసిక్యూషన్ న్యాయవాదులు తెలిపారు. హత్య, సామూహిక అత్యాచారం అభియోగాలపై దోషులుగా తేలిన ముగ్గురికీ మరణశిక్ష విధించాలని కోర్టుకు విన్నవించినట్లు పేర్కొన్నారు. బాల నేరస్థుడైన మరో నిందితుడిపై ఇంకా విచారణ ప్రారంభం కాలేదు. అతడు సాంజీరామ్‌కు మేనల్లుడు. అతడి వయసును నిర్ధరించే అంశంపై దాఖలైన పిటిషన్ జమ్మూ కశ్మీర్ హైకోర్టులో ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఇందుకు కారణం.

ప్రధాన నిందితుడు సాంజీరామ్‌ను సోమవారం పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లా సెషన్స్ న్యాయస్థానానికి తీసుకొస్తున్న పోలీసులు

రాష్ట్రం వెలుపలికి బదిలీ

గత ఏడాది ఏప్రిల్ 16న ఈ కేసు విచారణ కథువాలోని ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో ప్రారంభమైంది. అభియోగపత్రాన్ని దాఖలు చేయకుండా న్యాయవాదులు పోలీసులను అడ్డుకోవడంతో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంది. కేసు విచారణను పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు విచారణను రహస్యంగా, రోజువారీ ప్రాతిపదికన చేపట్టాలని పఠాన్‌కోట్ జిల్లా సెషన్స్ జడ్జీని ఆదేశించింది. గత ఏడాది జూన్ చివరి వారం నుంచి ఈ కోర్టులో విచారణ మొదలైంది. ఈ నెల 3న ముగిసింది. తాజా తీర్పును పీడీపీ అధ్యక్షురాలు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ స్వాగతించారు. ఈ కేసులో అరుగురు దోషులకు మరణ శిక్ష విధించాలని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ డిమాండ్ చేశారు.

నాలుగు రోజుల పాటు అఘాయిత్యం

కథువాలో బాలికను నిందితులు నాలుగు రోజుల పాటు అత్యంత దారుణంగా అత్యాచారం చేసి హతమార్చారు. గత ఏడాది జనవరి 10న సంచార జాతికి చెందిన సదరు బాలిక గుర్రాలను మేపేందుకు వెళ్లి గల్లంతైంది. తప్పిపోయిన గుర్రాల ఆచూకీ పట్టుకోవడంలో సాయం చేస్తానని నమ్మబలకడం ద్వారా ఆమెను బాల నేరస్థుడు అపహరించాడు. నిందితులంతా కథువాలోని ఒక ఆలయంలో ఆ చిన్నారిని బందీగా ఉంచారు. ఆమెకు మత్తు మందు ఇచ్చి, నాలుగు రోజుల పాటు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ సమయంలో ఆమెకు జోజనం కూడా పెట్టలేదు. చివరికి ఆ పాప మెడకు ఉచ్చువేసి, ఒక బండరాయితో తలపై మోది చంపేశారు. గత ఏడాది జనవరి 17న చిన్నారి మృతదేహం ఒక అటవీ ప్రాంతంలో లభ్యమైంది. కథువా ప్రాంతానికి తరచూ వస్తున్న సంచార జాతివారిని భయభ్రాంతాలను చేసి, ఇక్కడి నుంచి తరిమేసే ఉద్దేశంతో ఈ నేరస్థులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో నిందితులకు మద్దతుగా భాజపా మంత్రులు చౌదురి లాల్ సింగ్, ప్రకాశ్ గంగాలు ర్యాలీ నిర్వహించడంతో రాష్ట్రంలోని భాజపా-పీడీపీ సంకీర్ణంలో విభేదాలు తలెత్తాయి. గత ఏడాది ఏప్రిల్‌లో ఆ మంత్రులిద్దరూ రాజీనామా చేశారు.

సోమవారం దిల్లీలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయ్‌శంకర్

ఉపరాష్ట్రపతితో జయ్‌శంకర్ భేటీ

దిల్లీ: కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయ్‌శంకర్, ఆ శాఖ సహాయమంత్రి మురళీధరన్ సోమవారం దిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని జయ్‌శంకర్ ట్విటర్ వేదికగా వెల్లడించారు.

ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు

- ఎస్‌సీవో భేటీలో కోరనున్న మోదీ

దిల్లీ: ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు బలమైన, నిర్ణయాత్మక చర్యలు అవసరమని ఈ నెల 14 నుంచి జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి చేసే ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరే అవకాశం ఉంది. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే ఈ కార్యక్రమంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో ఆయన ద్వైపాక్షిక భేటీలు నిర్వహిస్తారని కూడా విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ) ఎ.గీతేశ్ శర్మ తెలిపారు. గత నెలలో లోక్‌సభ ఎన్నికల్లో మన విజయం సాధించాక మోదీ పాల్గొంటున్న తొలి బహుళ పక్ష సదస్సు ఇదే. ఇందు కోసం ఆయన ఈ నెల 13 నుంచి రెండు రోజుల పాటు కిర్గిజిస్థాన్‌లో పర్యటిస్తారు. శక్తిమంతమైన కూటమిగా ఎస్‌సీవోకు పేరుంది. అందులోని దేశాలకు ప్రపంచ జనాభాలో 42 శాతం, ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 20 శాతం వాటా ఉంది. మోదీ తన ప్రసంగంలో ఉగ్రవాదం అంశాన్ని ప్రస్తావనకు తెచ్చినా నిర్దిష్టంగా ఏ దేశం పేరునూ ప్రస్తావించబోరని గీతేశ్ శర్మ చెప్పారు. కూటమిలోని సభ్య దేశాల మధ్య సంధానతను మెరుగుపరచాల్సిన అవశ్యకతను ప్రధాని ప్రస్తావించనున్నారని తెలిపారు. రక్షణ రంగంలో సహకారాన్ని మెరుగుపరచుకోవాలని కూడా కోరనున్నట్లు చెప్పారు.

ఏ దేశాన్నీ లక్ష్యం చేసుకోవడంలేదు: చైనా

ఎస్‌సీవో సమావేశంలో ఆర్థిక సంబంధ అంశాలు, ఉగ్రవాదంపై పోరు ప్రధానాంశంగా భద్రతా సహకారం వంటి వాటిపై చర్చ ఉంటుందని చైనా తెలిపింది. అయితే ఏ దేశాన్నీ లక్ష్యంగా చేసుకోవడం దీని ఉద్దేశం కాదన్నారు. భారత్, పాక్‌ల ప్రధాన మంత్రులు ఈ భేటీకి హాజరవుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. ఉగ్రవాదం అంశంపై పాక్‌ను మోదీ లక్ష్యంగా చేసుకోరాదన్న సందేశం ఈ వ్యాఖ్యల్లో ధ్వనిస్తోంది.

పాక్ గగనతలం మీదుగా ప్రయాణం

లాహోర్: భారత ప్రధాని మోదీ ప్రయాణించే విమానం తమ గగనతలం నుంచి వెళ్లడానికి పాకిస్థాన్ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈనెల 13,14 తేదీల్లో కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరుగనున్న షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సుకు మోదీ హాజరుకానున్నారు. బాలాకోట్‌పై వైమానిక దాడి నేపథ్యంలో పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రధాని మోదీ ప్రయాణించే విమానం పాక్ గగనతలం నుంచి వెళ్లనివ్వాలంటూ భారత్ చేసిన విజ్ఞప్తిని ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వం ప్రాథమికంగా అంగీకరించింది.

ప్రతి శాఖకూ ఐదేళ్ల ప్రణాళిక

- ఉన్నతాధికారులకు ప్రధాని మోదీ ఆదేశం

దిల్లీ: ప్రతి మంత్రిత్వ శాఖకు స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్ట మైలురాళ్లతో ఐదేళ్ల ప్రణాళికను రూపొందించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉన్నతాధికారులకు ఆదేశించారు. ప్రస్తుత స్థితిలో మార్పులు రావాలని, జీవన నాణ్యత పెరగాలని కోరుకుంటున్న ప్రజాతీర్పునకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలన్నారు. సోమవారం కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ.. ప్రతి శాఖ ప్రభావవంతమైన నిర్ణయాలతో ముందుకు సాగాలని, ఇందుకోసం వంద రోజుల వ్యవధిలో ఆమోదాలు లభించాలన్నారు. ప్రజలు మెరుగైన జీవనాన్ని వాంఛిస్తున్నారని, ప్రభుత్వం వారి జీవనం సాఫీగా సాగడంపై దృష్టి సారించాలన్నారు. భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా అధికారులు కృషి ప్రారంభించాలన్నారు. ప్రజల భారీ ఆకాంక్షలను సవాలుగా భావించవద్దని, లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం ముందున్న మంచి అవకాశంగా చూడాలన్నారు. భారతీయ ఓటరు వచ్చే ఐదేళ్ల కోసం ఓ దృష్టికోణాన్ని అందించారని, ఇది కొత్త ప్రభుత్వం ముందు ఒక అవకాశమన్నారు. పెరుగుతున్న జనాభాను సమర్థంగా ఉపయోగించుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు. 'భారతీలో తయారీ' ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ ఈ దిశగా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నీరు, మత్స్య, పశుపోషణ కూడా ప్రభుత్వానికి ముఖ్యమైన విభాగాలన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేశారని, ఈ మనత అధికారుల బృందం మొత్తానికీ చెందుతుందన్నారు. తన బృందం తనకు గర్వకారణమని వ్యాఖ్యానించారు. సమావేశంలో బాగంగా అధికారులతో సంభాషించారు. చర్చను కేబినెట్ కార్యదర్శి పీకే సిన్హా ప్రారంభించారు. క్రితంసారి ప్రధాని అధికారులతో నేరుగా అనుసంధానమైన తీరును సిన్హా గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శులు వివిధ రంగాలకు సంబంధించి తమ ఆలోచనలను పంచుకున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, నిర్మలాసీతారామన్, జితేంద్రసింగ్ పాల్గొన్నారు.

జులై 9న చంద్రయాన్-2!

దిల్లీ: ప్రతిష్ఠాత్మక 'చంద్రయాన్-2' ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) వడివడిగా సమాయత్తమవుతోంది. వ్యోమనౌక కూర్పు దాదాపుగా పూర్తికావొచ్చింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో, బెంగళూరులోని బ్యాలాలులో తుది పరీక్షలు చోటుచేసుకుంటున్నాయి. వచ్చే నెల 9న 'చంద్రయాన్-2' ప్రయోగం చేపట్టాలని ఇస్రో యోచిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 20 లేదా 21న శ్రీహరికోటలోని ప్రయోగ వేదికకు వ్యోమనౌక చేరుకోనుంది.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి యోగా

పణజీ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి యోగాను సిలబస్‌లో తప్పనిసరి చేయాలని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు ప్రతిపాదన పంపినట్లు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీపాద్ నాయక్ సోమవారం తెలిపారు. పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు యోగాను క్రీడా విభాగంలో ఒక తప్పనిసరి అంశంగా చేర్చాలన్నది ఈ ప్రతిపాదనలో భాగం. దీనికి వీలైనంత త్వరగా ఆమోదం తెలిపి, 2020-21 విద్యాసంవత్సరం నుంచే యోగాను సిలబస్‌లో చేర్చాలని భావిస్తున్నట్లు నాయక్ చెప్పారు.

దేశీయ ఔషధాలకూ బార్ కోడింగ్!

ఈనాడు, దిల్లీ: నకిలీ ఔషధాల కేంద్రంగా భారత్‌పై ఉన్న అపవాదును తొలగించేందుకు కేంద్రప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ విపణిలో విక్రయించే ఔషధాలపై కూడా బార్ కోడింగ్‌ను తప్పనిసరి చేయాలని ఆరోగ్య మంత్రిత్వశాఖ యోచిస్తోంది. ప్రస్తుతం విదేశాలకు ఎగుమతి చేసే ఔషధాలపై బార్ కోడింగ్ తప్పనిసరి. దేశీయంగా విక్రయించేవాటిపై అది తప్పనిసరేమీ కాదు. అయితే, దేశీయంగా విక్రయించే మందులపై కూడా బార్ కోడింగ్‌ను తప్పనిసరి చేయాలని నూతన ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు ఆరోగ్యశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఔషధాలను ట్రాక్ చేయడం, కాలం చెల్లిన మందులను గుర్తించడం వంటి అంశాల్లో ఈ కోడింగ్ దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఆరోపణలు చేసిన మహిళను పెళ్లాడిన ఎమ్మెల్యే

అగర్తలా: తనపై అత్యాచారం జరిపారంటూ పోలీసులకు ఫిర్యాదుచేసిన మహిళనే పెళ్లి చేసుకున్నారు... ఇండిజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టి) శాసనసభ్యుడు ధనుంజయ్ త్రిపుర సోమవారం ఆయనిళ్లుడ విలేకరులతో మాట్లాడుతూ- 'అవును. నాపై అత్యాచార ఆరోపణలు చేసిన మహిళను అగర్తలాలోని చాతుర్దాస్ దేవాలయంలో ఆదివారం పెళ్లి చేసుకున్నా' నని వెల్లడించారు. ఇద్దరి మధ్య రాజీ కుదిరిందని, సదరు మహిళ ఇప్పుడెంతో సంతోషంగా ఉందని త్రిపుర తరఫు న్యాయవాది చెప్పారు. దంపతులిద్దరూ ఒకరిపై ఒకరు పెట్టుకున్న కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే త్రిపుర పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి తనపై అత్యాచారం జరిపారంటూ... బాధిత మహిళ గత నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు జర్దారీ అరెస్ట్

ఇస్లామాబాద్: నకిలీ బ్యాంకు ఖాతాల ద్వారా పెద్ద మొత్తంలో నగదును విదేశాలకు అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు, మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో భర్త ఆసిఫ్ అలీ జర్దారీ అరెస్టయ్యారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ సహ వ్యవస్థాపకుడైన ఆయనను జాతీయ జవాబుదారీ బ్యూరో (ఎన్‌ఎబీ) అధికారులు సోమవారమిక్కడ అరెస్టు చేశారు. రూ.15 కోట్ల మేర విదేశాలకు అక్రమంగా నగదును తరలించినట్లు జర్దారీ, ఆయన సోదరి ఫర్యాల్ తల్పూర్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

మాలీలో 100 మంది ఊచకోత

బామాకో: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలీలో జాతుల మధ్య వైషమ్యాలు భగ్గుమన్నాయి. కౌండో జిల్లా సొబానే-కే గ్రామంలో డోగన్ జాతి ప్రజలపై ఆదివారం రాత్రి విరోదులు విరుచుకుపడి మారణహోమం సృష్టించారు. ఈ ఘటనలో దాదాపు వంద మంది మృతి చెందారని భావిస్తున్నారు. దుండగులు డోగన్ జాతీయుల ఇళ్లపై సామూహికంగా దాడి చేసి దొరికినంత సొమ్మును దోచుకొని, ఆస్తులను ధ్వంసం చేశారు. ఆనవాళ్లు దొరకకుండా శవాలను కాల్చివేసినట్లు స్థానిక అధికారులు సోమవారంనాడు వెల్లడించారు.

విపక్ష సర్కార్లను కూల్చే కుట్ర

- కేంద్రంపై తృణమూల్ ఆరోపణ

కోల్‌కతా, దిల్లీ: ప్రతిపక్షాల పాలనలో ఉన్న ప్రభుత్వాలను పడగొట్టే, అధికారం చేజిక్కించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. శాంతి భద్రతలను కారణంగా చూపి ప్రభుత్వాలను కూల్చడానికి సన్నాహం పన్నుతోందని విమర్శించింది. ఎన్నికల అనంతరం పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంటున్న అల్లర్లను అయన చేయాలంటూ కేంద్ర హోంశాఖ పంపించిన సలహా పత్రంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పార్థ చటర్జీ స్పందించారు. సోమవారం సచివాలయంలో మమత విలేకరులతో మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న కుట్రతోనే రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం, భాజపా కలిసి అల్లర్లు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. భాజపా శ్రేణులే అల్లర్లకు పాల్పడుతున్నాయని, దీనిపై సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు వార్తలు ప్రచారం చేయడానికి ఆ పార్టీ కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని అన్నారు. ఏ రాష్ట్రంలోనయినా అల్లర్లు జరిగితే అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాన బాధ్యత ఉంటుందని చెప్పారు. "ఈ అల్లర్లు ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయి. ఇది వారి ఆటలో భాగం. దేశంలో భాజపాను నేను ఒక్కదాన్నే వ్యతిరేకిస్తున్నాను. అందుకే నా గొంతు నొక్కేయడానికి ప్రయత్నిస్తోంది. మా ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించవు" అని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి సలహా పత్రం పంపడంపై తీవ్ర అభ్యంతరం తెలుపుతూ తృణమూల్ ప్రధాన కార్యదర్శి పార్థ చటర్జీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు మాటు లేఖ రాశారు. దీన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించకుండా, రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయాన్ని అడగకుండా హోంశాఖ ఏకపక్షంగా శాంతి భద్రతలపై ఓ నిర్ణయానికి వచ్చిందని అభిప్రాయపడ్డారు. భాజపా గూండాలే అల్లర్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భాజపాకు, కేంద్ర హోంశాఖకు ఒకరే అధ్వర్యం వహిస్తున్నారని, భాజపా అనుకుంటున్నదాన్ని హోంశాఖ కళ్లుమూసుకొని అమలు చేస్తోందని విమర్శించారు.

మోదీ, అమిత్ షాలను కలిసిన గవర్నర్

పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలను కలిశారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం తలెత్తిన హింస, ప్రస్తుత పరిస్థితిపై వివరించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉందా అని గవర్నర్‌ను విలేకర్లు ప్రశ్నించగా అలాంటి అంశం చర్చకు రాలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రం సహకరించడం లేదని భాజపా సీనియర్ నేత ముకుల్ రాయ్ ఆరోపించారు.

బెంగాల్‌లో భాజపా నిరసనలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తమ పార్టీ కార్యకర్తలు హత్యకు గురవుతుండడానికి నిరసనగా సోమవారం భాజపా 'చీకటి రోజు'ను పాటించింది. పలు చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. శనివారం ఉత్తర 24 పరగణాల జిల్లా బసీర్‌హాట్ సబ్‌డివిజన్ సందేశ్‌ఖాలీలో జరిగిన మర్రణలో ఇద్దరు భాజపా కార్యకర్తలు, ఒక తృణమూల్ కార్యకర్త మృతి చెందడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బసీర్‌హాట్‌లో భాజపా 12 గంటల బంద్ పాటించింది. వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. రోడ్లు, రైల్వేలైన్లపై కార్యకర్తలు బైఠాయించి రాకపోకలకు అంతరాయం కలిగించారు.

ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు చేపట్టాలి

- ప్రతిపక్షాలను సంఘటితం చేస్తాం: సీపీఎం

దిల్లీ: ఎన్నికల కమిషన్(ఈసీ)లో సంస్కరణలు చేపట్టడానికి ప్రతిపక్షాలను కూడగడతామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్రపతి నేతృత్వంలోని కొలీజియం ఎంపిక చేయాలన్నారు. ఈసీని సంస్కరించాల్సిన అవశ్యకతను ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలే నొక్కి చెప్పాయన్నారు. ఈసీ స్వేచ్ఛగా, పక్షపాతరహితంగా ఎన్నికలు నిర్వహించలేకపోయిందన్నారు. ప్రతిపక్షాలను ఏకం చేస్తామని, ఈసీ పక్షపాతరహితంగా పనిచేసేలా తక్షణమే సంస్కరణలు చేపట్టాలని కోరతామని చెప్పారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై నిర్వహించిన సమీక్షలో బాజపా గెలుపునకు నాలుగు కారణాలను వామపక్షాలు గుర్తించాయన్నారు. "భారీగా ధనబలానికి తోడు భాజపాకు దేశీయంగా, అంతర్జాతీయంగా కార్పొరేట్ల మద్దతు లభించింది. ఎన్నికల బాండ్ల ద్వారా భారీమొత్తంలో డబ్బు పొందింది" అని ఏచూరి పేర్కొన్నారు. హిందుత్వ మతతత్వ ఏకీకరణ వల్ల మైనార్టీలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగబద్ధమైన సంస్థల్లో గత ఐదేళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రమేయం పెరిగిందని, ఇకపై ఇది మరింత తీవ్రం కానుందని ఏచూరి అన్నారు.

ఈవీఎంలపై శరద్ పవార్ అనుమానాలు

ముంబయి: సార్వత్రిక ఎన్నికలలో పరాజయం తర్వాత ఈవీఎంల కచ్చితత్వంపై ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ మరోసారి అనుమానాలు వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయనీ విషయం ప్రస్తావించారు. తాము ఒక పార్టీకి ఓటేస్తే అది వేరే పార్టీకి వెళ్లిందేమోనని ప్రజలు అనుకునే పరిస్థితి రాకూడదని చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజల మనస్సులలో ఈవీఎంల గురించి అనుమానాలు రాకూడదని శరద్ పవార్ అన్నారు. శరద్‌పవార్ అన్నకొడుకు అజిత్ పవార్ మాత్రం తన బాబాయితో ఈ అంశంలో విభేదించారు. మూడు నెలల క్రితం రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన సంగతి గుర్తుచేశారు. గెలిచినప్పుడు ఈవీఎంలు బాగానే ఉన్నాయని.. ఓడిపోతే మాత్రం వాటిని తప్పుపట్టడమేంటన్నారు.

దిల్లీ రక్షణకు అమెరికా క్షిపణి వ్యవస్థ

- ఐదు వలయాల్లో దేశ రాజధానికి గగనతల కవచం

దిల్లీ: అమెరికా నుంచి అధునాతనమైన 'నేషనల్ అడ్వాన్స్డ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ సిస్టమ్-2' (నాసామ్స్-2)ను కొనుగోలు దిశగా భారత్ అడుగులు వేస్తోంది. దీనితోపాటు స్వదేశీ, రష్యా, ఇజ్రాయెల్ గగనతల వ్యవస్థలను సమకూర్చుకొని దిల్లీలో బహుళ అంచెల క్షిపణి రక్షణ కవచాన్ని మోహరించాలని భావిస్తోంది. తద్వారా దేశ రాజధానిని శత్రువుల డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణుల నుంచి రక్షించుకోవాలనుకుంటోంది. నాసామ్స్-2 విక్రయానికి లాంఛనంగా ఆమోదం తెలుపుతూ అమెరికా త్వరలోనే ఒక తుది ముసాయిదాను భారత్‌కు పంపే అవకాశం ఉందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఆయుధ వ్యవస్థ ఖరీదు రూ.6వేల కోట్లు ఉంటుంది. దిల్లీలో మోహరించాల్సిన ప్రాంతాలు సహా పలు అంశాలపై ఇప్పటికే చర్చలు జరిగాయి. అమెరికాతో ఒప్పందం కుదిరాక నాసామ్స్-2 భారత్ చేతికి అందడానికి రెండు నుంచి నాలుగేళ్లు పట్టొచ్చు. మరోవైపు అమెరికా నుంచి ఒత్తిడి ఎదురవుతున్నప్పటికీ రూ.40వేల కోట్లతో ఐదు ఎస్-400 గగనతల రక్షణ